ISSN : 0971-8729

ప్రత్యేక సంచిక

# యోజన

సంపుటి : 44 సంచిక : 12 అభివృద్ధి మాసపత్రిక అక్టోబర్ 2016 ₹ 30



## నూతన అధ్యాయాన్ని అల్లుతున్న వస్త్ర పరిశ్రమ

భారతదేశంలో హస్తకళల మనుగడ
శ్రీమతి స్మృతి ఇరాని

చేనేతకారుల సంక్షేమానికి పథకాలు
అజయ్ టాంట

జౌళి రంగంలో ఉపాధి కల్పన, సమ్మిళిత వృద్ధికి చర్యలు
శ్రీమతి రష్మి వర్మ

భారత్‌లో చేనేత : గతం, వర్తమానం, భవిష్యత్తు
జయా జైట్లీ

విశిష్ట వ్యాసం
ఆధునిక భారత నిర్మాణానికి పునాది ఖాదీ
వి. కె. సక్సేనా

ప్రత్యేక వ్యాసం
జౌళి రంగంలో సాంకేతిక నవ శకం
ప్రకాష్ వాసుదేవన్



మహాత్మునికి 147 వ జయంతి సందర్భంగా నివాళులు

అక్టోబర్ 2016 | సంపుటి : 44 | సంచిక : 12

ISSN : 0971-8729

# యోజన

ముఖ్య సంపాదకులు : దీపికా కచ్చల్
వరిష్ఠ సంపాదకుడు : విజయకుమార్ వేదగిరి
సంపాదకుడు : మహమ్మద్ సిరాజుద్దీన్
జాయింట్ డైరెక్టర్ (ప్రొడక్షన్) : వి.కె. మీనా

e-mail : yojana_telugu@yahoo.co.in
e-mail : yojana.telugu@nic.in

*ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వతః (ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)*

## ఈ సంచికలో...

1. భారతదేశంలో హస్తకళల మనుగడ – శ్రీమతి స్మృతి ఇరాని ... 5
2. చేనేతకారుల సంక్షేమానికి పథకాలు – అజయ్ టాంటా ... 8
3. జౌళి రంగంలో ఉపాధి కల్పన, సమ్మిళిత అభివృద్ధికి చర్యలు – శ్రీమతి రష్మి వర్మ ... 10
4. భారత్‌లో చేనేత : గతం, వర్తమానం, భవిష్యత్తు – జయా జైట్లీ ... 14
5. ఆధునిక భారత నిర్మాణానికి పునాది ఖాదీ – వి. కె. సక్సేనా ... 17
6. జౌళి రంగంలో సాంకేతిక నవ శకం – ప్రకాష్ వాసుదేవన్ ... 20
7 వస్త్ర ఎగుమతులకు నూతన అవకాశాలు – అదితి దాస్ రౌత్ ... 25
8 ఖాదీ : భారత స్వాతంత్ర్యోద్యమ ప్రతీక – డా॥ ఎ. అన్నామలై ... 30
9 ఆధునిక ప్రపంచంలో వస్త్ర ప్రాధాన్యం – ప్రొ. హయవదన ... 34
10. మీకు తెలుసా? ... 37
11. విజ్ఞాన విపంచి – ప్రాతూరి పోతయ్య శర్మ ... 38
12. దర్పణం ... 41
13. జనపనార పరిశ్రమాభివృద్ధి అవకాశాలు – సుబ్రత గుప్తా ... 43
14. పట్టు వస్త్ర పరిశ్రమ : సవాళ్ళు – ముందడుగు – బి.ఎస్. అంగాడి, కె.కె. షెట్టి, హెచ్. నగేష్ ప్రభు ... 48
15. తెలుగువారి చేనేతలు – ప్రపంచీకరణకు విసిరిన సవాలు – ఎం. ఎస్. లక్ష్మి ... 53
16. సిరిసిల్ల టెక్స్ టైల్ పరిశ్రమ ప్రస్థానం... – హనుమాండ్ల సంపత్ కుమార్ ... 58
17. నేతకారుల సేవా కేంద్రాలు – వి. హిమజకుమార్ ... 60
18. మనసు దోచే పొందూరు ఖాదీ – ఎన్.నాగేశ్వరరావు ... 62
19. జౌళి రంగం అభివృద్ధికి క్లస్టర్ వ్యూహం – డాక్టర్ ఎ.కె.కృష్ణకుమార్ ... 65
20. జనసంకల్ప బలంతో స్వచ్ఛభారత్ – రేవూరు ఉమామహేశ్వరరావు ... 70
21. భారతీయ వస్త్రపరిశ్రమ : ప్రపంచీకరణ ప్రభావం – ఆర్. కె. దాల్మియా ... 72

**ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన సమాచారాన్ని అందజేసేందుకు, తెలుగు, హిందీ, ఇంగ్లీషు, అస్సామి, బెంగాలి, తమిళం, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, పంజాబీ, కన్నడ, ఒడియా భాషలలో వెలువడుతున్న మాసపత్రిక.**

### యోజన (తెలుగు) చందా వివరాలు

**1 సంవత్సరానికి - రూ. 230/- 2 సంవత్సరాలకు - రూ. 430/- 3 సంవత్సరాలకు - రూ. 610/-**

**మరిన్ని వివరాల కోసం : 040-27546312 /13 / 14 ఈ ఫోన్ నంబర్లకు సంప్రదించండి.**

**చందాను Bharatkosh.gov.in సైట్‌లో Publications Division లింకును క్లిక్ చేసి ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు :**

ఎడిటర్, **యోజన (తెలుగు),** 205, 2వ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.

యోజన ప్రచురించిన వ్యాసాలలో వ్యక్తపరిచిన భావాలు ఆయా రచయితలవే, వారు పనిచేస్తున్న సంస్థలు, ప్రభుత్వ అభిప్రాయాలను అవి ప్రతిబింబించవు.
యోజనలో ప్రచురించే ప్రకటనలలోని అంశాలు ఆయా సంస్థలు, వారి ప్రతినిధులకు చెందినవి. ప్రకటన పాఠం / సారాంశం మూలంగా ఎదురయ్యే ఎటువంటి పర్యవసానాలకు యోజన బాధ్యత వహించదు.

ISSN : 0971-8729

# యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం




### భవిష్యత్ నమూనా!

దుస్తులు అనగానే రంగురంగుల, అనేక డిజైన్లు మన కళ్ళముందుకు వస్తాయి. నూలు, పట్టు, షిఫాన్, ఏదైనాసరే, మొహంజోదారో కాలం నాటి మహిళ అయినా, లేదా ఈజిప్టు రాణి క్లియోపాత్ర అయినాసరే, లేదా విక్టోరియా కాలం నాటి బాల్ డాన్సర్ అయినాసరే, మహారాణులు, యువరాణులు అందరూ ధరించే ఆకర్షణీయ దుస్తులు మనను కట్టి పడేస్తాయి. తరాలు మారినప్పుడల్లా, దుస్తుల డిజైన్లు మారుతుంటాయి. నూలు, జనపనార, పట్టు వంటి సహజ ఉత్పత్తులైనాసరే, లేదా రేయాన్, షిఫాన్, మస్లిన్ వంటి కృత్రిమమైనవైనాసరే, మన దేశంలోని విభిన్న సంస్కృతుల కారణంగా, వేషభాషలు కూడ విభిన్నంగా కనిపిస్తాయి. రాజస్థాన్‌లోని బంధిని, బెంగాల్ వారి కంథా, గుజరాత్ వారి తన్చోయ్, తమిళుల కాంజీవరం ప్రతి ఒక్కటీ, తనదైన విభిన్న శైలిలో స్థానిక సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. బనారసి సిల్క్, ఒడిశా సిల్క్, టస్సర్ సిల్క్, మూగా సిల్క్, చందేరి వంటి రకాలు ప్రపంచ ప్రసిద్దాలు.

నూలు దుస్తుల ఉత్పత్తి, వినియోగంలో మనదేశం ఎప్పుడూ ముందువరుసలో ఉంది. చారిత్రాత్మకంగా, నూలు అనేది ధోవతి గానీ, కుర్తా గానీ, చీర, లేదా లంగా ఏదైనా మధ్య, దిగువతరగతి వారు ధరించే బట్టలు. ఒకప్పుడు మనదేశ నూలు ఉత్పత్తులు ఎంత ప్రసిద్ధి చెందాయంటే, వీటి పోటీకి తట్టుకోలేక, బ్రిటన్‌లోని నూలు మిల్లులన్నీ మూతపడే పరిస్థితి వచ్చింది. దానితో తెల్లవాళ్ళు, తమ దేశీయ పరిశ్రమలను కాపాడుకోడానికి మన పత్తి రైతులపైనా, నూలు మిల్లులపైనా అనేక ఆంక్షలు విధించారు. అలా, ఖాదీ, నూలు మన స్వతంత్ర్య సంగ్రామంలో ప్రధానపాత్ర పోషించిన విషయం మనకు తెలిసిందే! అప్పటినుండి ఖాదీ మన అమూల్య వారసత్వ సంపదగా మిగిలిపోయింది. ఈ ఖాదీ ఉత్పత్తిపై ఆధారపడి ఎన్నో వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. ఈ ఖాదీకి ఉన్న ఉపాధి సామర్థ్యాన్ని చూసి ప్రధానమంత్రి ఇటీవల తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ, కనీసం ఒక జత ఖాదీ దుస్తులను కొనమని దేశ యువతకు పిలుపునిచ్చారు. కృత్రిమ వస్త్రాలు వివిధ వాతావరణ పరిస్థితులలో తగిన రక్షణనీయలేవేమోగానీ ఖాదీ మాత్రం సర్వకాల సర్వావస్థలలోనూ మనకు తగిన రక్షణ కల్పిస్తుంది. చేనేత వస్త్రాలు, మన సంప్రదాయంగా నిలచిన మరో రంగం. పురాతన కాలం నుండీ మనదేశ పట్టు వస్త్రాలు ప్రపంచ ప్రసిద్ధిగాంచాయి. ఈశాన్య, దక్షిణ భారతాలలో, పట్టుదారం వడకడం, దుస్తులు నేయడం అనేవి ప్రముఖ ఉపాధి కల్పనా మార్గాలు. జనపనార ప్రధానంగా ప్యాకింగ్ పరిశ్రమలో ప్రధాన ఆవశ్యకం. కానీ, ఇటీవలి కాలంలో మాత్రం ఇది దుస్తుల రూపంలో అనేకమంది ఫ్యాషన్ డిజైనర్లను ఆకర్షిస్తున్నది.

భారతీయ వస్త్ర పరిశ్రమ ప్రపంచంలోని రెండవ పెద్ద ఎగుమతిదారు. అంతే కాదు, దేశంలో వ్యవసాయం తరువాత రెండవ పెద్ద ఉపాధి కల్పన రంగం కూడ! నేటికి 45 మిలియన్లమందికి ప్రత్యక్షంగానూ, మరో 60 మిలియన్లమందికి పరోక్షంగానూ, ఈ రంగం ఉపాధి కల్పిస్తున్నది. స్థూల దేశీయోత్పత్తిలో నాలుగు శాతం ఈ రంగం నుండే సమకూరుతున్నది. కళాకారుల సంక్షేమం కోసం, వారికి ఆధునిక పరిజ్ఞానాన్ని అందచేయడంకోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను, శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. వారి ఉత్పత్తుల అమ్మకాలకు ఈ-కామర్స్ వంటి అనేక అవకాశాలను కల్పస్తున్నది. మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో మన వస్త్ర ఉత్పత్తి 5.65 శాతం వాటాతో, 2015-16 నాటి మన దేశీయ ఎగుమతులలో 14శాతంగాను ఉన్నాయి. అయినప్పటికీ మనదేశం ఇంకా చైనా, బంగ్లాదేశ్ యూరొపియన్ యూనియన్, హాంగ్ కాంగ్, వియత్నాం, ఇండొనేషియా, కంబోడియా, అమెరిక వంటి దేశాల పోటీవల్ల, నాలుగు రోడ్ల కూడలిలోనే ఉన్నది. వస్త్ర రంగంలో నూరుశాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం, సాంకేతిక పరిజ్ఞాన మెరుగు నిధి నిబంధనలను మరింత మెరుగుపరచడం, వంటి ప్రోత్సాహక చర్యల ద్వారా మద్దతు పలకవచ్చు. దీనివల్ల ఎంతో మందికి తిండి, బట్ట, గూడు లభిస్తాయి. ■

# భారతదేశంలో హస్తకళల మనుగడ



**వ్యవసాయ అనుబంధ రంగాల్లో పని చేసే వారు జీవనోపాధిగా ఈ కళలను ఎంచుకుని ఖాళీ సమయాల్లో ఈ కళల్లో తమ నైపుణ్యాలను వినియోగంలోకి తెచ్చి జీవనం సాగిస్తున్నారు. దేశంలో సుమారు 2.3 కోట్ల మంది ప్రజలు హస్తకళలు, చేనేత రంగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా హస్తకళా ఉత్పత్తుల మార్కెట్ 70 వేల కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా. ఈ రంగంలో ప్రస్తుతం భారతదేశం వాటా రెండు శాతానికి తక్కువగానే ఉంది.**

ఎంతో ఉన్నతమైన భారతీయ సంస్కృతిలో హస్తకళలు, చేనేత రంగాలు అంతర్ భాగం. కార్మిక శక్తికి అమిత ప్రాధాన్యం ఉన్న అసంఘటిత రంగంలోనివి ఈ కార్యకలాపాలు. గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఎంతో మంది హస్త కళాకారులకి ఈ రంగాలు ఉపాధి కల్పిస్తున్నాయి. ఎంతో సమున్నతమైన భారత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ దేశానికి ఎంతో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని అందిస్తున్నాయి. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పని చేసే వారు జీవనోపాధిగా ఈ కళలను ఎంచుకుని ఖాళీ సమయాల్లో ఈ కళల్లో తమ నైపుణ్యాలను వినియోగంలోకి తెచ్చి జీవనం సాగిస్తున్నారు. దేశంలో సుమారు 2.3 కోట్ల మంది ప్రజలు హస్తకళలు, చేనేత రంగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. ఒక సామాజిక, ఆర్థిక వర్గీకరణలోని వ్యక్తులుగా వారు స్తూపంలో దిగువన నిలుస్తున్నారు. ఈ రంగాలు దేశీయ ఎగుమతులకు కూడా విశేషమైన వాటా అందిస్తున్నాయి. భారత హస్తకళా ఉత్పత్తులు ప్రపంచంలోని భిన్న ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. యుకె, అమెరికా, యుఏఇ, జర్మనీ, ఫ్రాన్స్ లాటిన్ అమెరికా, ఇటలీ, నెదర్లాండ్స్, కెనడా, ఆస్ట్రేలియా... ఇలా ఎన్నో దేశాలకు భారత హస్తకళా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఆ వస్తువులు భారత హస్తకళా రంగంలోని సౌందర్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. భారత దేశానికి చెందిన ప్రాచీన కళల వైభవాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నాయి. తక్కువ వేతనాలకే భారీ సంఖ్యలో అందుబాటులో ఉండే కార్మికశక్తి, ప్రాంతీయంగా అందుబాటులో ఉండే వనరుల వినియోగం, తక్కువ పెట్టుబడులు, ప్రత్యేకతను చాటి చెప్పే నైపుణ్యాలు ఈ రంగానికి బలం. ఇన్ని బలాలున్నప్పటికీ, అక్షరాస్యత తక్కువగా ఉండడం, ఆధునిక సాంకేతికతపై అవగాహనా రాహిత్యం, ముడిసరకు కొనుగోలుకు అవసరమైనంత ఆర్థిక వనరులు అందుబాటులో లేకపోవడం, సరైన వ్యవస్థాగత నిర్మాణం కొరవడడం వంటి లోపాలు ఈ రంగానికి పెను సవాలు విసురుతున్నాయి. అలాగే వస్తూత్పత్తి రంగం నుంచి కూడా ఈ రంగాలకు సవాలు ఎదురవుతోంది. ప్రధానంగా మరమగ్గాలు, సింథటిక్ దుస్తులు వీటికి పెను ముప్పుగా పరిణమించాయి. నేటి యుగంలో గ్లాస్, మెలామైన్ (ఒక ప్రత్యేక మూలకంతో తయారుచేసే ప్లాస్టిక్) వస్తువులు కూడా పర్యావరణమిత్రమైన మట్టివస్తువులను

**శ్రీమతి స్మృతి ఇరానీ,** కేంద్ర జౌళి శాఖ మంత్రి.
E-mail: minister.textile@gov.in, mot_fb@nic.in

కనుమరుగు చేస్తున్నాయి. ఇన్ని అవరోధాలున్నా ఈ రంగం ప్రతీ ఏడాది మంచి పురోగతినే సాధిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

గ్రామీణ సమాజంలోని సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి దోహదపడే ఈ హస్తకళా విభాగంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయి. 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా హస్తకళా ఉత్పత్తుల మార్కెట్ 70 వేల కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా. ఈ రంగంలో ప్రస్తుతం భారతదేశం వాటా రెండు శాతానికి తక్కువగానే ఉంది. ఈ రంగం అభివృద్ధిలో అపార అవకాశాలకు ఇది దర్పణం పడుతోంది. వీటి వలన పర్యావరణ ప్రయోజనాలు కూడా ఉన్నాయి. హస్తకళా ఉత్పత్తుల ప్రాసెసింగ్‌లో వెలువడే కర్బన వ్యర్థాల శాతం కూడా తక్కువగానే ఉంటుంది. ప్రాంతీయంగా అందుబాటులో ఉండే ప్రకృతి సిద్ధమైన, ఆర్గానిక్ వస్తువులనే వీటి తయారీలో ఎక్కువగా వినియోగిస్తారు. తక్కువ నైపుణ్యాలు గల, ఇంటిలోనే జీవనం సాగించే మహిళలకు ఈ రంగం చక్కని ఉపాధి కల్పించి ఒక ఆదాయవనరుగా నిలుస్తున్నది. ఇంటిలోను, సమాజంలోను వారి హోదాను పెంచుతుంది. సంప్రదాయిక హస్తకళలను పరిరక్షించడం, బలోపేతం చేయడం, కళాకారుల ఆదాయాలు పెంచడం వల్ల ఈ రంగంలో జీవించే వారి సామర్థ్యాలు పూర్తిగా వినియోగంలోకి వస్తాయి. ఆయా రంగాల్లో మంచి పెట్టుబడి అవకాశాలు కూడా అందుబాటులో ఉన్నాయి. పలు విభాగాలుగా చీలిపోయి ఉన్న ఈ విలువ ఆధారిత రంగంలో హస్తకళాకారులను చేయి పట్టుకుని నడిపించాల్సిన అవసరం ఉంది. వారి నైపుణ్యాలకు గల విలువను వారికి తెలియచెప్పాలి. నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు నిరంతర శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలి. వారి నైపుణ్యాల అభివృద్ధి, సామర్థ్యాల పెంపు, మరింత మెరుగైన ఉత్పాదకత సామర్థ్యాల సాధన కోసం ఆధునిక సాంకేతిక అన్వేషణలపై వారిలో చైతన్యం పెంపు వంటి అంశాల్లో కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖకు చెందిన డవలప్‌మెంట్ కమీషనర్ హ్యాండ్లూమ్స్ అనుబంధ చేనేతకారుల సేవా కేంద్రాలు చేస్తున్న కృషి అసమానమైనది. ఈ చర్యల వల్ల చేనేతకారుల ఆదాయాలు కూడా పెరుగుతున్నాయి. చేనేతకారుల సేవా సంఘాలు ఆ రంగంలోని వారికి సరికొత్త డిజైన్లను అందుబాటులోకి తెస్తున్నాయి. దుస్తుల నేతకు ముందు, నేత సమయంలోను, నేత పూర్తయిన తర్వాత అనుసరించాల్సిన విధానాలపై శిక్షణ ఇస్తున్నాయి. నూలు పడుగుకు చుట్టడం, మగ్గంలో పడుగును అమర్చడం, రంగులద్దడం, డిజైన్లు వేయడం (కాడ్) వంటి విభాగాల్లో శిక్షణ ఇస్తున్నాయి. అంతే కాదు వివిధ వాణిజ్య ప్రదర్శనల్లో చేనేతకారులు పాల్గొనేందుకు అవకాశాలు కల్పించడం, మార్కెట్ అనుసంధానం చేయడం వంటి సేవలు కూడా చేస్తున్నాయి.



దేశంలో అమలులో ఉన్న మెగా హాండ్లూమ్ క్లస్టర్ల పథకం భిన్న ఉత్పత్తుల తయారీలో ప్రత్యేకతవున్న ప్రాంతాల భౌగోళిక గుర్తింపు, నైపుణ్యాల అభివృద్ధి, డిజైన్ ఇన్‌పుట్‌లను అందించడంలో కీలకంగా నిలుస్తోంది. అలాగే దేశీయంగాను, అంతర్జాతీయంగాను మారుతున్న మార్కెట్ అభిరుచులకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పిస్తూ, చేనేత రంగంలోని వారికి మెరుగైన వైద్య సదుపాయాలను కూడా అందుబాటులోకి తెస్తోంది. ఆ రంగాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్న ప్రజల ఆదాయాలు పెరిగేందుకు దోహదపడుతోంది. ఆగస్టు ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత రంగంలో పారిశ్రామిక ధోరణులను ప్రోత్సహించడం, నైపుణ్యాలు పెంచడం లక్ష్యంగా కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, నైపుణ్యాల అభివృద్ధి శాఖలు ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందానికి అనుగుణంగా ఈ రెండు మంత్రిత్వ శాఖలు చేనేత విభాగంలో నైపుణ్యాల అభివృద్ధికి, పారిశ్రామిక ధోరణుల ప్రోత్సాహానికి వివిధ కార్యక్రమాలను చేపడతాయి. చేనేత కార్మికుల నైపుణ్యాలను పరస్పరం అందించుకోవడం, వనరులు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవడం, ఆయా విభాగాల్లో పని చేస్తున్న సంస్థల మధ్య సారూప్యత పెంచడం వంటి కార్యక్రమాలు ఇందుకు ఆలంబనగా ఉంటాయి.

అంతే కాదు, చేనేత, హస్తకళా ఉత్పత్తులు సమకాలీన సమాజం అభిరుచులు, ఆధునిక జీవనశైలికి దీటుగా ఉండేలా రూపొందించాల్సిన అవసరం ఉంది. భారత హస్తకళా ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలో పోటీని తట్టుకుని నిలబడాలంటే బ్రాండింగ్‌ను మరింత పటిష్టం చేయాలి. సామాజిక, వాణిజ్య లక్ష్యాలు రెండింటినీ మిళితం చేస్తూ కొత్త వ్యాపార నమూనాలు ఆవిష్కరించాలి. మార్కెటింగ్, బ్రాండింగ్ కోణంలో చూస్తే ఇండియా హ్యాండ్లూమ్ బ్రాండ్ అత్యంత కీలకమైనది. 2015 ఆగస్టు ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గౌరవ ప్రధాని ఈ బ్రాండ్‌ను ఆవిష్కరించారు. ఎలాంటి లోపాలు లేని, ముడి సరకు వినియోగంలో గాని, ప్రాసెసింగ్‌లోగాని, డిజైనింగ్‌లో గాని, తయారీలో గాని, నాణ్యతా ప్రమాణాలకు కట్టుబడడంలో గాని పర్యావరణానికి హాని కలిగించే విధానాలేవీ అనుసరించకుండానే రూపొందించిన

అత్యున్నత నాణ్యత గల చేనేత ఉత్పత్తులుగా ధ్రువీకరిస్తూ బ్రాండింగ్ వేసే ప్రక్రియ అది.

మారుతున్న వినియోగదారుల అభిరుచులు, ప్రాధాన్యతలకు దీటుగా డిజైనింగ్ చేయడంలో వృత్తిపరమైన నైపుణ్యాల కొరత మరో ఆందోళనకరమైన అంశం. దీన్ని పరిష్కరించే లక్ష్యంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) 'క్రాఫ్ట్ క్లస్టర్' విధానాన్ని తమ పాఠ్యాంశాలకు అనుసంధానం చేసింది. దీని వల్ల నిఫ్ట్ విద్యార్థులు దేశంలోని భిన్న భౌగోళిక ప్రాంతాలకు చెందిన చేనేతకారులు, కళాకారులతో కలిసి పని చేసే వీలు కలుగుతుంది. దీని వల్ల విద్యార్థులకు ఆ రంగంలో ఎదురయ్యే సవాళ్ళపై అవగాహన ఏర్పడుతుంది. చేనేత కళాకారులు, వృత్తి కళాకారులకు అవసరమైన సరికొత్త డిజైన్లు, సాంకేతికతను అందించగలుగుతారు. అలాగే చేనేతకారులు, కళాకారులకు ఆధునిక మార్కెట్లలో ఎదురయ్యే సవాళ్ళపై అవగాహన ఏర్పడుతుంది. చెన్నైలోని నిఫ్ట్ కేరళకు చెందిన కోజికోడ్ క్లస్టర్‌తో (వడకర, కోయిలండి, కోజికోడ్) సన్నిహితంగా పని చేస్తోంది. ఈ క్లస్టర్ రెండు తరాల నాటి ఉత్పత్తులు చేనేత, 'ఉరు' అభివృద్ధికి కృషి చేస్తోంది. చేనేత విభాగంలో 30 సహకార సంఘాలు భాగస్వాములుగా ఉండగా బైపూర్‌లోని కళాకారులు సాంప్రదాయిక పడవలు 'ఉరు'ను తయారుచేయడంలో సిద్ధహస్తులు. అందుబాటు ధరల్లో లభించే నాణ్యమైన ముడిసరకు వినియోగించడం ద్వారా ఆయా రంగాల్లోని కళాకారుల ఉత్పత్తుల్లో నాణ్యత పెరిగి వేతనాల్లో స్థిరత్వం, పెరుగుదల కూడా సాధించగలుగుతారు. డైరెక్ట్ మార్కెటింగ్ వసతులు లేకపోవడం, పట్టణ ప్రాంతాలతో అనుసంధానం లేకపోవడం కూడా వారికి ఎదురవుతున్న మరో సవాలు. దీన్ని పరిష్కరించడానికి మార్కెట్ లింకేజిలు సాధించడంతో పాటు క్లస్టర్లను శక్తివంతం చేయడం, సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకోవడం అవసరం.

ఈ-కామర్స్ ద్వారా చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్‌ను ప్రోత్సహించడం జౌళిశాఖ ప్రాధాన్యతల్లో ఒకటి. పారదర్శకంగాను, పోటీ సామర్థ్యంతోను, చేనేత ఉత్పత్తులకు వివిధ ఈ-కామర్స్ వేదికల్లో ప్రాచుర్యం కల్పించడానికి ఆ శాఖ కృషి చేస్తోంది. ఇలాంటి మార్కెట్ వేదికలను అందుబాటులోకి తేవడం వల్ల కళాకారుల్లో సాధికారత ఏర్పడుతుంది. వారి జీవనప్రమాణాలు మెరుగుపడతాయి. ప్రభుత్వం, ఆర్థిక సంస్థలు, లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థలు, ఆయా రంగాల్లో పరిజ్ఞానం గల విద్యావేత్తల భాగస్వామ్యం వల్ల సాంప్రదాయ కళారంగం ఎంతో అభ్యున్నతి సాధిస్తుంది. ఈ రంగాలన్నీ భిన్న మార్గాల్లో కళాకారులకు మద్దతు అందించగలుగుతాయి. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి ఆర్థిక సంస్థ జలవనరుల లభించే వస్తువుల ఆధారంగా నేతను ప్రోత్సహించడం ఇందుకు చక్కని ఉదాహరణ. అస్సాం కేంద్రంగా పని చేస్తున్న ఈ సంస్థ కాలుష్య జలాల్లో లభించే సువాసన గల ఒక మొక్క నుంచి బాగ్‌లు, గృహాలంకరణ వస్తువులు, యుటిలిటీ వస్తువుల తయారీని ప్రోత్సహిస్తోంది. థాయ్‌లాండ్, మలేసియాలను అనుసరిస్తూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, అహ్మదాబాద్ అందించే డిజైన్లతో తయారు చేస్తున్న ఈ ఉత్పత్తులు దేశంలోనే కాకుండా నేపాల్, జపాన్‌తో సహా వివిధ విదేశీ మార్కెట్లలో కూడా ఆదరణకు నోచుకుంటున్నాయంటున్నారు. భారత్‌లోని చేనేత, హస్తకళల రంగాలు భిన్నత్వానికి ప్రతీకలుగా నిలుస్తాయి. భిన్న ప్రాంతాల్లో విశేష ఆదరణ గల హస్తకళా ఉత్పత్తులను అవి తయారు చేస్తాయి. ఇలాంటి 143 ఫ్యాబ్రిక్‌లకు, హస్తకళా ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (జిఐ) లభించడం ముదావహం. జౌళి రంగంలో జిఐ పొందిన వాటిలో చందేరికి క్రీస్తుశకం 1305 నాటి నుంచి ప్రాచుర్యం ఉంది. రాజస్థాన్‌లోని బరాన్ జిల్లాలో కైథూన్‌లోను, ఇతర గ్రామాల్లోను నేసే కోటా డోరియా చీరలు భిన్న పత్తి, సిల్క్ యార్న్‌తో తయారైనవి. అంతే కాదు, పోచంపల్లి ఇక్కత్, కంజీవరం సిల్కు, శ్రీకాళహస్తి కలంకారి, మహేశ్వర్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన మహిళలు తయారుచేసే అలంకార వస్తువు కంతా, పూర్తి కాటన్ ఫ్యాబ్రిక్ జందాని, బలూచరి, ఒడిశాకు చెందిన ఇక్కత్ వంటివి జి1 గుర్తింపు పొందిన ఇతర ఉత్పత్తుల్లో ఉన్నాయి. చేనేత రంగానికి చెందిన వివిధ విభాగాల కళాకారుల సాంప్రదాయక పరిజ్ఞానానికి జిఐ రక్షణ కల్పించడంతో పాటు వాటిని అనధికారికంగా ఉపయోగించడంపై చట్టపరమైన రక్షణ కూడా కల్పిస్తుంది. ఇది కళాకారులకు ఉమ్మడి గుత్తాధిపత్యాన్ని అందిస్తుంది. భారీగా యాంత్రికీకరణ జరిగిన ప్రస్తుత సమాజంలో భారత్ వంటి దేశాల సాంప్రదాయిక హస్తకళా, చేనేత రంగాల పరిజ్ఞానాలను పరిరక్షించుకోవడం, ఆ రంగాలకు మనుగడ అందించడం ఒక పెద్ద సవాలే. గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు ఈ కుటుంబ సాంప్రదాయాల పట్ల తీవ్ర అసహనం ప్రకటిస్తూ కొత్త మార్కెట్లు, సరసమైన ధరలు సాధించడం పట్ల మొగ్గు చూపుతున్నారు. ఈ దశలో మన సాంప్రదాయిక కళలు, ఉత్పత్తులపై ప్రజల్లో చైతన్యం పెంచడం అవసరం. ఇందులో భాగంగా కళాకారుల కుటుంబాల్లోని సంతానానికి చక్కని విద్య, శిక్షణ వసతులు, మార్కెట్లను అందుబాటులోకి తేవడం కోసం గట్టి ప్రయత్నం జరగాలి. మనకు జ్ఞాపకం లేని సమయం నుంచి మనుగడలో ఉన్న హస్తకళా ఉత్పత్తులకు ప్రపంచ హస్తకళా ఉత్పత్తుల రంగంలో ప్రత్యేక స్థానం అందించిన కుటుంబ సాంప్రదాయక కళలను గౌరవించి కళాకారుల బిడ్డలు ఆ వృత్తిలోనే కొనసాగే అవకాశం ఇచ్చినట్టవుతుంది.

■

# చేనేతకారుల సంక్షేమానికి పథకాలు



**వేయి సంవత్సరాలకు పైగా వైభవంతో ప్రభవిస్తున్న వస్త్ర పరిశ్రమ, నేడు లక్షలాదిమందికి జీవనోపాధిని కల్పిస్తున్నది. ఈ ఉపాధి అవకాశాలను మరింత పెంపొందించి, అత్యంత అనుకూల పని పరిస్థితులనూ, సౌకర్యాలనూ కల్పించి, వారు మరింత నాణ్యమైన ఉత్పత్తిని చేసేవిధంగా ప్రోత్సహించాలని భారత ప్రభుత్వం సంకల్పించింది. వస్త్ర పరిశ్రమ బహుముఖమైనది కనుక, కార్మికులకు బహుముఖ నైపుణ్యాలు అవసరం. వారివారి అవసరాలకనుగుణమైన పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది.**

దేశంలోని అత్యంత పురాతన, పెద్ద మంత్రిత్వశాఖ జౌళి. పురాతత్వ నిపుణుల అన్వేషణల్లో, వేల సంవత్సరాల క్రితమే, హరప్పన్ ప్రజలకు కూడ, బట్టలు నేయడం, నూలు వడకటం వంటివి తెలుసుననే ఆధారాలు దొరికాయి. వేయి సంవత్సరాలకు పైగా వైభవంగా ప్రభవిస్తున్న వస్త్ర పరిశ్రమ, నేడు లక్షలాదిమందికి జీవనోపాధిని కల్పిస్తున్నది. ఈ ఉపాధి అవకాశాలను మరింత పెంపొందించి, అత్యంత అనుకూల పని పరిస్థితులనూ, సౌకర్యాలనూ కల్పించి, వారు మరింత నాణ్యమైన ఉత్పత్తిని చేసేవిధంగా ప్రోత్సహించాలని భారత ప్రభుత్వం సంకల్పించింది. దీనివల్ల, వారు నాణ్యమైన ఉత్పత్తులను చేయడమేకాక, మెరుగైన జీవనప్రమాణాలతో జీవించగలుగుతారు. అయితే వస్త్ర పరిశ్రమ బహుముఖమైనది కనుక, కార్మికులకు బహుముఖ నైపుణ్యాలు అవసరం. వారివారి అవసరాలకనుగుణమైన పథకాలను కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా అమలు చేస్తున్నదీ వివరించే ప్రయత్నం ఈ కింద జరిగింది:

**1)మరమగ్గాలలో సంక్షేమ కార్యక్రమాలు:**

**అ) సామూహిక బీమా పథకం:**

మరమగ్గాల కార్మికులు సమాజంలో అత్యంత పేదవర్గానికి చెందినవారు కనుక అమలులో ఉన్న ఏ జీవితబీమా పథకము వారికి వర్తించదు. వీరికోసం ఒక ప్రత్యేక జీవిత బీమా పథకాన్ని జూలై 2003లో ప్రారంభించారు. అది నేటి పన్నెండవ పంచవర్ష ప్రణాళికలో కూడ కొనసాగుతున్నది. మంత్రిత్వశాఖకు చెందిన ముంబైలోని జౌళి కమీషనరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పథకంలో సహజ మరణానికి రూ. 60,000/– లు, ప్రమాద మరణానికి లక్షన్నర రూపాయలు, ప్రమాదవశాత్తూ, శాశ్వత అంగవైకల్యం కలిగితే, లక్షన్నర రూపాయలు, ప్రమాదంవల్ల పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ 75,000/– లు అందచేస్తారు.

అంతేకాదు కార్మికుల పిల్లలకు విద్యావసరాలకోసం ఇద్దరు పిల్లలకు తొమ్మిది నుండి 12వ తరగతి వరకు సంవత్సరానికి రూ. 2,400/– లు, అందచేస్తారు. దీనికోసం చేనేతకారులు సంవత్సరానికి రూ. 80/– లు (మొత్తం ప్రీమియం రూ. 470/– లు) చెల్లించి బీమా సదుపాయం పొందాలి.

**చేనేతకారుల పునరావాస నిధి పథకం:**

ఈ పథకం క్రింద మిల్లును పూర్తిగా గానీ, పాక్షికంగాగానీ మూసివేస్తే, కార్మికులకు నష్ట పరిహారం ఇస్తారు. ఇప్పటివరకూ, దేశవ్యాప్తంగా మూసేసిన 98 జౌళిమిల్లులకు చెందిన 1,17,751 మంది కార్మికులకు అగష్టు, 2016 వరకూ రూ. 319.66 కోట్ల పరిహారాన్ని చెల్లించారు.

**అజయ్ టాంటా,** కేంద్ర జౌళిశాఖ సహాయ మంత్రి

E-mail: mos-textiles.gov.in

**చేనేతకారులకు సంక్షేమ పథకాలు:**

చేనేతకారుల ఆర్థిక దుస్థితి మరమగ్గాలలో పనిచేసేవారికన్నా ఏమీ మెరుగ్గాలేదు. చేనేతకారులు దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలోనూ, ముఖ్యంగా మారుమూల గ్రామాలు, గిరిజనప్రాంతాలలో కూడ విస్తృతంగా ఉన్నారు. కనుకనే అట్టివారి సంక్షేమంకోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం కొంచం క్లిష్టమైనది. అయినప్పటికీ వీరికోసం భారత ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. అవి ఏవంటే:

**అ) మహాత్మాగాంధీ చేనేతకారుల బీమా పథకం:**

ఈ పథకం కింద చేనేతకారులకు బీమా సౌకర్యం కల్పిస్తారు. ఈ పథకంలో ఇచ్చే ప్రయోజనాలు: సహజ మరణానికి రూ. 60,000/–లు, ప్రమాద మరణానికి రూ. 1,50,000/–లు, ప్రమాదంలో శాశ్వత అంగవైకల్యం కలిగితే రూ. 1,50,000/–లు, పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ. 75,000/–లు.

**ఆ) ఆరోగ్యబీమా:**

పన్నెండవ పంచవర్షప్రణాళికా కాలంలో ప్రభుత్వం రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన నమూనాలో కేంద్రప్రభుత్వం చేనేతకారులకు ఒక ఆరోగ్యబీమా పథకాన్ని అమోదించింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖవారి ఆధ్వర్యంలో మార్చి 29, 2016 నుండి ప్రారంభమైన ఈ పథకంలో చేనేతకారులు ఆసుపత్రి పాలయి, పనిచేయులేకపోతే, రూ. 30,000/–లు చెల్లిస్తారు. అస్సాం, బీహార్, చత్తీస్ గఢ్, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, కర్ణాటక, కేరళ, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, త్రిపుర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ మరియు పశ్చిమ బెంగాలు వంటి 19 రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలుచేస్తుండగా, దీనికి సమాంతరమైన మరో పథకాన్ని తమిళనాడు అమలు చేస్తున్నది. ఈ పథకంలో ఇన్‌పేషంటులకు ఇచ్చే రూ 30,000/– లకు అదనంగా ఆవుట్ పేషంటుగా ట్రీట్మెంటు తీసుకుంటున్నవారికి కూడ మరో రూ 7,500/– లు అందచేస్తారు. అక్టోబరు 1, 2015 నాటికి ఈ పథకంలో 1,44,294 మంది సభ్యులుగా చేరారు.

**హస్తకళాకారులకు సంక్షేమ పథకాలు:**



మనదేశంలో హస్తకళలు, వాటి ఉత్పత్తులు ఎంతో ఖరీదైనవి. గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాలలో సైతం ఈ కళాకారులు ఉన్నారు. వీరి సంక్షేమానికి భారత ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను మొదలెట్టింది.

**రాజీవ్ గాంధీ శిల్పి స్వాస్థ్య బీమా యోజన:**

ఈ పథకాన్ని, 2006–07లో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. చేనేత కళాకారులు రూ. 30/– చెల్లించి తమ పేర్లు నమోదుచేసుకున్నట్లయితే, వారికి వివిధరకాల వైద్య సహాయాలు అందుతాయి. కళాకారుడు, అతని కుటుంబ సభ్యులలో ఎవరికి అనారోగ్యం సంభవించినా, రూ. 30,000/–ల వరకూ బీమాసౌకర్యం అందుతుంది. బయటి పేషంటుగా ట్రీట్మెంటు తీసుకుంటే, రూ. 7,500/– సహాయమందుతుంది. ఏప్రిల్ 1, 2017 నుండి ఈ పథకాన్ని రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజనలో కలిపి, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ నిర్వహిస్తుంది. ఈ పథకంలో ఇంతవరకూ 23,74,938 మంది నమోదుచేసుకున్నారు.

**ఆమ్ ఆద్మీ బీమా యోజన:**

భారతీయ జీవితబీమా సంస్థ 2004–05లో హస్తకళాకారులకు జనశ్రీ బీమాయోజన పథకాన్ని ప్రారంభించింది. తరువాత ఈ పథకం పేరును ఆమ్ ఆద్మీ బీమా యోజన పథకంగా మార్చారు. గత ఆర్థిక సంవత్సరం ముగిసేవరకూ, ఈ పథకంలో 23,31,288 మంది సభ్యులుగా చేరారు.

**పేదకళాకారులకు ఆర్థిక సహాయం:**

ఈ పథకం కింద పేద కళాకారులకు వారి వృద్ధాప్యంలో ఆర్థిక సహాయం చేస్తారు. జాతీయ పురస్కారాలు, మెరిట్ ప్రశంసలు, శిల్పగురు పురస్కారాలు మొదలైన గుర్తింపులు పొంది, 60 సంవత్సరాలు దాటిన కళాకారులు, వారి వార్షిక ఆదాయం రూ. 30,000/–లు దాటనట్లయితే, అట్టివారికి నెలకు రూ. 3,000/–ల పింఛను అందచేస్తారు.


**జనపనార కార్మికులకు సంక్షేమ పథకాలు:**

జనపనార కార్మికులకు, వారి కుటుంబాలకూ పారిశుధ్య సౌకర్యాలు, అంటే వారికి మరుగుదొడ్లు, వాష్ బేసిన్లకోసం 90శాతం వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తుంది. జూట్ మిల్లుల కార్మికుల పిల్లల విద్యాసౌకర్యాలకోసం, ముఖ్యంగా ఆడపిల్లల విద్యకోసం మాధ్యమీక స్థాయి వారికి రూ. 5,000/–, సీనియర్ సెకండరీ స్థాయి వారికి రూ. 10,000/–ల ఉపకార వేతనాలను అందచేస్తారు. అదేవిధంగా గ్రాడ్యుయేట్లకు రూ. 15,000/–, పోస్టుగ్రాడ్యుయేట్లకు రూ. 20,000/– ల ఉపకారవేతనాలనందచేస్తారు. ఛార్టెడ్ అక్కౌంటెంటు, ఇంజనీరింగ్ వంటి వృత్తివిద్యలకైతే పూర్తిగా ట్యూషన్ ఫీజును భర్తీ చేస్తారు. ఈ పథకంలో ఇంతవరకూ 6,733 మంది విద్యార్థులు నమోదుచేసుకున్నారు.

**షెడ్యూల్డ్ కులాలు, జాతులకు చెందిన జూట్ మిల్ కార్మికులకు జీవితబీమా:**

ఈ పథకాన్ని, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమాయోజన పథకాలకింద అమలుచేస్తున్నారు. కేంద్ర జౌళిమంత్రిత్వశాఖ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలలో, కార్మికుల వ్యక్తిగత సంక్షేమానికి పెద్దపీట వేశారు. ■

# జౌళి రంగంలో ఉపాధి కల్పన, సమ్మిళిత వృద్ధికి చర్యలు



**జౌళి రంగంలో దేశీ, విదేశీ పెట్టుబడులు భారీ పరిమాణంలో పెరగడానికి నైపుణ్యమున్న కార్మిక సృష్టితో పాటు, ఉపాధి కల్పనలో అపార వృద్ధికి అవకాశముంది. దీనితో పాటు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మేక్ ఇన్ ఇండియా నినాదంతో భారత్‌ను అంతర్జాతీయ తయారీ కేంద్రంగా తయారు చేయడానికి జౌళి రంగం కీలక భూమికను పోషించనున్నది. జౌళి రంగంలో భారత ప్రభుత్వం ఇటీవల కాలంలో తీసుకున్న చర్యల ఫలితంగా ఈ రంగంలో ఒక ఆశావాద దృక్పథాన్ని పెంచుతూ ఎగుమతులు, ఉపాధి కల్పన వృద్ధితో పాటు సామాజిక పరివర్తనకు తెర లేస్తున్నది.**

భారత్‌లో సామాజిక మార్పుల ఫలితాలను, వృద్ధి చెందుతున్న కార్మికశక్తిని ఏకతాటిపైకి తీసుకొని రావడం ద్వారా ఉపాధి కల్పనను సాధించడం సాధ్యం అవుతుంది. టెక్స్‌టైల్, దుస్తుల పరిశ్రమలో అపారమైన ఉపాధి అవకాశాలు ఉండడంతో ఈ రంగాల్లోకి అత్యధిక పరిమాణంలో కార్మికులను చేర్చుకోవడం వీలవుతుంది. ఆర్థిక మాంద్యంతో కునారిల్లుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు భిన్నంగా దేశంలో ఉన్న పరిస్థితులను వినియోగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం వస్త్ర, దుస్తుల పరిశ్రమకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించడమే కాకుండా మరింత ఉపాధి కల్పనకు వీలుగా నైపుణ్య వృద్ధిపై దృష్టి సారించింది. ఈ దిశగా తీసుకుంటున్న చర్యలన్నీ ఇప్పటికే ఉన్న ఇతర వస్త్ర రంగ విధానాలకు అనుగుణంగా ఉంటూ అత్యధిక వృద్ధి రేటు, ఎగుమతులు, ఉపాధి కల్పనతో పాటు సాంఘిక పరివర్తనకు ఉద్దేశించినవి.

నిరుత్సాహకరమైన, నిరాశాపూరిత అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా 7 శాతం వృద్ధి రేటు సాధించడానికి భారత్‌లో కొన్ని రంగాలు కీలకమైనవిగా భావించాలి. అయినా, దేశంలో పెరుగుతున్న కార్మికశక్తికి తగ్గ ఉపాధి కల్పనలో కొంత ఆందోళన నెలకొన్న మాట వాస్తవం. ఆధునిక ప్రపంచ చరిత్ర పొడవునా విధాన నిర్ణేతలు ఆర్థిక పురోగతి సాధించడానికి, ఉపాధి కల్పనకు వస్త్ర రంగంపై ఆధారపడ్డారు. ఇటీవలి నెలల్లో భారత్ కూడా జాతీయ లక్ష్యాలను సాధించడానికి ఈ రంగానికి ప్రత్యేక హోదాను కల్పించింది. నిరాశపూరిత ఆర్థిక పరిణామాలను అధిగమించడం కోసం ప్రపంచం తన గమనాన్ని మార్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో భారత్ ఇప్పటికే మరో అత్యధిక వృద్ధి రేటును సాధించడానికి వస్త్ర, దుస్తుల పరిశ్రమకు పెద్దపీట వేసింది.

**భారతీయ వస్త్రరంగ పునరుజ్జీవం:**

కొన్ని శతాబ్దాలుగా భారత్ ఆర్థిక బలం సాంప్రదాయ రంగాల్లోనే ఉండడం వల్ల పట్టు, నూలు రంగంలో ప్రధాన ఉత్పత్తిదారుగా, ఎగుమతిదారుగా ఉంటూ వస్తోంది. అయితే బ్రిటిష్ వలస పాలనలో ఈ రంగంలో భారతీయ ఆధిక్యతకు దెబ్బ తగిలింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా వస్త్ర రంగం కోట్లాది గ్రామీణ కుటుంబాలకు ప్రధాన ఉపాధిగా ఉండడమే కాకుండా ఆధునిక వస్త్ర పరిశ్రమలో వేలమంది వలస కార్మికులకు అండగా నిలిచింది. తొంభైయ్యవ దశకంలో భారతీయ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన ప్రపంచీకరణ మార్పుల్లో ప్రభుత్వాలు టెక్స్‌టైల్ రంగంపై ప్రత్యేక దృష్టి సారించడంతో మరోసారి భారతీయ వస్త్ర పరిశ్రమ మరోసారి వృద్ధి బాటలోకి ప్రవేశించింది. అమెరికా, యూరోప్‌ల్లో

**శ్రీమతి రష్మి వర్మ,** కేంద్ర జౌళి శాఖ కార్యదర్శి.
E-mail: secy_textiles@nic.in

వస్త్ర తయారీ ఖరీదైన వ్యవహారం కావడంతో భారత్ వంటి ఆసియా దేశాలు తమకున్న అపారమైన, చౌక అయిన కార్మిక శక్తితో, విస్తారమైన సహజ వనరులతో పాటు అనుకూలమైన ఆర్థిక విధానాల కారణంగా వస్త్ర తయారీ రంగానికి అత్యంత ఆకర్షణీయమైన లక్షిత ప్రాంతాలుగా ఆవిర్భవించాయి. భారతీయ వస్త్ర పరిశ్రమకి ఉపాధి కల్పించడానికి సాధ్యమైన కార్మికశక్తి, చేతితో తయారుచేసే, సహజమైన ముడిసరుకు అపరిమితంగా ఉండడం కలిసి వచ్చింది. ఇక బంగ్లాదేశ్, వియత్నాం వంటి దేశాల్లో వస్త్ర పరిశ్రమ మనుగడ సాధించడానికి పూర్తిగా ఎగుమతుల మీద ఆధారపడితే భారత్‌లో ఎగుమతుల కన్నా దేశీయ వినియోగమే ఎక్కువగా ఉంది. వస్త్ర రంగంలో భారత్ తనకున్న అవకాశాలను వినియోగించుకుంటూ ప్రపంచ వస్త్ర ఎగుమతి రంగంలో రెండవ అతి పెద్ద దేశంగా ఆవిర్భవించింది. భారతీయ వస్త్ర ఎగుమతుల విలువ 40 బిలియన్ల అమెరికా డాలర్లకు చేరుకోగా అది మొత్తం అంతర్జాతీయ విపణిలో దాదాపు అయిదు శాతంగా ఉన్నది. 2.3 ట్రిలియన్ అమెరికా డాలర్లుగా ఉన్న జాతీయ స్థూలోత్పత్తిలో భారత్ వస్త్ర పరిశ్రమ 2 శాతం ఆక్రమించింది. వ్యవసాయం తరువాత ఉపాధి కల్పనలో వస్త్ర రంగానిది రెండవ స్థానంకాగా, పారిశ్రామిక ఉత్పత్తిలో 10 శాతం వాటాతో దేశీయ ఎగుమతుల్లో 13 శాతం సాధించింది.

### భారతీయ సాంఘికావరణ ఫలితాలు:

దాదాపు 128 కోట్ల మందితో ప్రపంచంలో జనాభా పరంగా భారత్ రెండో స్థానంలో నిలుస్తోంది. ఇకపోతే భారత్‌లోని 66 శాతం జనాభా అంటే దాదాపు 85 కోట్ల మంది పని చేసే సామర్థ్యం ఉన్నవారే. 2030 నాటికి మరో పదహారు కోట్ల మంది ఈ జాబితాలో చేరనున్నారని నిపుణులు అంచనా వేస్తున్నారు. సాంఘిక ఆవరణ ఫలితాలతో కార్మిక ఆధారిత ఉత్పత్తులైన వస్త్ర, దుస్తుల రంగంలో సమీప భవిష్యత్‌లో భారత్ అగ్ర దేశంగా ఆవిర్భవిస్తుంది. సాంఘికావరణ ఫలితాలను ఉపయోగించుకుంటూ భారత్ ప్రతి నెలా లక్ష ఉద్యోగాలను ఈ రంగంలో కల్పించాల్సి ఉంటుంది. వస్త్ర, దుస్తుల తయారీ రంగంలో భారత్ 8 నుంచి 10 శాతం వృద్ధి చెందుతుంటే అందులో ఉపాధి కల్పనే లక్ష్యంగా సమ్మిళ అభివృద్ధికి ఆదర్శంగా నిలవాలి.

### వస్త్ర రంగంలో ఉపాధి కల్పనా శక్తి:

ఉపాధి కల్పనా పరంగా ఆలోచిస్తే వస్త్ర తయారీ రంగంలో ఎన్నో అవకాశాలున్నాయి. ఈ రంగంలో ఇప్పటికే అయిదు కోట్ల మందికి పైగా ప్రత్యక్షంగా, 6.7 కోట్లకు పైగా అనుబంధ రంగాలైన పత్తి, జనపనార, గొర్రెల పెంపకం, వస్త్ర తయారీ యంత్ర పరిశ్రమ వంటి తదితర రంగాల్లో ఉపాధి కల్పిస్తోంది.

ఒక పూర్తి సమగ్రమైన టెక్స్‌టైల్, దుస్తుల తయారీ పరిశ్రమలో ఒక కోటి రూపాయలకు పెట్టుబడికి 30 ఉద్యోగాలు ఉంటే, దుస్తుల తయారీ పరిశ్రమలో కోటి రూపాయల పెట్టుబడికి 70 ఉద్యోగాలు సృష్టిస్తున్నారు. వాస్తవంగా చెప్పాలంటే, అఖిల భారత టెక్స్‌టైల్, గార్మెంట్ పరిశ్రమ సర్వే 2011-12 ప్రకారం చిన్న తరహా యేతర గార్మెంట్స్‌లో ప్రతి కోటి రూపాయల పెట్టుబడికి

పట్టిక: వస్త్ర, దుస్తుల తయారీ రంగంలో ఉపాధి అవకాశాల అంచనా (మిలియన్లలో)

| రంగం, పరిశ్రమ | మార్చి, 2011 నాటికి | 2017 నాటి లక్ష్యం | 2015-16 |
|---|---|---|---|
| వస్త్ర రంగం<br>కాటన్, చేతి తయారీ, యార్న్, మిల్లు (ఎస్ఎస్ఐ స్పిన్నింగ్, చేనేత యూనిట్లను మినహాయించి) | 1.4 | 1.61 | 1.58 |
| చేతితో తయారీ, ఫిలమెంట్ యార్న్ పరిశ్రమ (టెక్స్‌రైజింగ్ పరిశ్రమతో కలిపి) | 0.24 | 0.28 | 0.27 |
| వికేంద్రీకృత మర మగ్గాల రంగం | 5.09 | 5.84 | 5.71 |
| చేనేత రంగం | 7 | 8.05 | 7.88 |
| కుట్టు పరిశ్రమ | 0.45 | 0.52 | 0.51 |
| ప్రాసెసింగ్ రంగం | 0.44 | 0.51 | 0.50 |
| ఉన్ని రంగం | 3.2 | 3.68 | 3.60 |
| రెడీమేడ్ దుస్తుల రంగం (కుట్టు పరిశ్రమతో కలిపి) | 11.22 | 12.9 | 12.62 |
| పట్టు పరిశ్రమ | 7.7 | 8.86 | 8.67 |
| హస్త కళల రంగం | 8 | 9.2 | 9.00 |
| జనపనార పరిశ్రమ | | | |
| 1) సంఘటిత రంగంలో జనపనార పరిశ్రమ | 0.26 | 0.3 | 0.29 |
| 2) అసంఘటిత జనపనార పరిశ్రమ | 0.2 | 0.23 | 0.23 |
| మొత్తం (1) | 45.19 | 51.97 | 50.84 |
| అనుబంధ రంగాలు<br>పత్తి | | | |
| 1) పత్తి వ్యవసాయం | 20 | 23 | 22.50 |
| 2) కాటన్ జిన్నింగ్, ప్రాసెసింగ్ | 1.3 | 1.5 | 1.47 |
| 3) పత్తి వ్యాపారం | 19 | 21.85 | 21.38 |
| ఇంత వరకు మొత్తం | 40.3 | 46.35 | 45.34 |
| గొర్రెల పెంపకం | 2.8 | 3.22 | 19.13 |
| జనపనార సాగు | 17 | 19.55 | 19.13 |
| టెక్స్‌టైల్ యంత్ర, అనుబంధ పరికరాలు | 0.1 | 0.12 | 0.12 |
| మొత్తం (2) | 60.2 | 69.23 | 67.73 |
| స్థూల మొత్తం (1+2) | 105.4 | 121.2 | 118.57 |

ఆధారం: 12వ ప్రణాళిక వర్కింగ్ గ్రూప్ నివేదిక, కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ

68 నుంచి 169 ఉద్యోగాలు సృష్టిస్తున్నారు. ఉపాధి కల్పన విషయంలో వస్త్ర పరిశ్రమ ఎలాంటి పొరపొచ్చాలకు తావు లేకుండా గ్యారెంటీగా పెట్టిన పెట్టుబడికి తగ్గ ఫలితాన్ని ఇస్తోంది.

**అంతర్జాతీయ పరిశ్రమల్లో నిర్మాణాత్మక మార్పు:**

గత మూడు దశాబ్దాలుగా ఈ రంగంలో

| కింద తెలిపిన పట్టికలో పరిశ్రమల వార్షిక సర్వే ప్రచురణ ఆధారంగా వస్త్ర రంగంలో ఉపాధికి ఇతర రంగాలతో ఒక పోలిక: | | | |
|---|---|---|---|
| తయారీ రంగం | నిర్దిష్ట పెట్టుబడి (లక్షల్లో) | ఉపాధి కల్పన | ప్రతి కోటి రూపాల పెట్టుబడికి ఉపాధి కల్పన |
| పాల ఉత్పత్తులు | 1203869 | 145601 | 12 |
| బీవరేజెస్ | 2675247 | 158507 | 6 |
| ఫర్ వస్త్రాలు తప్ప ధరించే దుస్తులు | 1280564 | 713833 | 56 |
| కుట్టిన వస్త్రాలు | 1369141 | 264261 | 19 |
| పేపర్, పేపర్ ఉత్పత్తులు | 642536 | 248529 | 39 |
| రబ్బర్ ఉత్పత్తులు | 2668512 | 218754 | 8 |
| ప్రాథమిక ఇనుము, స్టీలు | 40999661 | 650680 | 2 |
| ఎలక్ట్రానిక్ పరికరాలు | 421154 | 76619 | 18 |
| సాధారణ వినియోగ యంత్ర సామాగ్రి | 3417453 | 338964 | 10 |
| మోటార్ వాహనాలు | 7088020 | 176523 | 2 |
| ఆధారం: వార్షిక పరిశ్రమల సర్వే, 2013-14 | | | |

నిష్క్రమించే దారిలో ఉంది. భారత్‌కి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నారు. అంతర్జాతీయ టెక్స్‌టైల్ మార్కెట్ నుండి చైనా వెళ్లి పోతుండడంతో ఏర్పడుతున్న అతి భారి ఖాళీని పూరించడానికి భారత్‌లో ఉన్న అపారమైన ముడి సరుకు, కార్మికశక్తిని వినియోగించుకోవాలి.

**టెక్స్‌టైల్ మార్కెట్ అభివృద్ధి తీరుతెన్నులు:**

ఎగుమతుల్లో అత్యధిక వృద్ధి రేటు అంచనాతో పాటు, దేశీయంగా వినిమయ వస్త్రాల విషయంలో వినియోగదారుల కొనుగోలు శక్తి పెరగడంతో అంతర్గత మార్కెట్‌లోనే టెక్స్‌టైల్ రంగం రెండంకెల వృద్ధి రేటును సాధించే అవకాశాలున్నాయి. అంతర్జాతీయం, జాతీయం మార్కెట్ తీరుతెన్నులను పరిగణనలోకి తీసుకుంటే, భారతీయ టెక్స్‌టైల్, దుస్తుల తయారీ రంగం ప్రస్తుతం ఉన్న 119 బిలియన్ అమెరికన్ డాలర్ల నుంచి 2025-26 నాటికి 400 బిలియన్ అమెరికా డాలర్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

**టెక్స్‌టైల్ పరిశ్రమ, సమ్మిళిత అభివృద్ధి:**

ఉపాధి కల్పనతో పాటు టెక్స్‌టైల్ రంగం మహిళా సాధికారతకు ప్రభుత్వం చేపడుతున్న పథకాలకు నిరంతరంగా ఇతోధిక సహాయం అందిస్తోంది. దుస్తుల తయారీ రంగంలోని మొత్తం కార్మికుల్లో మహిళా కార్మికులు 70 శాతంగా ఉన్నారు. దిగువ ఆదాయ వర్గాలకు సుస్థిరమైన జీవనోపాధి కల్పించడంలో, వారి జీవన ప్రమాణాలు మెరుగు పడడానికి టెక్స్‌టైల్ పరిశ్రమ దోహదపడుతోంది. అందువలన, భారత్ వంటి దేశంలో ఉపాధి కల్పనలో టెక్స్‌టైల్ రంగం పాత్ర అపరిమితమైంది. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే అత్యధికులకు నాణ్యమైన విద్య, ఇతర ప్రాథమిక సదుపాయాలు అందుబాటులో లేవు. దీంతో ప్రాథమిక ఉపాధి కల్పనలో నైపుణ్యంలేని, ఉన్నత విద్య లేని గ్రామీణ కార్మికులకు టెక్స్‌టైల్ రంగం అండగా ఉంటూ కేవలం మూడు లేదా నాలుగు వారాల నామమాత్రపు శిక్షణతోనే ఉపాధినిస్తోంది.

అంతర్జాతీయంగా చైనా నిర్వివాదంగా అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రత్యేకించి టెక్స్‌టైల్, దుస్తుల రంగంలో చైనా గత ఇరవై సంవత్సరాలుగా 40 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. 2009 ఆర్థిక సంక్షోభం తరువాత, ఈ వ్యాపారంలో చైనా అభివృద్ధి సగటున 15 శాతం నుంచి 2014లో నాలుగు శాతానికి పడిపోయింది. ఈ ధోరణి సమీప భవిష్యత్‌లో కూడా కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం చైనా అత్యధిక వేతనాల కారణంగా అంతర్గత మార్కెట్‌పై దృష్టి పెడుతూ అంతర్జాతీయ ఎగుమతి మార్కెట్ నుంచి

**ఉపాధి కల్పనకు వ్యూహాలు-సమ్మిళిత అభివృద్ధి:**

అంతర్జాతీయ మార్కెట్‌లో అవకాశాలు, టెక్స్‌టైల్ రంగంలో అపారమైన ఉపాధి కల్పనను పరిగణనలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం శరవేగంగా వృద్ధి రేటును సాధించడానికి, ఈ రంగంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు ఒక వ్యూహాన్ని రూపొందించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పథకాలకు తోడు, సాంకేతిక పురోభివృద్ధి,

| పట్టిక: భారతీయ టెక్స్‌టైల్, దుస్తుల తయారీ మార్కెట్ వృద్ధి తీరుతెన్నులు | | | |
|---|---|---|---|
| | 2015-16 | 2025-26 | సిఏజీఆర్ |
| ఎగుమతులు | 40 బిలియన్ డాలర్లు | 150 బిలియన్ డాలర్లు | 14 శాతం |
| దేశీయ మార్కెట్ | 79 బిలియన్ డాలర్లు | 250 బిలియన్ డాలర్లు | 12 శాతం |
| మొత్తం | 119 బిలియన్ డాలర్లు | 400 బిలియన్ డాలర్లు | 13 శాతం |
| ఆధారం: అంతర్గత అంచనాలు, కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ | | | |

మౌలిక సౌకర్యాల కల్పన, సంప్రదాయ విధానాలను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం నైపుణ్య వృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. ఈ క్రమంలో, భారతీయ దుస్తుల తయారీ రంగంలో పోటీతత్వం పెంచడానికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటిస్తూ ఈ రంగంలో ఇంతవరకున్న ఆంక్షలను ఎత్తివేస్తూ ఉపాధి కల్పన, ఎగుమతులకు ప్రోత్సాహకాలను ప్రకటిస్తోంది.

**నైపుణ్య వృద్ధి, అనుకూల వాతావరణ సృష్టి:**

రానున్న సంవత్సరాల్లో ఉద్యోగ కల్పనకు ఈ రంగంలో అత్యధిక వృద్ధి అవసరం. ఈ వృద్ధిని సాధించడానికి తయారీ రంగంలో అధిక మొత్తాల్లో పెట్టుబడులు పెటాల్సి ఉంటుంది. నైపుణ్యమున్న కార్మికుల కొరత తీర్చడానికి నైపుణ్య వృద్ధిపై దృష్టి సారించాలి. టెక్స్‌టైల్ రంగంలో సమగ్ర నైపుణ్య వృద్ధి పథకాన్ని అమలు చేయడం ద్వారా కార్మికుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలి. దీంతో ప్రస్తుతం ఉన్న టెక్స్‌టైల్ శిక్షణ కార్యక్రమాల్లో ప్రైవేటు, రాష్ట్ర ప్రభుత్వాలకు భాగస్వామ్యం కల్పించాలి. సెప్టెంబర్ 1, 2016 నాటికి ఐఎన్‌డీఎస్ కింద 7.7 లక్షల మంది కార్మికులకు శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో 5.6 లక్షల మంది అంటే 66 శాతం మందికి జౌళి రంగంలో ఉపాధి లభించింది. ఐఎస్‌డిఎస్ కింద 2016-2017 ఆర్థిక సంవత్సరం నాటికి 15 లక్షల మంది నైపుణ్యం కలిగిన కార్మికుల తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పాటు అసంఘటిత రంగంలో ఉన్న వారికి కేంద్ర ప్రభుత్వ హస్తకళల పథకం, చేనేత రంగంలో శిక్షణ ఇవ్వనున్నారు. స్కిల్ ఇండియా కార్యక్రమం కింద ఇటీవలే విస్తారమైన, ప్రభావవంతమైన శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. టెక్స్‌టైల్, దుస్తుల తయారీ రంగంలో రెండు నైపుణ్య వృద్ధి సంస్థలు.. టెక్స్‌టైల్ సెక్టార్ నైపుణ్య సంస్థ, దుస్తుల తయారీ, కుటీర పరిశ్రమ రంగంలో నైపుణ్య సంస్థలను ఏర్పాటు చేశారు.

**గార్మెంట్ రంగానికి ప్రత్యేక ప్యాకేజీ:**

అత్యధిక ఉద్యోగ్య అవకాశాల కల్పనకు అవకాశమున్న గార్మెంట్ పరిశ్రమకు అధిక వేతనాలు లభించే వీలున్న అంతర్జాతీయ పరిశ్రమతో విస్తారంగా సంబంధాలు లేకపోవడం, అనేక పరిమితులున్న కార్మిక ఆంక్షలు ఉత్పాదనపై ప్రభావం చూపడంతో పాటు, పెట్టుబడులకు, ఎగుమతులకు ప్రోత్సాహకాలు కరవయ్యాయి. ఈ ఆంక్షలను సడలించడానికి, దుస్తుల రంగంలో వృద్ధి సాధించడానికీ, పోటీతత్వాన్ని పెంచడానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. ఇటీవలే ఆమోదం పొందిన ఈ ప్రత్యేక ప్యాకేజీ ద్వారా రెడిమేట్ దుస్తుల ద్వారా ఎగుమతులకున్న పరిమితులను అధిగ మించడానికి, నిర్ధారిత కాల పరిమితితో కూడిన ఉపాధి, ఓవర్‌టైమ్ పరిమితి పెంచడం, ఆదాయపన్ను చట్టంలోనిసెక్షన్ 80 జెజెఏఏని సడలించడం వంటి కార్మిక సంస్కరణలతో దుస్తుల రంగంలో ఉపాధి వృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. దుస్తుల రంగంలో కార్మికులకు మొదటి మూడు సంవత్సరాల పాటు కార్మిక భవిష్య నిధిలో యజమాని వాటా 12 శాతాన్ని ప్రభుత్వమే భరించడానికి ముందుకొచ్చింది. అయితే నెలకు రూ.15000 లోపు వేతనమున్న కార్మికులు భవిష్య నిధిలో జమ చేయడం తప్పనిసరిగా కాకుండా వారి ఇష్ట ప్రకారం వదిలేయడానికి నిబంధనలు సడలించారు. దీంతో కార్మికుల వినియోగానికి మరింత డబ్బు వారికి అందుబాటులోకి వస్తుంది. నిర్ణీత కాల పరిమితితో కూడిన ఉద్యోగ కల్పన ద్వారా కార్మికుల సంఖ్య పెరగడంతో సీజన్‌లో గార్మెంట్ పరిశ్రమ ఉత్పాదకత మరింతగా పెరగనుంది. ఇక నిర్ణీత గడువు కోసం ఉద్యోగంలోకి తీసుకున్న కార్మికుడికి శాశ్వత ఉద్యోగికి ఉన్న అన్ని సౌకర్యాలు అంటే పని వేళలు, వేతనం, అలవెన్సులు, చట్టపరమైన చెల్లింపులు వర్తిస్తాయి. పని వేళలను వారంలో యాభై గంటల నుంచి వంద గంటలకు పెంచడం ద్వారా కార్మికుల ఆదాయం పెరుగుతుంది. దుస్తుల తయారీ రంగానికి ప్రభుత్వం ప్రకటించిన ఈ ప్రత్యేక ప్యాకేజీ కారణంగా ఈ రంగంలో రానున్న మూడేళ్ల వ్యవధిలో ఒక కోటి ఉద్యోగాలు సృష్టించనున్నట్లు అర్థమవుతుంది.

**ముగింపు:**

జౌళి రంగంలో దేశీయ, విదేశీ పెట్టుబడులు భారీ పరిమాణంలో పెరగడానికి నైపుణ్యమున్న కార్మిక సృష్టి అవసరముండగా ఉపాధి కల్పనలో అపార వృద్ధికి అవకాశముంది. దీంతో పాటు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మేక్ ఇన్ ఇండియా నినాదంతో భారత్‌ను అంతర్జాతీయ తయారీ కేంద్రంగా తయారు చేయడానికి జౌళి రంగం కీలక భూమిక పోషించనున్నది. భారత్‌లో సమూల మార్పులపై ప్రారంభోపన్యాసం చేసిన సింగపూర్ ఉప ప్రధానమంత్రి షణ్ముగరత్నం మాట్లడుతూ అంతర్జాతీయంగా ఆర్థికంగా నిరాశజనిత వాతావరణం నెలకొన్న తరుణంలో భారత్‌లో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తోందనీ, సుదీర్ఘకాలం పాటు సాంఘిక, మానవ వనరులపై పెట్టుబడులు పెట్టనుండడంతో సామాజిక పరివర్తన సాధ్యమవుతుందని అన్నారు. జౌళి రంగంలో భారత ప్రభుత్వం ఇటీవల కాలంలో తీసుకున్న చర్యల ఫలితంగా ఈ రంగంలో ఒక ఆశావాద దృక్పథాన్ని పెంచుతూ ఎగుమతులు, ఉపాధి కల్పన వృద్ధితో పాటు సామాజిక పరివర్తనకు తెర తీయనుంది. ■

# భారత్‌లో చేనేత : గతం, వర్తమానం, భవిష్యత్తు




**మన దేశంలో వస్త్రాలు ఒకప్పుడు ఏదో ఒక విశేషతతో ముడిపడి ఉండేవి. బుద్ధుడి బోధనలను వర్ణచిత్రాలలో రూపొందించిన పతాకాలే తూర్పుదేశాలకు తీసుకెళ్ళాయి. బంగారుతీగలతో పవిత్రమైన శ్లోకాలను నేసిన పట్టువస్త్రాలతో అలంకరించేవారు. నూతన వధూవరుల దాంపత్యం నూరేళ్ళు వర్ధిల్లాలని కోరుతూ ఆశీర్వచనాలు వధువు కట్టుకునే చీర అంచుల్లో నేసేవారు. ఇక ఒడిశా 'ఇక్కత్' చీరలు పురాణాల్లోని పద్యాలుకానీ, భజనలతో కానీ నేసి ఉంటాయి. చేనేతరంగాన్ని పునరుజ్జీవింప చేయడానికి ప్రభుత్వ దృక్పథంలో తక్షణం కొన్ని మార్పులు తీసుకురావాల్సి ఉంటుంది.**

సృజనాత్మకమైన హస్తకళల, కళాత్మకమైన భావనల వారసత్వ సంపదలో మనదేశం ఒక కల్పవృక్షంలాంటిది. కానీ దీన్ని విస్మరించి మనంచెప్పుకోదగ్గ ఏ విశేషాలూ లేని, యాంత్రికంగా కనిపించే విదేశీ సంస్కృతులకేసి ఆబగా చూస్తుంటాం. ఎందుకంటే మనకు సమకాలీన భిన్న సంస్కృతులపట్ల భేషజాలు, మోజులు ఎక్కువ కనుక. మనం ఏ సంప్రదాయాన్నుంచి వచ్చామో వాటి మూలాలే మనల్ని ఆధునికతలోకి నడిపిస్తున్నాయన్న వాస్తవాన్ని మనం మరుస్తుంటాం. భారతీయులుగా మనకు గుర్తింపును తీసుకొచ్చేదీ, చివరకు మనకు భద్రత కల్పించేదీ కూడా ఈ సంప్రదాయమే.

### అర్థం, గుర్తింపు, రీతీరివాజు

భారతదేశం ఆధ్యాత్మికతకు నిలయ మనేది తరచుగా వినిపించే మాట. మన దేశంలో వస్త్రాలు ఒకప్పుడు ఏదో ఒక విశేషతతో ముడిపడి ఉండేవి. బుద్ధుడి బోధనలను వర్ణచిత్రాలలో రూపొందించిన పతాకాలే తూర్పుదేశాలకు తీసుకెళ్ళాయి. దేవాలయాల్లో విగ్రహాలను, రాజుల భుజాలను ప్రతిష్ఠాత్మకంగా అలంకరించే వస్త్రాలుకూడా పవిత్రతకు, ప్రతిష్ఠకు అద్దంపట్టేవి. బంగారుతీగలతో పవిత్రమైన శ్లోకాలను నేసిన పట్టువస్త్రాలతో అలంకరించేవారు. నూతన వధూవరుల దాంపత్యం నూరేళ్ళు వర్ధిల్లాలని కోరుతూ ఆశీర్వచనాలు వధువు కట్టుకునే చీర అంచుల్లో నేసేవారు. ఇక ఒడిశా 'ఇక్కత్' చీరలు పురాణాల్లోని పద్యాలుకానీ, భజనలతో కానీ నేసి ఉంటాయి. ఇక సందర్భం ఏదయినా మన దేశంలో ఆశీర్వచనంలో పవిత్రత అంతర్భాగంగా ఉంటుంది. కొత్తగా ఉద్యోగం సంపాదించుకున్న కొడుకు తన మొదటి సంపాదనతో తల్లికి చీర కొనివ్వడం మన సాంప్రదాయతకేకాక, కృతజ్ఞత, గౌరవాలకు సూచికవంటిది.

సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ధరించే వస్త్రాలను పక్కనబెడితే చాలామటుకు అలంకరణకు లేదా ఇతరత్రా అవసరాలకు వాడే చేనేత వస్త్రాలకు సందర్భోచిత ప్రత్యేకత, ప్రయోజనం ఉంటాయి. మనదేశంలో వస్త్రాలు విశిష్టంగా ఉంటాయనే ఖ్యాతి రావడానికి ఇవే కారణం. దక్షిణ అమెరికాలో, ఆఫ్రికాలో, దక్షిణాసియాలో ఇప్పటికీ ఇటువంటి వస్త్రాల తయారీ ప్రత్యేక సందర్భాల్లో వాడుకలో ఉన్నా, మన దేశంలో అంత విస్తారంగా తరతరాలుగా సాంప్రదాయకంగా వాడుకలో ఉన్నట్టుగా లేదు. ఈశాన్యరాష్ట్రాల్లో కనిపించే శాలువాల వైవిధ్యం

**జయా జైట్లీ,** ప్రెసిడెంట్, దస్త్‌కారీ హాథ్ సమితి.
E-mail: dastkarihaat@gmail.com

చూస్తే మనకు దీని విశిష్టత ఏమిటో బోధపడుతుంది. అలాగే మనదేశంలో కనిపించే ప్రతి చేనేతలో ఆ ప్రాంతపు వాసనలు ప్రస్ఫుటంగా కనిపిస్తుంటాయి.

మొగల్ పాలనకు ముందు భారతదేశంలో బట్టలు కుట్టడం అనే పద్ధతిలేదు. వాటినిశరీరంపై కప్పుకోవడానికి, చుట్టుకోవడానికి, కట్టుకోవడానికి వీలుగా నేసేవారు. మగవాళ్ళు-లుంగీలు, ధోవతులు, అంగవస్త్రాలు, తలపాగాలు, వెయిస్ట్‌కోటులు, శాలువాలు ఉపయోగిస్తే, స్త్రీలు-చీరలు, లుంగీలు, ముడివేసుకునే రవికెలు, మేలిముసుగులు, చెవులకు, తలకు చుట్టుకునే బట్టలు, శాలువాలు ధరించేవారు. చేతి మగ్గాలపై వీటిని అవసరానికి తగిన కొలతలతో నేసేవారు. మొగలాయి పాలన ప్రారంభమైన తరువాత దర్జీలతో సహా పలువురు వృత్తికళాకారులు రంగప్రవేశం చేసారు. అలా పర్షియన్ షేర్వాణీలు, పైజమాలు, కుర్తాలు, షరారాలు, లంగాల వాడకం మనదేశంలో కూడా మొదలయింది. తర్వాత బనారస్‌లో పట్టుతో నేసిన వస్త్రాలకు, బెంగాల్‌నేతపని వారు నేసిన పలుచని, సన్నని వస్త్రాలకు గిరాకీ పెరిగింది. 14, 15 శతాబ్దాల్లో భారత్, ఐరోపాలలో రాజ దర్బారుల్లోని వారు శరీరకొలతలకు తగ్గట్టుగా కుట్టిన వస్త్రాలు ధరించేవారు.

తెల్ల దొరల పాలన మొదలయిన తర్వాత మాంచెస్టర్, లాంకషైర్ జౌళిమిల్లుల నుండి వస్త్రాలు రావడంతో వలసపాలకులు పనిగట్టుకుని భారీపన్నులు,ఇతరత్రా ఇబ్బందులు సృష్టించి భారత చేనేత నడ్డి విరగ్గొట్టారు. ఈ నష్టాన్ని అరాకొరా ఉన్నతస్థాయి వారు తట్టుకోగలిగారు. అలాగే పోటీలోలేని వస్త్రతయారీలో ఉన్న పేద నేత పనివారుకూడా ఈ ఉపద్రవాన్ని తప్పించు కోగలిగారు. తువ్వాళ్ళుగా, తలపాగాలుగా, దిండు గలీబులుగా, బెడ్‌షీట్లుగా, రుమాళ్ళుగా, పైపంచెలుగా...ఇలా రకరకాలుగా వాడుకోవడానికి వీలయిన వస్త్రాలను నేసే పేదనేత పనివాడికి పోటీలేకుండా పోయింది.

**ఇంకా సజీవంగా ఎలా ఉంది?**

వారసత్వంగా కొనసాగుతున్న సంప్రదాయాలు ఈ రంగం ఇంకా బతికి ఉండడానికి ఒక ప్రధాన కారణం. అవి బట్టలరకానికీ, శైలికీ ఒక పవిత్రభావాన్ని కలుగచేస్తాయి. రెండవది-దాని వినియోగ దారులకు వ్యక్తిగతంగా వర్గం, ప్రాంతం, మతం లాంటి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెడుతున్నాయి. మూడవది-కులవ్యవస్థ కొనసాగడంతో అదికూడా నిశ్చలంగా స్థిరంగా ఉండడం కూడా ఒక కారణమయింది. దీనివల్ల ఒక నష్టంకూడా జరిగింది. చేనేత పనివారు ఒక చట్రంలో ఇరుక్కు పోయినట్లయింది. వారికి తెలిసిన వృత్తే అయినా వంశానుగతంగా అబ్బిన నైపుణ్యాలను ఆచరణలో చూపిస్తూ ఒడిదుడుకులు ఎదురయినప్పుడు నిస్సహాయంగా ఉండిపోవలసి వస్తున్నది. దీనికంటే మంచి లాభసాటి వృత్తులలోకి సులభంగా ప్రవేశించలేని పరిస్థితి ఏర్పడుతున్నది. మరో ఆసక్తికర పరిణామం కూడా ఉంది. దక్షిణ భారతదేశంలో ఒకప్పుడు పాలించిన విజయనగర, బహమనీ రాజుల కాలంలో దేవాలయాల నిర్మాణాలకే నిధులు అందచేసిన సంపన్న చేనేత పనివారు తర్వాత కాలంలో దళారీ మార్కెట్ల దోపిడీతో సమాజంలోని అసమానత్వాలతో ప్రగతిబాట పట్టలేకపోయారు. బాగా విస్తరిస్తూపోతున్న, సాంప్రదాయక సమాజంలో కొనసాగుతూ వచ్చిన చేనేత.. వలసపాలకులు తెచ్చిన యాంత్రీకరణతో బాగాదెబ్బతిన్నది.

**ఖాతాదారులు :**

గతాన్ని సమీక్షించుకుంటున్నప్పుడు అప్పటి ఖాతాదారులను గురించికూడా పరిశీలించాల్సి ఉంటుంది. పైన చెప్పినట్లు 5శతాబ్దాలక్రితం.. శరీరాకృతికంటే శరీర ఆచ్ఛాదనకే ప్రాముఖ్యత, అప్పుడు అదికూడా చేతితో నేసిన వస్త్రానికే. అన్ని తరగతుల వినియోగదారులకు అవసరమైన బట్టను చేనేత కార్మికులు తయారుచేసి ఇచ్చేవారు. మొగలాయి కుటుంబాల వారు వారి బట్టలను వారే కుట్టుకుని ధరించగా, రాజకుటుంబీకులు, సంపన్న శ్రేణి వర్గాలు ఖరీదుఎక్కువయినా ఖాతరుచేయకుండా నేయించుకునేవారు. కుర్తాలు, పంట్లాములు, రవికెలవంటి అదనంగా కుట్టిన వస్త్రాలను అల్పాదాయ వర్గాలవారు వాడేవారు.

ఈ వేళ పట్టణాల్లోని యువత వస్త్రధారణలో వైవిధ్య సంప్రదాయ వారసత్వాన్ని విస్మరించి విదేశీ సంస్కృతులకు సంబంధించి దిగుమతి చేసుకున్న వస్త్రాలవైపే మొగ్గుచూపు తున్నది. ప్రపంచవ్యాప్తంగాఉండే ఫ్యాషన్లు చేనేత వాడకాన్ని దరిచేరనీయవు. సింథటిక్స్ మెరుపులు ఖాతాదారులను చేనేతవైపు చూడనీయవు. స్థానికంగా ఉండే చాలా సంప్రదాయవర్గాలు చేనేతను సజీవంగా ఉంచుతున్నా వీటి సంఖ్య చాలా స్వల్పం.

**స్వతంత్ర భారతంలో...**

స్వతంత్రం రాకపూర్వం- భారత్ నుంచి ఎగుమతయ్యే ఏరకం వస్త్రాల మార్కెట్‌నయినా అప్పటి బ్రిటీష్ పాలకులు నిర్దేశించిన కొన్ని నిబంధనల ఆధారంగా దళారీ శక్తులే ప్రభావితంచేసేవి. 1947 తర్వాత ఈ రంగంలో సంక్షేమం, అభివృద్ధి, మద్దతుధరల వ్యవస్థ అనేవి ప్రభుత్వపరంగా అందడం మొదలయింది. దీనికి వెనుక మహాత్మా గాంధీ కృషితోపాటూ, జాతీయ ఖాదీ ఉద్యమం పాత్ర, కమలాదేవి ఛటోపాధ్యాయ, ప్రపుల్ జయకర్ వంటి పలుకుబడిగల వ్యక్తుల ప్రభావం బాగా పనిచేసాయి. అయితే స్వాతంత్ర్యానంతరం పారిశ్రామికీకరణ పెద్దఎత్తున మొదలు కావడంతో మిల్లుబట్ట, సింథటిక్ వస్త్రాలు, మరమగ్గాలు, కార్మిక వర్గానికి సౌకర్యంగా మారడంతో చేనేత కార్మికుల జనాభా క్రమేణా తగ్గుతూ వచ్చింది.

దీన్ని సరిదిద్దడానికి మొదట పునరుద్ధరణ, తరువాత దశాబ్దాలలో మార్కెట్లు,

ఎగుమతులు, సబ్సిడీల వంటి వాటిమీద దృష్టి కేంద్రీకరించడం జరిగింది. నిజానికి అసలు ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఏమిటి? పెరగడానికి అవకాశాలు ఎక్కడ, తిరోగమనానికి కారణాలు ఏమిటి, వాస్తవంగా తోడ్పాటు అవసరమావంటి అంశాలపై నిశితంగా పరిశీలన జరగలేదు. వర్తమాన స్థితిగతులను అంచనావేయడానికి అనేక వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ, వృత్తిగతంగా వాటి పరిశీలన, విశ్లేషణ, మదింపు జరగలేదు. కాకుల లెక్కలవంటి లక్ష్యాలతో నిధులను ఖర్చుపెట్టడం లేదా పారదర్శకత, పరిశీలన లోపించడంవంటివి జరిగినప్పుడు- వాస్తవ లబ్ధిదారుడు ప్రయోజనం పొందలేకపోతున్నాడు. తత్ఫలితంగా అసలే నిరాశలోఉన్న చేనేత పనివారు మరింత దరిద్రంలోకి వెడుతున్నారు. గ్రామాల్లో కూడా చేనేత వృత్తికి తిలోదకాలిచ్చి రిక్షాలులాగి, లేదా సమీప నగరాల్లో బఠాణీలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు.

1980వ దశకం మధ్య నుండి మరమగ్గాలు ఉధృతంగా పెరిగి పోయాయి. ఈ దురాక్రమణను ఆపగలిగిన యంత్రాంగం ఆవశ్యకతను, రెండురంగాల మధ్య వైవిధ్యాన్ని వివరించే వినియోగ దారుల విద్య కొరవడింది. ఇది చేనేత రంగానికి హాని కలిగించింది. ప్రభుత్వరంగ సంస్థలుఎంతగా దీన్ని పైకి లేపే ప్రయత్నం చేసినా,వెలుగులు విరజిమ్మే ప్రైవేటు రంగ ప్రకటనల ముందు ఇవి వెలవెలా పోయాయి. దురదృష్టవశాత్తూ తొలినాటి పొంగు, ఉత్సాహం చిన్న చిన్న ప్రభుత్వ సంస్థల రూపంలో నామమాత్రంగా రూపాంతరం చెందాయి. ప్రభుత్వ జోక్యం సానుకూలంగా కనిపించినా, ఆచరణలో నిర్లక్ష్యపూరితంగా ఉంటున్నాయి.

అయితే పాలకుల ఆదరణ కోల్పోతున్నా, గతకొన్ని దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛావాణిజ్య అవకాశాలు కొరవడుతున్నా ఖాదీ ఒక వంక పూర్తిగా అంతరించిపోతున్నా ప్రభుత్వ జోక్యమే ఇంకా దానిని సజీవంగా ఉంచిందని ఒప్పుకోక తప్పదు. దీనికి ఉదాహరణలు గా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'విశ్వకర్మ' పథకం, 1980వ దశకంలో నిర్వహించినప్రదర్శనలు, 1970, 80 దశకాల్లో దేశవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించిన చేనేత ఎక్స్‌పోలను చెప్పుకోవచ్చు. దీనితో పరిస్థితిలో కొంత మార్పువచ్చింది. ముఖ్యంగా ఫ్యాషన్ పరిశ్రమతో మంచి మార్కెట్ వేదికలను అనుసంధానం చేయడంతో దీనిని ప్రోత్సహించాలనుకునేవారి గుర్తింపు పొందడానికి ఆస్కారం ఏర్పడింది.

### కొత్త దృక్పథం :

చేనేతరంగాన్ని పునరుజ్జీవింప చేయడానికి ప్రభుత్వ దృక్పథంలో తక్షణం కొన్ని మార్పులు తీసుకురావాల్సి ఉంటుంది. దీనిని సానుభూతితోకాక, సమర్థమైనరంగం అన్న దృష్టితో చూడాల్సి ఉంటుంది. 'ముద్ర' రుణాలను, ఉపయోగించుకోవడం మీద, 'స్టార్టప్', 'నైపుణ్య భారత్'ల ద్వారా ఔత్సాహికులను ప్రోత్సహించాలి. ఈ రంగం పట్ల బ్యాంకులకు కూడా అవగాహన కల్పించి 'నైపుణ్య భారత్', చేనేత పథకాలను "ఉపాధి హామీ పథకం" (MGNREGA) తో సమన్వయం చేయాలి.

నాణ్యమైన నూలు సముచిత ధరలకు దొరకడం కష్టసాధ్యమవుతున్నది. నూలుకు ప్రత్యామ్నాయంగా జనపనార, పత్తివంటి వాటిపై అవగాహన పెంచాలి. ఈ విషయంలో ఫ్యాషన్‌రంగ నిపుణుల సహాయ సహకారాలు తీసుకోవాలి. హడావిడిగా నిర్వహించే ఫ్యాషన్ షోలకంటే ఓ రెండేళ్ళు అదేపనిగా దీనిమీద కృషి చేస్తే మంచిఫలితాలు లభిస్తాయి.

దేశవ్యాప్తంగా అద్దకం పనుల పరిజ్ఞానం బాగా వ్యాప్తిలో ఉంది. అదీగాక ఇది పర్యావరణ హితంగా ఉండడంతో ప్రపంచస్థాయిలో దీనికి ఆమోదం లభిస్తున్నది. అందువల్ల దీన్ని పునరుజ్జీవింపచేయడం, దీనిలో శిక్షణ ఇవ్వడంవంటి వాటిపై దృష్టి కేంద్రీకరించాలి. చేనేత రంగంలో కూడా అంతర్జాతీయ సాంకేతిక సహకారంతో వెదురు, అరటి, పైనాపిల్‌నార వంటి సేంద్రీయ వనరులను చేనేత మగ్గంమీద వాడే దిశగా కృషి జరగాలి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌వంటి ఆన్‌లైన్ మార్కెట్లను సద్వినియోగం చేసుకుంటే చేనేత రంగం, చేనేత కళ విస్తరిస్తాయి. ఇప్పటికే కొంత మంది కళాకారులు వ్యక్తిగతంగా ఫేస్‌బుక్ ఖాతాలు తెరవడం, వెబ్‌సైట్లు ప్రారంభించడంవంటివి నేర్చుకుంటున్నారు. చేనేత పనివారు వీటిలోని లాభనష్టాలను సునిశితంగా పరిశీలించి తగు విధంగా స్పందించాలి.

ఇప్పుడు పలు రాష్ట్రాలలో పలురకాల పన్నులవిధానాలతో ప్రతిభావంతులైన పలువురు కళాకారులు, చేనేత ఉత్పత్తిదారులు తమ మార్కెట్‌ను పెంచుకోలేకపోతున్నారు. ఇప్పుడు కొత్తగా జిఎస్‌టి అమల్లోకి వస్తేపరిస్థితిలో సానుకూల మార్పు వచ్చేమాట నిజమే అయినా వీటిని వారు అధిగమించాలి.


ఎగుమతులమీద శ్రద్ధ పెట్టడంమంచిదే కానీ అక్కడ విజయవంతమైన ఒక వస్తువునుఅదే డిజైన్‌తో పెద్ద సంఖ్యలో సరఫరాచేయడం కుదరదు. అటువంటి సందర్భాల్లో చేనేతదనే భ్రమలు కల్పించిమరమగ్గాలు ఇదే ఉత్పత్తిని సొమ్ముచేసుకునే అవకాశాలున్నాయి. దీనివల్ల చేనేత విశ్వసనీయత దెబ్బతింటుంది. అందువల్ల స్వదేశీమార్కెట్లను నిర్లక్ష్యం చేయకుండా ఇక్కడి అవసరాలు గమనించి, ఇక్కడ పెరుగుతున్న కొనుగోలు శక్తికి దీటుగా సాంస్కృతికతను ప్రతిబింబిస్తూ స్థానిక అభిరుచులనుజోడించి వారి మార్కెట్లను పెంచుకోవాలి.

స్వచ్ఛందసేవా సంస్థలరంగం ప్రభుత్వంతో కలిసి పారదర్శకంగా, నిజాయితీగా పనిచేసే భాగస్వామ్యాలను నెలకొల్పే అవకాశాలను అన్వేషించాలి. 1980 దశకంలో ఏర్పాటుచేసిన నేత కార్మికుల సేవా

*తరువాయి 19వ పేజీలో...*

విశిష్ట వ్యాసం

# ఆధునిక భారత నిర్మాణానికి పునాది ఖాదీ



**ఖాదీ ఉత్పత్తి ప్రపంచంలోనే అతి పెద్ద గ్రామీణ ఉత్పత్తి కార్యక్రమం. జలగల వంటి మధ్యవర్తులు కానీ, క్లిష్టమైన మార్కెటింగ్ ప్రక్రియలు కానీ అవసరం లేకుండా వేలాది కుటుంబాలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారుడికి చేరవేసే కార్యక్రమం. గ్రామీణ కార్మికులకు తమ పనికి అత్యధిక విలువ, వినియోగదారులకు తాము చెల్లించిన ధరకు అత్యంత గిట్టుబాటుచేగూర్చే పని ఇది. మన జాతికి ఖాదీ నిస్సందేహంగా అతి విలువైన వారసత్వ సంపద. గ్రామీణ, పేద ప్రజలకు ఫలవంతమైన ఉపాధి కల్పించే బృహత్ బాధ్యత ఖాదీ గ్రామోద్యోగ సంఘంపై ఉంది.**

ఆధునిక భారత్‌ను నిర్మించాలని మనం ఈ మధ్య తరచూ మాట్లాడుకుంటున్నాం. ఆధునికతలో వైవిధ్యానికి సంకేతాలైన మౌలిక సదుపాయాల కల్పన, శాస్త్రీయ స్ఫూర్తి, సాంకేతిక పాటవం, సైనిక పటిమ, కళాత్మక ప్రావీణ్యం మొదలైనవి పెంపొందించడం ఎంత ముఖ్యమో, ముందుకు సాగాలంటే మన మూల సామర్థ్యాలను గుర్తించడం కూడా అంతే అవసరం. ప్రతి జాతి తన మూలాలకు రుణపడి ఉంటుంది. సుస్థిరంగా, పటిష్టంగా నిలిచిన పునాదుల పైనే కొత్త స్వప్న హర్మ్యాలను మనం నిర్మించగలుగుతాం.

శతాబ్దాల పాటు మనని బ్రిటిష్ వారు పాలించినప్పటికీ, మన సాంస్కృతిక, సంప్రదాయ జీవన పద్ధతులకు దూరం కాని జాతిగా మనం మనగలిగాం. తృణమూల స్థాయిలో, మన మూల శక్తియుక్తుల్లోనే మన భవిష్యత్తు ఉందనీ, దిగుమతి చేసుకున్న విలువల పునాది మీద జాతి నిర్మాణం సాధ్యం కాదనీ మహాత్మా గాంధీ ముందే గుర్తించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలన నట్టనడిమిన, 1920 సంవత్సరంలో, స్వదేశీ ఉద్యమంలో భాగంగా గాంధీజీ, ఖాదీని ఒక రాజకీయ ఆయుధంగా రంగంలోకి తెచ్చారు. స్వేచ్ఛా దుస్తులుగా ఖాదీ వస్త్రాలకు నామకరణం చేసిన బాపూ, భారత్‌కు స్వయంప్రతిపత్తిలో ఒక శాశ్వత చిహ్నాన్ని తెచ్చిపెట్టారు. భారత్ తన స్వంత ప్రతిపత్తిపై నడవగలదని ఆంగ్లేయులకు రుజువు చేయడంతో పాటు ఆయన, తాము రోజూ ధరించే వస్త్రాల ద్వారా తమ జీవిత సౌభాగ్యాన్ని నేత నేసుకునే స్వేచ్ఛ తమకుందన్న గర్వాన్ని భారతీయుల్లో నింపారు.

ఖాదీ, గ్రామీణ ఉత్పాదన జాతీయతా వాదానికి ఒక ఘనమైన ప్రాతిపదిక కాగా, మన సమాజం పునాదులు గ్రామీణ ప్రజానీకం ప్రయత్నాలు, కృషిపై ధృడంగా నిలిచి ఉన్నాయని భారత్ ప్రపంచానికి చూపింది. అంటే. ఖాదీ కేవలం ఒక వస్త్ర విశేషమే కాదు, ఒక శాంతి దూతగా, మన స్వేచ్ఛకూ, జాతీయ అస్తిత్వానికీ సంకేతంగా మారిపోయింది.

స్వాతంత్ర్యం అనంతరం భారత ప్రభుత్వం 1956 కేవీఐసి చట్టం కింద ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమీషన్ ను ఒక చట్టబద్ధమైన సంస్థగా ఏర్పాటు చేసింది. స్వయం ప్రతిపత్తితో జాతి నిర్మాణం జరపగలిగిన శక్తికి ఇది ఒక నివాళి. పని చేసేందుకు ఉత్సుకతో ఉన్న భారీ మానవ వనరులను, సమిష్టి మానవ శక్తిని, నైపుణ్యాలను జాతీయ ఉత్పాదనకోసం వినియోగించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు లేని దేశం మనది. జాతికి తోడ్పడుతూనే వ్యక్తిగతంగా జీవనోపాధి సంపాదించుకునేందుకు ఆ వ్యక్తులకు అవకాశం కల్పించే వీలు లేని దేశం. ఆ సమయంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించడం కంటే తగిన,

**వి. కె. సక్సేనా,** ఛైర్మన్, ఖాదీ & గ్రామీణ పరిశ్రమల కమీషన్, న్యూ ఢిల్లీ.
E-mail: chairmankvic2015@gmail.com

మరింత కీలకమైన పని మరొకటి లేదేమో.

ఖాదీ ఉత్పత్తి ప్రపంచంలోనే అతి పెద్ద గ్రామీణ ఉత్పత్తి కార్యక్రమం. జలగల వంటి మధ్యవర్తులు కానీ, క్లిష్టమైన మార్కెటింగ్ ప్రక్రియలు కానీ అవసరం లేకుండా వేలాది కుటుంబాలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారుడికి చేరవేసే కార్యక్రమం. గ్రామీణ కార్మికులకు తమ పనికి అత్యధిక విలువ, వినియోగదారులకు తాము చెల్లించిన ధరకు అత్యంత గిట్టుబాటును ఒనగూర్చే పని ఇది. మన జాతికి ఖాదీ నిస్సందేహంగా అతి విలువైన వారసత్వ సంపద.

అయిదు వేలకు పైగా సంస్థలు, మూడు లక్షల ఇరవై వేల మందికి పైగా సూక్ష్మ పారిశ్రామికవేత్తలు మన దేశంలో కేవీఐసీ కార్యక్రమాలను, లక్ష్యాలను అమలు చేసేందుకు భారీ నెట్‌వర్క్, యంత్రాంగంగా దోహదం చేస్తున్నారు. కేవీఐసిలో వివిధ పథకాల కింద కోటిమందికి పైగా ఫలవంతమైన కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నారు.

ఖాదీ ఉత్పత్తి కార్యకలాపాల్లో ప్రధానంగా మహిళలే పాల్గొంటారు. ఖాదీ కార్మికుల్లో ఎనభై శాతానికి మందికి పైగా మహిళలే. గ్రామీణ పరిశ్రమల కార్యక్రమంలో మహిళల వాటా 30%. ఖాదీ గ్రామీణ పరిశ్రమల రంగం 40,000 కోట్ల రూపాయలకు పైగా ఖాదీ గ్రామీణ ఉత్పత్తుల తయారీ జరుపుతుంది. ఇందులో నలభై శాతం ఖాదీ కార్యకలాపాల కింద గ్రామీణ ప్రజలకు జీవనోపాధి సహాయంగా తిరిగి లభిస్తుంది.

వాతావరణంలో మార్పుల వల్ల దుష్ప్రభావం, పారిశ్రామికీకరణ వల్ల పెరిగిపోతున్న కార్బన్ పాదముద్రల గురించి ప్రపంచం అంతా తీవ్రంగా చర్చిస్తున్న తరుణంలో, మన దేశం ఖాదీ పరిశ్రమ జీరో కార్బన్ ఫుట్ ప్రింట్ గురించి ప్రపంచానికి తెలియచెప్పాలి. సింథటిక్ జౌళి పరిశ్రమల వల్ల పర్యావరణానికి జరుగుతున్న హాని గురించి ఇంకా మనకు పూర్తిగా తెలియని సమయంలో ఖాదీ పరిశ్రమ వల్ల ఏ నష్టం లేదన్న విషయం చెప్పాలి. ప్రపంచవ్యాప్తంగా వార్షికంగా ఆరువేల కోట్ల టన్నుల కిలోల జౌళి ఉత్పత్తి జరుగుతుందని అంచనా కాగా, వాటి ఉత్పత్తికి 1,074 వందల కోట్ల KWh విద్యుత్ (లేదా 132 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు), 6 నుంచి 9 ట్రిలియన్ లీటర్ల నీరు అవసరం అవుతున్నాయని అంచనా. సింథటిక్ జౌళి పరిశ్రమ అతి పెద్ద గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలకు కారణం. భౌగోళికంగా ఉత్పత్తి అవుతున్న మొత్తం కార్బన్ లో ఇరవయ్యో వంతు ఈ పరిశ్రమ ద్వారానే జరుగుతోంది.

అయితే ఖాదీ మాత్రం చేనేత వస్త్రం కావడంతో ఉత్పత్తిలో విద్యుచ్ఛక్తిని ఏ మాత్రం వినియోగించరు. పూర్తిగా నైసర్గిక పద్ధతిలో, కార్బన్ కాలుష్య రహితంగా ఈ వస్త్రం తయారౌతుంది. భవిష్యత్తులో వస్త్రరంగంలో అత్యుత్తమమైన నూలుగా ఖాదీకి స్థానం లభించాలి. ఈ మౌలిక ప్రాతిపదికన మనం ఖాదీని భౌగోళిక వేదికపై ప్రవేశపెట్టి ఆధునిక ప్రపంచంలో ఖాదీ విలువ, పరిశుభ్రమైన, నిరంతరాభివృద్ధి సాధించగలిగే ప్రపంచానికి ఖాదీ అవసరం గురించి తెలియచెప్పాలి.

"మన గ్రామాల్లో ఖాదీ గ్రామోద్యోగ్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని అనుకుంటున్నాం. ఖాదీ లక్షలాది మందికి ఉపాధి కల్పించే అవకాశాన్నిస్తుంది," అని ప్రధాన మంత్రి తన మన్ కీ బాత్ ప్రసంగంలో చెప్పారు.

ఖాదీకి, ముఖ్యంగా నేత కార్మికుల సమస్యలకు, ప్రధానమంత్రి ఇస్తున్న ప్రాధాన్యం, జాతి నిర్మాణంలో వారు పోషించగల పాత్రను ప్రతిఫలిస్తుంది. 'స్వాతంత్ర్యానికి ముందు జాతికోసం ఖాదీ, స్వాతంత్ర్యం తర్వాత రీతి కోసం ఖాదీ' అని ప్రధానమంత్రి ఇటీవల మంచి నినాదం ఇచ్చారు. "ఖాదీ వినియోగాన్ని పెంచాలి. కనీసం ఒక్క ఖాదీ వస్త్రమైనా కొనుగోలు చేయండి. మీరు ఖాదీ కొంటే, మీరు ఒక పేద వ్యక్తి ఇంటిలో దీపం వెలిగించినవారు అవుతారు," అని కూడా ప్రధానమంత్రి చెప్పారు. ప్రధాన మంత్రి చేసిన ఈ విజ్ఞప్తి తర్వాత ఖాదీ వస్త్రం, దుస్తుల అమ్మకాలు గత ఏడాది 29% పెరిగాయి. ఈ పెరుగుదల ధోరణి ఇంకా కొనసాగుతోంది.

ఒక వస్త్రంగా ఖాదీ, ఆధునిక సమాజంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా మార్పులు చెందింది. ఈనాడు దేశంలో వేలాది ఉత్పత్తి కేంద్రాల్లో నూలు, పాలియెస్టర్, పట్టు మొదలైన వివిధ రకాల వస్త్రాలను వినియోగదారుల అవసరం ప్రకారం కలిపి నేత నేసే పని చేస్తున్నారు.

"ఒక నూలు, ఒక జాతి" అన్నది ఇప్పుడు కొత్త నినాదం. ఖాదీ నుంచి బ్రాండ్ ను ఖాదీ ఇండియాకు మార్చాం. "ఒక నూలు, ఒక జాతి" శీర్షికతో కేవీఐసి 2016 5 మే నుంచి 4 జూన్ వరకు శ్రీనగర్‌లో ఒక నెలరోజుల జాతీయ ఖాదీ ప్రదర్శన నిర్వహించింది. స్వాతంత్ర్యం అనంతరం తీవ్రవాద సమస్య ఎదుర్కొంటున్న జమ్మూ కాశ్మీర్‌లో ఇటువంటి ప్రదర్శన నిర్వహించడం ఇదే మొదటి సారి. దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన 198 ఖాదీ సంస్థలు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించగా వాటిలో 56 జమ్మూ కాశ్మీర్‌కి చెందినవే. లక్షమందికి పైగా సందర్శకులు, రెండు కోట్ల రూపాయలకు పైగా అమ్మకాలతో ఈ ప్రదర్శన విజయవంతమైంది. మే 2016లో కేవీఐసి కాశ్మీర్లోని పంపోర్ వద్ద 25 చర్ఖాలు, అయిదు మగ్గాలతో ఒక కేంద్రం ఏర్పాటు చేసింది. జమ్మూ జిల్లా నగ్రోతా గ్రామంలో ఉగ్రవాద బాధిత కుటుంబాల కోసం రుమాలు తయారీ ప్రాజెక్టు ప్రారంభించి 296 మంది మహిళలకు అక్కడ ఉపాధి కల్పించారు.

భౌగోళికంగా ఫ్యాషన్ రంగంలోకి ప్రవేశించేందుకు కేవీఐసి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన రితు బెరీని కమీషన్ కు సలహాదారుగా నియమించింది. ఖాదీలో రెడీ మేడ్ దుస్తులలో అత్యాధునిక డిజైన్లు, స్టైల్ పైనా, దేశంలోనూ, విదేశాల్లోనూ ఖాదీని పెంపొందించేందుకు సంబంధించి ఆమె కమీషన్‌కు సలహాలు, సూచనలు ఇస్తారు.

ఈ నేపథ్యంలో, గ్రామీణ, పేద ప్రజలకు ఫలవంతమైన ఉపాధి కల్పించే బృహత్ బాధ్యత కేవీఐసిపై ఉంది. ఈ విధంగా మన దేశంలో గ్రామీణాభివృద్ధికి చోదక శక్తిగా పని చేసే లక్ష్యాన్ని

కేవీఐసికి నిర్దేశించారు. ఖాదీతో సహా వైవిధ్యంతో కూడుకున్న గ్రామీణ పరిశ్రమలను ఏర్పాటు చేసి, పెంపొందించి, ప్రోత్సహించి, నిరంతరం పని చేసేలా చూడడం కమీషన్ పని.

గుర్తు తెలియని సైనికులకు స్మారక చిహ్నం మాదిరిగా, చరఖా కూడా జాతిపిత పిలుపుకి స్పందించి, స్వావలంబన, శ్రమ మార్గాలను నమ్ముకున్న గుర్తు తెలియని గ్రామీణ ప్రజలకు నివాళిగా నేను భావిస్తాను. నూలు వడకడం ద్వారా అహింసా పోరాటంలో, సత్యాగ్రహంలో యోధుడైన ప్రతి ఒక్క వ్యక్తినీ మనం గుర్తుంచుకోలేమేమో కానీ, మనం చరఖాను సగర్వంగా ప్రదర్శించినప్పుడల్లా, మనం ఆ యోధులందరికీ నివాళి అర్పిస్తున్నట్లే ! ఈ దృక్కోణం నుంచి చూస్తే, స్వరాజ్యానికి ప్రతీక అయిన చరఖాను దేశ రాజధానిలో సముచితమైన స్థానంలో ప్రదర్శించడం మన దృష్టిని ఎప్పుడు ఆకర్షించేందుకు మంచి పద్ధతి అని నేను అనుకుంటున్నాను. చరఖా ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని, న్యూఢిల్లీలో ఇందిరా గాంధి అంతర్జాతీయ విమానాశ్రయంలో T-3లో ప్రపంచంలోనే అతి పెద్ద చరఖా నమూనాను కేవీఐసి నెలకొల్పింది.

కేవీఐసి ప్రధాన లక్ష్యాల్లో ఒకటి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడం. మన దేశంలో ప్రధానమంత్రి జాతీయ ఉపాధి కల్పనా కార్యక్రమం ప్రారంభం అయిన నాటి నుంచి 20 లక్షలకు పైగా ఉపాధి అవకాశాలు కల్పించారు. కేవీఐసి ఉపాధి పథకాల వల్ల సాధించిన సత్ఫలితాల్లో ముఖ్యమైనది గ్రామీణులు పట్టణప్రాంతాలకు వలస పోకుండా నివారించడం, తద్వారా దేశీయ, స్థానిక నైపుణ్యాలు గ్రామీణ ప్రాంతాల్లోనే వికసించేలా తోడ్పడడం.

కేవీఐసి అమలు చేస్తున్న అనేక పథకాలు, కార్యక్రమాలతో పాటుగా, గ్రామాల్లో ఖాయిలా పడ్డ పరిశ్రమలను పునరుద్ధరించడం, అమ్మకాలు రెట్టింపు చేయడం, నేత కారులకు అధిక వేతనాలు అందేలా ఒక యంత్రాంగాన్ని అభివృద్ధి పరచడం కమీషన్ చైర్మన్‌గా నా ప్రస్తుత ఆశయం. నేత కేంద్రాలు నడిపేందుకు సౌర విద్యుత్ ఉపయోగించి, శారీరక శ్రమ తగ్గించాలని కూడా మేము భావిస్తున్నాం. నేత కార్మికులకు బీమా సౌకర్యం కల్పించడం, నికరమైన ఆరోగ్య సేవల వ్యవస్థలో చేర్చడం, వారి విద్యావకాశాలు పెంచి, వారి కృషికి భౌగోళిక జీవన స్రవంతిలో గుర్తింపు తీసుకురావడం మొదలైనవి ఇప్పుడు కేవీఐసి లక్ష్యాల్లో ముఖ్యమైనవి.

ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు ఆధునిక భారత్‌లో, ఆధునిక ప్రపంచంలో తమకున్న కీలకమైన, అర్థవంతమైన స్థానాన్ని రుజువు చేసుకుంటున్నాయి. మానవ చరిత్రలోనే అత్యంత స్థిరమైన సామాజిక ఆర్థిక వ్యవస్థలుగా తమ విలక్షణతను పదేపదే నిలుపుకుంటున్నాయి.

■

*16వ పేజీ తరువాయి...*

## భారత్‌లో చేనేత : గతం, వర్తమానం, భవిష్యత్తు

సంఘాలు సమర్థంగా పనిచేసాయి. ఇప్పటికీ సేవలందిస్తున్నాయి. అయితే వీటి వని స్థానికులకే పరిమితమవుతున్నది. అలాకాక ఆధునికతను ఉపయోగించి ఇటు చేనేత వనివారికి, ప్రజలకు ఉపయోగపడే కేంద్రాలుగా నైపుణ్య శిక్షణా కేంద్రాలుగా మలచి వాటిని డిజిటలైజేషన్, ఆన్‌లైన్ ప్రక్రియలద్వారా అందరికీ అందుబాటులో ఉంచవచ్చు. నైపుణ్యాలను అభివృద్ధిపరచడానికి ముందుగా నైపుణ్యాల సర్వేజరగాలి. అలాగే ప్రస్తుతం ఉన్న నైపుణ్యాలను గుర్తించడంతోపాటూ ఆర్థిక, సామాజిక స్థితిగతులను కూడా గుర్తించాలి. వారి సామర్థ్యాన్ని పెంచడానికి ఫొటోగ్రఫీ, అకౌంటింగ్, ఎగ్జిబిషన్, అన్‌లైన్ అమ్మకాలవంటివాటిలో కొత్త నైపుణ్యాలను వారికి అందించాలి.

**పునరుజ్జీవం :**

ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ల ఏకరూపతతో వినియోగదారులు విసుగెత్తడం చేనేతకు శుభ సూచకం. ఈ ఉత్పత్తులపట్ల వారి ఆసక్తి పెరుగుతున్నది. చేనేత విశిష్టతలు చాలా ఉన్నాయి. ప్రతి వస్తువూ వైవిధ్యంతో ఉంటుంది. అన్నీ ఒకేలా ఉండవు. ఖాతాదారులు కోరుకున్న విధంగా కూడా తయారు చేసి ఇవ్వవచ్చు. వారసత్వం, సంప్రదాయాల మక్కువ ఎలాగూ ఆకర్షిస్తుంది. చేనేతలో ప్రతి వస్త్రానికో ఆసక్తికరమైన కథ ఒకటుంటుంది.

ప్రోత్సాహానికి, ప్రచారానికి సామాజిక మాధ్యమాలు బాగా సహకరిస్తున్నాయి. జౌళి మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన 'చేనేత ధరించండి' నినాదం చేనేతకు కొత్త ఖాతాదారులను పెంచుతున్నది.

'మేకిన్ ఇండియా', 'స్కిల్ ఇండియా' వంటివాటితో శరవేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అంతర్జాతీయంగా ఆసక్తి రేకెత్తించింది. ఇది కేవలం మూడో కూటమి దేశం కాదు, సాంస్కృతికంగా, సాంప్రదాయ కంగా శక్తిసామర్థ్యాలున్న దేశం. అలాగే ఆధునికతను కూడా అక్కున చేర్చుకునే దేశంగా గుర్తింపుతెచ్చుకుంటున్నది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న హస్తకళలు, సంప్రదాయకళలు, చేనేత ఖాతాదారులను కూడా ఆకర్షిస్తున్నది. సృజనాత్మకమైన ఈ సాంస్కృతిక సంపదకు ఎంతగా ప్రచారం కల్పిస్తే చేనేత కళాకారులకు అంతగా ప్రోత్సాహం లభించి, దేశ ప్రగతి ప్రస్థానంలో వారూ కలిసి నడుస్తారు.

సమస్యలు ఎన్నయినా ఉండొచ్చు. కానీ సామర్థ్యానికి మాత్రం హద్దుల్లేవు. మరేదేశానికీ లేని అసాధారణ నైపుణ్యాలు, ప్రజ్ఞ, ప్రక్రియలతో భారత్‌లో పొరలుపొరలుగా అమరిన సాంస్కృతిక వారసత్వం సజీవంగా కొనసాగడానికి తోడ్పడుతున్నందువల్ల ఈ సవాలు సృజనాత్మకమైనది, స్ఫూర్తిదాయక మైనది కూడా. ఇదంతా ఒక ఎత్తయితే... చేనేత పనివారి కుటుంబాలకు నిజమైన ఆర్థిక భరోసాతో వారి జీవితాలకు ఒక పరమార్థం కల్పించడం మరొక ఎత్తు.

■

ప్రత్యేక వ్యాసం

# జౌళి రంగంలో సాంకేతిక నవ శకం



**టెక్స్‌టైల్ రంగంలో సాంకేతిక టెక్స్‌టైల్స్ నూతనంగా ఆవిర్భవిస్తున్న పరిశ్రమ. మెడికల్, సివిల్ ఇంజనీరింగ్, ఆటోమోబైల్ తదితర రంగాల్లో వివిధ అవసరాలైన ఫిల్టరేషన్, ప్రొటెక్షన్, బారియర్, ఇన్సులేషన్, హైజీన్, దృఢత్వం, సుదీర్ఘకాల మన్నిక వంటి అవసరాల కోసం సాంకేతిక టెక్స్‌టైల్స్‌ని వినియోగిస్తున్నారు. సాంకేతిక టెక్స్‌టైల్స్‌ని ప్లాస్టిక్, లోహాలు, పేపర్, ఫిల్మ్ వంటి వాటి స్థానంలో సాంకేతిక ప్రయోజనాలను సాధించడానికి వాడుతున్నారు.**

మానవ జీవితంలో టెక్స్‌టైల్ కీలక పాత్ర పోషిస్తుంది. టెక్స్‌టైల్ అంటే కేవలం దాన్ని మనం దుస్తులుగా ధరించడమే కాకుండా విస్తారమైన ప్రయోజనాలున్నాయి. ఊయల తొట్టిలో పడిన నాటి నుంచి కాటికి చేరే వరకు ప్రతి దశలోనూ వస్త్ర ప్రాముఖ్యత ఉంది. వస్త్రేతర రంగాల్లోనూ టెక్స్‌టైల్ అవసర ముంటుంది. సాంకేతిక ప్రయోజనాల కోసం రూపొందించే టెక్స్‌టైల్‌ను సాంకేతిక టెక్స్‌టైల్ అంటారు. అయితే ఈ సాంకేతిక టెక్స్‌టైల్‌ను అలంకరణ కోసమో, అభిరుచి కోసమే తయారు చేయరు. సాంకేతిక ప్రయోజనాల కోసం సాంకేతిక టెక్స్‌టైల్ ఉత్పాదనలను, పదార్థాలను తయారుచేస్తారు.

వివిధ రకాలైన సాంకేతిక టెక్స్‌టైల్ ఉత్పాదనల్లో మిశ్రమ టెక్స్‌టైల్ పదార్థాలు, నిర్మితాలు, అంతిమ రూప కల్పన, వస్త్ర రీతులు, మార్పిడి పరిజ్ఞానాన్ని వినియోగిస్తారు. అంటే పరిశుభ్రం చేసే పరికరం వంటి సాధారణ సాంకేతిక టెక్స్‌టైల్ నుంచి సంక్లిష్టమైన, అత్యంత దృఢమైన కణజాల రూపంలోని అంతర్గత పరికరాల (ఇంప్లాంట్స్) వరకు తయారుచేస్తారు. అయితే సాంకేతిక ప్రయోజనాల కోసం టెక్స్‌టైల్‌ను వినియోగించడం మానవ జాతికి కొత్తేమీ కాదు. గతంలో అలాంటి సాంకేతిక టెక్స్‌టైల్స్ నిర్మాణంలో, వినియోగంలో ఈనాటి వాటితో పోలిస్తే, అతి సాధారణంగా ఉండేవి. నేటి సాంకేతిక టెక్స్‌టైల్స్ తయారీలో పనితీరులో, అవసరమైన సామర్థ్యంలో అత్యాధునికంగా ఉండడానికి సరికొత్త పదార్థాలను, నిర్మాణాలను, రసాయనాలను, మిశ్రమాలను వాడుతున్నారు.

ఇలాంటి సాంకేతిక టెక్స్‌టైల్స్‌ని ప్లాస్టిక్, లోహాలు, పేపర్, ఫిల్మ్ వంటి వాటి స్థానంలో సాంకేతిక ప్రయోజనాలను సాధించడానికి వాడుతున్నారు. ఎందుకంటే వీటి అనమాన్యమైన లక్షణాలు, వినూత్న నిర్మాణాలు, అతి తక్కువ బరువు, అతి పొడవు నుంచి మందం నిష్పత్తి, అవసరానికి తగిన రీతిలో మలుచుకొనే లక్షణాల కారణంగా సాంకేతిక టెక్స్‌టైల్స్‌కి డిమాండ్ పెరిగింది. ఆధునిక సాంకేతిక టెక్స్‌టైల్స్ నిర్మాణంలో సంక్లిష్టంగా ఉన్నప్పటికీ పనితీరు సామర్థ్యం మెరుగ్గా ఉండడంతో పాలిమర్స్, ముడి పదార్థాలు, ఫైబర్ నిర్మాణాలు, లక్షణాలు, యార్న్, ఫిలామెంట్ నిర్మాణం, గార్మెంట్ ఉత్పత్తులు, నిర్మాణాలను ప్రత్యేక ప్రయోజనాలు సాధించడానికి వినియోగిస్తున్నారు.

**ప్రకాష్ వాసుదేవన్,** డైరెక్టర్, దక్షిణ భారత జౌళి పరిశోధన సంఘం.
E-mail: director@sitra.org.in

ఇలాంటి అనేక సాంకేతిక టెక్స్‌టైల్స్‌లో ఫైబ్రోస్ నిర్మాణాలు (ఉదాహరణకి సర్జికల్ కాటన్ ఉత్పత్తులు, కాటన్ వూల్ రోల్స్, కాటన్ బడ్స్, హెమోస్టాటిక్ ఫైబ్రోస్ పాడ్స్, శబ్ద నిరోధానికి ఫైబర్ నింపిన పరికరాలు, ఉష్ణ నిరోధకాలు, తలగడలు, హెూసెస్, ఫిల్టర్స్, రూఫ్ లైన్స్ వంటివి). సూచర్స్, రోప్స్ వంటి ఉత్పత్తులను యార్న్, ఫిలామెంట్ వంటి వాటితో తయారు చేస్తారు. వూవెన్ వంటి ఫాబ్రిక్ నిర్మాణాలతో బెడ్ షీట్స్, సర్జికల్ గౌన్స్, కార్బన్, గ్లాసు వూవెన్ ఫాబ్రిక్స్, కార్పెట్స్, సీట్ ఫాబ్రిక్స్, బాండేజెస్, కోత నిరోధక ఫాబ్రిక్స్ రూపొందిస్తున్నారు. హెరినా మెష్, స్పోర్ట్స్‌వేర్, కంప్రెషన్ గార్మెంట్స్, స్పేసర్ ఫాబ్రిక్ వంటి వాటినీ ఈ సాంకేతిక టెక్స్‌టైల్‌లో తయారు చేస్తారు. వాస్కులర్ గ్రాఫ్ట్స్, ట్యూబ్యులర్ బాండేజీ, చెపల వలలు, శాటిలైట్ యాంటెన్నాలను కూడా సాంకేతి టెక్స్‌టైల్ పరిజ్ఞానంతో రూపొందిస్తున్నారు. ఇక నాన్ వూవెన్ టెక్స్‌టైల్ కింద టిష్యూ ఇంజనీరింగ్‌కి స్కాఫోల్డ్స్, ఫిల్టర్ మెంబ్రేన్, వైప్స్, డిస్పోజబుల్స్, క్రాప్ కవర్స్, సీడ్ బ్లాంకెట్స్, వీడ్ కంట్రోల్ ఫాబ్రిక్స్, ఇన్సులేషన్ టేప్స్ వంటివాటిని తయారు చేస్తారు. సూచర్స్, రోప్స్, స్టెంట్స్, లిగమెంట్స్, టెండాన్స్, ఫ్లాస్, స్కాఫోల్డ్స్ వంటి బ్రైడెడ్ పరికరాలను, రొటేటర్ కఫ్, ఎంబ్రాయిడర్డ్ సర్ఫ్యాట్స్ వంటి ఎంబ్రాయిడర్డ్ పరికరాలను, పైన పేర్కొన్న పదార్థాల మిశ్రమాలతో బేబీ డైపర్స్, శానిటరీ నాప్‌కిన్స్ వంటి వాటిని కూడా రూపొందిస్తున్నారు.

ప్రత్యేక ప్రయోజనాలు, నిర్వహణ అవసరాల కోసం, కోటింగ్స్, లామినేషన్ (అగ్ని మాపక పదార్థంగా, యాంటీ మైక్రోబియల్, బ్రీథబుల్, ఫ్లూయిడ్ రిపల్లెంట్ వంటివి) కోసం సాంకేతిక టెక్స్‌టైల్‌ను వినియోగిస్తారు.

**భారత్‌లో సాంకేతిక టెక్స్‌టైల్ వృద్ధికి అవకాశాలు, అవసరాలు:**

1. ఆదాయం పెరిగింది, దీంతో సగటు భారతీయ వినియోగదారుడి కొనుగోలు శక్తి పెరిగింది. మరింత మెరుగైన, సౌకర్యవంతమైన, ఖరీదైన, విలాసవంతమైన, పరిశుభ్రమైన రక్షణాత్మ వస్తువులపై వ్యయం చేయడానికి ఆసక్తి చూపిస్తున్నాడు. దీంతో వైప్స్, శానిటరీ నాప్‌కిన్స్, బేబీ డయాపర్స్ వంటి వస్తువుల వినియోగం పెరిగింది. గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు.
2. ఒక ప్రత్యేక రంగం అభివృద్ధిని బట్టే సాంకేతిక టెక్స్‌టైల్‌కి డిమాండ్ ఉంటుంది. ఉదాహరణకి, ఆటోమొబైల్ పరిశ్రమ శరవేగంగా పెరుగుతుండడంతో ఆటోమొబైల్ టెక్స్‌టైల్‌కి డిమాండ్ పెరుగుతోంది. నగర భారతంలో పెరుగుతున్న ఆధునిక హాస్పిటల్స్‌తో వైద్య పర్యాటకం కూడా పెరగడంతో మెడికల్ టెక్స్‌టైల్ వినియోగం పెరిగింది.
3. వినియోగదారుల్లో అత్యధికులు విద్యావంతులు కావడంతో ఇంటర్నెట్, టీవీ వంటి వాటి కారణంగా టెక్నికల్ టెక్స్‌టైల్ ఉపయోగం, ఇతర వాటితో పోలిస్తే తక్కువ వ్యయం వంటి వాటిపై అవగాహన పెరిగింది. ఉదాహరణకి ఇప్పటికే చాలామంది భారతీయ రైతులు వ్యవసాయ ఆధారిత టెక్స్‌టైల్ ఉత్పత్తుల ప్రాధాన్యత గుర్తించడంతో అగ్రో టెక్స్‌టైల్స్ వాడకం పెరిగింది.
4. టెక్నికల్ టెక్స్‌టైల్ అంటే అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్నది, అనేక రంగాల మధ్య సంయమనం సాధించేది కావడంతో, ఇది పాతకాలం నాటి టెక్స్‌టైల్ తయారీదారులకు సరికొత్త అంశంగా కనిపిస్తుంది. దీంతో సాంకేతిక టెక్స్‌టైల్ రంగంలోకి అడుగు పెట్టేవారికి దేశీయంగా పోటీ కూడా ఉండదు.
5. జనాభా పెరగడంతో పాటు ఆయు:ప్రమాణాలు పెరగడం కూడా కలిసి వచ్చే అంశమే. జీవన కాలం పెరగడంతో ప్రపంచంలోనే రెండో అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ ఆవిర్భవించింది. తత్ఫలితంగా సాంకేతిక టెక్స్‌టైల్‌కి అంటే హైజీన్ (పరిశుభ్రత), ఆరోగ్య జాగ్రత్తల సంబంధ టెక్స్‌టైల్‌కి డిమాండ్ పెరిగింది.
6. దీంతో పాటు ఆన్‌లైన్ వ్యాపారాలు, సంఘటిత వాణిజ్య సముదాయాల కారణంగా సాంకేతిక టెక్స్‌టైల్ ఉత్పత్తులు వినియోగదారుడికి చేరడం సులువు కావడంతో వృద్ధి రేటు కూడా నమోదు అవుతోంది.
7. సంప్రదాయ టెక్స్‌టైల్ ఉత్పత్తుల కన్నా అధిక లాభాలు రావడంతో ఎక్కువమంది ఈ సాంకేతిక టెక్స్‌టైల్ వైపు మొగ్గు చూపుతున్నారు.
8. ప్రపంచ సాంకేతిక టెక్స్‌టైల్ ఉత్పత్తుల వినియోగంతో పోల్చి చూస్తే భారత్‌లో వీటి కొనుగోలు, వినియోగం తక్కువగా ఉండడంతో దేశీయంగా వీటి మార్కెట్ వృద్ధికి సమృద్ధిగా అవకాశాలున్నాయి. భారతీయ వినియోగదారుడి సంస్కృతి అలవాట్లలో వచ్చిన మార్పుకి ప్రపంచీకరణ, పాశ్చాత్తీకరణ కారణమవడంతో అత్యంత సామర్థ్యమున్న హోమ్ టెక్స్‌టైల్స్, మొబిల్‌టెక్, స్పోర్ట్స్‌టెక్ వంటి సాంకేతిక టెక్స్‌టైల్స్ ఉత్పత్తుల వినియోగం పెరగడం మొదలైంది.
9. కొన్ని సాంకేతిక టెక్స్‌టైల్ ఉత్పత్తులకు పారిశ్రామిక డిమాండ్ కూడా పెరుగుతోంది.
10. ప్రపంచంలో భారత్ రెండో అతి పెద్ద టెక్స్‌టైల్ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు సాధించింది. అందువలన బలమైన పంపిణీ, ఎగుమతులు, దిగుమతుల సంబంధాలు, మౌలిక సౌకర్యాలు లభ్యం కావడంతో సాంకేతిక టెక్స్‌టైల్ రంగం మరింతగా లబ్ధి పొందుతుంది.

11. సంప్రదాయ టెక్స్‌టైల్ రంగంలో ప్రస్తుతం లభిస్తున్న చౌక అయిన కార్మికశక్తి కూడా సాంకేతిక టెక్స్‌టైల్ రంగం వృద్ధికి దోహదపడుతుంది.

**సాంకేతిక టెక్స్‌టైల్ అవసరాలు:**

ఈ రంగంలోని పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుత అంచనా అంటే 2015 నుంచి 2020 నాటికి 4.68 శాతం సీఏజీఆర్ 2020 నాటికి 42.2 మిలియన్ మెట్రిక్ టన్నుల వృద్ధిని సాంకేతిక టెక్స్‌టైల్ రంగం సాధిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరో నివేదిక ప్రకారం 2014-2019 నాటికి సీఏజీఆర్ 3.71 శాతం వృద్ధిని నమోదు చేస్తుంది. అయితే పరిమాణంలో వివిధ రకాలైన సాంకేతిక టెక్స్‌టైల్ ఉత్పత్తులు తయారీ ఏటా 8 నుంచి 19 శాతం వృద్ధి నమోదు చేస్తూ మొత్తం సాంకేతిక టెక్స్‌టైల్ ఉత్పత్తుల పరిమాణంలో సీఏజీఆర్ 11 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇక దేశ స్థూలోత్పత్తికి ప్రస్తుతం ఉన్న 12 శాతం దేశీయ సాంకేతిక టెక్స్‌టైల్ ఉత్పత్తులు, 20 శాతం చైనా ఉత్పత్తులు 0.75 శాతం వాటాను అందిస్తున్నాయి. 2017-18 నాటికి దేశంలో సాంకేతిక టెక్స్‌టైల్ పరిశ్రమ రూ. 1,16,217 కోట్లకు చేరుతుందని అంచనా. అంతర్జాతీయ సాంకేతిక టెక్స్‌టైల్ రంగంలో భారత్ వాటా కేవలం 3 శాతమే ఉండగా, చైనా, యూరోప్ తయారీదారుల వాటా 75 శాతం ఉంది.

**సవాళ్లు**

**1. ప్రత్యేక ముడి పదార్థాల కొరత:**

సంప్రదాయ టెక్స్‌టైల్ పరిశ్రమకి అవసరమైన ముడి పదార్థాలు భారత్‌లో సుస్థిరమైన పంపిణీ వ్యవస్థ కారణంగా అమేయంగా ఉన్నాయి. అయితే సాంకేతిక టెక్స్‌టైల్స్ విషయంలో స్పష్టమైన కొరత కనిపిస్తుంది. ప్రత్యేక అవసరాల కోసం, ఉన్నత సామర్థ్యమున్న ముడి పదార్థాలు, ఫైబర్స్, యార్న్స్, ఫాబ్రిక్స్ అందుబాటులో లేకపోవడం సాంకేతిక టెక్స్‌టైల్స్ పరిశ్రమ అభివృద్ధికి అడ్డంకిగా మారింది. అలాంటి పదార్థాలను భారత్ దిగుమతి చేసుకోవాల్సి రావడంతో ఉత్పత్తి వ్యయం పెరిగి, అధిక సమయం తీసుకుంటుండడంతో పోటీలో వెనకపడుతోంది.

**2. సాంకేతిక పరిజ్ఞాన కొరత:**

సంప్రదాయ టెక్స్‌టైల్ తయారీలో భారత్‌కి సుసంపన్నమైన పరిజ్ఞానం ఉన్నప్పటికీ అత్యాధునిక సాంకేతిక టెక్స్‌టైల్స్ ఉత్పత్తుల తయారీకి అవసరమైన ఆధునిక సాంకేతికత కొరవడింది. ముడి పదార్థాల్లాగానే, సాంకేతిక టెక్స్‌టైల్స్ తయారీకి అవసరమైన యంత్ర సామాగ్రిని దిగుమతి చేసుకోవాల్సి రావడంతో ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతోంది.

**3. వివిధ తయారీ విధానాల మధ్య అనుసంధానం, మార్కెటింగ్ :**

సాంకేతిక టెక్స్‌టైల్స్ వంటి నూతన ఉత్పాదనకి వివిధ తయారీ విధానాల మధ్య అనుసంధానం అవసరం. ఒకసారి అలాంటి ఉత్పాదనను అభివృద్ధి చేస్తే, పారిశ్రామికంగా గిట్టుబాటయ్యే సాంకేతిక తయారీ, మార్కెటింగ్ మరో సవాలుగా నిలుస్తుంది.

**4. నైపుణ్యమున్న మానవ వనరుల కొరత:**

సాంకేతిక టెక్స్‌టైల్స్ విభాగం అత్యంత సక్లిష్టమైన నిర్మాణాల మీద ఆధారపడి ఉండడంతో దానికి వివిధ తయారీ విధానాలలో పరిజ్ఞానం అవసరమవుతుంది. దీని కోసం కార్యనిర్వాహకుడి నుంచి కార్మికుడి వరకు నైపుణ్యమున్న మానవ వనరులు అవసరమవుతారు. ఉదాహరణకి, మెడికల్ టెక్స్‌టైల్‌లో మెడికల్ సైన్స్, టెక్స్‌టైల్ పరిజ్ఞానం, జియో టెక్స్‌టైల్స్‌లో సివిల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ పరిజ్ఞానం అవసరం.

**5. సరైన నియమాలు, ప్రమాణాల కొరత:**

భారత దేశంలో సాంకేతిక టెక్స్‌టైల్స్ ప్రారంభదశలో ఉండడంతో ఇప్పటికే ఉన్న వ్యవస్థల్లో సాంకేతిక టెక్స్‌టైల్స్ రంగానికి అవసరమైన నియమాలు, ప్రమాణాలు మృగ్యమయ్యాయి. ఈ రంగంలో నియమాలు, ప్రమాణాలను అత్యావశ్యకంగా నెలకొల్పాల్సిన అవసరముంది. అయితే సాంకేతిక టెక్స్‌టైల్స్ ఉత్పాదనల్లో అలాంటి వాటి గురించి కనీస అవగాహన లేక అందుబాటులో లేవు.

**6. అంతర్జాతీయ పరిశోధన మరియు అభివృద్ధి లోపం:**

భారతీయ విశ్వ విద్యాలయాలు, కళాశాలలు, పరిశోధనా మరియు అభివృద్ధి కేంద్రాలు స్పష్టమైన ఉత్పాదాన కేంద్రకంగా ప్రపంచస్థాయి పరిశోధన మరియు అభివృద్ధిపై అత్యధికంగా మదుపు చేయాల్సి ఉంటుంది.

**7. ఒక ఏకీకృత కోడింగ్ వ్యవస్థ లేమి:**

విశిష్టమైన, గుర్తించగలిగే సాంకేతిక టెక్స్‌టైల్స్ ఉత్పత్తులఎగుమతికి ఏకీకృత కోడింగ్ వ్యవస్థను (హెచ్ఎస్ఎన్ కోడ్స్) అవసరం.

**8. ఒక చక్కటి సంఘటితమైన సాంకేతిక టెక్స్‌టైల్స్ రంగం లేకపోవడం:**

సాంకేతిక టెక్స్‌టైల్స్ రంగం ప్రధానంగా చిన్నతరహా పరిశ్రమ స్థాయిలో ఉండడం, సంప్రదాయ టెక్స్‌టైల్ పరిశ్రమ కన్నా ఎక్కువగా వికేంద్రీకృతంగా ఉండడం సమస్యగా మారుతోంది.

**9. ప్రత్యేక వాణిజ్య మౌలిక సౌకర్యాల కొరత:**

రవాణ, నీరు, వ్యర్థ నిర్వహణ, పరీక్షా సదుపాయాలు, టెలీ కమ్యూనికేషన్స్, హై స్పీడ్ ఇంటర్నెట్ వంటి నవ్య మౌలిక సదుపాలను సాంకేతిక టెక్స్‌టైల్స్ రంగం అభివృద్ధి పెంపొందించుకోవాలి.

**10. చైనా వంటి అంతర్జాతీయ ఉత్పాదక దేశాల నుంచి ఎదురయ్యే పోటీ.**

**11. వ్యర్థ నిర్వహణ, నిబంధనల కొరత:**

కొన్ని సాంకేతిక టెక్స్టైల్స్ ఉత్పత్తులకు సరైన వ్యర్థ నిర్వహణ పరిష్కారాలను అత్యవసరంగా కనుగొనాల్సి ఉంది. ప్రత్యేకించి శానిటరీ నాప్కిన్స్, బేబీ డయాపర్స్, అంటువ్యాధి లక్షణాలున్న హాస్పిటల్ వ్యర్థాలు వంటి అత్యధిక పరిమాణంలో వినియోగించే సాంకేతిక టెక్స్టైల్స్ ఉత్పత్తులను పర్యావరణ హితంగా నిర్మూలించే వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలి.

**ప్రభుత్వ చర్యలు :**

1. సాంకేతిక టెక్స్టైల్స్ మెరుగుదల, అభివృద్ధి పథకం (ఎస్జిడిటిటి) ప్రధానంగా ఈ రంగంలో 'జ్ఞాన కేంద్రాల'ను ఏర్పాటు చేయడం, సాంకేతిక టెక్స్టైల్స్ పట్ల అవగాహన పెంచడం, సాంకేతిక టెక్స్టైల్స్ సంబంధించిన క్షేత్రస్థాయి సమాచారాన్ని క్రోడీకరించడం లక్ష్యంగా ఉంది.

2. సాంకేతిక టెక్స్టైల్స్ రంగంలో లక్ష్యం: సాంకేతిక టెక్స్టైల్ రంగంలో లక్ష్య సాధన కోసం కేంద్ర టెక్స్టైల్ మంత్రిత్వశాఖ రెండు కార్యక్రమాలను ప్రారంభించింది: మినీ మిషన్-1, మినీ మిషన్ -2 పథకాల లక్ష్యాల్లో పరీక్ష సదుపాయాలు, నైపుణ్యమైన మానవ వనరులు, పరిశోధన మరియు అభివృద్ధి, మెరుగైన క్రమబద్దీకరణ నిబంధనలు, ప్రత్యేక అవసరాల సన్నద్ధత, ప్రమాణాలు, వ్యాపార ప్రోత్సాహకాలు, మార్కెటింగ్ అభివృద్ధికి మద్దతు, హెచ్ఎస్ కోడ్స్ను గుర్తించడం, ఇన్క్యుబేషన్ కేంద్రాలపై (ఎఫ్ఐసి)దృష్టి పెట్టడం ముఖ్యమైనవి.

అ) ఇన్క్యుబేషన్ కేంద్రాలు(ఎఫ్ఐసి)లను పర్యవేక్షణతో కూడిన 'ప్లగ్ అండ్ ప్లే' మోడల్లో తయారు చేయాలి. పూర్తిస్థాయి ఉత్పాదనా సౌకర్యాలను సంబంధిత జ్ఞాన కేంద్రాలు (సీఏఈ) వాణిజ్య స్థాయిలో ఉత్పత్తికి అందించాలి.

ఆ) ఇన్క్యుబేషన్ కేంద్రాలు(ఎఫ్ఐసి) నూతన పారిశ్రామికవేత్తలు స్థిరపడుతూ వారి సొంత సంస్థలను నెలకొల్పే వరకు అందుబాటులో ఉండాలి.

3. భారత్లో అగ్రో టెక్స్టైల్ వినియోగాన్ని ప్రోత్సహించడానికి (ఈశాన్య ప్రాంతాలకు మినహాయింపు) పథకాలను అమలు చేయాలి.

4. ఈశాన్య ప్రాంతాలకు ప్రత్యేకంగా అగ్రో టెక్స్టైల్ వినియోగాన్ని ప్రోత్సహించే పథకాలను అమలు చేయాలి.

5. ఈశాన్య ప్రాంతంలో జియో టెక్నికల్ టెక్స్టైల్ వినియోగాన్ని ప్రోత్సహించే పథకాలను అమలు చేయాలి.

6. అదనంగా, దేశంలోని పలు రాష్ట్రాలు.. సవరించిన సాంకేతిక పురోగామి నిధి పథకాలు (ఏటీయూఎఫ్) మరియు సాంకేతిక పురోగామి నిధి పథకాల (టీయూఎఫ్ఎస్) కింద సరికొత్త, మెరుగుపర్చిన యంత్ర సామాగ్రిని సమకూర్చుకోవడానికి మదుపరులకు రాయితీతో కూడిన రుణ సదుపాయాలను సమకూర్చాలి.

7. సమగ్ర టెక్స్టైల్ పార్కుల అభివృద్ధి పథకం (ఎస్ఐటిపి).

8. ప్రధానమైన సాంకేతిక టెక్స్టైల్ తయారీ యంత్రాల దిగుమతికి కస్టమ్స్ సుంకంలో రాయితీలు ఇవ్వాలి.

9. సాంకేతిక టెక్స్టైల్స్ కోసం కేంద్రీకృత ఉత్పాదనా పథకం: ఎమ్ఈఐఎస్ – సాంకేతిక టెక్స్టైల్స్ ఉత్పత్తుల ఎగుమతులు ప్రోత్సహించడానికి రుణ సదుపాయం కల్పించాలి.

10. కేంద్ర టెక్స్టైల్ మంత్రిత్వశాఖ ఇప్పటికే సాంకేతిక టెక్స్టైల్స్ ఉత్పత్తులను క్రమబద్దీకరించడానికి విధివిధానాలను రూపొందిస్తోంది. దీంతో దేశంలో సాంకేతిక టెక్స్టైల్స్ వినియోగం, అవసరాలు వృద్ధి కానున్నాయి.

11. సాంకేతిక టెక్స్టైల్స్ కోసం పరిజ్ఞాన కేంద్రాలను నెలకొల్పడం ద్వారా పరీక్ష, శిక్షణ, ఉత్పాదనాభివృద్ధి, సమాచార వనరులు వంటివి అభివృద్ధి చెందుతాయి.

దేశంలో సాంకేతిక టెక్స్టైల్స్ కోసం ఏర్పాటు చేసిన పరిజ్ఞాన కేంద్రాలు కింది పట్టికలో చూడండి.

| వరుస సంఖ్య | సంస్థ పేరు | సాంకేతిక టెక్స్టైల్స్ విభాగం |
|---|---|---|
| 1 | ది సింథటిక్ అండ్ ఆర్ట్ సిల్క్ మిల్స్ రీసెర్చ్ అసోసియేషన్ (ఎస్ఎఎస్ఎమ్ఆర్ఎ), ముంబై | అగ్రోటెక్ |
| 2. | అహ్మదాబాద్ టెక్స్టైల్ ఇండస్ట్రీస్ రిసెర్చ్ అసోసియేషన్ (ఎటిఐఆర్ఎ), అహ్మదాబాద్ | కాంపోసైట్స్ |
| 3. | బాంబే టెక్స్టైల్ రీసెర్చ్ అసోసియేషన్ (బిటిఆర్ఎ), ముంబై | జియోటెక్ |
| 4. | పిఎస్జి కాలేజీ ఆఫ్ టెక్నాలజీ, కోయంబత్తూరు | ఇండుటెక్ |
| 5. | ది సౌత్ ఇండియా టెక్స్టైల్ రీసెర్చ్ అసోసియేషన్ (ఎస్ఐటిఆర్ఎ), కోయంబత్తూరు, | మెడిటెక్ |
| 6. | డికెటిఈ సొసైటీస్ టెక్స్టైల్ అండ్ ఇంజనీరింగ్ ఇనిస్టిట్యూట్, ఇచల్కరంజ్ | నాన్వూవెన్ |
| 7. | నార్తర్న్ ఇండియా టెక్స్టైల్ రీసెర్చ్ అసోసియేషన్ (ఎన్ఐటిఆర్ఎ), ఘజియాబాద్ | ప్రొటెక్ |
| 8. | వూల్ రిసెర్చ్ అసోసియేషన్, ముంబై | స్పోర్ట్టెక్ |

పరిజ్ఞాన కేంద్రాల్లో అత్యవసరమైన సౌకార్యలను కింద పేర్కొనబడిన విధంగా ఏర్పాటు చేశారు:

1. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాల మేరకు ఉత్పాదనల మదింపు కోసం గుర్తింపు పొందిన పరీక్ష సదుపాయలు.
2. పుస్తకాలు, ప్రమాణాలు, నమూనాలు వంటి వాటితో వనరుల కేంద్రాలు.
3. అంతర్జాతీయ పరిశోధన మరియు అభివృద్ధి కోసం మరియు విదేశీ సంస్థలు, ప్రయోగశాలల అనుబంధంతో ప్రోటోటైప్ సౌకర్యాలు
4. సాంకేతిక టెక్స్‌టైల్స్ పరిశ్రమలో పనిచేస్తున్న నిపుణుల కోసం శిక్షణా కేంద్రాలు.
5. ఈ రంగంలో భాగస్వాముల మధ్య జ్ఞానదాయకమైన సంప్రదింపులు, ఇచ్చిపుచ్చుకోవడం.
6. ప్లగ్ అండ్ ప్లే పద్ధతిలో ఇన్‌క్యుబేషన్ కేంద్రాలు సాంకేతిక టెక్స్‌టైల్స్ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక విభాగంలో సేవలందించడం.
7. పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు జ్ఞాన కేంద్రాలు సలహా, సహాయ సేవలు అందించడం.

**ప్రభుత్వం ఏ దిశగా పనిచేస్తోందంటే...**

1. ప్రస్తుతం ఉన్న జ్ఞాన కేంద్రాల ద్వారా పరిశోధన మరియు అభివృద్ధిలో పీపీపీ విధానాన్ని ప్రోత్సహించడం.
2. నిపుణత కలిగిన మానవ వనరుల అభివృద్ధి
3. ఎగుమతులు ప్రోత్సాహకం
4. హెచ్‌ఎస్‌ఎన్ కోడ్స్‌ను సాంకేతిక టెక్స్‌టైల్స్ రంగం కోసం గుర్తించడం.
5. సాంకేతిక టెక్స్‌టైల్స్ పరిశ్రమలో పెట్టుబడులను పెంచడానికి సాంకేతిక టెక్స్‌టైల్స్ రంగంలో ఎఫ్‌డీఐలను ప్రోత్సహించడం
6. సాంకేతిక టెక్స్‌టైల్స్ ఉత్పాదనల వినిమయాన్ని ప్రోత్సహించడానికి క్రమబద్ధీకరణ యంత్రాంగం నెలకొల్పడం
7. సాంకేతిక టెక్స్‌టైల్స్ రంగానికి ప్రామాణిక విధివిధానాల రూపకల్పన
8. సంస్థల్లో సాంకేతిక టెక్స్‌టైల్స్ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడం
9. సాంకేతిక టెక్స్‌టైల్స్ యంత్ర సామాగ్రి తయారీని ప్రోత్సహించడం
10. ఎదుగుతున్న దశలో ఉన్న సాంకేతిక టెక్స్‌టైల్స్ పరిశ్రమని నిరంతరం పర్యవేక్షించడం.

**ముగింపు:**

టెక్స్‌టైల్ రంగంలో సాంకేతిక టెక్స్‌టైల్స్ నూతనంగా ఆవిర్భవిస్తున్న పరిశ్రమ. మెడికల్, సివిల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ తదితర రంగాల్లో వివిధ అవసరాలైన ఫిల్టరేషన్, ప్రొటెక్షన్, బారియర్, ఇన్సులేషన్, హైజీన్, దృఢత్వం, సుదీర్ఘకాల మన్నిక వంటి అవసరాల కోసం సాంకేతిక టెక్స్‌టైల్స్‌ని వినియోగిస్తున్నారు. భారత్‌లో సాంకేతిక టెక్స్‌టైల్స్ తలసరి వినియోగం సగటు అంతర్జాతీయ వాడకంతో పోలిస్తే చాలా తక్కువగా ఉంది. అయితే ఇతర సాంకేతిక టెక్స్‌టైల్స్ తయారీ దేశాలతో పోలిస్తే భారత్‌లోని చవకైన కార్మికశక్తి, పదార్థాల లభ్యత, అత్యధిక దేశీయ వినియోగం దృష్ట్యా ఈ రంగంలో చక్కటి భవిష్యత్ ఉంది. ఈరోజు, ప్రభుత్వ విధానాల సహాయంతో ఉదయిస్తున్న సాంకేతిక టెక్స్‌టైల్స్ పరిశ్రమలో ఉన్న అవకాశాలు. కుంటి నడక నడుస్తున్న సంప్రదాయ టెక్స్‌టైల్ పరిశ్రమకు జవజీవాలు అందిస్తూ వైవిధ్యభరితమైన సాంకేతిక టెక్స్‌టైల్స్ తయారీలో కొత్త అధ్యాయానికి తెరతీస్తాయి.

■


## యోజన చందా ఆన్-లైన్‌లో

ప్రచురణల విభాగం వారి యోజన, ఇతర పత్రికలకు చందాను ఆన్-లైన్‌లో చెల్లించవచ్చు. www.Bharatkosh.gov.in వెబ్ సైట్‌లో Publications' Divistion వారి linkను క్లిక్ చేసి సూచనలను అనుసరించండి. చెల్లింపు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ ద్వారా చెయవచ్చు. చందా వివరాలు సంవత్సరానికి రూ. 230/-, రెండు సంవత్సరాలకు రూ. 430/-, మూడు సంవత్సరాలకు రూ. 610/-లు.

*సీనియర్ ఎడిటర్*

# వస్త్ర ఎగుమతులకు నూతన అవకాశాలు



**ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీవో) గణాంకాలు 2015 ప్రకారం ప్రపంచంలో 5.8 శాతం వాటాతో భారత్ 2014లో మూడో అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఉంది. 2014లో మొత్తం 314 బిలియన్ డాలర్ల ప్రపంచ వాణిజ్యంలో మొత్తం ఎగుమతులు 41 బిలియన్ డాలర్లు కాగా, అందులో జౌళి ఉత్పత్తులు విలువ 18.3 బిలియన్ డాలర్లుగా ఉంది. దుస్తుల ఎగుమతుల్లో భారత్ 3.7శాతం వాటాతో ప్రపంచంలో ఆరోస్థానంలో ఉంది. అదే సంవత్సరం 483 బిలియన్ డాలర్ల వాణిజ్యంలో మొత్తం 41 బిలియన్ డాలర్ల ఎగుమతులు కాగా, అందులో రెడీమేడ్ దుస్తుల వాటా 18 బిలియన్ డాలర్లు.**

పారిశ్రామిక యుగానికి ముందు భారత్ వస్త్ర ఎగుమతులకు పేరెన్నిక గన్నది. ఇబిన్ బతూతా వంటి విదేశీ యాత్రికులెందరో సుల్తానుల కాలంలో బజారులో విశేష వస్త్ర రీతుల అమ్మకాలను వర్ణించి ఉన్నారు. ప్రాచీన కాలంలో భారతీయులు చైనా, ఇండొనీసియాలతో పాటు రోమన్ ప్రపంచంతో వస్త్ర వాణిజ్యం నెరిపేవారు. రోమన్ వర్తక నౌకల తరువాత అరబ్బులు ఆ స్థానాన్ని భర్తీ చేయగా, ఆ తరువాత 15వ శతాబ్ది చివరినాటికి వాస్కోడగామా ఈ గడ్డపై అడుగుపెట్టడంతో పోర్చుగీసు వారితో వాణిజ్యం మొదలైంది. కొంతకాలానికి 16వ శతాబ్దిలో ఉపఖండంలో ఐరోపా కంపెనీలు తమ స్థావరాలు ఏర్పాటు చేసుకుని సుసంపన్న వాణిజ్యంలో భాగస్వాములుగా మారిపోయాయి. వస్త్ర ఎగుమతుల్లో ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద దేశంగా అవతరించింది. ముఖ్యంగా 18, 19 శతాబ్దాల్లో వస్త్ర వాణిజ్యం ఇతోధికమైన వృద్ధి సాధించింది.

మొఘలుల కాలంలో దేశం ప్రధానంగా బంగారం, ముడిపట్టు, అశ్వాలు, దంతాలు, విలువైన రత్నాలు, వెల్వెట్, బ్రోకేడ్ తదితరాలు దిగుమతి చేసుకునేది. ఎగుమతుల్లో చాలా వరకూ వస్త్రాలు, నీలిమందు, మసాలా దినుసులు, ఇతరత్రా వస్తువులు మాత్రం ఉండేవి. అయితే భూ మార్గంలో రవాణాకు ఎన్నో ఆంక్షలు, అవాంతరాలకు తోడు అంత సురక్షితం కాకపోవడంతో సాగర, నదీ మార్గాల్లో వాణిజ్యం వెల్లివిరిసింది. ఆగ్నేయాసియా దేశాల్లో భారతీయ వస్త్రాలు సముద్ర వర్తకంలో అధిపత్యం సాధించాయి.

చౌకైన అందమైన భారతీయ వస్త్రాలకు విదేశాల్లో బాగా గిరాకీ ఉండేది. ఆయా దేశాల అభిరుచులకు తగ్గట్టుగా విశేషమైన నేతతో భారతీయ వస్త్రకారులు ఎన్నో నమూనాలను పంపేవారని తెలుస్తోంది. భారతీయ చేనేతకారులు, అద్దకం పనివారు విదేశీ సాంకేతిక పనితనాన్ని అలవర్చుకోవడంతో పాటు కాలానుణంగా గిరాకీని అనుసరించి మేలైన వస్త్రాలను అందించడంలో సమర్థులుగా ఉండేవారు. నాటి భారతీయ వస్త్రాల ప్రాచుర్యానికి ఆంగ్లభాషలో చేరిన 'కాలికో', పజామా, ముస్లిన్, జింగమ్, షాల్, దుంగరీ, చింజ్, ఖాకీ వంటి పదాలే నిదర్శనం.

**ప్రపంచ వాణిజ్యం : తాజా ధోరణి**

భారతీయ వస్త్ర పరిశ్రమ చరిత్రలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంది. వలసపాలనలో యంత్రాలతో తయారైన

**అదితి దాస్ రౌత్,** కేంద్ర జౌళి శాఖ వాణిజ్య సలహాదారు, న్యూ ఢిల్లీ.
E-mail: adrout@nic.in

కారుచౌక వస్త్రాలు, వస్త్ర ఉత్పత్తులు భారత్‌ను ముంచెత్తి, దేశీయ కుటీర నేత వస్త్రకారులను తీవ్రంగా దెబ్బతీశాయి. ఇటీవల ప్రపంచీకరణ యుగంలోనూ బహుళ ఉత్పత్తుల కేంద్రాలు, ప్రపంచవ్యాపిత గొలుసుకట్టు సరఫరా వ్యవస్థల నుంచి ఎదురవుతున్న కొత్త సవాళ్లు ఈ రంగాన్ని ప్రభావితం చేస్తున్నాయి. అయినప్పటికీ వివిధ భారతీయ చేనేత వస్త్ర విశేషాలు ప్రపంచవ్యాప్తంగా పేరెన్నిక గని మార్కెట్లలో స్థానం పొందుతున్నాయి.

కొన్నేళ్లుగా అభివృద్ధి చెందిన దేశాల్లో వాణిజ్య పురోగతి పూర్తిగానూ, వర్ధమాన దేశాల్లో గణనీయ స్థాయిలో మందగించింది. ప్రపంచ వాణిజ్యం వృద్ధి 2015తో పోలిస్తే ఎటువంటి మార్పు లేకుండా ప్రస్తుతం 2.8 శాతంగా ఉంది. అభివృద్ధి చెందిన దేశాల దిగుమతులు కొద్దిగా మాత్రమే పెరిగే అవకాశం ఉండగా, వర్ధమాన ఆసియా దేశాల్లో మాత్రం దిగుమతులకు భారీ గిరాకీ పుంజుకోనున్నదని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీఓ) అంచనా వేస్తోంది. 2017లో ప్రపంచ వాణిజ్యం 3.6 శాతానికైనా పెరగాల్సి ఉందని డబ్ల్యుటీఓ భావిస్తున్నది.

నేడు ప్రపంచ వాణిజ్యం ఎన్నో అంతర్గత సవాళ్లతో కూడుకుని ఉంది. కొన్నేళ్లుగా భారత వాణిజ్యం మన ఎగుమతులకు దృఢమైన ఆదరవులుగా గల అమెరికా, ఐరోపా వంటి సంప్రదాయ వర్తక రాజ్యాల నుంచి కొత్త మార్కెట్ల దిశగా పయనిస్తోంది. అనేక నూతనోద్భవ ఆర్థిక వ్యవస్థలు విస్తృత ఆర్థిక వాతావరణంలో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. బ్రెజిల్, ఇండియా, ఇండోనేసియా, మెక్సికో, రష్యా సమాఖ్య, దక్షిణాఫ్రికా, టర్కీతో పాటు నూతన ఆర్థికవ్యవస్థలన్నీ 2016లో గుర్తించదగ్గ రీతిలో వృద్ధి సాధించనున్నాయని అంచనా వేస్తుండగా, చైనా మాత్రం దీర్ఘకాలం బలహీన వృద్ధినే కనబరిచే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంలో చైనా వృద్ధి బలహీన పడడం నూతన ఆర్థిక వ్యవస్థలకు తోడు, చిన్న చిన్న వర్ధమాన దేశాలు, పరివర్తన దిశలో ఉన్న ఆర్థిక వ్యవస్థలపైనా పెద్ద ప్రభావమే చూపే అవకాశం ఉంది. అయితే చైనా వృద్ధి బలహీనపడడం పెద్ద దేశాలను ముఖ్యంగా ఐరోపా మండలం మందగమనం నుంచి కోలుకోకుండా దెబ్బతీస్తుందన్న భయాలూ ఉన్నాయి. చారిత్రాత్మకంగా పెద్ద ఎత్తున మహిళలకు, నైపుణ్యం లేని కార్మికులకు ఉపాధి కల్పించిన వస్త్ర పరిశ్రమ అభివృద్ధి పారిశ్రామికీకరణకు తొలిమెట్టు. ఉన్నత నైపుణ్యం కలిగిన ఉత్పత్తి రంగాలకు, సత్వర వృద్ధి గల సేవా రంగానికి పెద్ద పీట వేస్తూ పరివర్తన చెందుతున్న చైనా ఆర్థిక వ్యవస్థలో వస్త్ర రంగం భాగస్వామ్యం తగ్గిపోతే ఇది ప్రపంచ వస్త్ర వాణిజ్యంలో సరికొత్త మలుపునకు దారితీసి భారత్‌కు ప్రపంచ మార్కెట్లో విస్తృత అవకాశాలను (ఎగుమతుల్లో చైనా ముందంజలో ఉన్నప్పటికీ) సాధించి పెడుతుంది. ఈ దిశలో ప్రాంతీయ వాణిజ్య ఒప్పందాలు(ఆర్‌టీఏ) కూడా మార్కెట్ల ఎంపికకు మనకు దోహదపడతాయి.

## ప్రపంచ వస్త్ర ఎగుమతులు

ప్రస్తుత ప్రపంచ వస్త్ర విపణి 1100 బిలియన్ డాలర్లుగా అంచనా. కాగా వర్తక పరిమాణం 750 బిలియన్ డాలర్లు. దాదాపు 350 బిలియన్ డాలర్ల వార్షిక వ్యాపారంతో ఐరోపా యూనియన్ అతిపెద్ద వినియోగదారుగా ఉంది. 2025 నాటికి ప్రపంచ వస్త్ర, దుస్తుల రంగం ఏటా ఐదు శాతం వృద్ధితో 2,100 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది.

మొత్తం ప్రపంచ వస్త్ర ఎగుమతుల్లో చైనా 35-39 శాతం వాటాతో అతిపెద్ద ఎగుమతిదారుగా ఉంది. తరువాత స్థానాల్లో ఐరోపా యూనియన్, బంగ్లాదేశ్, హాంగ్‌కాంగ్, వియత్నాం, ఇండియా, టర్కీ, ఇండొనేసియా, అమెరికా, కాంబోడియా ఉన్నాయి. మొత్తం వస్త్ర దిగుమతుల్లో ఐరోపా యూనియన్ 35-38శాతం వాటా కలిగి ఉండగా, అమెరికా 18శాతం, జపాన్ 6శాతం దిగుమతులు కలిగి ఉన్నాయి. తరువాత చెప్పుకోదగ్గ స్థాయిలో హాంగ్‌కాంగ్, కెనడా, రష్యా, దక్షిణకొరియా, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, చైనాలు వస్త్ర దిగుమతుల్లో వాటా కలిగి ఉన్నాయి. అయితే ఈ ఏడు దేశాల వాటా ప్రపంచ మొత్తం వస్త్ర దిగుమతుల్లో అతి స్వల్పమే. ఏది ఏమైనా రానున్న ఐదేళ్లలో ప్రపంచ వస్త్ర, దుస్తుల ఎగుమతుల్లో చైనా ఆధిపత్యమే కనిపిస్తుంది. చైనా తన జౌళి మిల్లులు, యంత్రాలు, మౌలికసదుపాయాల ఆధునికీకరణకు సంబంధించి విజయవంతంగా విదేశీ పెట్టుబడులు ఆకర్షించింది. వస్త్ర తయారీ యంత్రాల దిగుమతి విషయంలో కూడా చైనాదే పెద్ద చేయి. ఈ నేపథ్యంలో ప్రపంచ విపణిలో విస్తరణ అనివార్యం అయినా, గ్లోబల్ డిమాండ్ తగ్గినపుడు దానిని తట్టుకోవడానికి దేశీయంగా గిరాకీ పెరగడం కూడా అవసరం.

## భారత వస్త్రోత్పత్తులు, దుస్తుల ఎగుమతులు

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీవో) గణాంకాలు 2015 ప్రకారం ప్రపంచంలో 5.8 శాతం వాటాతో భారత్ 2014లో మూడో అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఉంది. 2014లో మొత్తం 314 బిలియన్ డాలర్ల విలువైన ప్రపంచ వాణిజ్యంలో మొత్తం ఎగుమతులు 41 బిలియన్ డాలర్లు కాగా, అందులో టెక్స్‌టైల్స్ (జౌళి ఉత్పత్తులు) విలువ 18.3 బిలియన్ డాలర్లుగా ఉంది. దుస్తుల ఎగుమతుల్లో (రెడీమేడ్ గార్మెంట్స్) భారత్ 3.7శాతం వాటాతో ప్రపంచంలో ఆరోస్థానంలో ఉంది. అదే సంవత్సరం 483 బిలియన్ డాలర్ల వాణిజ్యంలో మొత్తం 41 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు కాగా, అందులో రెడీమేడ్ గార్మెంట్స్ వాటా 18 బిలియన్ డాలర్లు.

ఎగుమతుల ద్వారా లభించే ఆదాయం దేశీయ వస్త్ర పరిశ్రమకు అదనపు విలువను జోడిస్తూ పురిపుష్టం చేస్తోంది. గ్లోబల్ డిమాండ్ సన్నగిల్లడానికి తోడు దేశీయంగానూ వనరుల వ్యయం, రవాణా వ్యయం పెరగడం, కఠిన కార్మిక చట్టాలు వెరసి దేశీయంగా ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ వస్త్ర పరిశ్రమ తట్టుకుని ఇతర రంగాలతో పోలిస్తే చక్కని పురోగతి కనబరిచి 2015-16 మొత్తం దేశ ఎగుమతుల్లో 14 శాతం వాటాను అందించింది.

## నవీన ఉత్పాదక కేంద్రాలు

చౌకగా నిపుణులైన శ్రామికులను అందించడంలో బంగ్లాదేశ్, వియత్నాం వంటి దేశాలు పోటీకి రావడంతో ఇంతవరకూ చౌకగా శ్రమశక్తిని అందిస్తూ వచ్చిన భారత్‌కు గల అవకాశాలు క్రమేపీ సన్నగిల్లుతున్నాయి. బంగ్లాదేశ్‌లో ఇప్పటికే ఎగుమతుల ఆధారిత పరిశ్రమల రంగం వాటా ఆ దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో నాలుగోవంతుని మించిపోగా, భవిష్యత్తులో మరింత వృద్ధి సాధించి గ్లోబల్ ఉత్పాదక కేంద్రంగా అవతరించే అవకాశం కనిపిస్తోంది. బంగ్లాదేశ్, వియత్నాంలకు తోడు రెడీమేడ్ దుస్తుల రంగంలో కాంబోడియా, ఇథియోపియా, మయన్మార్ వంటి దేశాలు సమీప భవిష్యత్తులో పోటీకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2015 మధ్యకాలం నాటికి దుస్తుల రంగం 2,30,000 మందికి ఉపాధి కల్పించగా, ఈ సంఖ్య 2020 నాటికి 15 లక్షలకు పెరగవచ్చని అంచనా. మయన్మార్ 'నేషనల్ ఎక్స్‌పోర్ట్ స్ట్రాటజీ 2015-19' పేరిట ఒక ముసాయిదాను విడుదల చేసింది. ఆ ముసాయిదా ప్రకారం ఎగుమతుల మార్కెట్లో విస్తరించడానికి ఇప్పటి వరకూ కట్టింగ్, మేకింగ్, ప్యాకేజింగ్ (సీఎంపీ)కు పరిమితమైన పరిశ్రమ మరింత ముందడుగు వేసి ఎఫ్ఓబీ (ఫ్రీ ఆన్ బోర్డ్) విధానంలో భారీ పరిమాణంలో నాణ్యమైన అల్లిక వస్త్రోత్తుల తయారీని సాధించేలా ప్రోత్సహించనుంది.

ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2015లో బంగ్లాదేశ్, కాంబోడియా, ఇథియోపియా, మయన్మార్, వియత్నాం దేశాల వార్షిక వృద్ధి రేటు వరుసగా 6.6శాతం, 7శాతం, 9.6శాతం, 7శాతం, 6.7శాతంగా ఉంది. ఈ దేశాలన్నీ చైనా నుంచి దూరం జరిగిన ఉత్పాదక సంస్థలు, పెట్టుబడులతో లబ్ధి పొందుతూ నవీన ఉత్పాదక, ఎగుమతి ఆధారిత కేంద్రాలుగా అవతరించి ఉపాధి అవకాశాలు పెంపొందించే సామర్థ్యాన్ని సంతరించుకున్నాయి. దీంతో రానున్న కాలంలో ఆగ్నేసియా ప్రాంతం భారీ వినియోగ స్థావరాన్ని వృద్ధి చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

ఆఫ్రికన్ గ్రోత్ అండ్ ఆపర్చునిటీ యాక్ట్ (ఏజీఓఏ) 2000లో అమలులోకి వచ్చిన తరువాత ఆఫ్రికా వస్త్ర దిగుమతుల విపణి ఇతోధికంగా వృద్ధి చెందింది (టెక్స్‌టైల్ ఇంటెలిజెన్స్ లిమిటెడ్ 2016 నివేదిక). వస్త్ర పరిశ్రమకు ఊతమిచ్చేలా సబ్‌సహారా ఆఫ్రికా దేశాల్లోని ఎగుమతి దారులకు సుంకాలు, కోటాల నుంచి మినహా యింపులు ఇస్తూ అమెరికా మార్కెట్లో చోటు కల్పించడానికి ఈ ఒప్పందాన్ని ఉద్దేశించారు. ఈ చట్టం అమలుతో అనేక సబ్‌సహారన్ దేశాల నుంచి గార్మెంట్ ఎగుమతులు బాగా పెరిగాయి. దీనికితోడు గార్మెంట్ తయారీ కూడా ఊపందుకుని ముడిసరుకుల దిగుమతులకు భారీ డిమాండ్ ఏర్పడింది.

ఇథియోపియా, నైజీరియాలో వలే వ్యవసాయం, వనరుల వినియోగంలో సమర్థమైన విధాన వ్యూహంతో ముందుకు వెళితే ఆఫ్రికాకు వృద్ధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఆఫ్రికా స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ)లో దాదాపు 50శాతం భాగస్వామ్యం కలిగి ఉన్న దాదాపు 11 దేశాల్లో కోటీ యాభై లక్షల మధ్యతరగతి కుటుంబాలు ఉన్నాయి. 2030 నాటికి ఈ కుటుంబాల సంఖ్య 4.2 కోట్లకు పెరిగే అవకాశం ఉంది. అయితే రక్షణ భయాలు, రాజకీయ అనిశ్చితి, ఆరోగ్య సమస్యలు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల సమస్యలతో ఆఫ్రికా సతమతమవుతోంది.

## భారత వస్త్రోత్పత్తులకు నూతన మార్కెట్లు ఏవి?

విశేషంగా భారత ఎగుమతులకు ప్రధాన కేంద్రంగా ఉన్న దేశాల్లో దక్షిణాసియా ఉచిత వాణిజ్య ఒప్పందం (సాఫ్టా)లో భాగస్వామి అయిన బంగ్లాదేశ్ మినహా ముఖ్యమైన పది దేశాలతో భారత్‌కు ఎఫ్‌టీఏ (స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం), ప్రాధాన్యతా ఒప్పందాలు (పీటీఏ) కూడా లేవు. ప్రపంచ ఆర్థిక గమనంలో మార్పులకు అనుగుణంగా మార్కెట్లను కూడా అందిపుచ్చుకోవడం అవసరం. ఎగుమతులు నిలకడగా వృద్ధి సాధించడానికి వస్త్రోత్పత్తులకు బలమైన విపణి అవకాశాలు గల దేశాలతో/ప్రాంతీయ ఒప్పందాలు చేసుకోవడం తప్పనిసరి.

అంతర్జాతీయంగా నూలు, ఉన్ని వంటి చేనేత ఉత్పత్తులకు బాగా గిరాకీ ఉంది. అయితే ముడిసరుకుల ధరల్లో హెచ్చుతగ్గులు, తయారీ ఖర్చుల పెరుగుదల వంటి అస్థిరత కలిగించే అంశాలు చిన్నతరహా సంస్థలపై ప్రభావం చూపుతాయి. అంతర్జాతీయంగా పోటీకి నిలబడాలంటే మారుతున్న ఫ్యాషన్ ధోరణులను, వివిధ ప్రాంతాల, వయస్కుల వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వస్త్ర తయారీ రంగం స్పందించాల్సి ఉంటుంది.


భారత్‌కు సంప్రదాయ అభివృద్ధి మార్కెట్లయిన ఉత్తర అమెరికా, ఐరోపా దేశాల్లో ఆర్థికాభివృద్ధి మందగించింది. టీపీపీ అమలు చేస్తే వాణిజ్యం దృష్ట్యా కూడా భారత ఎగుమతులకు, పోటీదారులకు కూడా సవాళ్లు ఎదురుకానున్నాయి. దీనితో పోలిస్తే వర్ధమాన, నూతన ఆర్థిక వ్యవస్థల విపణులు


బాగా వృద్ధి రేట్లు సాధించే అవకాశాలు ఉన్నాయి. ఆయా దేశాల్లోని ప్రభావశీలమైన మధ్యతరగతి వర్గాల నుంచి దీర్ఘకాలంలో గిరాకీ ఏర్పడి వృద్ధిని బలోపేతం చేయనున్నది. లాటిన్ అమెరికా, ఆసియాన్, యురేషియా, పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికా, ఇతర దేశాలైన టర్కీ, కెనడా, ఆస్ట్రేలియాల విపణుల్లో పాగా వేయడానికి సరైన వ్యూహంతో ముందుకు వెళ్లాల్సి ఉంటుంది.

పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికా ప్రాంతం (డబ్ల్యుఏఎన్ఏ) చురుకైన వృద్ధికి కేంద్రం. ఈ ప్రాంతంలో ఇజ్రాయిల్ దేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి భారత్ కృషి చేస్తోంది. ఇజ్రాయిల్‌లోని గార్మెంట్ పరిశ్రమ అధికంగా తన నూలు, ఇతర నేత వస్త్ర (యార్న్, వూవెన్ ఫ్యాబ్రిక్) అవసరాలకు దిగుమతులపైనే ఆధారపడుతోంది. 2015లో ఇజ్రాయిల్ వస్త్ర (అపారెల్) దిగుమతుల్లో ఐదు శాతం (1.5 బిలియన్ డాలర్ల) వృద్ధి కనబర్చింది. అందులో భారత్ భాగస్వామ్యం కేవలం ఒక్కశాతమే. అందుకు భిన్నంగా ఇజ్రాయిల్ నుంచి భారత్‌కు కుటీర వస్త్ర దిగుమతులు (హోం టెక్స్‌టైల్స్) అధికంగా 6 శాతం (0.2 బిలియన్ డాలర్లు) ఉన్నాయి.

ఆఫ్రికా ఖండంలో ఈజిప్ట్‌కు అతిపెద్ద నూలు, వస్త్ర (కాటన్, టెక్స్‌టైల్) కేంద్రాలున్నాయి. ఈజిప్ట్ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన వస్త్ర పరిశ్రమ కూడా నూలు, ఫ్యాబ్రిక్, ఇతర అవసరాలకు దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ఆ దేశ వస్త్ర దిగుమతులు 2015లో భారీ స్థాయిలో 17శాతం (0.2 బిలియన్) వృద్ధి నమోదుచేశాయి. అయితే ఇక్కడ కూడా భారత భాగస్వామ్యం కేవలం 1 శాతమే. ఇక్కడి వస్త్ర పరిశ్రమ ఊర్ధ్వముఖ విధానంలో నూలు తయారీ నుంచి సంపూర్ణ వస్త్ర తయారీ వరకూ కార్యకాలాపాలు చేపడుతున్నది. అంతేకాకుండా నమూనాల తయారీ, కట్టింగ్, కుట్టు, ప్యాకింగ్ వరకూ ఉత్పత్తి అన్ని దశల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబిస్తోంది. వస్త్ర పరిశ్రమల రంగం ప్రధానంగా పత్తి నూలుపై ఆధారపడినా, ఇటీవలి కాలంలో వివిధ రకాల చేనేత, నార వస్త్రాలకు (ఫైబర్ టెక్స్‌టైల్స్) గిరాకీ పెరుగుతోంది. ఎంఎంఎఫ్ (మల్టీమోడ్ ఫైబర్ టెక్స్‌టైల్స్) దిగుమతులు ఇటీవల బాగా పెరుగుతున్నాయి. గడచిన ఐదేళ్లలో ఈజిప్ట్‌కు ఎంఎంఎఫ్ వస్త్రోత్పత్తుల దిగుమతులు ఏటా 3శాతం పెరుగుతున్నాయి. విశేషంగా భారత్ ప్రధాన సరఫరాదారుగా ఉంది. 2015లో ఈజిప్ట్ జీడీపీ వృద్ధి రేటు 4.2శాతంగా ఉండి, ఆ దేశ ఎగుమతి కేంద్రాల్లో నిలకడగా పెట్టుబడులు పెరుగుతున్నాయి.

భారత చేనేత, నార వస్త్రాలకు టర్కీ ప్రధాన మార్కెట్‌గా ఉంది. ఆ దేశ దుస్తుల తయారీ పరిశ్రమకు నూలు, నార, ఫ్యాబ్రిక్ వంటి ముడిసరుకుల కొరత ఉంది. తద్వారా దిగుమతులకు భారీ అవకాశం కల్పిస్తోంది. ఆ దేశ జీడీపిలో వాణిజ్యం 58శాతం ఆక్రమిస్తుంది. 2015లో ఆ దేశ వస్త్రోత్పత్తులు, దుస్తుల దిగుమతులు 2.9 బిలియన్ డాలర్లుగా ఉన్నప్పటికీ వృద్ధిరేటు తగ్గుదలనే సూచిస్తోంది. అందువల్ల భారత్ ఆ దేశ మార్కెట్‌పై దృష్టి నిలపవచ్చు. ప్రస్తుతం టర్కీ మార్కెట్లో భారతీయ వాటా కేవలం 2-3శాతం మాత్రమే.




పైన సూచించిన పట్టికలు తాజా పరిణామాలను వెల్లడిస్తాయి.

కొన్నేళ్లుగా లాటిన్ అమెరికాతో భారత్ సంబంధాలు వాణిజ్యం, పెట్టుబడులకు మించి ఇంధన వనరులు, మేధో వినిమయంతో సహా జీ20, బ్రిక్స్, ఐబీఎస్ఏ (ఇండియా, బ్రెజిల్, సౌతాఫ్రికా) వంటి బహుళపక్ష వేదికల భాగస్వామ్యం వరకూ విస్తరించాయి. పీటీఏ (ప్రిఫరెన్షియల్ ట్రేడ్ అగ్రిమెంట్) రూపేణా భారత్ మెర్కోసురాండ్ చిలీతో సంబంధాలు నెరపుతోంది. ఈ ఒప్పందాలు భారత్‌తో పాటు ఎల్ఏసీ ప్రాంత వర్తకులకు ఎన్నో అవకాశాలు అందుబాటులోకి తెస్తాయి. వస్త్ర వాణిజ్యం విషయంలో మెక్సికో, చిలీ, పెరూ దేశాలు అతి ముఖ్యమైనవి. మెక్సికో, చిలీ వరుసగా అతిపెద్ద వస్త్ర, దుస్తుల (టెక్స్‌టైల్, అపారెల్) దిగుమతిదారులు కావడం గమనార్హం. 2015లో మెక్సికో, చిలీ, పెరూ దేశాల వస్త్ర దిగుమతులు వరుసగా 4.1 బిలియన్లు, 3.1 బిలియన్లు, 0.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఎల్ఏసీలోని స్థానిక పరిశ్రమలు,

అంతర్జాతీయ పోటీలో నిలబడలేకపోతుండగా ఆయా దేశాలు చైనాపై అధికంగా ఆధారపడడం తగ్గించుకుంటున్నాయి. ఏదేమైనా చిలీ మొత్తం దుస్తులు, హోం టెక్స్‌టైల్స్ దిగుమతుల్లో భారత్ వాటా వరుసగా 1శాతం, 4శాతం మాత్రమే కాగా, మెక్సికోలో ఈ వాటా మూడు శాతం చొప్పున, పెరూలో రెండు శాతం చొప్పున వాటా కలిగి ఉంది. లాటిన్ అమెరికా విపణిలో మరింత విస్తరించడానికి గల అవకాశాన్ని ఇది సూచిస్తోంది.

### ఇతర అభివృద్ధి మార్కెట్లు : ఓషియానా, కెనడా

సంప్రదాయ మార్కెట్లకు (అభివృద్ధి చెందిన దేశాలు) విలువాధారిత ఉత్పత్తుల (వస్త్రాలు) ఎగుమతులపై దృష్టి కొనసాగిస్తూనే వినియోగ వస్త్రాల విభాగంలో మార్కెట్ సన్నగిల్లుతున్న కెనడా వంటి దేశాలకూ విస్తరించాలి. కెనడా మార్కెట్లో సాంకేతిక వస్త్రోత్పత్తుల రంగం (టెక్నికల్ టైక్స్‌టైల్) వేగంగా విస్తరిస్తోంది. తాజా గణాంకాల ప్రకారం, 2015లో 8.6 బిలియన్లుగా గల సాంకేతిక వస్త్ర ఎగుమతులు 2017నాటికి 9.3 బిలియన్ డాలర్లకు విస్తరించనున్నట్టు అంచనా. నిత్యం ఎన్నో మార్పులు చోటు చేసుకునే సాంకేతిక వస్త్ర ఎగుమతుల్లో కూడా గణనీయ మార్పులు చోటుచేసుకుంటాయి. ముడి వినియోగ పరిశ్రమలు అధికంగా గల లాటిన్ అమెరికా ప్రాంతం సాంకేతిక వస్త్ర ఉత్పత్తులకు అతిపెద్ద వినియోగదారు కావడం గమనార్హం. అందువల్ల కెనడాతో సమగ్ర భాగస్వామ్యం ఒప్పందం (సీఈపీఏ) ఏర్పాటు చేసుకుని ఈ విభాగంలో ఎగుమతులకు సంబంధించి అవకాశాలను అందిపుచ్చుకోగలగాలి. భారతీయ వస్త్ర పరిశ్రమలో సాంకేతిక వస్త్రోత్పత్తుల తయారీ విశేషంగా వృద్ధి చెందుతోంది. ప్రపంచంలో ఈ విభాగంలో మన వాటా ప్రస్తుతం 9 శాతం కాగా, 2013లో 11.6 బిలియన్లుగా గల వాణిజ్యం, 2017నాటికి 26 బిలియన్లకు చేరుకునే అవకాశం ఉంది (ఐటీఏ టెక్నికల్ టెక్స్‌టైల్స్ టాప్ మార్కెట్స్ నివేదిక 2016).

ఆస్ట్రేలియాలో జౌళి, వస్త్ర, పాదరక్షల (టీసీఎఫ్) తయారీ పరిశ్రమల రంగంలో ఎంతో వైవిధ్యం కలిగి రెడీ టు యూజ్ వస్త్రోత్పత్తులు, దుస్తులు, తివాచి, పాదరక్షలు, ఆటోమోటివ్ టెక్స్‌టైల్స్ వంటి సాంకేతిక వస్త్రోత్పత్తులకు ప్రాధాన్యం ఉంది. ఇక్కడి వస్త్రోత్పత్తుల మార్కెట్ విలువ 25 బిలియన్ డాలర్ల నుంచి ఐదు శాతం వృద్ధితో 2025 నాటికి 45 బిలియన్లకు చేరుకునే అవకాశం కలిగి ఉంది. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఆస్ట్రేలియాతో ప్రస్తుతం జరుగుతున్న ద్వైపాక్షిక చర్చల్లో సీఈపీఏ ఒప్పందం కుదుర్చుకోవడం ఎంతో ప్రయోజనదాయకం. ■

---


### యావత్ ప్రపంచానికి చేనేత ఫ్యాషన్ కేంద్రంగా మారాలి : ప్రధాని.

చేనేత దినోత్సవం సందర్భంగా ఆగష్టు 7 న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేనేతను మన జీవితాలలో ఒక భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. "మన చేనేత రంగం వైవిధ్యభరితమైనది, పర్యావరణ హితమైనది. ఈ రంగంలో ఉపాధి పొందుతున్న వారందరూ మన ఆదరణకు హర్షిస్తారు, ఆశీర్వదిస్తారు. ఈ రంగంలో ఎక్కువమంది మహిళలు ఉపాధిపొందుతున్నారు కనుక, చేనేతకు ప్రోత్సాహం మహిళా సాధికారతకు రాచమార్గం" (జనవరి 31, 2016 నాటి 'మన్ కీ బాత్' నుండి). నేడు దాదాపు ఖాదీ మన జాతీయ చిహ్నంగా మారింది. ఖాదీ ఆరోగ్యానికీ, స్వదేశీ అభివృద్ధికి చిహ్నంగానే కాక, యువతరం ఆకర్షణగా కూడా నిలుస్తున్నది. మేలైన ఖాదీ ఉత్పత్తులకు మరింత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని బాపూజీ ఎప్పుడూ అంటూ వుండేవారు.

### చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని సందేశం

స్వతః సిద్ధంగా చేనేత రంగం బలీయమైనది. దానికి మన మార్కెట్ ప్రోత్సాహం అవసరం. అన్నీ సహజ ముడి దారాలనే చేనేత వినియోగిస్తుంది. నేడు చేనేత యువతారాన్ని ఎక్కువ ఆకర్షించే విధంగా మనం మలచాల్సి వుంటుంది. ఇటీవల మనం డిజిటల్ ఇండియా పేరుతో నూతన సాంకేతిక సమాచార వ్యవస్థను అభివృద్ధి చేసుకున్నాం. దీనిద్వారా చేనేత అమ్మకాలను మనం ప్రోత్సహించవచ్చు. అమేజాన్, ఫ్లిప్ కార్ట్, ఈ-కామర్స్ లాంటి వేదికలను వినియోగించుకోవచ్చు. క్లస్టర్‌కు ప్రభుత్వం అందచేసే 60 లక్షల రూపాయల సహాయాన్ని రెండు కోట్ల రూపాయలకు పెంచారు. ఈ సహాయాన్ని నేరుగా చేనేతకారులకే అందేలా ప్రభుత్వం మార్పులు చేసింది. దారం మగ్గానికి వచ్చే ముందటి కార్యకలాపాలలో నేతకారుల శ్రమను తగ్గించి యాంత్రీకరణను అమలుచేయాలి. చిన్న స్థాయి కార్మికులకు మద్దతుగా ప్రభుత్వం 'ముద్ర' పథకం క్రింద 5 లక్షల రూపాయల వరకు సహాయాన్ని అందచేస్తున్నది. 'ముద్ర' బ్యాంకుకు 20 వేల కోట్ల రూపాయల మూలధనాన్ని, మరో 3 వేల కోట్ల రూపాయల మేరకు రుణ హామీనీ ప్రభుత్వం ఇచ్చింది. వారు అందచేసే వ్యక్తిగత రుణాలలో 60 శాతం తలసరి 50,000ల రూపాయలకు మించరాదని నిబంధన ఉన్నది. ఈ చర్యలు చేనేత కారులకు మంచి మద్దతుగా నిలుస్తాయనే అనుకుంటున్నాను అన్నారు ప్రధాని. (యోజన సంపాదక వర్గం).

# ఖాదీ : భారత స్వాతంత్ర్యోద్యమ ప్రతీక



**శ్రమైక జీవన సౌందర్యం, వికేంద్రీకరణ, అహింస, నిరాడంబరత అనే ఖాదీ మూల సూత్రాల విషయంలో రాజీ లేకుండా సామాన్య ప్రజలకు సైతం అందుబాటు ధరలలో, ఆకర్షణీయంగా ఖాదీ వస్త్రాలను అందించడమే ఇప్పుడు మన ముందున్న ప్రధాన సవాలు. సుస్థిర, పర్యావరణ అనుకూల అభివృద్ధి, కేవలం ఖాదీ పునాదులపై మాత్రమే సాధ్యం అవుతుంది. ప్రజలలో ఖాదీ అనుకూల మానసిక స్థితిని ప్రోది చేయడం, ఖాదీ మాత్రమే వినియోగించాలనే మానసిక స్థితికి మనమందరం చేరుకోవడం కూడా ఎంతో అవసరం.**

"సృష్టిలోని సర్వ జీవ కోటిని సోదర భావంతో చూడడమే ఖాదీ స్ఫూర్తి. అదే ఖాదీ స్ఫూర్తి అర్థం, పరమార్థం. అంటే మరోజీవికి హాని కలిగించే ఏ పని చేయరాదని, అలాంటి చర్యలను పూర్తిగా విసర్జించాలనేది ఖాదీ స్ఫూర్తిలోని అంతర్లీన భావం. ఈ భావనను మనం మన దేశ ప్రజలందరిలో కలిగించ గలిగితే, మన దేశం ఎంతో సమున్నత స్థాయికి చేరుతుంది." – *గాంధీజీ*

మనందరిలో ఖాదీ భావన, మందరిలో అందరం ఒక్కటే అన్న భావన పాదుకోవాలని ఆశించారు. ఖాదీ అనేది శరీరాన్ని కప్పే గుడ్డ పీలిక కాదు. అదొకతత్త్వం, అందరూ ఆచరించదగిన ఒక జీవన విధానం. 1917లో చంపారన్ సత్యాగ్రహం సమయంలో గాంధీజీ బీహార్ లోని రైతుల దయనీయ స్థితిని ప్రత్యక్షంగా చూశారు. ఈ సందర్భంగా గాంధీజీ, భిల్వార గ్రామంలో ఒక మహిళను కలిశారు. ఆమెతో మాట్లాడుతున్న సమయంలో ఆ మహిళకు మార్చుకోవడానికి మరో చీర లేదని తెలుసుకున్నారు. ఇక్కడ మనం ఒకసారి చంపారన్ సత్యగ్రహం అంటే ఏమిటో, అది ఎందుకు జరిగిందో తెలుసుకోవలసిన అవసరం ఉంది. బట్ట నేయడానికి మూలాధారమైన పత్తి పంట పండించే రైతుకు కప్పుకోవడానికి చారెడు బట్ట లేక పోవడం అనే దయనీయ స్థితి నుంచి చంపారన్ సత్యాగ్రహం ప్రారంభమైంది. ఒకప్పుడు మనం పత్తి పంట పండించడంలో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉన్నాం. అయినా మన రైతులకు అదే పత్తితో నేసిన వస్త్రం కరవైంది. మన దేశంలో పండిన పత్తి పంట అంతా ఇంగ్లాండ్‌కు ముడి సరకుగా తరలి పోయింది. అక్కడ మాంచెస్టర్ లేదా లాంక్ షేర్ లలో వస్త్రంగా తయారై, మన దేశానికీ దిగుమతి అవుతూ వచ్చింది. గాంధీజీ కూడా స్పిన్నింగ్, నేత ఒక సంస్కృతిగా వెలసిల్లిన ప్రాంతం నుంచే వచ్చారు వస్త్ర సృష్టిలో ఎంతో ఘన చరిత్ర మనది. అయితే ఆ ఘన చరిత్ర ఎమైంది? ఆ గత చరిత్ర ఎటు పోయింది? బ్రిటిష్ పాలకులు దాన్ని మాయం చేశారు ఈస్ట్ ఇండియా కంపెనీ, భారత దేశంతో పాటుగా భారత ఉపఖండం మొత్తంలో వ్యాపార, వాణిజ్యాలను కబళించి, శాసించడం ప్రారంభమైన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తమ అవసరాల కోసం బ్రిటిష్ పాలకులు గ్రామీణ భారత దేశంలోని వస్త్ర సంస్కృతిని నాశనం చేశారు.

**డా॥ ఎ. అన్నామలై,** డైరెక్టర్, నేషనల్ గాంధీ మ్యూజియం, రాజ్ ఘాట్, న్యూ ఢిల్లీ.
E-mail: nationalgandhimuseum@gmail.com

## ఘనమైన గత వైభవం

అనువంశికంగా వచ్చిన భారతీయ వస్త్ర విజ్ఞానం వస్త్ర ప్రపంచానికి తల మానికంగా నిలిచింది. భారతీయ నేత గాళ్లు నేసిన నీలి రంగు నూలు వస్త్రం, 'ఇక్కత్' ఫరాహెూ సమాధుల్లో కనిపించింది. గులాబీ రంగులు అద్దిన వస్త్రాలు మోహంజోదారోలో వెలుగుచూశాయి. ఈ వస్త్రాలను గ్రీక్, రోమన్ వ్యాపారులు భారత ఉపఖండం సృష్టించిన అద్భుత సృష్టిగా పేర్కొన్నారు. అజంతా, ఎల్లోరా చిత్రాలలో కనిపించే ఎన్నో రంగులు, డిజైన్లు, ఇంకెన్నో అద్భుత ఆకృతులు గల వస్త్ర సంపద భారతీయ చేనేత వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది. మన దేశంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా ఆ ప్రాంతానికి చెందిన, ఆ ప్రాంతానికే ప్రత్యేక మైన వస్త్ర కళాసృష్టి కనిపించేది. నేతల్లో, రంగుల్లో, అద్దకాలు, ఆకృతులలో, ఎక్కడికక్కడ అదొక ప్రత్యేక కళగా ప్రపంచానికి మన దేశం వస్త్ర వెలుగులు పంచి ఇచ్చింది. ఒకే ఒక్క మాటలో చెప్పాలంటే, గతంలో వస్త్ర శాస్త్రంలో మన దేశం ప్రపంచానికే తలమానికంగా నిలిచింది. భారతీయ వస్త్ర కీర్తి, గౌరవం కన్ను కుట్టేలా చేసింది. చివరకు కొన్ని దేశాలు భారతీయ వస్త్రాల దిగుమతిపై నిషేధం విధించాయి. అనేక దేశాల రాజులు, చక్రవర్తులు మన దేశంలో చేతిమగ్గాలపై నేసిన వస్త్రాలను ధరించేవారు. అయితే ఆ తర్వాత వచ్చిన పారిశ్రామిక విప్లవం, ఇంగ్లాండ్ లో వెలిసిన పవర్ లూమ్ పరిశ్రమ భారతీయ చేనేతను చిదిమేసింది. అదే సమయంలో ఇంగ్లాండ్ ప్రభుత్వం తమ వలసవాద విధానాలకు అనుగుణంగా కొత్త చట్టాలుచేసింది. ఈ చట్టాలు మన దేశంలోనూ కొత్త వ్యాపార విధానాల అమలుకు అంకురార్పణ చేశాయి. మన దేశంలో ఉత్పత్తి అయిన పత్తి మొత్తాన్ని కట్టకట్టి, అది కూడా తక్కువ ధరకు ఇంగ్లాండ్‌కు ఎగుమతి చేయాలనే నిబంధనను విధించాయి. ఇంగ్లాండ్‌లో తయారైన వస్త్రాలు భారతీయ మార్కెట్‌ను ముంచెత్తాయి. దీంతో భారతీయ చేనేత చేతులు విరిగి పోయాయి. లక్షలాది మంది చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఎన్నో లక్షల కుటుంబాలు వీధుల పాలయ్యాయి. ఈ చట్టాలు, దానిపర్యవసానాలు భారతీయులు చేతితో వడికిన నూలుతో నేసిన వస్త్రాలకు మరణ శాసనంగా మారాయి. అలా కాల క్రమంలో భారతీయ సంప్రదాయ వస్త్ర విజ్ఞానం కాల గర్భంలో కలిసిపోయింది.

## ఖాదీ ఉద్యమం

ఈ నేపథ్యంలో గాంధీ " నేను 1908లో మొదటి సారిగా లండన్‌లో చరఖా చూశాను. దక్షిణ ఆఫ్రికా ప్రతినిధి బృందానికి సారధిగా నేను అక్కడికి వెళ్ళాను.,ఆ సందర్భంగా నేను చాలా మంది భారతీయ విద్యార్థులు, ఇతరులను కలిశాను. భారత దేశంలో పరిస్థితులపై మేము సుదీర్ఘంగా చర్చించు కున్నాము. ఈ చర్చల సందర్భంగా నాకు, చరఖాలేనిదే స్వరాజ్యం సాధ్యం కాదు అనిపించింది. ప్రతి ఒక్కరూ నూలు వడకాలని, అది అవసరమని నాకు అనిపించింది. అయితే అప్పటికి నాకు మగ్గానికి – చరఖాకు మధ్య ఉన్న తేడా తెలియదు." – *గాంధీజీ*

భారతీయుల వాస్తవ స్థితి గతులను స్వయంగా తెలుసుకునేందుకు, గోఖలే సూచన మేరకు గాంధీజీ దేశంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల దయనీయ పరిస్థితులను స్వయంగా చూశారు. రైతులకు సంవత్సరంలో సగ భాగం ఎలాంటి ఉపాధి లేదు. చంపారన్ సంఘటన కూడా గాంధీజీపై ప్రభావం చూపింది. రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపవలసిన అవసరాన్ని గాంధిజీ గుర్తించారు. ప్రత్యామ్నాయ ఉపాధి కలిపిస్తే రైతులు తమ సమయాన్ని, శక్తిని సద్వినియోగం చేసుకుని అదనపు ఆదాయాన్ని పొందగలరని గాంధీజీ తలపోశారు. నూలు వడకడం, బట్టలు నేయడం ప్రత్యామ్నాయ ఉపాధిగా గుర్తించారు. అహ్మదాబాద్‌లోని వస్త్ర పరిశ్రమ యజమానుల సహకారంతో గాంధీజీ ముందుగా ఆశ్రమంలో బట్టలు నేయడం ప్రారంభించారు. అయితే, ఇలా చేయడం వలన పారిశ్రామిక వేత్తలకు ప్రయోజనం చేకూరుతుందిగానీ, రైతులకు నేరుగా ప్రయోజనం చేకూరడం లేదని త్వరలోనే గాంధీజీ గ్రహించారు. ఇదే సమయంలో గాంధీజీకి గంగాబెహన్ మజుందార్ అనే మహిళ పరిచయం అయ్యారు. గుజరాత్ రాష్ట్ర రెండవ విద్యా సదస్సులో పరిచయం అయిన ఆమెకు గాంధీజీ సంప్రదాయ పద్ధతిలో నూలు వడికే పద్ధతి అందుకు సంబంధించిన ఉపకరణాలను కనుగొనే పనిని అప్పగించారు." గంగాబెహెన్ గుజరాత్ అంతా తిరిగారు. అలా తిరగ్గా తిరగ్గా చివరకు ఆమెకు, బరోడా రాష్ట్రంలోని విజయపురి అనే గ్రామంలో చరఖా కనిపించింది. ఆ గ్రామమంలోని చాలా ఇళ్లలో చరఖా లున్నాయి. కానీ, నిరుపయోగంగా మూలన పడి ఉన్నాయి. గంగాబెహెన్ గ్రామస్తులతో మాట్లాడారు. నూలు వడికేందుకు పత్తిని ఇచ్చి వడికిన నూలు కొనుగోలుకు భరోసా ఇస్తే, మూల పడేసిన చరఖాలను బయటకు తీసి, మళ్ళీ నూలు వడికేందుకు గ్రామస్థులు సంసిద్ధతను వ్యక్తపరిచారు. ఈ శుభ సమాచారాన్ని గంగాబెహెన్ నాకు తెలిపారు."
– *గాంధీజీ*

అలా గాంధీ, గంగాబెహెన్, మగన్‌లాల్ గాంధీ లాంటి విశ్వసనీయ సహచరుల సహకారంతో ఆశ్రమంలో చేతితో నూలు వడకడం, నేత నేయడం ప్రారంభించారు. ఖాదీని ముందుగా గాంధీజీ, ఆశ్రమంలో ప్రయోగాత్మకంగా పరిశీలించి చూశారు. ఆ తరువాతనే దేశ వ్యాప్తంగా ఉద్యమంగా ముందుకు తీసుకు పోయారు. చేతితో వడికిన నూలుతో నేసిన వస్త్రానికి గాంధీజీ 'ఖాదీ' అని

నామకరణం చేశారు. అంతే కాకుండా దానికొక విశిష్ట తత్వాన్ని జోడించి కాంగ్రెస్ ఉద్యమానికి కొత్త కార్యక్రమాన్ని ఇచ్చారు.

## స్వదేశీ స్ఫూర్తి

"స్వదేశీకి ఖద్దరు మూల స్థంభం. ప్రధాన స్ఫూర్తి. ఖద్దరు లేని స్వదేశీ జీవం లేని దేహంతో సమానం. అది చితికి చేర్చేందుకు తప్ప ఇంకెందుకు పనికి రాదు. ఒకే ఒక్క స్వదేశీ వస్త్రం ఏదైనా ఉందంటే, అది ఒక్క ఖద్దరు మాత్రమే. లక్షల కోట్ల మంది దేశ ప్రజల భాషలో చెప్పుకోవాలంటే, స్వదేశీ అనేది మనం పీల్చే గాలితో సమానం, అదే మన ఊపిరి. స్వదేశీ పరీక్షల్లో నెగ్గడమంటే ఏదో ఒక స్వదేశీ తయారీ వస్తువును అందరూ వినియోగించడమే కాదు, స్వదేశీ వస్తువు తయారీలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావడమే నిజమైన స్వదేశీ స్ఫూర్తికి నిదర్శనం. ఆ విధంగా చూసినప్పుడు స్వదేశంలో తయారైన మిల్లు బట్టలను అందరూ వాడడం అంటే అది పరిమిత స్వదేశీ పరిధిలోకి మాత్రమే వస్తుంది. ఎందుకంటే ఆ వస్త్ర తయారీలో ఏ కొద్ది మంది మాత్రమే పాల్గొంటారు. అదే ఖద్దరు నేతలో అయితే లక్షలాది మంది పాల్గొంటారు". – *యంగ్ ఇండియా పత్రిక జూన్ 17, 1926.*

ఇలా గాంధీజీ స్వదేశీ భావాన్ని, స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకు వెళ్లారు. ప్రజలను ఉద్యమానికి సిద్ధం చేశారు. విదేశీ వస్త్ర బహిష్కరణకు పిలుపు నిచ్చారు. స్వదేశీ స్ఫూర్తి ద్వారా జాతీయ స్ఫూర్తిని రగిల్చారు. ఖద్దరును జాతీయ స్ఫూర్తికి ప్రతీకగా నిలిపారు. ఖాదీ ఉద్యమం ద్వారా గాంధీజీ అహింసా ఆయుధాన్ని ఎక్కుపెట్టి వలస పాలకుల దోపిడీ పునాదులను కదిల్చి వేసేందుకు పూనుకున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను వికేంద్రీకరణ పునాదులపై తిరిగి నిర్మించే కార్యక్రమంలో ఖాదీని చేర్చారు. ఆలా ఖాదీ స్వాతంత్ర్య ఉద్యమంలో అంతర్భాగం అయింది. అయితే, పరిచయ సమయంలోనే ఒక తప్పు దొర్లింది. అది ఖాదీ రంగు తెలుపు కావడం. ఈ కారణంగా ఖాదీ వస్త్రాలు మహిళలను ఆకర్షించ లేకపోయాయి. తెల్ల చీర కట్టుకోవడం అంటే అది వైధవ్యానికి చిహ్నం అనే భావన ఉండడం వలన మహిళలు, (వేరే రంగు అంచు ఉన్నా) ఖాదీ చీరలు ధరించేందుకు విముఖత చూపారు. అందుకే గాంధీ తెలుపు అంటే స్వచ్ఛతకు, నిరాడంబరతకు చిహ్నం అని వివరించే ప్రయత్నం చేశారు. అందరికీ ఆదర్శంగా నిలిచేందుకు, అయన తన భార్య కస్తూరిబాను తెల్లచీర కట్టుకోమన్నారు. ఆశ్రమంలోని మహిళలు అందరూ తెల్ల చీరలు కట్టుకోవాలని కోరారు.

## ఖాదీ – ఆర్థిక వ్యవస్థ

ఖాదీ ఉద్యమం గ్రామాల, ముఖ్యంగా గామీణ మహిళల సాధికారతకు బాటలువేసింది. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనడానికి కూడా ఖాదీ ఉద్యమం ఒక ప్రధాన కారణం. ఇందుకు సంబంధించి గాంధీజీ "గ్రామాలలో నివసించే 16 సంవత్సరాల వయసు నిండిన స్త్రీ, పురుషులు అందరికి, కుటీర లేదా ఇతర పరిశ్రమలలో వారి వారి నైపుణ్యానికి, సామర్థ్యానికి తగిన ఉపాధి అవకాశాలు కలిపించే వ్యవస్థ ఏర్పడే వరకు లేదా గ్రామీణ ప్రజలకు అన్ని సదుపాయాలు గల పట్టణాలను నిర్మించే వరకు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే లక్షలాదిమందికి ఖాదీ ఒక్కటే నిజమైన ఆర్థిక వనరు. నేను వనరు అని ఎందుకు అన్నానంటే, ఖాదీ ఎంతకాలం అయినా, కొనసాగాలనే ఉద్దేశంతోనే నేను వనరు అనే మాటను ఉపయోగించాను" – అన్నారు *గాంధీజీ ఒక చోట.*

ఉత్పత్తి వికేంద్రీకరణ వలన ఆదాయ సమానత్వానికి అవకాశం ఏర్పడుతుంది. "సంపదను సృష్టించిన తర్వాత దానిని సమానంగా పంపిణి చేయడం సాధ్యం కాదు అని రాజాజీ అన్నారు. అందుకు సంపద సృష్టించిన వారు ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించరు. కానీ సంపద సృష్టికి ముందే ఆదాయం సమానంగా పంపిణి అయ్యేలా ఉత్పత్తి ప్రక్రియను రూపొందించుకో వచ్చును. అదే ఖాదీ"

"ఖాదీ గ్రామీణ సౌర వ్యవస్థలో సూర్యుడు. ఆ సూర్యుని నుంచి వేడిని, శక్తిని పొందే అనేక ఇతర పరిశ్రమలు ఇతర గ్రహాలు. అది లేకుండా ఇతర పరిశ్రమలు అభివృద్ధి చెందలేవు. అయితే, ఇతర పరిశ్రమల పునరుద్ధరణ జరగనిదే, ఖాదీ మరింత ప్రగతిని సాధించలేదు అని నేను నా చివరి పర్యటనలో తెలుసుకున్నాను. గ్రామాలు, గ్రామీణ ప్రజలు తమ ఖాళీ సమయాన్ని లాభదాయకంగా మలచుకోవాలంటే, గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులను అన్ని కోణాలలో సృజించవలసి ఉంటుంది." (హరిజన్ 16-11-1934). గాంధీజీ, కాంగ్రెస్‌లో అంతర్గతంగా వచ్చిన వత్తిడిని కూడా గుర్తించారు. కాంగ్రెస్ సంస్థాగత పరిధి నుంచి ఖాదీని వేరుచేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే, 1925లో అఖిల భారత ఖాదీ సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ మార్గదర్శకత్వంలో ఖాదీ దేశం లోని అన్ని ప్రాంతాలకు చేరింది. కొత్త వారిని ఆకర్షించింది. దేశ వ్యాప్తంగా మద్దతు విస్తరించింది.

## స్వాతంత్ర్యోద్యమానికి ప్రతీక

గాంధీజీ సారధ్యంలో సాగిన స్వాతంత్రోధ్యమానికి చరఖా ప్రతీకగా మారింది. జాతీయ వాదానికి ఖాదీ చిహ్నంగా నిలిచింది. ఈ ప్రతీకలు భారతీయ దృశ్యాన్ని మార్చి వేశాయి. వలస వాదుల అధికారం, ప్రజా అధికారంగా రూపాంతరం చెందడాన్ని ప్రజలు చూడగలిగారు. ఒకప్పుడు సామాన్య

ప్రజలు పోలీసులను చూస్తే భయపడే వారు, కానీ, గాంధీజీ అహింసా వ్యూహాన్ని ముందుంచిన తర్వాత, 'ఖాదీ వస్త్ర ధారణలో ఉన్న వారిని చూసి పోలీసులు భయపడ్డారు. ఒక ఆర్థిక కార్యక్రమంగా ప్రారంభమైన ఖాదీ ఉద్యమం, ఒక బలమైన రాజకీయ అస్త్రంగా మారింది.

లీసా త్రివేది తమ పుస్తకం "క్లోథింగ్–గాంధీస్ నేషన్'లో పేర్కొన్న విధంగా, "ఖాదీ, వలసవాద పాలితులను, జాతీయ పాలితులుగా, జాతీయ పౌరులుగా మార్చివేసింది. నూతన వస్త్ర ధారణతో స్వదేశీ సమర్థకులు, మేధావులు, ఉన్నత వర్గాల వారు జాతీయ సమాజంలో భాగస్వాములు అయ్యేలా చేసింది. నూతన వస్త్ర ధారణ వలసవాద భావజాలానికే కాదు, సంప్రదాయ అడ్డుగోడలకు కూడా సవాలుగా నిలిచింది. 'అలవాటుగా ఖాదీ ధరించే' వారుగా అనుకునే వారు సాధారణ శ్రామిక సూత్రాన్ని, స్వయం సామర్థ్యాన్ని, రాజకీయ సమాజం పునాదిగా గుర్తించారు. గౌరవించారు. ఒక్క ముక్కలో చెప్పుకోవాలంటే, ఖాదీ, వలస పాలనలో ఉన్న భారతీయులు అందరిలో తామంతా, ఒకే జాతికి చెందిన వారమని గుర్తించేలా చేసింది. ఖాదీ అందరిని సంపూర్ణ భారతీయులుగా మలచ లేకపోయినా, వలసవాద, సంప్రదాయ అడ్డుగోడలను ప్రతి ఒక్కరు తిరస్కరించేలా చేసింది". "ఖాదీ, ఉద్యమం అంతిమ లక్ష్యం, కేవలం పట్టణ ప్రాంత ప్రజలకు ఆధునిక ఖాదీ వస్త్రాలను సరఫరా చేయడం, తద్వారా మిల్లు వస్త్రాల తయారీ దారులకు పోటీగా నిలవడం, ఆ విధంగా ఇతర పరిశ్రమల్లోలాగా, కొద్ది మంది కళాకారులకు ఉపాధి కలిపించడం మాత్రమే కాదు. వ్యవసాయనికి అనుబంధ పరిశ్రమగా అభివృద్ధి చేయాలన్నదే ఖాదీ ఉద్యమ అంతిమ లక్ష్యం. ఈ ప్రయత్నం ఇంకా సఫలం కాలేదు. అది సఫలం కావాలంటే, అది స్వయం పోషకం కావాలి. ఖాదీ, వినియోగం గ్రామా గ్రామానికి విస్తరించాలి. గ్రామీణ ప్రజలు ఏ విధంగా అయితే తాము తినే ఆహార పదార్థాలను తామే వండు కుంటారో, అలాగే, తాము కట్టే ఖాదీ బట్టను వారే నేసుకోలేరా? సొంత అవసరాలకు మించి అధికంగా ఉంటే, దానిని అమ్ముకో వచ్చును" – *హరిజన్, జూలై 6, 1935.*

### మన ముందున్న సవాళ్లు


శ్రమైక జీవన సౌందర్యం, వికేంద్రీకరణ, అహింస, నిరాడంబరత అనే ఖాదీ మూల సూత్రాల విషయంలో రాజీ లేకుండా సామాన్య ప్రజలకు సైతం అందుబాటు ధరలలో, ఆకర్షణీయంగా ఖాదీ వస్త్రాలను అందించడమే ఇప్పుడు మన ముందున్న ప్రధాన సవాలు. స్వాతంత్రోద్యమం, స్వదేశీ ఉద్యమంవంటి బలమైన ప్రేరణలు లేని ప్రస్తుత పరిస్థితులలో ఖాదీ, స్వశక్తిపై, సైద్ధాంతిక పునాదులపై తన కాళ్ళపై తాను నిలబడ వలసిన అవసరం ఉంది. నూలు వస్త్రాలు, మిల్లులో తయారైనవే అయినా, నిస్సందేహంగా, పర్యావరణ అనుకూలమైనవి. అంతే కాదు మన వాతావరణానికి అనుకూల మైనవి. అలాగే శరీర, దేహ సంరక్షణకు నూలు వస్త్రాలు చాలా అనుకూలం. అందులో సందేహం లేదు. అయితే, ఉత్పత్తి, పంపిణీ, వినియోగం ఎలా అన్నవి మూల ప్రశ్నలు. ఖాదీ, ఉత్పత్తి పరంగానే పర్యావరణ అనుకూల ఉత్పత్తి. తనకు అనుకూలమైన, అందుబాటులో ఉన్న సాంకేతిక సాధనలను వినియోగించుకునే సౌలభ్యం ఉంది. ఉత్పత్తి వికేంద్రీకరణ సమాన ఆదాయ పంపిణీకి దోహదం చేస్తుంది. తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. సుస్థిర,పర్యావరణ అనుకూల అభివృద్ధి, కేవలం ఖాదీ పునాదులపై మాత్రమే సాధ్యం అవుతుంది. ఖాదీ ఉద్యమం ప్రజా ఉద్యమంగా ఎదగవలసిన అవసరం ఉంది, అన్నిటిని మించి ఖాదీ మన జాతీయ వస్త్రధారణగా గుర్తింపు పొందవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలలో ఖాదీ అనుకూల మానసిక స్థితిని ప్రోది చేయడం, మన అవసరాలకు ఖాదీ మాత్రమే వినియోగించాలనే మానసిక స్థితికి మనమందరం చేరుకోవడం కూడా ఎంతో అవసరం. ఖాదీ వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా మనం మానవ జాతి అతి పురాతన కళాసంపదను సంరక్షించిన వారమౌవుతాం. ■

# యోజన

**యోజన** నవంబర్, 2016 సంచిక **"పన్నుల సంస్కరణలు"** అంశంపై వెలువడుతుంది. **యోజన** (తెలుగు) మాసపత్రిక చందా వివరాలకు, www.Bharatkosh.gov.in చూడవచ్చు. చిరునామా మార్పు, పత్రిక అందకపోవడం వంటి అంశాలకు 040–27546312 / 13 / 14 నెంబర్లను సంప్రదించవచ్చు.

**– సీనియర్ ఎడిటర్**

# ఆధునిక ప్రపంచంలో వస్త్ర ప్రాధాన్యం



**మనజౌళి ఎగుమతుల భవిష్యత్తు ఆశాజనకంగా ఉన్నది. మరిన్ని ఎగుమతులకున్న అవకాశాలు, పెరుగుతున్న దేశీయ వినియోగమే దీనికి సాక్షి. ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు మన మార్కెట్లోకి ప్రవేశిస్తున్నా, రిటైల్ రంగం ఎంతో పెరుగుదలను రికార్డు చేసింది. వచ్చే దశాబ్ద కాలంలో మన ఈ ఎగుమతులు ఏటా పదమూడు శాతం చొప్పున పెరగవచ్చుని అంచనా! దీనితో మొత్తం ప్రపంచ దుస్తుల ఎగుమతులలో మనదేశం వాటా 20 శాతానికి చేరవచ్చు. ఈ ఆశావహ పరిస్థితి ఆధారంగా ప్రభుత్వం మరో 120 బిలియన్ అమెరికన్ డాలర్ల మేర ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి నిశ్చయించింది.**

"నేటి ప్రపంచంలో బట్టలు అంటే శరీరానికి రెండవచర్మం. ఒకప్పుడు, "Face is the Index of the mind" అనేవారు. నేడు, "Dress is the Index of the mind" అనాల్సిన పరిస్థితి. టెక్స్ టైల్ అనే పదం, 15వ శతాబ్దం నాటి లాటిన్ పదం, Textiles Texture నుండి వచ్చింది. సాంకేతిక నిర్వచనాన్ని చూస్తే, ఏదైనా నూలు, దారం నుండి వడికి, అల్లి, ఆచ్ఛాదనకు వినియోగించేది అని అర్థం చెప్పవచ్చు. విక్టోరియన్ ఇంగ్లీషులో క్లొ అంటే, క్లాత్ అని అర్థం. మనదేశంలో దాదాపు ఐదువేల సంవత్సరాలక్రితం నుండే, అంటే, హరప్పా నాగరికత రోజులనుండే మనకు బట్టలు నేయడం తెలుసు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దంలోనే మనం అనేక దేశాలకు వస్త్రాలను ఎగుమతి చేశాము. చైనా వంటి దేశాలనుండి, సుగంధ ద్రవ్యాలకు బదులుగా, పట్టును దిగుమతి చేసుకునేవారం. ఈజిప్టులో పురాతత్వశాఖవారి తవ్వకాలలో అనేక గుజరాత్‌లో తయారైన నల్లని అద్దకం వస్త్రాలు దొరికాయట. అంటే ఆనాడే మనం వస్త్రాలను ఎగుమతిచేసినట్లు ఆధారం కదా?

**వర్తమాన పరిస్థితి:**


బలమైన దేశీయ మార్కెట్, ఎగుమతుల అవకాశాలు రెండూ కలసి మన దేశ వస్త్ర పరిశ్రమను పటిష్టమైన స్థితిలో ఉంచాయి. అంతేకాదు, పత్తి, నూలు, పట్టు, జనుము వంటి ముడిపదార్థాలు కూడ మనదేశంలోనే సమృద్ధిగా లభిస్తున్నాయి. దీనికి తోడు, నైపుణ్యం గల కార్మికులు, సాంకేతిక పరిజ్ఞాన అందుబాటు సమృద్ధిగా ఉండటంతో, అవకాశాలు మెండుగా ఉన్నాయి.

**వస్త్రాల వర్గీకరణ:**

1. దుస్తులు (మహిళలు, పురుషులు, పిల్లలకు)



2. ఇంటి అవసరాలు, అలంకరణలకు అవసరమైన పట్టాలు, తువ్వాళ్ళు, ఫర్నీచర్ను అలంకరించే గుడ్డలు మొదలైనవి.




**ప్రొ. హయవదన,** టెక్స్‌టైల్ టెక్నాలజీ విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
E-mail: jamsvj@gmail.com

3. పారిశ్రామిక సంబంధమైనవి బెల్టులు, టైర్లు, తలుపులకు, కిటికీలకు ఉపయోగించే పానెళ్ళు,
4. వ్యవసాయానికి అవసరమైన మరియు, పశువుల పాకల నిర్మాణానికి అవసరమైనవి,
5. నిర్మాణ సాంకేతికతలో వినియోగించే అనగా, స్టేడియంలు, ఈతకొలనులు, ఆనకట్టలు, విమానా శ్రయాలు, రైలు, బస్ స్టేషన్లు వంటివాటిలో వినియోగించే జౌళి ఉత్పత్తులు,
6. భద్రత, రక్షణ ఉపకరణాలలో వాడే జౌళి ఉత్పత్తులు.



7. వైమానికరంగంలో వాడే జౌళి ఉత్పత్తులు.
8. ఎలక్ట్రానిక్స్ రంగంలో అంటే, సర్క్యూట్ బోర్డులు, ఆప్టికల్ ఫైబర్ బోర్డులు మొదలైనవాటిలో వినియోగించే జౌళి ఉత్పత్తులు.



9. సిగరెట్ల ఫిల్టర్లలో వాడే పీచు.



10. వైద్యరంగంలో వినియోగించే కాంటాక్టు లెన్సులు, కృత్రిమ రెటీనా, ఆసుపత్రి బట్టలు, గాయలకు కుట్లు వేసేందుకు వాడే దారం మొదలైనవి.



11. క్రీడారంగంలో వాడేవి, పాదరక్షలలో వాడేవి.



12. సముద్ర ఉత్పత్తుల కోసం వాడేవి, మోటారు వాహనాలు, రవాణా రంగాలలో వాడే, సీట్ల బట్టల, టార్పాలిన్లు, ప్యాకేజీ రంగంలో వాడే ఉత్పత్తులు మొదలైన ఎన్నో అంశాలలో జౌళివాడకం ఉంటుంది. ఇక దుస్తుల రంగానికి వస్తే, సహజమైనవి, కృత్రుమమైనవి అని రెండు రకాలు. సహజమైనవంటే, పత్తి, ఉన్ని, జనుము, కొబ్బరిపీచు వంటి సహజ ఉత్పత్తుల నుండి వినియో గించేవి. కృత్రుమమైనవి అంటే, పాలిస్టర్, నైలాన్, పాలిథిన్, విస్కోస్ వంటి ఉత్పత్తులు.





**నూలు, పీచు, ఇతర ముడి పదార్థాల వర్గీకరణ:**

ఎక్కడికక్కడ అన్ని రంగాలు, వర్గాలుగా ఏర్పడ్డాయి. ఎలాగంటే, నూలు, పీచు ఉత్పత్తి పరిశ్రమల సంఘం స్పిన్నింగ్ మిల్లులు, మగ్గాల సంఘాలు రెడీమేడ్ దుస్తుల ఉత్పత్తి సంఘాలు మొదలైనవి. ఇక వీటిలో ప్రభుత్వ చొరవ గురించి ప్రస్తావిస్తే, అహ్మదాబాద్, ముంబాయి, దక్షిణ భారత, ఉత్తరభారత వస్త్ర పరిశ్రమ పరిశోధన సంఘాలు జనపనార పరిశోధన కేంద్రం ఉన్ని పరిశోధన కేంద్రం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజి, నేషనల్ టెక్స్టైల్స్ కార్పోరేషన్, సెంట్రల్ సిల్క్ బోర్డ్, మొదలైనవెన్నో ఉన్నాయి.

**ఆంధ్రప్రదేశ్ – తెలంగాణాలలో వస్త్ర పరిశ్రమ:**

పోచంపల్లి, గద్వాల్, ధర్మవరం,



నారాయణపేట వంటి చేనేత కేంద్రాల గురించి అందరికీ తెలిసిందే. తెలంగాణాలోని మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, ప్రాంతాలలోను, రాయలసీమలోని మదనపల్లి, పులివెందుల, కోస్తలోని గుంటూరు, విశాఖ, తణుకు, కృష్ణ ప్రాంతాలలో స్పిన్నింగు మిల్లులు

ఉన్నాయి. హైదరాబాద్, పోచంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, నల్గొండ, కరీంనగర్ (సిరిసిల్లా), షాద్‌నగర్, కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరులలో మరమగ్గాలు ఉన్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మేడ్చల్, మహబూబ్‌నగర్‌లలో రెడీమేడ్ దుస్తుల తయారీ పరిశ్రమలు, రంగారెడ్డి జిల్లా తొర్రూర్‌లో టెక్చరింగ్ యూనిట్‌లు ఉన్నాయి.

**తెలంగాణా ప్రత్యేకం ఇక్కత్:**

చిట్కిరంగు అద్దకం అని పిలిచే ఈ అద్దకం వృత్తిగా నల్గొండజిల్లాలో అనేక కుటుంబాలు జీవిస్తున్నాయి. అయితే క్రమంగా ఈ కళాకారుల పనితనంలో నాణ్యత లోపించి, వారువాడేరంగుల అద్దకం నాసిరకంగా దిగజారిపోయింది. ఈ కళను మెరుగు పరచడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు కొంత కృషి చేశారు. ప్రపంచ బ్యాంకువారి ఆర్థిక సహాయంతో గ్రామసభలు నిర్వహించి, ప్రజల అవగాహనను మరింత మెరుగుపరచడానికి కృషిచేశారు.


**నార దుస్తులు:**

అల్లికలేకుండ నారతో దుస్తులు నేయడం ఒక పద్ధతి. ఈ తయారీలను వైద్య, క్రీడ, పారిశ్రామిక, ఆటోమొబైల్ వంటి రంగాలలో వినియోగిస్తారు. తెలంగాణా ప్రభుత్వం ఈ జౌళిరంగానికి అనేక విధాల ప్రోత్సాహాన్ని అందిస్తున్నది. చేనేతకారులకు సమయానుకూలంగా తగిన మార్గదర్శక సమాచారాన్ని అందించడానికి ఒక వెబ్ సైటును కూడ నిర్వహిస్తున్నది. ప్రతి ఒక్క చేనేతకారుని వివరాలనూ, ఆర్థిక పరిస్థితిని రికార్డు చేసి, వారి ఉత్పత్తుల నాణ్యతను పెంచి మరింత గిట్టుబాటైన ప్రతిఫలాన్ని పొందేలాగు సహాయమందిస్తున్నది.

**ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలో, వస్త్ర సంబంధ చదువులు, ఉపాధి అవకాశాలు**

ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో ఇప్పటివరకూ టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో బి.టెక్, ఎం.టెక్, పి.హెచ్.డి లను అందచేస్తున్న విద్యాలయం ఒకే ఒక్కటి ఉన్నది. నేడు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయవిశ్వవిద్యాలయం హోం సైన్స్ విభాగంలో, నూతనంగా బి.ఎస్సీ, ఎం.ఎస్సీ, పి.హెచ్.డి కోర్సులను ప్రారంభించింది. సిరిసిల్లలోని ఎస్.ఆర్.ఆర్. పాలిటెక్నిక్ ఒకే ఒక్క డిప్లొమా కోర్సును అందచేస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, గుంటూరులోని టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో బి.టెక్ కోర్సును అందిస్తున్నారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు 'అప్పేరల్స్ టెక్స్‌టైల్స్'లో బి.టెక్. కోర్సును అందచేస్తున్నారు. ఇవేకాక, జౌళి సాంకేతిక ప్రభుత్వ సంస్థ, మహిళా పాలిటెక్నిక్‌లు డిప్లొమ కోర్సులను అందిస్తున్నాయి.


**టెక్స్‌టైల్స్ మార్కెటింగ్:**



మనదేశ ఎగుమతులలో, దుస్తుల ఎగుమతి వాటా 7శాతంగా ఉన్నది. అయితే, 2015-16 సంవత్సరానికి మాత్రం, అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే, ఎగుమతులు 2.43 శాతం తగ్గాయి. వస్త్రాల ఎగుమతు లయితే, 2015-16 సం.లో అంతకుముందు సంవత్సరంకన్నా, 16,987.77 మిలియన్ల అమెరికన్ డాలర్ల వృద్ధిని రికార్డు చేశాయి. మన అల్లికల దుస్తులకు ప్రధాన కొనుగోలుదారు అమెరికా. ప్రతి సంవత్సరం 1675.07 మిలియన్ అమెరికన్ డాలర్ల ఎగుమతులు చేస్తున్నాము. దేశ స్థూల దేశీయోత్పత్తిలో ఐదు శాతం వాటా మన దుస్తుల ఎగుమతులదే.

**భవిష్యత్ దృశ్యం:**

మనజౌళి ఎగుమతుల భవిష్యత్తు ఆశాజనకంగా ఉన్నది. మరిన్ని



ఎగుమతులకున్న అవకాశాలు, పెరుగుతున్న దేశీయ వినియోగమే దీనికి సాక్షి. ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు మన మార్కెట్లోకి ప్రవేశిస్తున్నా, రిటైల్ రంగం ఎంతో పెరుగుదలను రికార్డు చేసింది. వచ్చే దశాబ్ద కాలంలో మన ఈ ఎగుమతులు ఏటా పదమూడు శాతం చొప్పున పెరగవచ్చని అంచనా! దీనితో మొత్తం ప్రపంచ దుస్తుల ఎగుమతులలో మనదేశం వాటా 20 శాతానికి చేరవచ్చు. ఈ ఆశావహ పరిస్థితి ఆధారంగా ప్రభుత్వం మరో 120 బిలియన్ అమెరికన్ డాలర్ల మేర ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి నిశ్చయించింది. దీనివల్ల 35 మిలియన్ల నూతన ఉపాధి అవకాశాలు అందివస్తాయి.

■

మీకు తెలుసా?

## జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం

ఇంతవరకూ, చేనేత, హస్తకళల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సహాయ కార్యక్రమాలనూ, 'జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం' పేరిట 12వ పంచవర్ష ప్రణాళిక నుండి సమీకృతం చేశారు. వ్యక్తిగత నేతకారులు, సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు, హస్తకళల కళాకారులకు అందించే అన్ని రకాల సహాయాలు, రుణాలు అన్నింటినీ ఏకీకృతం చేసి, వర్తమాన ఆర్థిక సంవత్సరానికి రూ. 19,000ల కోట్లను కేటాయించారు. దీనితో పాటుగా వారు గతంలో తీసుకున్న రుణాల తిరిగి చెల్లింపునకు, నూతన రుణాలు అవసరమైతే, వడ్డీలో 6 శాతం రాయితీని కూడ ఇస్తారు. అయితే వ్యక్తిగత రుణ మాఫీకి గరిష్ట పరిమితి రూ. 50,000/–లు. ఈ సమీకృత కార్యక్రమాన్ని అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేస్తారు. పనియంత్రాలు, వర్కు షెడ్లు వంటి వాటికి రూ. 15 లక్షల వరకూ వడ్డీ రాయితీతో రుణాలనిస్తారు. అదనంగా 10 వేల రూపాయల వరకూ మార్జిన్ మనీ కూడ అందచేస్తారు. బ్యాంకుల నుండి తీసుకునే రుణాలకు 85శాతం వరకూ హామీనిస్తారు.

## సమీకృత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం

చేనేత కార్మికులకూ, హస్తకళాకారులకూ అంతర్జాతీయ స్థాయి పోటీని తట్టుకునేందుకు వారి నైపుణ్యాన్ని మరింత పదును తేల్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నారు. దీనికోసం ప్రత్యేకంగా, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో శిక్షణా సంస్థలను ఏర్పాటు చేస్తారు. ఏవైనా సంస్థలు శిక్షణ అందచేయడానికి ముందుకు వస్తే, వాటికి తగిన గుర్తింపునిచ్చి, ఆర్థిక సహాయాన్ని కూడ అందచేస్తారు. అయితే ఈ మొత్తం వ్యక్తిగతంగా ఒక్కొక్క అభ్యర్థికీ, రూ. 10,000/–లకు మించకుండా ఇస్తారు.

## పత్తికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు

నాణ్యమైన పత్తి ఉత్పత్తికి రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక చర్యలను తీసుకుంటున్నది. వ్యవసాయ ధరల సంఘాన్ని ఒకదానిని ఏర్పాటుచేసింది. పత్తితో సహా, అన్నిరకాల వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటైన ధరలను అందించడం ఈ సంఘం లక్ష్యం. సాగుబడికి అవసరమైన వివిధ ఉపకరణాలు, ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారకాలు, పనిముట్లు వంటివాటి ధరలు, ఆమోదయోగ్యమైన లాభాన్ని చేర్చి ఈ సంఘం ధరలను నిర్ణయిస్తుంది. ప్రతి సీజన్‌లోనూ గిట్టుబాటు ధరను ప్రకటించేముందు, ఉపకరణాల ధరలలోని తేడాలనూ, ఆయా రాష్ట్రాలు విధించే పన్నులు, సుంకాలు వంటివాటినన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ విధానంలో ప్రభుత్వం ప్రతి సంవత్సరమూ గిట్టుబాటు ధరలను ప్రకటిస్తుంది.

## టెక్నాలజీ మిషన్

ఆధునిక సాంకేతిక విధానాలను స్వాగతిస్తూ ప్రభుత్వం బిటి పరిజ్ఞానాన్ని ఉపయోగించి పత్తి దిగుమతిని గణనీయంగా తగ్గించగలిగింది. అంతేకాదు, ఈ సాంకేతికత పుణ్యమా అని నేడు మనదేశం ప్రపంచంలో రెండవ పెద్ద పత్తి ఎగుమతిదారుగా అవతరించింది. తక్కువ నీటిని వినియోగించుకుని నాణ్యమైన దిగుబడినిచ్చే విత్తనాలపై ప్రస్తుతం పరిశోధనలు జరుగుతున్నాయి.

## గమనిక

**వ్యాసకర్తలకు సూచన** యోజన మాసపత్రికకు వ్యాసాలు పంపేవారు తమ వ్యాసం సాఫ్ట్ కాపీని పేజిమేకర్ 6.5 లేదా 7 మరియు "అను" 7 ఫాంట్‌లో, వర్డ్‌లోనూ పంపాలి. వ్రాతప్రతిని కూడ హామీ పత్రంతో కలిపి పోస్టుద్వారా పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదం, అనుసరణ కాదనీ, మరే పత్రికకూ పంపలేదనీ, ఇంతకుముందు పుస్తకంగా ముద్రించలేదని పేర్కొనాలి. రచనలు 15వ తేది లోపు మాకు చేరాలి. ప్రచురణకు నోచుకోని రచనలు తిరిగి పంపబడవు. దీనపై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ చోటులేదు. గమనించగలరు.

*సీనియర్ ఎడిటర్*

యోజన తెలుగు మాసపత్రిక, 205, రెండవ అంతస్థు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.
E-mail: yojana_telugu@yahoo.co.in - yojana.telugu@nic.in



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్య శర్మ

1. 'ఒలింపిక్ ఆర్డర్' అనే అవార్డు ఇటీవల ఎవరి కిచ్చారు?
   ఎ) జస్టిస్ ఆర్.ఎమ్ లోధ
   బి) ఎన్ రామచంద్రన్ ప్రెసిడెంట్, IOA
   సి) నాగపురి రమేష్ డి) శుభముద్గల్
2. కాళోజి నారాయణ రావు అవార్డ్ ఇటీవల ఎవరికిచ్చారు?
   ఎ) గోరెటి వెంకన్న
   బి) డా॥ సి. నారాయణ రెడ్డి
   సి) దాశరథి కృష్ణమాచార్యులు
   డి) దాశరథి రంగ చార్యులు.
3. చంద్రయాన్–2 వివరాలేవి?
   ఎ) ఇస్రో, 2018లో ప్రయోగింపదల్చింది.
   బి) GSLV-MK II ద్వారా చంద్రయాన్–2 పంపిస్తారు.
   సి) చంద్రయాన్–2లో ఒక ఆర్బిటర్ (అంతరిక్ష నౌక), లాండర్, రోవర్ ఉంటాయి. వీటి మొత్తం బరువు 3,280 కిలో గ్రాములు.
   డి) పైవన్నీ.
4. G-20 దేశాల సమావేశం ఇటీవల ఎక్కడ నిర్వహించారు?
   ఎ) హాంగ్‌జౌ, చైనా బి) జర్మనీ
   సి) భారతదేశం డి) రష్యా
5. ఈ క్రిందివాటిల్లో ఏది కరక్ట్?
   ఎ) మణిపూర్ – నజ్మా హెప్తుల్లా
   బి) అస్సాం – బన్వరీలాల్ పురోహిత్
   సి) పంజాబ్ – వి.పి. సింగ్ బద్‌నూర్
   డి) పైవన్నీ (రాష్ట్రాలు – గవర్నర్లు)
6. అండమాన్ & నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్ ఎవరు?
   ఎ) ఫరూక్ ఖాన్
   బి) ప్రొఫెసర్ జగదీష్ ముఖి
   సి) కిరణ్ బేడి డి) నజీబ్ జంగ్
7. XXXI ఒలింపిక్ గేమ్స్‌లో 121 పతకాలు గెల్చుకొని ప్రథమ స్థానంలో ఉన్న దేశం ఏది?
   ఎ) చైనా బి) USA
   సి) ఇంగ్లాండ్ డి) రష్యా
8. "స్కార్ పీన్" జలంతర్గాముల సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్‌కు అందించిన దేశం ఏది?
   ఎ) రష్యా బి) ఫ్రాన్స్
   సి) జపాన్ డి) ఇటలీ
9. సరోగసీ (రెగ్యులేషన్) బిల్, 2016 ద్వారా వేటిని అనుమతించారు? వివరాలేవి?
   ఎ) కమర్షియల్ సరోగసీ అనుమతించరు.
   బి) విదేశస్థులు, హోమోసెక్స్యువల్స్, అన్‌మారీడ్ కపుల్స్, సింగిల్ పీపుల్, వీరికి అనుమతించరు
   సి) దగ్గర బంధువుల "అల్ ట్రూయిస్టిక్ సరోగసీ" మాత్రమే అనుమతిస్తారు.
   డి) పైవన్నీ.
10. సెంట్రల్ వాటర్ కమీషన్ (CWC) ఎప్పుడు ప్రారంభించారు?
    ఎ) 1945 బి) 1947
    సి) 1950 డి) 1966
11. సిటిజన్‌షిప్, 2016 బిల్లు ద్వారా ఏ దేశం నుండి వలస వచ్చినవారికి పౌరసత్వం ఇవ్వాలని భావిస్తున్నారు?
    ఎ) పాకిస్తాన్ బి) ఆఫ్ఘనిస్తాన్
    సి) బంగ్లాదేశ్ డి) పైవన్నీ
12. "వోట్ ఆన్ ఎకౌంట్‌కి" సంబందించిన వివరాలు భారత రాజ్యాంగంలో ఎన్నవ ఆర్టికల్‌లో రాసి ఉన్నాయి?
    ఎ) 116 బి) 280 సి) 71 డి) 51
13. భారతదేశంలో తొలిసారిగా వార్షిక బడ్జెట్ విధానం ఎప్పుడు ప్రవేశ పెట్టారు?
    ఎ) 15.08.1947 బి) 26.01.1950
    సి) 07.04.1860 డి) 26.11.1949
14. బ్రిటీష్‌వారు భారతదేశాన్ని పాలించినప్పుడు పని చేసిన తొలి ఇండియన్ ఫైనాన్స్ మెంబర్ ఎవరు?
    ఎ) జేమ్స్‌విల్సన్ బి) లార్డ్‌కర్జన్
    సి) ఛెమ్స్‌ఫోర్డ్ డి) లార్డ్‌క్లైవ్
15. 26.11.1947 నాడు కేంద్రం బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పుడు ఆర్థికశాఖ మంత్రి ఎవరు?
    ఎ) ఆర్. కె. షణ్ముగంబెట్టి
    బి) టి.టి. క్రిష్ణమాచారి
    సి) మాడభూషి అనంత శయనం అయ్యంగార్
    డి) మొక్షగుండం విశ్వేశ్వరయ్య.
16. "స్క్రాంజెట్" రాకెట్‌లో మండే ఇంధనం ఏది?
    ఎ) పొటాషియం బి) హైడ్రోజన్
    సి) యురేనియం డి) ప్లుటోనియం
17. "స్క్రాంజెట్" రాకెట్ వల్ల లాభాలు ఏవి?
    ఎ) ఆక్సిజన్ మోసుకుపోవాల్సిన పనిలేదు.
    బి) రొటేటింగ్ విభాగాలు లేవు.
    సి) బరువు తక్కువ. రాకెట్ నుండి బహిర్గతమయ్యే వాయువులు నీటి ఆవిరి కావడం వల్ల పర్యావరణం పాడుకాదు.
    డి) పైవన్నీ.
18. "ప్లాటనిస్టా గాంజెటికా" అనే డాల్ఫిన్‌లు ఏ నదిలో ఉన్నాయి?
    ఎ) సబర్మతి బి) గంగా
    సి) భీమానది డి) తుంగభద్ర
19. సెయింట్ థెరెసాలాగ, గతంలో ఎవరు సెయింట్‌లు అయ్యారు?
    ఎ) సెయింట్ అల్ఫోంజా
    బి) సెయింట్ కురియాకోస్
    సి) సెయింట్ యూఫ్రేషియా ఎలువాంథిగల్
    డి) పై అందరూ.
20. RBI 24వ గవర్నర్‌గా ఎవరు నియమితులయ్యారు?
    ఎ) డా॥ ఉర్జిత్ పటేల్
    బి) సి.డి. దేశ్‌ముఖ్
    సి) ఆస్‌బార్న్ డి) బిమల్ జలన్
21. 'ఆగ్‌ప్లేషన్' అనే ద్రవ్యోల్బణం, ఏ వస్తువులు ధరలను తెలియచేస్తుంది?
    ఎ) ఆహారోత్పత్తులు బి) పెట్రోలియం ధరలు
    సి) ఎరువుల ధరలు డి) కార్ల ధరలు
22. నాన్‌సోలార్, రెన్యువబుల్ ఎనర్జీలో వేటిని చేర్చారు?
    ఎ) పవనశక్తి బి) బయోమాస్ ఇంధనశక్తి
    సి) స్మాల్ హైడ్రో ఎనర్జీ డి) పైవన్నీ
23. ఒలింపిక్ క్రీడల మోటో (Motto) ఏది?
    ఎ) స్విఫ్టర్ (Citius) బి) హయ్యర్ (Altius)
    సి) స్ట్రాంగర్ (Fortius) డి) పైవన్నీ
24. 1850లో వెన్‌లాక్ ఒలింపియన్ గేమ్స్ ప్రారంభించిన దెవరు?
    ఎ) థామస్ బాఛ్
    బి) డా॥ విలియంపెన్నీ బ్రూక్స్
    సి) బేరన్‌పియరీ డి కౌ బెర్టిన్
    డి) ధ్యాన్ చంద్
25. ఛక్మాస్ & హజోంగ్స్ అనే ప్రజలు భారత్‌కు ఎక్కడ నుండి వచ్చారు?
    ఎ) ఆఫ్ఘనిస్తాన్ బి) రష్యా

సి) బంగ్లాదేశ్ డి) జపాన్

26. ఏ రాష్ట్ర గ్రామాలలో మొబైల్ ఫోన్ సేవలు సంపూర్ణంగా ఉన్నాయి?
ఎ) కేరళ & కర్ణాటక బి) ఒడిశా
సి) జార్ఖండ్ డి) మధ్యప్రదేశ్

27. భారత్ నెట్ ప్రాజెక్ట్ ద్వారా గ్రామాలలో బ్రాడ్ బాండ్‌తో ప్రతి గృహానికి సేవలు ఎప్పటిలోగా అందించాలనుకుంటున్నారు?
ఎ) 2020 బి) 2017
సి) 2022 డి) 2024

28. భారతదేశంలో యురేనియం గనులు ఎక్కడున్నాయి?
ఎ) 6 అండర్‌గ్రౌండ్ గనులు (బాగ్ జాత, జాదుగూడ, భతిన్, నార్వాపహార్, తురంధి, మొహుల్ది) జార్ఖండ్.
బి) ఓపెన్ పిట్ ఫైన్ (బందుహురంగ్)
సి) తుమ్మలపల్లి (కడప జిల్లా)
డి) పైవన్నీ.

29. ASEAN–ఇండియా & ఈస్ట్ ఏషియా సమ్మిట్ (సమావేశాలు) ఇటీవల ఎక్కడ నిర్వహించారు?
ఎ) మనిలా బి) వియన్‌తియానే, లావోస్
సి) జకార్తా డి) సింగపూర్

30. భారతీయ రైల్వేలు ప్రవేశ పెట్టిన "(డైనమిక్) ఫ్లెక్సీ ఫేర్ ప్రైసింగ్" పద్ధతిలో ఏ రైళ్ళలో ఛార్జీలు వసూలు చేస్తారు?
ఎ) 42 రాజధాని రైళ్ళలో
బి) 46 శతాబ్ది రైళ్ళలో
సి) 54 దురంతో రైళ్ళలో & సువిధ రైళ్ళలో
డి) పైవన్నీ (మాములు ఛార్జీ కన్నా, ఈ పద్ధతిలో 1.5 రెట్లు ఎక్కువ ఛార్జీ వసూలు చేయవచ్చు)

31. ఐదుగురు సభ్యులున్న సుప్రీం కోర్టు కొల్లీజియంకి ఎవరు హెడ్?
ఎ) కేంద్రన్యాయ శాఖ మంత్రి.
బి) సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి.
సి) సొలిసిటర్ జనరల్.
డి) ప్రధానమంత్రి.

32. "కమ్యూనలిజం" ఏ ప్రీమియర్" అనే గ్రంథ రచయిత ఎవరు?
ఎ) రొమిల్లా థాపర్ బి) బిపిన్ చంద్ర
సి) డి.ఎన్. ఝా డి) కె.ఎన్.పణిక్కర్

33. ఏ దేశాన్ని మలేరియా లేని దేశంగా ఇటీవల WHO ప్రకటించింది?
ఎ) ఇండియా బి) శ్రీలంక
సి) బ్రెజిల్ డి) రష్యా

34. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(భారత రాజ్యాంగం ఆర్టికల్స్‌కి సంబంధించినది)
ఎ) ఆర్టికల్ 14 : సమానత్వపు హక్కు
బి) ఆర్టికల్ 15 : వివక్షత చూపరాదు.
సి) ఆర్టికల్ 25 (1) : మత స్వేచ్ఛ హక్కు
డి) పైవన్నీ (పవిత్ర స్థలాలలోకి మహిళల ప్రవేశం గురించి, ఇటీవల వీటిని చర్చిస్తున్నారు).

35. మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ ఎప్పుడు ఆమోదించారు?
ఎ) 1969 బి) 1971
సి) 1980 డి) 1975

36. 'కిలిమంజారో' పర్వతం ఏ దేశంలో ఉంది?
ఎ) బ్రెజిల్ బి) అర్జెంటినా
సి) టాంజానియా సి) పెరూ

37. కావేరి బేసిన్‌లో ఉన్న రిజర్వాయర్లు ఏవి?
ఎ) క్రిష్ణరాజసాగర్ బి) హారంగి
సి) హేమవతి & కాబిని
డి) పై నాలుగు (వీటి కెపాసిటి: 104 TMC ft.)

38. ఉత్తర కాశీ దగ్గరున్న త్రిపానీ ఏరియాలో ఉన్న నెలాంగ్ లోయలో సరస్సు ఏ నదుల సంగమం వల్ల ఏర్పడింది?
ఎ) అంగార్ నాల్లా & సోనం నది (కొంత దూరం తర్వాత దీన్ని జధ్‌గంగ అంటారు.)
బి) యమున సి) సోన్ డి) చంబల్

39. "మసాలా బాండ్స్"ను భారతీయ కంపెనీలు ఏ కరెన్సీలో విడుదల చేస్తాయి?
ఎ) జపాన్ యెన్ బి) రూపాయలు
సి) రష్యారూబుల్స్ డి) యూరోలలో

40. ఖప్రబీటిల్ (కాబినెట్ బీటిల్) అనే పురుగు దేనిలో కనిపిస్తుంది?
ఎ) భారతదేశపు నాన్–బాస్మతీ బియ్యంలో
బి) కందిపప్పు సి) శనగపప్పు
డి) ఆవాలు

41. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
ఎ) APEDA : అగ్రికల్చరల్ & ప్రాసెసడ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటి.
బి) NPPO నేషనల్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్
సి) AIREA ఆల్ ఇండియా రైస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్.
డి) పైవన్నీ (చైనాకు బియ్యం ఎగుమతి అంశంలో ఇవి ప్రస్తావనకు వచ్చాయి).

42. ఎక్కడ జీవించే బంగారు రంగు చేపలకి శాస్త్రవేత్తలు బారాక్ ఒబామా పేరు పెట్టారు?
ఎ) బంగాళాఖాతంలోనివి.
బి) పసిఫిక్ మహాసముద్రంలో "కూర్ ఎటోల్"కి దగ్గర 300 అడుగుల లోతులో ఉండే చేపలకు.
సి) మన్నార్ జలసంధిలోనివి.
డి) లక్షదీవులలోనివి.

43. సెయింట్ థెరెసా మొదటి పేరు ఏది?
ఎ) ఆగ్నెస్ గాంగ్జె బోజాగ్జు (Agnes Gonxe Bojaxhiu)
బి) థెరెసా ఆఫ్ కల్‌కతా
సి) సిస్టర్ నివేదిత
డి) సిస్టర్ ప్రేమ

44. క్రీస్తు శకం 1846లో చేసుకున్న లాహోర్ ట్రియటీ తర్వాత, కాశ్మీర్‌ని గులాబ్‌సింగ్‌కి అమ్మిన దెవరు?
ఎ) బ్రిటీష్‌వారు బి) రాణి జిందాన్
సి) దిలీప్‌సింగ్ డి) దివాన్ ముల్ రాజ్

45. 1965కు పూర్వం ఎక్కడ సదర్–ఇ–రియాసత్ పదవి ఉండేది? (ఇప్పుడు గవర్నర్ పదవి వచ్చింది)
ఎ) ఢిల్లీ బి) జమ్మూ & కశ్మీర్
సి) లాహోర్ డి) జునాగఢ్

46. T–20 దేనికి సంబంధించినది? ఇది ఇటీవల G–20 మీటింగ్ గురించి ప్రస్తావించింది?
ఎ) 20 గ్లోబల్ థింక్‌టాంక్‌లకు
బి) వీళ్ళు వరల్డ్ లాండ్ బ్రిడ్జిని ప్రతిపాదించారు.
సి) రష్యాలోని సైబేరియా నుండి అలస్కా వరకు అండర్ గ్రౌండ్‌టన్నెల్ (సొరంగం) ఏర్పాటు చేయ్యాలంటున్నారు.
డి) పైవన్నీ.

47. గోవా బర్డ్ వాచింగ్ ఫెస్టివల్ నిర్వహించనున్నది. గోవాకు సంబంధించి ఏవి కరెక్ట్?
ఎ) రాష్ట్రపక్షి – బుల్ బుల్
బి) బోండ్లా వైల్డ్‌లైఫ్ శాంక్చువరీ, సలీం ఆలీ బర్డ్ శాంక్చువరీ (ఛోరావా దీవిలో) గోవాలో ఉన్నాయి.
సి) మొల్లెం నేషనల్ పార్క్ ఉంది. గోవాలో
డి) పైవన్నీ.

48. గంగానదిలోని డాల్ఫిన్‌లు గ్రుడ్డివి. కాని వేటిని విని ఇవి ప్రయాణిస్తాయి?
ఎ) తాము నోటితో చేసిన శబ్దాలను, లక్ష్యాలకు పంపి, అక్కడ నుండి తిరిగి వచ్చిన శబ్దాలను పసిగట్టి.
సి) అతినీలలోహిత కిరణాల ద్వారా.
డి) సూర్య కాంతితో.

49. ప్రతిపాదిత GST కౌన్సిల్‌కి, ఛైర్మెన్ / హెడ్‌గా ఎవరుంటారు?
ఎ) కేరళ ఆర్థిక మంత్రి
బి) కేంద్ర ఆర్థిక మంత్రి
సి) పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఆర్థిక మంత్రి
డి) కేంద్ర హోంశాఖ మంత్రి

50. న్యూసూయెజ్ కెనాల్ ప్రాజెక్ట్‌ని 8.2 బిలియన్ల అమెరికా డాలర్ల పెట్టుబడితో ఏ దేశం చేపట్టదల్చింది?
ఎ) ఇరాన్ బి) ఇరాక్
సి) ఈజిప్టు డి) లిబియా

51. PAVA అనే రసాయనంలో, P అక్షరం దేనికి?
ఎ) పాలీవినైల్ బి) ప్లాస్టిక్

సి) పెలార్గానిక్ (PAVA పెలార్గానిక్ యాసిడ్ వాని లైల్ అమైడ్) (దీన్ని గ్రెనేడ్‌లలో వాడతారు)

డి) ప్యూర్

52. INSAT-3DR ఉపగ్రహాన్ని ఏ రాకెట్ ద్వారా ప్రయోగించారు?

ఎ) PSLV-C25 బి) GSLV-F05

సి) SLV-3 డి) ASLV

53. జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (కక్ష్య)లో పెట్టిన INSAT-3DR ఉపగ్రహం, పెరిజీని ఎంత దూరంలో ఉంచారు?

ఎ) 169.7 కి.మీ. బి) 35,950 కి.మీ.

సి) 650 కి.మీ. డి) 750 కి.మీ.

54. INSAT-3DR ఉపగ్రహ సేవలు ఏ దేశాలకూ లభిస్తాయి?

ఎ) మాల్దీవులు బి) టాంజానియా

సి) సీషెల్స్ డి) పైవన్నీ

55. అమూదరియా నది ఏ దేశాల మధ్య సహజ సరిహద్దుగా ఉంది? (దీని మీద ఫ్రెండ్‌షిప్ బ్రిడ్జి నిర్మించారు?

ఎ) ఇరాన్ & ఇరాక్

బి) ఉజ్‌బెకిస్తాన్ & ఆఫ్ఘనిస్తాన్

సి) ఫ్రాన్స్ & ఇటలీ

డి) టర్కీ & సిరియా

56. బెంగలూరులో ఉన్న దొరైసాని పాళ్య జాల్లరి (లక్క పురుగులు) రిజర్వ్ ఫారెస్ట్ ఇటీవల కాలంలో దేనికి ప్రసిద్ధి చెందుతోంది?

ఎ) పట్టు పురుగులు

బి) 124 రకాల సీతాకోక చిలకల స్థావరంగా

సి) కొంగలు డి) డేగలు

57. 157 కి.మీ. పొడవున్న నెల్లూరు జిల్లా కోస్తా తీరంలో 'మడ అడవుల వృద్ధి బాగా ఉంది, ఇవి ఏ నదుల ఒడ్డున ఉన్నాయి.

ఎ) కండలేరుక్రీక్ బి) ఉప్పుటేరు

సి) ఈపూరు

డి) పైవన్నీ (మడ అడవులు సహజంగా పెరిగి తీర ప్రాంతాలలో వచ్చే తుఫాన్ల నుండి రక్షణ కల్పిస్తాయి)

58. రాజ్యాసభ సభ్యుల ఎన్నకలలోను, లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుల ఎన్నికలలోనూ "ఎలాంటి రంగు ఇంక్" పెన్ను వాడాలని ఎలక్షన్ కమిషన్ తెలిపింది?

ఎ) నల్ల ఇంకు

బి) ఇంటిగ్రేటెడ్ వయోలెట్ స్కెచ్ పెన్.

సి) ఎర్ర ఇంకు డి) నీలం ఇంకు (సిరా)

59. FAME ఇండియా స్కీం వివరాలేవి?

ఎ) ఫాస్టర్ ఎడాప్షన్ & మాన్యుఫాక్చరింగ్ ఆఫ్ హైబ్రిడ్ & ఎలక్ట్రిక్ వెహికల్స్ ఇన్ ఇండియా స్కీం.

బి) ఇది నేషనల్ ఎలక్ట్రిక్ మొబిలిటి మిషన్ ప్లాన్‌లో భాగం.

సి) విద్యుత్‌తో నడిచే వాహనాలు, హైబ్రిడ్ వాహనల వాడకం వల్ల భారతదేశంలో రూ. 60,000 కోట్ల రూపాయల విలువగల డీజిల్ / పెట్రోల్ వంటి ఇంధనాలు ఆదాచేయవచ్చును.

డి) పైవన్నీ (ఈ పథకాన్ని ఏప్రిల్, 2015లో ప్రకటించారు).

60. ఎవరికి పర్మనెంట్ రెసిడెన్సీ స్టేటస్ (PRS) ఇవ్వాలని నిర్ణయించారు? వివరాలేవి?

ఎ) పాకిస్తాన్ తప్ప, అన్ని విదేశాలను నుండి భారతకు వచ్చి విదేశీ పెట్టుబడులు పెట్టేవారికి.

బి) 10 సంవత్సరాల మల్టిపుల్ ఎంట్రీ వీసా ఇస్తారు.

సి) కనీసం రూ. 10 కోట్ల రూపాయలు (18 నెలల్లో) గాని, రూ. 25 కోట్ల రూపాయలు (36 నెలల్లో) గాని భారత దేశానికి తీసుకొచ్చి పెట్టుబడి పెట్టాలి.

డి) పైవన్నీ.

61. ఏ దేశాలలో పెట్టుబడులు పెట్టడానికి ప్రాజక్ట్ డెవలప్‌మెంట్ ఫండ్ (PDF)ని రూ. 500 కోట్ల రూపాయలతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది?

ఎ) కంబోడియా బి) లావోస్

సి) మయన్‌మార్ & వియత్నం

డి) పైవన్నీ ( EXIM బ్యాంక్ ద్వారా PDF పనులు చేస్తుంది)

62. 2016-17 ఆర్థిక సంవత్సరం, మొదటి త్రైమాసికంలో (క్వార్టర్‌లో) (ఏప్రిల్, మే, జూన్) భారతదేశ GDP వృద్ధి రేటు ఎంత?

ఎ) 7.1% బి) 7.6% సి) 7.3% డి) 6%

63. 'కార్టలైజేషన్' చేసినందుగాను సిమెంట్ కంపెనీల మీద కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (CCI) జరిమానా విధించింది? 'కార్టలైజేషన్' అంటే ఏమిటి? వివరాలేవి?

ఎ) వ్యాపార సంస్థలు, కూటమిగా ఏర్పడడం.

బి) వస్తువుల సప్లై తగ్గించి, తద్వారా రేట్లు పెంచడం.

సి) సరుకులకి అధికంగా డిమాండ్ ఉన్నపటికి ఉత్పత్తి తగ్గించడం.

డి) పైవన్నీ.

64. ఈ క్రిందివారిలో ఎవరికి రామన్ మెగ్‌సెసే అవార్డు ఇచ్చారు ఇటీవల?

ఎ) బెజవాడ విల్సన్

బి) టి.యం. క్రిష్ణ

సి) డోంపెట్ ధౌఫా (ఇండోనేషియా), కోంచితకార్పియో – మొరేల్స్, జపాన్ ఓవర్‌సీస్ కార్పొరేషన్ వాలంటీర్స్, వియంటియానేరెస్క్యూ.

డి) పై అందరికి (ఫిలిప్పైన్స్ దేశంలో ఇచ్చారు)

65. బలూచిస్తాన్ ఏ దేశంలో ఉంది?

ఎ) ఇరాన్ బి) పాకిస్తాన్

సి) ఇరాక్ డి) ఉజ్‌బెకిస్తాన్

66. నలంద యూనివర్సిటీ ఎక్కడుంది?

ఎ) మధ్యప్రదేశ్ బి) రాజ్‌గిర్, బీహార్

సి) గుజరాత్ డి) ఉత్తర్ ప్రదేశ్

67. డ్రాఫ్టెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (DRHP)లో ఉండే వివరాలేవి?

ఎ) కంపెనీ సంబంధించిన ఆర్థిక, యాజమాన్య పరసమాచారం

బి) వ్యాపార సమాచారం

సి) వ్యాపారంలో వచ్చే రిస్కుల సమాచారం

డి) పైవనీ ఉంటాయి.

68. డిజిటల్ లాకర్ వల్ల లాభాలేవి?

ఎ) కాగితాలు లేని పరిపాలన సాధ్యమౌతుంది.

బి) బంగారం నిల్వ చేసుకోవచ్చు.

సి) నగలు దాచుకోవచ్చు.

డి) వజ్రాలు దాచుకోవచ్చు.

69. 2020లో ఒలింపిక్ క్రీడల నిర్వహణ కోసం, ఒలింపిక్ పతకాన్ని ఎవరు అందుకున్నారు?

ఎ) టోక్యో మేయర్ యురికో కొయికే

బి) దిల్మారౌసెఫ్, సి) అభినవ్ భింద్ర

డి) దీపాకర్మాకర్.

## జవాబులు (అక్టోబర్ - 2016)

| | | | |
|---|---|---|---|
| 1-బి | 19-డి | 37-డి | 55-బి |
| 2-ఎ | 20-ఎ | 38-ఎ | 56-బి |
| 3-డి | 21-ఎ | 39-బి | 57-డి |
| 4-ఎ | 22-డి | 40-ఎ | 58-బి |
| 5-డి | 23-డి | 41-డి | 59-డి |
| 6-బి | 24-బి | 42-బి | 60-డి |
| 7-బి | 25-సి | 43-ఎ | 61-డి |
| 8-బి | 26-ఎ | 44-ఎ | 62-ఎ |
| 9-డి | 27-బి | 45-బి | 63-డి |
| 10-ఎ | 28-డి | 46-డి | 64-డి |
| 11-డి | 29-బి | 47-డి | 65-బి |
| 12-ఎ | 30-డి | 48-ఎ | 66-బి |
| 13-సి | 31-బి | 49-బి | 67-డి |
| 14-ఎ | 32-బి | 50-సి | 68-ఎ |
| 15-ఎ | 33-బి | 51-సి | 69-ఎ |
| 16-బి | 34-డి | 52-బి | |
| 17-డి | 35-బి | 53-ఎ | |
| 18-బి | 36-సి | 54-డి | |

**ఆరోగ్య రక్షణలో నూతన పంథా:**





ఢిల్లీలోని అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజల ముంగిటికే ఆరోగ్య సేవలను తీసుకెళుతున్నది. ప్రతి కాలనీలో క్లినిక్ లను ప్రారంభించి, మందులను కూడ అందచేసేందుకు నూతన వెండింగ్ మెషీన్లను ఏర్పాటు చేస్తున్నది. ఈ మెషీన్ మొత్తం 50 రకాల మందులను టాబ్లెట్లను, సిరప్లను కూడ అందచేస్తుంది. USAID వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వెండింగ్ మెషీన్లు డాక్టరు ప్రిస్క్రిప్షన్ ఆధారంగా పనిచేస్తాయి. వీటి ఏర్పాటుకు ఒక్కోదానికీ కేవలం రూ. 20 లక్షలు మాత్రమే ఖర్చు అవుతుంది.

**కృత్రిమ అవయవాలు:**



మనకు అనేకరకాల కృత్రిమ అవయవాలగురించి తెలుసు. కానీ, ఇక్కడ మనం తెలుసుకోవాల్సింది ఏమంటే, ముంబైలోని యువప్రతిష్ఠాన్ అనే ఒక స్వచ్ఛంధ సంస్థ, "లింబ్ ఫర్ లైఫ్" అనే ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనిలో కోల్పోయిన శరీరభాగాలను ఎలక్ట్రానిక్ విడిభాగాలతో ఉచితంగా భర్తీ చేస్తుంది. పేదలకు అధిక ప్రాధాన్యమిచ్చే ఈ కార్యక్రమంలో కృత్రిమ శరీర భాగాలు సహజ శరీర భాగాలలానే పూర్తిగా పనిచేస్తాయి. అవసరమైనవారు 912221634152 ఫోను ద్వారా గానీ, ksofficemail@gmail.com ఈ-మైల్ ద్వారా గానీ సంప్రదించవచ్చు.

**స్వచ్ఛ భారత్:**




పారిశుధ్యం అంటే ఎన్నో విషయాలు ఇమిడి ఉంటాయి. అయితే మన దేశంలో వీటిలో ఏఒక్కటి సాధించినా విశేషమే! ముంబై పోలీసులు ఈ విషయంలో తీసుకున్న చొరవ ప్రశంసార్హం. ముంబైలో ఇక ఎవరైనా రోడ్డుమీద ఉమ్మితే పోలీసులు వెయ్యి రూపాయలు జరిమానా విధించవచ్చు. ఈ మేరకు ఆ రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని చేసింది. ఈ చట్టం ప్రకారం మొదటిసారి పట్టుబడినవారు వెయ్యి రూపాయల జరిమానాతోపాటు, ఒకరోజు స్థానిక ఆసుపత్రిలో స్వచ్ఛంధ సేవ చేయాలి. రెండవసారి పట్టుబడితే, మూడువేల జరిమానా, మూడురోజుల ఆసుపత్రి సేవ, మళ్ళీ పట్టుబడితే, ఐదు వేలరూపాయల జరిమానా, ఐదు రోజుల సేవ ఉంటుంది. విచక్షణా రహితంగా ఉమ్ములు వేయడంవలన మన దేశంలో సంవత్సరానికి 20 చొప్పున క్షయ వ్యాధి కేసులు ప్రబలుతున్నాయి.


**బాల్యవివాహం ఒక శాపం:**




మనదేశంలో బాల్యవివాహాలు ఇంకా ఎక్కువగానే ఉన్నాయి. పది సంవత్సరాల వయసుకూ రాకుండానే లక్షలాదిమందికి వివాహాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో ఈ జాఢ్యం ఎక్కువగా ఉన్నది. చట్టబద్ధమైన వివాహ వయసు 18, 21 అయినప్పటికీ, గత జనాభాలెక్కల ప్రకారం, దేశంలో వివాహమైఉన్న 64 కోట్లమందిలో 1.89శాతం మందికి పది సంవత్సరాలలోపే వివాహం జరిగింది. గుజరాత్ లో 4.67 లక్షలమంది మహిళలకు, 2.36 లక్షలమంది పురుషులకు పది సంవత్సరాల వయసులోపే వివాహంజరిగినట్లు తెలుస్తున్నది. రాజస్థాన్లో 3.57 కోట్లమందికి బాల్యవివాహాలు జరిగాయి. ఈ దురాచారాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం అభయం పథకం కింద 181 హెల్ప్ లైన్ను అందుబాటులోకి తెచ్చింది. రాజస్థాన్లో ఈ దురాచారంపై చైతన్యం ఎలా ఉందంటే, 47వేలమంది టెంట్ సప్లయర్స్ బాల్యవివాహాలకు తమ సేవల నందించమని ప్రతినబూనారు.

**భారతీయ అంతరిక్ష పరిశోధనల్లో మరో కలికితురాయి:**

స్క్రామ్జెట్ అనే అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇటీవల రాకెట్లాంచర్ను విజయవంతంగా పరీక్షించింది. దీనిప్రత్యేకత ఏమంటే, వాతావరణంలోని ఆక్సిజన్ను తీసుకుని ఇంధనాన్ని



మండించడం. దీనివల్ల భవిష్యత్తులో రాకెట్ ప్రయోగాల వ్యయం గణనీయంగా తగ్గుతుంది. వాతావరణంలోని ఆక్సిజన్ను తీసుకోవడంవల్ల, రాకెట్ బరువు సగానికి పైగా తగ్గి, మరింత వేగంగా ప్రయణించగలదు. ఇట్టి ఇంజన్లను తిరిగి ఉపయోగించుకోవచ్చు.

**నీటి కొలతలు:**



మనమందరం, వార్తలలో ఇన్ని క్యూసెక్కుల నీరు లేదా, టి.ఎం.సిల నీరు అని చదువుతుంటాము. కానీ, ఈ కొలతల వివరాలు కొద్దిమందికే తెలుసు. నిజానికి ఒక టి.ఎమ్.సి నీరు అంటే, వేయి మిలియన్ ఘనపు అడుగుల నీరు. అంటే, 28,316,846,592 లీటర్ల నీరు. అలాగే ఒక క్యూసెక్ నీరు అంటే, సెకనుకు ప్రవహించే ఒక ఘనపుటడుగు నీరు. అంటే సెకనుకు 28.317 లీటర్ల నీరు. చాలా మందికి ఈ అంకెలనుండి ఎంత నీరు వృధా అయిందో సరైన అవగాహన కల్గదు. కాని ఈ అంకెలను మనకు తెలిసిన లేదా మన ఊహకు అందే విషయాలతో పోల్చడం వల్ల , చాలా సులభంగా ఎంత నీరు వృధా అయిందో అవగాహన కల్గుతుంది. ఒక టిఎంసి జలం అంటే దాదాపు 15 రోజులపాటు హైదరాబాద్ నగరం (70 లక్షల జనాభా వున్న) ఉపయోగించే నీళ్ళ తో సమానం. నాగార్జున సాగర్ డ్యామ్ కెపాసిటి 400 టిఎమ్ సిలు అంటే దాదాపు 17 సంవత్సరాలు హైదరాబాద్ నగరానికి (70 లక్షల జనాభా వున్న) సరిపోయేంత నీరు అని అర్థం. ఒక లక్ష క్యూసెక్ జలం ఒక రోజంతా సముద్రం లోకి వదిలారంటే నాలుగున్నర నెలల పాటు హైదరాబాద్ నగరం (70 లక్షల జనాభా వున్న) ఉపయోగించే నీరు ఒక్క రోజులో సముద్రం పాలు అయిందని అనుకోవచ్చు. అంటే, మన అవగాహనలేమితో ఎంత నష్టపోతున్నామో కదా!

**స్వచ్ఛభారత్‌కు ఉడుతసాయం:**



స్వచ్ఛభారత్ కార్యక్రమప్రేరణతో మధ్యప్రదేశ్‌లో 9, 10 వ తరగతులు చదువుతున్న అక్కాతమ్ముళ్ళు గత రెండు సంవత్సరాలుగా తల్లితండ్రులు ఇచ్చిన పాకెట్ మనీని కూడబెట్టి, దీనికి తమకు స్కూలులో వచ్చిన ఉపకారవేతనాన్ని కూడకలిపి, నరసింగపూర్ గ్రామంలోని లక్ష్మీబాయి పాఠశాలలో బాలికలకు ఒకమరుగుదొడ్డిని కట్టించారు. ఆమీర్ ఖాన్, మైమూనా ఖాన్ అనే ఈ అక్కాతమ్ముళ్ళు 16వందల మంది చదువుతున్న ఈ పాఠశాలలో రెండే మరుగుదొడ్లు ఉండటంతో అక్కడి అమ్మాయిలు పడుతున్నవేదనకు స్పందించారు. ఈ స్పందన అందరిలోనూ ఉంటే, దేశంలో సమస్యలనేవే ఉండవుకదా!

**మరో మానవతాసాయం:**



సాధారణంగా ఇళ్ళలో పనిచేసేవారికి ముసలితనంలో కూడ ఎటువంటి రక్షణలూ ఉండవు. అయితే, మనసుండాలేగానీ, మనం, మన ఇళ్ళలో నమ్మకంగా పనిచేస్తున్న పనిమనుషులకు ఇప్పుడు మనం పెన్షన్ సదుపాయాన్ని కల్పించవచ్చు. INVEST INDIA MICRO PENSION SERVICES PRIVATE LIMITED (IIMPS) అనే ఒక స్వచ్ఛంధ సంస్థ మొదలెట్టిన ఒక పథకం ప్రకారం, పనిమనిషి నెలకు 50 రూపాయలు, యజమాని అంతే మొత్తం అందచేయడంతో ఈ పథకం ప్రారంభమవుతుంది. కేంద్ర ప్రభుత్వం అమలుచేసిన వృద్ధాప్య పింఛను పథకంతో స్ఫూర్తి పొందిన ఈ సంస్థ ఈ పథకాన్ని ప్రారంభించింది. అసంఘటిత రంగానికిచెందిన దినసరి కూలీలు 18–55 సంవత్సరాల మధ్య వయసుగల వారెవరైనా ఈ పథకంలో చేరవచ్చు. నూతన పెన్షన్ పథకం క్రింద 30,000/–ల వరకు బీమా సౌకర్యం, 60 సంవత్సరాల వయసు నుండి వర్తిస్తుంది. ఇతర వివరాలకు 080–23014545 హెల్ప్ లైన్‌ను సంప్రదించవచ్చు.

**చేనేత నాణ్యతా చిహ్నం:**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగస్టు 07వ తేదీన చేనేత దుస్తుల నాణ్యతా చిహ్నాన్ని




ఆవిష్కరించారు. వస్త్రంపై ఈ చిహ్నం ఉంటే, దానిని నేసిన ముడిసరుకు, నేతపనితనం, ఇతర అంశాలలో ఉన్నత నాణ్యతాప్రమాణాలను పాటించారని గుర్తు. అంతేకాదు, తయారీలో పర్యావరణ ప్రమాణాలను కూడా పాటించారని హామీ. సమగ్రమైన నిశిత పరిశీలన తరువాత మాత్రమే ఈ ప్రమాణాన్ని ఇస్తారు. ఐఎస్ఐ మార్క్ లాంటి ఈ గుర్తు లభిస్తే, అటు అమ్మకం/తయారీ దారులకు అధిక ఆదాయం, వినియోగదారులకు నాణ్యతా హామీ.

**సమీకృత చెల్లింపుల మాధ్యమం:**





సంపూర్ణ నగదురహిత లావాదేవీలు మనకు ఇక ఎంతో దూరంలో లేవు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ వారు ఒక సమీకృత చెల్లింపుల మాధ్యమానికి అనుమతినివ్వడంతో ప్రజలకు చరవాణి ద్వారా చెల్లింపులకు మార్గం మరింత సుగమమైంది. ఆక్సిస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫెడరల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఆంధ్ర బ్యాంక్, భారతీయ మహిళా బ్యాంక్, కెనరా బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, మరియు విజయ బ్యాంక్ వంటి బ్యాంకులకు చెందిన ఖాతాలనుండి చెల్లింపులను ఈ చరవాణి అప్లికేషన్ ద్వారా చేయవచ్చు. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన ఈ మాధ్యమం ఒకసారి ఒక వినియోగదారునితో మాత్రమే నేరుగా లావాదేవీలను చేస్తుంది కనుక, వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించాల్సిన అవసరం లేదు. దీనిద్వారా ఒక బ్యాంక్ నుండి మరే ఇతర బ్యాంక్ కు అయినా చెల్లింపులు చేయవచ్చు. ఈ మాధ్యమాన్ని గూగుల్ ప్లే స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు.

**ప్రయాణ వేగాన్ని పెంచే హైపర్ లూప్:**





కనుమూసి తెరిచేంతలో ఒక ప్రాంతాన్నుండిమరోప్రాంతానికి వెళ్లడమనేది మనం కేవలం కామిక్ పుస్తకాలలోనే చూస్తుంటాము. నిముషాలలో సుదూర నగరాలను అధిగమించే ఈ కల్పనను మనం నిజం చేసుకోవచ్చు. HYPERLOOP TECHNOLOGIES AND HYPERLOOP TRANSPORTATION TECHNOLOGIES (HTT) అనే ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రస్తుతం అమెరికాలో పరీక్షిస్తున్నారు. మనదేశంలో ముందుగా రైళ్లలో ప్రవేశపెట్టాలని యోచిస్తున్నారు. మొదటి పరీక్షను విజయవంతంగా అధిగమించిన ఈ సాంకేతికతలో లీనియర్ ఇండక్షన్ మోటార్ఎల్‌యూ, ఎయిర్ కంప్రెస్సోర్లను వాడుతారు.

**విదేశాలలో చదువుకునే విద్యార్థులకు మదద్:**




విదేశాలలో చదువుకుంటున్న విద్యార్థుల సంక్షేమానికి కేంద్రం 'మదద్' పేరుతో ఒక పథకాన్ని ప్రారంభించింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఈ కార్యక్రమంలో విద్యార్థులు ముందుగా తమ ఉద్యోగ వివరాలను నమోదు చేసుకోవాలి. విద్యా విషయాలే కాక, వివాహ, ఉద్యోగ సంబంధ సమస్యలకు కూడా ఈ విభాగంలో సంప్రదించవచ్చు. ఇతర వివరాలను WWW.MADAD.GOV.IN వెబ్‌సైట్‌లో పొందవచ్చు.


**శిశు ధనుర్వాతానికి టాటా:**




మనదేశం శిశుధనుర్వాతానికీ, ఒక రకమైన బాక్టీరియా ద్వారా సంక్రమించే YAWS అనే వ్యాధికి శాశ్వతంగా టాటా చెప్పింది. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ మనదేశానికి ధృవీకరణ పత్రాన్ని కూడా ఇచ్చింది. ప్రపంచ ఆరోగ్యసంస్థ దక్షిణాసియా ప్రాంతీయ సంచాలకులు డా. పూనం ఖేత్రపాల్ కేంద్ర ఆరోగ్యమంత్రి డా. జయప్రకాష్ నడ్డ, ప్రధాని నరేంద్రమోదీలను అభినందిస్తూ ఈ మేరకు ఒక లేఖ రాశారు.

■

# జనపనార పరిశ్రమాభివృద్ధి అవకాశాలు



**తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో సుమారు 40లక్షల మంది రైతులు జనుము పండిస్తుండగా, మరో మూడున్నర లక్షల మంది కార్మికులు జనపనార పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారు. అపారమైన ఉత్పత్తి, ఉపాధి అవకాశాలను కల్పించే జనపనార ఉత్పత్తులను కేవలం చట్టం కల్పించిన భద్రతకే పరిమితం చేయకుండా మరింత విస్తృత అవకాశాలను వినియోగించుకునేందుకు వీలుగా విస్తరించాల్సి ఉంది.**

జ్యూట్ ప్యాకేజింగ్ మెటీరియల్స్‌యాక్ట్ 1987 కింద జనపనార పరిశ్రమకు చట్టబద్ధమైన భద్రత లభిస్తున్నది. అయితే చట్టం కల్పిస్తున్న భద్రత వల్ల పరిశ్రమలో పోటీతత్వం పెరగక పోవడంతో అభివృద్ధి మందగిస్తున్న దన్న విమర్శలు తలెత్తుతుండడంతో దీనిపై సమీక్ష అవసరమవుతున్నది.

భారత దేశంలో వస్త్రోత్పత్తిలో ప్రత్తి తర్వాత స్థానం జనపనారదే. సామాజిక, ఆర్థిక, పర్యావరణ సమస్యలు అనేకం దీనితో ముడిపడిఉన్నాయి. పర్యావణ కాలుష్య కారకమైన ప్లాస్టిక్ వినియోగానికి ప్రత్యామ్నాయంగా వాతావరణంలో సులువుగా కలిసిపోయే లక్షణం కలిగినందువల్ల జానపనారకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. అధిక వర్షపాతం కలిగిన చిత్తడి నేలల్లో రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడంలో జనపనార ఎంతగానో తోడ్పడుతోంది. తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో సుమారు 40లక్షల మంది రైతులు జనుము పండిస్తుండగా, మరో మూడున్నర లక్షల మంది కార్మికులు జనపనార పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతుండడం వల్ల ఈ రాష్ట్రాల ఆర్థిక, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ప్రోత్సాహం లభిస్తోంది.

పత్తికంటే బలీయమైనది కావడం వల్ల వస్త్రాల తయారీలో కాకున్నా రెండు శతాబ్దాలుగా గోనెసంచులు, పురికొసలు, తాళ్ల వంటి ప్యాకేజింగ్ మెటీరియల్ తయారీలో జనపనార కీలకపాత్ర వహిస్తోంది. సిమెంట్, ఎరువులు, ఆహార ధాన్యాలను నిలువ జేసేందుకు ప్యాకింగ్ చేసేందుకు ఖరీదైన జనపనార స్థానంలో ప్లాస్టిక్ సంచులు వచ్చాయి. కానీ సింథెటిక్ ఉత్పత్తుల వల్ల వాతావరణ కాలుష్య సమస్యలు ఏర్పడు తుండడంతో ప్రత్యామ్నాయంగా జనపనార తన పట్టు బిగించే అవకాశాలున్నాయి.

**చట్టం ఒక వరమా? లేక శాపమా?**

పర్యావరణానికి హానిచేసే ప్లాస్టిక్ స్థానంలో జనపనార ఉత్పత్తులను ప్యాకేజింగ్ మెటీరియల్స్ తయారీలో వినియోగించడం శ్రేయస్కరమని ప్రభుత్వం భావించింది. ఇందుకోసం 1987 మే 11వ తేదీన "జ్యూట్ ప్యాకేజింగ్ మెటీరియల్స్" చట్టాన్ని అమలులోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం పంచదార, ఆహార ధాన్యాల వంటి వాటిని విధిగా గోనెసంచులలోనే ప్యాక్ చేయాల్సిఉంటుంది. గత మూడు దశాబ్దాలుగా ఈ చట్టం వల్ల జనపనార పరిశ్రమకు ఎంతో ప్రయోజనం కలిగింది.

---

**సుబ్రత గుప్తా,** కమీషనర్, జనపనార విభాగం, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ.
E-mail: subratagupta@gmail.com

అయితే ఇటీవల వరకు ఇలాంటి చట్టం ఏదీ లేకుండానే బంగ్లాదేశ్‌లోని జనపనార పరిశ్రమ భారత దేశంలోని పరిశ్రమ కంటే గణనీయమైన అభివృద్ధి సాధించడం గమనార్హం. బంగ్లాదేశ్ 2010లో తయారుచేసిన "జ్యూట్ ప్యాకేజింగ్ మెటీరియల్ ఆక్ట్"ను 2012లో అమలు చేయాలని ప్రయత్నించి విఫలం కాగా చివరకు 2014లో అమలు చేయడం ప్రారంభించింది. అయితే భారతే దేశంలోలాగా బంగ్లాదేశ్ ప్రభుత్వం జ్యూట్ మిల్లుల నుంచి గోనెసంచులను నేరుగా కొనుగోలుచేయదు. వినియోగదారులు జనపనార వస్తువులను వినియోగించాలని మాత్రమే బంగ్లాదేశ్ చట్టం ఆదేశిస్తుంది. దీంతో బంగ్లాదేశ్ లోని జనపనార మిల్లుల వారు సొంత మార్కెట్ ఏర్పాటు చేసుకుని పోటీకి సిద్ధం కావలసివచ్చింది. ఇలా బహిరంగ మార్కెట్లో పోటీతత్వాన్ని అలవరచుకున్న జనపనార మిల్లులవారు ఉత్పత్తులలో వైవిధ్యం సాధించి మార్కెట్ పోటీని ఎదుర్కొంటూ అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలిచారు.

ప్రస్తుతం భారతదేశంలో అమలులో ఉన్న చట్టం ప్రకారం పంచదార, ఆహార ధాన్యాలు తప్పనిసరిగా గోనె సంచుల్లోనే నిల్వ చేయాల్సివుంది. ఆహారధాన్యాలను ప్యాక్ చేసేందుకు అవసరమైన గోనెసంచులను, ఇతర ప్యాకేజింగ్ సామాగ్రిని జనపనార మిల్లులనుంచి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తుంది. ఇలా 2006-07 నుంచి 2015-16 వరకు జేపీఎమ్ చట్టం కింద ఆహారధాన్యాల ప్యాకేజింగ్ కోసం అవసరమైన సామాగ్రిని జనపనార మిల్లుల నుంచే నేరుగా కొనుగోలు చేయడం ద్వారా ప్రభుత్వం ఎంతటి సహకారాన్ని అందజేసిందో ఈ కింది పట్టికలో వివరాలు చూస్తే అర్థమవుతుంది.

**గమనిక :**

బి-ట్విల్ అంటే మిల్లుల నుంచి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసిన గోనెసంచులు, ప్యాకింగ్ సామాగ్రి అని అర్థం వాస్తవానికి పంచదార, ఆహారధాన్యాల ప్యాకేజింగ్ నూటికి నూరుశాతం గోనెసంచుల్లో చేయాలన్న నిబంధనల ఫలితంగా గత దశాబ్ద కాలంలో గోనెసంచుల వినియోగం గణనీయంగా పెరిగింది. గోనెసంచుల కొనుగోళ్లు 2006-07సంవత్సరం నుంచి 2015-16 సంవత్సరానికి 8.3 లక్షల టన్నులకు పెరిగింది. కానీ ఇదే సమయంలో ముడి జనపనార18లక్షల టన్నుల నుంచి 14.4లక్షల టన్నులకు పడిపోయింది. ముడి జనపనార ఉత్పత్తుల వినియోగంలో ప్రభుత్వ కొనుగోళ్లు 22.3 శాతం నుంచి 57.6శాతానికి పెరిగాయి. గోనె సంచుల ఉత్పత్తులలో ప్రభుత్వ కొనుగోళ్లు 29.5 నుంచి 68.1శాతం మేరకు పెరిగాయి.

**పట్టిక :**

| సంవత్సరం | ముడి జనపనార మొత్తం ఉత్పత్తి (వేల మెట్రిక్ టన్నులు) | మొత్తం జనపనార వస్తువుల ఉత్పత్తులు (వేల మెట్రిక్ టన్నులు) | ప్రభుత్వం ఖాతాలో కొనుగోలు చేసిన బి-ట్విల్ (వేల మెట్రిక్ టన్నులు) | జనపనార వస్తువుల మొత్తం ఉత్పత్తిలో బి-ట్విల్ శాతం | ముడి జనపనార ఉత్పత్తులలో బి-ట్విల్ శాతం |
|---|---|---|---|---|---|
| 2006-07 | 1800 | 1356.3 | 400.7 | 29.50% | 22.30% |
| 2007-08 | 1782 | 1776 | 557.9 | 31.40% | 31.30% |
| 2008-09 | 1476 | 1633.7 | 572.2 | 35.00% | 38.80% |
| 2009-10 | 1620 | 1323.3 | 530.7 | 40.10% | 32.80% |
| 2010-11 | 1800 | 1565.7 | 688.6 | 44.00% | 38.30% |
| 2011.12 | 1845 | 11582.4 | 864.2 | 54.60% | 46.80% |
| 2012-13 | 1674 | 1591.5 | 884.1 | 55.60% | 52.80% |
| 2013-14 | 1782 | 1527.7 | 778.1 | 50.90% | 43.70% |
| 2014-15 | 1296 | 1267.1 | 727.5 | 57.40% | 56.10% |
| 2015-16 | 1440 | 1217.2 | 829 | 68.10% | 57.60% |

చట్టం ద్వారా భద్రత లభించిన సమయంలో భారత జనపనార పరిశ్రమ వైవిధ్యభరితమైన ఉత్పత్తులతో కొత్త మార్కెట్ల లోకి చొచ్చుకునిపోయి గణనీయమైన ప్రగతి సాధిచగలదని అందరూ భావించారు. ఐతే దానికి భిన్నమైన పరిస్థితి ఏర్పడింది. జనపనార మిల్లులు తమ ఉనికికి పూర్తిగా ప్రభుత్వం పైనే ఆధారపడడం వల్ల విదేశాల్లోనే కాదు స్వదేశీ మార్కెట్లో కూడా ఏమీ అమ్ముకోలేని దుస్థితికి చేరుకున్నాయి. దీనికి భిన్నంగా బంగ్లాదేశ్ ఉత్పత్తులు భారతీయ మార్కెట్లోకి ప్రవేశించాయి. ఇలా బంగ్లాదేశ్ ఉత్పత్తులు చౌకగా విక్రయించగలగడంతో మన జనపనార మిల్లులు కుదేలైపోయి నామమాత్రంగా నడుస్తున్నాయి.

బంగ్లాదేశ్ జనపనార పరిశ్రమ ప్రపంచ పోటీకి తట్టుకుని గట్టిగా నిలవడమేగాక నూతన ఉత్పత్తులతో కొత్త మార్కెట్లను కూడా పట్టుకోగలిగాయి. 2008-2009 నుంచి భారత్, బంగ్లాదేశ్‌ల నుంచి జనపనార ఉత్పత్తులు, ఎగుమతులను బేరీజు వేసుకుంటే వాస్తవాలు కళ్లకు కట్టినట్టు కనిపిస్తాయి. చట్టపరమైన భద్రత లభిస్తున్నప్పటికీ భారతదేశంలోని జనపనార పరిశ్రమ తిరోగమన పథంలో పయనిస్తూ ఉండగా, ఎలాంటి రక్షణ లేని బంగ్లాదేశ్ జనపనార

పరిశ్రమ పురోగమిస్తోందని ఉత్పత్తి, ఎగుమతి గణాంకాలు (భారతీయ ద్రవ్యమారక విలువల) ప్రకారం స్పష్టమవుతోంది. బంగ్లాదేశ్ నుంచి జనపనార ఉత్పత్తుల ఎగుమతుల విలువ సాలీనా సుమారు 88,787 మిలియన్ రూపాయలు కాగా భారతదేశం నుంచి 17,308 మిలియన్ రూపాయల మేరకు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి.

విధంగా బంగ్లాదేశ్ నుంచి దిగుమతయ్యే జనుము ఉత్పత్తులు చౌకగా లభించడంవల్ల భారత ఉత్పత్తులు క్రమంగా పోటీకి దూరంగా జరిగిపోతున్నాయి. పశువుల దాణా, కోళ్ళమేత ప్యాకింగ్ ఇప్పుడు పూర్తిగా బంగ్లాదేశ్ ఉత్పత్తులతోనే జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ లోని రెండు మిల్లులు ఈ పోటీని తట్టుకోలేక మూతపడడం గమనార్హం.

**భారత్, బంగ్లాదేశ్‌లలో జనపనార వస్తువుల ఉత్పత్తి, ఎగుమతుల వివరాలు**

| ముడి జనుము ఉత్పత్తి (బేళ్ల సంఖ్య వేలలో) | | | మొత్తం ఎగుమతుల విలువ (భారతీయ రూపాయలు మిల్లియన్లలో) | |
|---|---|---|---|---|
| సంవత్సరం | భారత్ | బంగ్లాదేశ్ | భారత్ | బంగ్లాదేశ్ |
| 2008-09 | 8200 | 5172 | 12161.6 | 56045.8 |
| 2009-10 | 9000 | 5945 | 8594.6 | (NA) |
| 2010-11 | 10000 | 7803 | 18541.5 | 90946 |
| 2011-12 | 10250 | 7405 | 20949.6 | 81941.4 |
| 2012-13 | 9300 | 7572 | 19918 | 96578.7 |
| 2013-14 | 9000 | 8000 | 21219.5 | 89172.7 |
| 2014-15 | 7200 | NA | 18138.1 | 97295.9 |
| 2015-16 | 6500 | NA | 18893.9 | 109565.5 |

అలాగే బంగ్లాదేశ్ నుంచి ఎగుమతయ్యే జనపనార ఉత్పత్తులు చౌకగా ఉండడంవల్ల విదేశీ మార్కెట్లలోకి గణనీయంగా చొచ్చుకు పోగలుగుతున్నాయి. భారత, బంగ్లాదేశ్ ఉత్పత్తుల ఖరీదు మధ్య 15 నుంచి 20 శాతం వరకు తేడా ఉంటోందని వెల్లడైంది. బంగ్లాదేశ్ మిల్లులలో కార్మికుల జీతభత్యాలు మనదేశంలో కంటే సుమారు 30శాతంమేరకు తక్కువగా ఉండగా, విద్యుత్ ఛార్జీలు కూడా మనకంటే సుమారు35శాతం వరకు తక్కువని చెప్పవచ్చు. అలాగే బంగ్లాదేశ్ జ్యూట్ ఉత్పత్తులపై ఎగుమతి సుంకాల్లో సుమారు10 శాతం (నూలుపై 7.5 శాతం) సబ్సిడీ లభిస్తోంది. దీనికితోడు మనదేశంలో జనుము ఉత్పత్తులపై ఎలాంటి దిగుమతి సుంకం లేకపోవడంతో బంగ్లాదేశ్ నుంచి కూడా జనపనార వస్తువులు సులువుగా దిగుమతి అవుతున్నాయి. ఈ

**జనపనార, వస్త్రాల అభివృద్ధి:**

భారత దేశంలో జనపనార పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్య జనుము నాణ్యతా ప్రమాణాలకు సంబంధించినదే. దేశంలో ఉత్పత్తయ్యే జనుములో మూడింట రెండు వంతులు టీడీ-5 నుంచి టీడీ-8 ప్రమాణాలతో కనీస నాణ్యత కూడా లేని నాసిరకమని వెల్లడవుతోంది. ఇలాంటి జనుముతో తయారయ్యే నార గోనెసంచులు వంటి ముతక వస్తువుల తయారీకి మాత్రమే పనికివస్తోంది తప్ప ఇతర నాణ్యమైన దుస్తులు లేదా వస్తువులు తయారీకి వినియోగపడటం లేదు. అయితే జేపీఎం చట్టం కల్పించిన భద్రత ఫలితంగా మిల్లులు ఈ నాసిరకం నారనే కొనుగోలుచేసి గోనెసంచుల తయారీకి వినియో గిస్తుండడం వల్ల రైతులు కూడా డిమాండ్ తగినట్టు ఈ జనుమునే

పండిస్తున్నామని భావిస్తున్నారు. దీనికి కారణం నాణ్యమై జనుము పండించడంవల్ల అదనపు ప్రయోజనం ఏదీ లేకపోవడంతో వారు కూడా నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టడం లేదనుకో వచ్చు. నాణ్యమైన జనుము పండిస్తే దానికి తగిన డిమాండ్, ఫలితం ఉంటుందన్న భరోసా పెరుగుతుంది. అలాగే ప్రోత్సహించే వారు వుంటే రైతులు కూడా నాణ్యమైన ఉత్పత్తుల కోసం ప్రయత్నిస్తారు.

జనపనార సాగులో మరో ప్రధానమైన అంశం ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన జనపనారను పరిశ్రమకు అందజేయడమే. పరిశ్రమకు తగిన నాణ్యమైన నార అందితే నాణ్యమైన ఉత్పత్తులు వెలుగులోకివస్తాయి. ఇందుకోసం జనుము పండించే రైతులలో అవగాహన పెంపొందించడం ఎంతో అవసరం. రైతులు అధీకృత విత్తనాలే వాడడం, సరైన చాళ్లలో విత్తడం, సకాలంలో కలుపు తీయడం వంటి నూతన వ్యవసాయ ప్రక్రియలను అవలంభించాలి. ప్రస్తుతం నారువేసి గుబురుగాపెంచే ప్రక్రియవల్ల మొక్కలు క్రమపద్ధతిలో ఆరోగ్యకరంగా పెరగడం సాధ్యం కాదు. సకాలంలో ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడడం కూడా అవసరమే.

మొత్తం జనపనార ఉత్పత్తిలో అత్యంత కీలకమైన అంశం - కోతల తర్వాత నార తీసేందుకు మొక్కలను నీళ్లలో నానబెట్టడం. ప్రస్తుతం దేశంలో పరిమిత నీటివనరులను పొదుపుగా వాడవలసి ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన నీరులభించక పోవడంతో జనుము మొక్కలను నానవేసేందుకు రైతులు చాల ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కన గుంటల్లో, మురుగు నీటి కాలవల్లోను అనారోగ్యకరమైన పద్ధతుల్లో నిర్ణీత సమయంకంటే తక్కువగా మొక్కలను నానవేయడం వల్ల ఉన్నత ప్రమాణాలతో తయారయ్యే వస్తువులకు

అవసమైన నాణ్యమైన నార తీయడం సాధ్యం కావడంలేదు.

జ్యూట్–ఐ–కేర్ (జ్యూట్ ఇంప్రూవ్డ్ కల్టివేషన్ అండ్ అడ్వాన్స్డ్ రెట్టింగ్ ఎక్సర్ సైజ్) పథకాన్ని 2015లో ప్రారంభించారు. సబ్సిడీ ధరలకే నాణ్యమైన విత్తనాల సరఫరా చేసేందుకు, సకాలంలో కలుపు తీసేందుకు అవసరమైన పరికరాలను అందజేసి కోతల తర్వాత పరిమిత నీటివనరులలో జనుము మొక్కలను నానవేసే ప్రక్రియలపై కూడా శిక్షణ ఇస్తున్నారు.

జనుము మొక్కలను నాన వేసే మూడు శాస్త్రీయ పద్ధతులు ఇప్పుడు మెరుగైన ఫలితాలిస్తున్నాయి. సింథటిక్ ట్యాంకులలో వివిధ రసాయనాల మిశ్రమాలను కలిపిన నీటిలో మొక్క పైపొరలు తొలగించి క్రమపద్ధతిలో నానవేయడం ఒక ప్రక్రియ. పారిశ్రామిక రసాయనాలను తయారు చేయడంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన సంస్థ ''నోవోజైమ్స్'' సహకారంతో ఐజెఐఆర్ఏ మరియు జేసిఐ సంస్థలు నూతన ప్రక్రియలను ప్రోత్సహిస్తున్నాయి. పరిమిత నీటి వనరులలో సాధారణంగా18 నుంచి 22 రోజులు నానవేయవలసిన మొక్కలను రసాయనాలు కలిపి వారం రోజుల్లోనే కుళ్లబెట్టడంవల్ల నాణ్యమైన నార తీయవచ్చు.

జ్యూట్–ఐ–కేర్ సంస్థ ప్రయోగాత్మకంగా చేపట్టిన రెండో సాంకేతిక పద్ధతిలో గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే పరిమిత నీటివనరుల్లో మొక్కలను త్వరగా కుళ్లబెట్టే బాక్టీరియాల సముదాయాన్ని చేర్చి 10 నుంచి 12 రోజుల్లో నాణ్యమైన నారుతీయగల పద్ధతిని వినియోగిస్తున్నారు. మొక్కలను త్వరగా కుళ్లబెట్టేందుకు సహకరించే సూక్ష్మ జీవులను పెంచడం మరో ప్రక్రియ. రైతులు ప్రస్తుతం వినియోగిస్తున్న నీటివనరులలో ఈ రెండు పద్ధతుల్లో ఒకదాన్ని ఎంచుకొని ఆచరించవచ్చు. ఈ సాంకేతిక పద్ధతులను వినియోగించడం వల్ల మొక్కలను నానవేసి ఉంచే సమయం తగ్గడమే గాక నార కూడా కనీసం ఒకటి నుంచి ఒకటిన్నర గ్రేడ్ల వరకు పెరిగే అవకాశం ఉంది. మెరుగైన వ్యవసాయ పద్ధతులను, మొక్కలను నానవేసే ప్రక్రియలను అవలంభించడంవల్ల నార దిగుబడి 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉండగా రైతుల ఆదాయం కూడా సుమారు 25 శాతం వరకు పెరుగుతుందని ఆశిస్తున్నారు.

నార నాణ్యత పెరగడంవల్ల దానికి తగినట్టుగా పరిశ్రమలలో యంత్రాలను కూడా ఆధునీకరించవలసి ఉంది. నాణ్యమైన నార నుంచి మరింత మంచి నార తీసి ఉన్నత ప్రమాణాలు కలిగిన వస్తువులను తయారు చేయవచ్చు. అయితే మన జ్యూట్ మిల్లుల్లో యంత్రాలు చాలావరకు బ్రిటిష్ హయాంలోని సాంకేతిక పరిజ్ఞానంతో తయారైనవే. మనం అక్కడక్కడా చూసే ఆధునిక యంత్రాలు సైతం 1980 లలో వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో నడుస్తున్నవే కావడం విశేషం.

ప్రత్తి, సింథటిక్ వినియోగానికి సంబంధిచిన సాంకేతిక ప్రగతివల్ల ఆధునిక వస్త్ర పరిశ్రమ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేసింది. అయితే భారతదేశంలో జనపనార పరిశ్రమకు సంబంధించి అలాంటి అభివృద్ధి ఇంకా కనిపించడం లేదు. ప్రస్తుతం వస్త్రపరిశ్రమలో నూతన ప్రక్రియలను జనపనార పరిశ్రమతో సమ్మిళితంచేసే ప్రయోగాలు అనేకం జరుగుతున్నాయి. వీటి ఫలితాలు అందుబాటులోకివస్తే ఇతర వస్త్రాల స్థాయిలోనే జనపనార వస్త్రోత్పత్తులు కూడా మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది. నారనుంచి నాణ్యమైన నూలుతీసేందుకు తగిన ఆధునిక యంత్రాలను కూడా ఆవిష్కరించవలసి ఉంది. ఈ ఉత్పత్తుల క్రమం మెరుగుపడడం వల్ల రైతులు, కార్మికులతో సహా పరిశ్రమ ప్రగతి రూపురేఖలు మారిపోతాయి.

**అంతులేని ఉత్పత్తులు – అవకాశాలు :**

పూర్వ పద్ధతుల్లో తయారవుతున్న జనపనార ఉత్పత్తులను ఆధునిక పోకడలకు అనువుగా అభివృద్ధి చేస్తున్నారు. చేతిసంచులు, చెప్పులు, పూలసజ్జలు, ఆభరణాలు, అలంకరణ వస్తువులు, నగలు, ఫర్నిచర్ వగైరాల తయారీలో ఇప్పుడు జనపనార విరివిగా వినియోగిస్తున్నారు. పాశ్చాత్య, మధ్యప్రాచ్యదేశాల్లో అత్యాధునిక గృహోపయోగ వస్తువుల తయారీలో జనపనారకే అధిక ప్రాధాన్యత లభిస్తోంది. అంతర్జాతీయంగా పేరొందిన హర్రోడ్స్, సాల్వాటోర్, ఫెర్రాగామో, మార్క్స్ & స్పెన్సర్స్ , ఐకేఈఏ వంటి సంస్థలు జానపనారతో తయారు చేసిన దుస్తులు, తదితర వస్తువులను పెద్దఎత్తున విక్రయిస్తున్నాయి. వాల్మార్ట్, కేరిఫోర్ తదితర ప్రపంచఖ్యాతి పొందిన సంస్థలతోబాటు బ్రిటిష్ హైపర్ మార్కెట్లుగా పోరాడిన టెస్కో, ఏఎస్ డీఏ, వైట్రోస్,సైన్స్బురీ వంటి సంస్థలు జానపనారతో తయారు చేసిన షాపింగ్ బ్యాగ్స్ విక్రయిస్తున్నారు. జనుము చేనేత అల్లికలతో తయారైన టీవీ కవర్లు, పెన్ స్టాండ్స్ వంటి ఆఫీస్ స్టేషనరీ ట్రే, ఫైల్ కవర్స్, క్యాలెండర్లు వంటివి క్రమంగా ప్లాస్టిక్ స్థానాన్ని భర్తీ చేస్తున్నాయి. గ్లోస్టర్ లైఫ్ స్టైల్, అంజెస్, క్లబ్, ఆర్బోర్, బలీఫాబ్స్ వంటి భారతీయ బ్రాండ్లు కూడా ఇప్పుడు మార్కెట్లోకి ప్రవేశించగలుగుతున్నాయి. ఎయిర్ కండీషనింగ్, వాహనాలలో లోపలి భాగాలు, ఫర్నిచర్ వంటి వాటి తయారీకి ఇప్పటికే వాడుతున్నారు. పర్యావరణంలో సులువుగా కలిసిపోయి కాలుష్యాన్ని నివారించేందుకు తోడ్పడే జ్యూట్ జియో టెక్స్టైల్స్ ఇప్పుడు పలు వస్తువుల తయారీలో ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయి. కాల్వగట్లను పటిష్టం చేసేందుకు, రైల్వేట్రాక్, రోడ్లు, గృహసంబంధమైన సివిల్ ఇంజనీరింగ్ నిర్మాణాలకు పర్యావరణ హితమైన జనపనారను వినియోగించవచ్చునని ఆధునిక ప్రయోగాలు నిరూపించాయి. జనపనార ప్రాధాన్యతను గుర్తించి వస్త్రపరిశ్రమల

మంత్రిత్వ శాఖ వివిధ నిర్మాణాలకు జనపనార వినియోగాన్ని విస్తృతపరిచే ప్రణాళికలను అమలు చేయాలని సూచిస్తున్నది.

**చట్టానికంటే మరింత దూరదృష్టి అవసరం :**

అపారమైన ఉత్పత్తి, ఉపాధి అవకాశాలను కల్పించే జనపనార ఉత్పత్తులను కేవలం చట్టం కల్పించిన భద్రతకే పరిమితం చేయకుండా మరింత విస్తృత అవకాశాలను వినియోగించుకునేందుకు వీలుగా విస్తరించాల్సి ఉంది. బంగ్లాదేశ్ లో చట్టం నేరుగా పరిశ్రమ కార్యకలాపాల్లో జోక్యం చేసుకోకుండా పరోక్షంగా ప్రోత్సహించడం వల్ల అక్కడ పరిశ్రమ పోటీతత్వం పెంచుకుని జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో దూసుకు పోతున్నది. అయితే భారత దేశంలో జేపీఎం చట్టం ప్రకారం జనుము ఉత్పత్తులలో కీలకమైన గోనెసంచులు, పురికొనలు, తాళ్లు వంటి ప్యాకింగ్ మెటీరియల్‌ను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయడం వల్ల పరిశ్రమ ఆ పరిధిని దాటి పురోగతి సాధించలేకపోతున్నది. ఈ పరిస్థితిని అధిగ మించాలంటే బంగ్లాదేశ్ చట్టం తరహాలో జనపనార పరిశ్రమకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇచ్చి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పోటీకి సిద్ధమయ్యేందుకు వీలుగా చర్యలు చేపట్టాలి. ఒక్కొక్క జ్యూట్ మిల్లు ప్రత్యేకంగా అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించు కోవాలి. వైవిధ్యభరితమైన ఉత్పత్తులను ఆవిష్కరించి మార్కెటింగ్‌లో ముందుకు పోవాల్సి ఉంది. కష్టకాలంలో పరిశ్రమను ఆదుకోవడానికి, కనీస విక్రయాలకు సంబంధించిన భరోసా కల్పించడానికి జేపీఎం చట్టం తప్పనిసరిగా అమలులో ఉండాల్సిందే. అయితే, క్రమంగా ప్రభుత్వం కల్పించే రిజర్వేషన్ తగ్గిస్తూ మన జనపనార మిల్లులు మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు చట్టం తోడ్పడాల్సి ఉంటుంది అలా జేపీఎం చట్టం కింద ఒక వైపు పరిశ్రమకు భద్రత కల్పిస్తూనే మరోవైపు ఆధునీకరణవైపు పురోగమించేలా ప్రోత్సాహం కలిగించాలి. ఈ సందర్భంగా వివిధ దేశాల్లో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఆయా ప్రభుత్వాలు అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించి ఆచరణాత్మకమైన ప్రణాళికను రూపొందించు కోవాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ రకాల ఉత్పత్తులతో ప్రపంచ మార్కెట్లో భారతీయ జనపనార పరిశ్రమను అగ్రస్థానంలో నిలబెట్టి అధిక ఆదాయం పొందేందుకు కృషి చేయాల్సి ఉంది. ఈ క్రమంలో దూరదృష్టితో ఆలోచించగలిగే రైతులు, కార్మికులు, మిల్లుల యజమానులు, పారిశ్రామిక వేత్తలు కూడా ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలను వినియోగించుకుని గరిష్ట నాణ్యతా ప్రమాణాలతో కూడిన వైవిధ్య భరితమైన వస్తువులు ఉత్పత్తి చేసేందుకు వీలుగా పరిశ్రమను ఆధునీకరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని జనపనార చట్టం కల్పిస్తున్న భద్రతకంటే మరింత ముందుకు సాగిపోగల దూరదృష్టితో ఆలోచనలు కొనసాగించాలి. ■

## ఉత్తరాభిప్రాయం



**R A PADMANABHA RAO** @raprao47 Feb 25

@Veekay60 Febraury yojana is resourceful 0 retweets 0 likes

ధన్యవాదాలండి. మీలాంటి పెద్దల మార్గదర్శనం యోజనకు శ్రీరామరక్ష.



Shafi Mohammad sir yojana should print national emblem on its masthead like employment news, new look in pages and more reference from authorities should be published, local writers articles only replica from original sources, it needs more original articles

Unlike • Reply • 1 • 7 hrs

మీ అభిమానానికి కృతజ్ఞతలు, మీ సూచనను మా ప్రధానకార్యాలయానికి పంపుతాను.



**Ravi Kumar Adusumalli @ARKUTF**

@TeluguYojana Yes it is very good magazine sir/madam..my sincere request is to give essays on current issues Thank you

9:55 AM - 21 Sep 2016

ధన్యవాదాలు రవి గారు. మీ సూచనను మేము పాటిస్తూనే ఉన్నాము. యోజనలో ఒక్కొక్క నెల ఒక్కొక్క అంశం మీద కూలంకషంగా వివరించే ప్రయత్నం జరుగుతున్నది.

ఉపాధికల్పన

# పట్టు వస్త్ర పరిశ్రమ : సవాళ్ళు – ముందడుగు

SILK MARK INDIA
Your Assurance of Pure Silk

**పట్టు ఉత్పత్తులకు నిరంతరం పెరిగే అంతర్జాతీయ, దేశీయ మార్కెట్, దీనితోపాటు విస్తృత ఉపాధి అవకాశాలు, గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాలలో ఆదాయ కల్పన, తక్కువ ఆదాయం, సామాజికంగా వెనుకబడిన వర్గాల అధిక భాగస్వామ్యం, భారీ ఎత్తున మహిళా భాగస్వామ్యం, ఎగుమతి ఆదాయవృద్ధికి అపార అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇవి పట్టు పరిశ్రమను ఆకర్షణీయ స్థానంలో నిలబెట్టి మంచి పెట్టుబడులు, దూరదృష్టి గల అభివృద్ధి ప్రణాళికలతో తదుపరి విస్తరణ దిశగా నడిపిస్తున్నాయి.**

వస్త్రాలలో రాణి వంటిది పట్టు. కాల పరీక్షకు నిలవడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా నూలు వస్త్రాల తరువాత అందరూ కోరుకునేదిగా పట్టు తనదైన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ వస్తోంది. పట్టుకు గల కాంతి, మృదువు, తేలిక, వెచ్చదనం వంటి ధర్మాలే దాని ప్రాముఖ్యతను పదిలంగా ఉంచుతున్నాయి. అంతేగాక రంగుల పరంగా ప్రజా జీవితాలతో పట్టు వస్త్రాల అనుబంధం పెనవేసుకుపోయింది. మన్నిక పరంగాను, కళా సౌందర్య విలువల పరంగా కూడా వాటి ప్రత్యేకత వాటిదే. సింథటిక్, నాన్ సింథటిక్ వస్త్రాల పోటీని సైతం ఎదుర్కొని తన విలక్షణ స్థానాన్ని కాపాడుకుంటోంది పట్టు. వాణిజ్య పరంగా సహజ పట్టుకు సంబంధించి ఐదు రకాలు – మల్బరీ, ట్రాపికల్, టసార్, ఓక్ టసార్, ఎరి, మూగా – ఎక్కువ ప్రజాదరణ కలిగి వున్నాయి. వీటిలో మల్బరీ పట్టును బాంబిక్స్ మోరి పురుగులు మల్బరీ చెట్ల నుంచి ఉత్పత్తి చేస్తాయి. మల్బరీ కాకుండా ఇతర పురుగులు ఉత్పత్తి చేసే పట్టుకు ఇప్పుడు 'వన్య సిల్క్' పేరుతో కొత్త గుర్తింపును ఇచ్చారు.

**వాణిజ్యపరమైన ఐదు రకాల సహజ పట్టు**

పట్టు పరిశ్రమ అంటే పట్టుదారాన్ని పొందడానికి పెద్ద ఎత్తున పట్టు పురుగులను పెంచడం. జౌళి రంగంలో అత్యధికులకు పని కల్పించే విభాగాలలో పట్టు పరిశ్రమ ఒకటి. పొలం, పొలం రహిత కార్యకలాపాలు పట్టు పరిశ్రమలో భాగం.

* పట్టు పురుగుల ఆహార వృక్షాల సాగు.
* పట్టు గూళ్ళ ఉత్పత్తి కోసం పట్టు పురుగుల పెంపకం.
* పట్టు గూళ్ళ నుంచి దారం తీయడం.
* ట్విస్టింగ్, డయింగ్, వీవింగ్, ప్రింటింగ్ మొదలైన ఇతర ప్రక్రియలను పూర్తి చేయడం.

ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన 17 లక్ష్యాలలో ఐదు ప్రధాన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో పట్టు వస్త్ర పరిశ్రమ కార్యకలాపాలను వేరు చేశారు. ఇవి: పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, సుస్థిర–సమ్మిళిత ఆర్థికాభివృద్ధి, సంపూర్ణ – ఉత్పత్తిదాయక ఉపాధి కల్పన, పునరుద్ధరణ, పచ్చదనాన్ని పెంచడం ద్వారా భూక్షీణత నివారణ. ఈ పరిశ్రమకు సంబంధించి ఇతర ముఖ్యాంశాలు.

* భారీగా ఉపాధి కల్పించే సామర్థ్యంతో అధిక శ్రామిక భాగస్వామ్యం రేటు (ఎల్ఎఫ్‌పిఆర్) (కిలో పట్టు ఉత్పత్తికి 11.03 పని దినాలు).

**బి.ఎస్.అంగాడి,** మాజీ డైరెక్టర్, సెంట్రల్ సిల్క్ బోర్డు. E-mail: bsangadi@gmail.com
**కె.కె. షెట్టి,** సంయుక్త కార్యదర్శి, సెంట్రల్ సిల్క్ బోర్డు. E-mail: kk.csb@nic.in
**హెచ్. నగేష్ ప్రభు,** ముఖ్య కార్య నిర్వాహణాధికారి, సెంట్రల్ సిల్క్ బోర్డు. E-mail: ms.csb@nic.in

* మహిళల ప్రమేయం (60%), కుటుంబ సభ్యుల భాగస్వామ్యంతో కుటుంబానికి అధిక ఆదాయం.
* మౌలిక ఉత్పత్తిదారులైన రైతులకు తిరిగి 60 శాతం రాబడి.
* సంపన్న వినియోగదారుల నుంచి పేదలకు (రైతులు, రీలర్స్, నేతకారులు) వాటా.
* పర్యావరణ అనుకూల కార్యకలాపాల వల్ల జీవవైవిధ్యం, సహజ ఆహార వృక్ష వనాల ప్రాంత పరిరక్షణ.
* పట్టు అనుబంధ ఉత్పత్తులు – సెరిసిన్ తదితర వాటి ద్వారా అదనపు ఆదాయ కల్పనకు అపార అవకాశాలు.

**ప్రస్తుత పరిస్థితి**

భారత పట్టు పరిశ్రమ భారత జౌళి పరిశ్రమలో అంతర్భాగంగావుంది. చైనా తరువాత ప్రపంచంలోనే అతి పెద్దదైన భారత పట్టు పరిశ్రమ ప్రపంచ ఉత్పత్తిలో దాదాపు 14 శాతాన్ని సమకూరుస్తోంది.

**ప్రపంచ ముడి పట్టు ఉత్పత్తి (2015)**

**భారత పట్టు పరిశ్రమ సామర్థ్యాలు:**

* పట్టు ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా తరువాత రెండవ స్థానం.
* ప్రపంచంలో అతి పెద్ద పట్టు వినియోగ దేశం.
* ప్రపంచంలోనే మొత్తం ఐదు రకాల పట్టును వాణిజ్య ప్రాతిపదికపై ఉత్పత్తి చేస్తున్న ఏకైక దేశం.
* ప్రఖ్యాత బంగారు 'మూగా' పట్టు ఉత్పత్తిపై ప్రపంచ గుత్తాధిపత్యం.
* దక్షిణ ప్రాంతంలోని పూర్తి అనుకూల వ్యవసాయ వాతావరణ పరిస్థితుల వల్ల ఏడాది పొడవునా పట్టు సాగుకు వీలు.
* పట్టు పరిశ్రమ విస్తరణకు సమృద్ధిగా సాగు యోగ్య భూమి లభ్యత.
* ఉన్నతమైన అర్హత, విశేషానుభవం గల శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో కూడిన ప్రపంచ శ్రేణి పట్టు పరిశోధనా సంస్థ ఏర్పాటు.
* చాలినంత మంది నైపుణ్య పనివారి భాగస్వామ్యం.

భారతదేశ ముడిపట్టు ఉత్పత్తి 2011-12 (11వ ప్రణాళిక ఆఖరు)లో 23,060 మెట్రిక్ టన్నుల నుంచి 2015-16లో 28,472 మెట్రిక్ టన్నులకు పెరిగింది. అంటే ఏటా 5.4% పెరుగుదల రేటు నమోదైంది. ఏడాదిలో బైవోల్టయిన్ బ్రాండ్లతో పట్టు ఉత్పత్తి ఏడాదికి 28 శాతం చొప్పున వృద్ధి రేటు నమోదు చేసింది. అదే విధంగా వన్య పట్టు ఉత్పత్తి ఇదే కాలంలో 13.8 శాతం పెరుగుదలను నమోదు చేసింది. ముడి పట్టును దిగుమతి చేసుకోవడం క్రమంగా తగ్గిపోయింది. దిగుమతి ప్రత్యామ్నాయ బైవోల్టయిన్ ముడిపట్టు ఉత్పత్తిలో మెరుగుదలే ఇందుకు కారణం.

**ముడిపట్టు దిగుమతులు**

గడచిన ఐదేళ్ళలో దేశంలో పెరిగిన దిగుమతి ప్రత్యామ్నాయ బైవోల్టయిన్ ముడి పట్టు ఉత్పత్తి ఫలితంగా దిగుమతులు 5,683 మెట్రిక్ టన్నుల (2011-12) నుంచి 3,529 మెట్రిక్ టన్నుల (2015-16)కు తగ్గాయి. 2019 నాటికి పూర్తిగా దిగుమతులకు స్వస్తి చెప్పడానికి వీలుగా దిగుమతి ప్రత్యామ్నాయ బైవోల్టయిన్ ముడి పట్టు ఉత్పత్తిలో దేశం స్వయం సమృద్ధి సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

**ఎగుమతులు**

భారత్ ప్రపంచంలో రెండవ పెద్ద పట్టు ఉత్పత్తి దేశమైనప్పటికీ అంతర్జాతీయ పట్టు వాణిజ్యంలో భారత పట్టు ఎగుమతుల మార్కెట్ వాటా చెప్పకోదగ్గట్టుగా (10%) లేదు. అయితే, పట్టు ఉత్పత్తులకు సంబంధించి దేశీయంగా పెద్ద మార్కెట్‌ను భారత్ కలిగింది. ఉత్పత్తి అయిన పట్టు ఉత్పత్తులలో దాదాపు 85 శాతం దేశీయ మార్కెట్‌లోనే అమ్ముడుపోతున్నాయి. కాగా, 15 శాతం వరకు ఉన్న భారత పట్టు ఎగుమతులలో అన్ని రకాల ఉత్పత్తులు (విలువ ఆధారిత వస్తువులతో సహా) సహజ పట్టు దారం, పట్టు వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, పట్టు తివాచీలు, పట్టు వ్యర్థాలు మొదలైనవి చేరి ఉన్నాయి. సంప్రదాయ ప్రధాన మార్కెట్లైన అమెరికా, యూరోపియన్ దేశాలకు, ఆసియా ప్రాంతంలోని చిన్న మార్కెట్‌లకు భారత పట్టు ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఏళ్ళ తరబడి పట్టు ఉత్పత్తుల ఎగుమతి ఆదాయం తగ్గుతూ వస్తోంది. అంతర్జాతీయ మాంద్యం, పశ్చిమ దేశాలలో తగ్గిన గిరాకీ ఇందుకు కారణం. 2015-16లో ఎగుమతి ఆదాయం రూ. 2,495.99 కోట్లుగా ఉంది. 11వ ప్రణాళికలోను, 12వ ప్రణాళిక మొదటి నాలుగు సంవత్సరాలలోను పట్టు ఉత్పత్తుల ఎగుమతుల విలువలను పట్టిక-1లో చూడవచ్చు.

పట్టిక -1. పట్టు ఉత్పత్తుల ఎగుమతి వాటి విలువ

| వస్తువులు | ఎగుమతుల విలువ రూ. కోట్లలో | | | | |
|---|---|---|---|---|---|
| | 11వ ప్రణాళిక | 2012-13 | 2013-14 | 2014-15 | 2015-16 |
| సహజ పట్టుదారం | 19.68 | 21.96 | 36.25 | 25.40 | 30.32 |
| పట్టు వస్త్రాలు | 1497.97 | 1410.31 | 1455.63 | 1465.44 | 1208.60 |
| రెడీమేడ్ దుస్తులు | 765.83 | 787.15 | 874.00 | 1214.01 | 1078.39 |
| పట్టు తివాచీలు | 20.08 | 21.14 | 15.71 | 15.97 | 16.88 |
| పట్టు వ్యర్థాలు | 49.77 | 62.97 | 99.30 | 109.12 | 89.80 |
| **మొత్తం** | **2353.33** | **2303.53** | **2480.89** | **2829.94** | **2495.99** |

(సోర్స్ : ఎఫ్‌టిఎస్ఐ & ఎమ్ఎస్ఎఫ్‌టిఐ, డిజిసిఐఎస్, కోల్‌కతా)

## నాణ్యత, ఉత్పాదకత, ఉపాధి కల్పనపై పరిశోధన – అభివృద్ధి ప్రభావం


సెంట్రల్ సిల్క్ బోర్డు, ఇతర రాష్ట్రాల పరిశోధన, అభివృద్ధి ప్రయత్నాల ఫలితంగా పట్టు ఉత్పత్తి ప్రమాణాలు, పరిమాణం, ఉత్పాదకత గణనీయంగా మెరుగుపడ్డాయి. మల్బరీ పట్టు ఉత్పత్తి 2015–16లో హెక్టార్‌కు 101 కేజీలకు పెరిగింది. ఇది 1997లో సుమారు 46 కేజీలు ఉంది. మెరుగైన పట్టు పురుగు ఫుడ్ ప్లాంట్‌లను ప్రవేశపెట్టడం, అధిక దిగుబడి పట్టు పురుగుల పెంపకం, నాణ్యమైన పట్టు పురుగుల విత్తనాల ఉత్పత్తి, సరఫరా, అత్యాధునిక పెంపకం విధానాల అన్వయింపు, పట్టుగూళ్ళ అనంతర ప్రక్రియ మెరుగుదల తదితర చర్యల వల్ల ఈ పురోగతి సాధ్యపడింది.

దాదాపు 12 లక్షల మంది పట్టు పరిశ్రమదారులతోనూ, 8.28 మిలియన్ ప్రజల ఉపాధి సామర్థ్యంతోనూ భారత పట్టు పరిశ్రమ జౌళిరంగంలో 20 శాతానికి పైగా వాటాతో పెరుగుదల, సుస్థిరతలో తన వేగాన్ని కొనసాగిస్తోంది. శీఘ్రగతిన సాగుతున్న పారిశ్రామికీకరణ సాగు విస్తీర్ణంపై పెరుగుతున్న ఒత్తిడితో నిమిత్తం లేకుండా పట్టు పరిశ్రమ పురోగమిస్తోంది.

## అంతర్జాతీయంగా 'భారతీయ పట్టుకు' పోటీ

ఈ మధ్యకాలంలో ప్రపంచ పట్టు పరిశ్రమ రంగంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పారిశ్రామికీకరణ ఫలితంగా దిగుమతి వ్యయం పెరగడం, వ్యవసాయ కూలీలు పారిశ్రామిక, సేవా రంగాల వైపు మొగ్గు చూపుతున్న కారణంగా చాలా దేశాలలో పట్టు ఉత్పత్తి కుంటుపడడం మనం చూస్తున్నాం. అవిభక్త యుఎస్ఎస్ఆర్, దక్షిణ కొరియా, బ్రెజిల్, థాయ్‌లాండ్ వంటి దేశాలకు అంతర్జాతీయ పోటీ ధరలకు అనుగుణంగా తమ పట్టు ఉత్పత్తులను ముందుకు తీసుకెళ్ళడం అసాధ్యంగా మారింది.

ఇతర పట్టు ఉత్పత్తి దేశాలతో పోలిస్తే భారత్‌కు గల అనుకూలతలు, అవకాశాలు చాలా ఎక్కువే. అంతర్జాతీయ పట్టు ఉత్పత్తి ధోరణులను బట్టి భారత్‌లో పట్టు పరిశ్రమ అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నట్టు స్పష్టమవుతుంది. జపాన్‌లో ఈ పరిశ్రమ పూర్తిగా కుదేలవగా, శక్తివంతమైన చైనా తన ఉత్పత్తి వ్యవస్థను సంప్రదాయేతర ప్రాంతాలపై కేంద్రీకరించే ప్రయత్నాలు చేస్తోంది. చైనా కంటే ఎక్కువ సాగు విస్తీర్ణం కలిగిన వాతావరణ పరిస్థితుల పరంగా (ప్రధాన దక్షిణాది పట్టు ఉత్పత్తి రాష్ట్రాలు) కూడా భారత్ ఎక్కువ అవకాశాలు కలిగివుంది. ఇందువల్ల ఏడాది పొడవునా పట్టుకాయల ఉత్పత్తికి వీలవుతోంది. అందుచేత ఉత్పత్తిని పెంచేందుకు భారత్‌కు మెరుగైన అవకాశాలు పుష్కలంగా వున్నాయి. తద్వారా ఎగుమతులను మరింత విస్తరించి అంతర్జాతీయ మార్కెట్‌లో సొంత బ్రాండ్ ఏర్పరచుకునే సత్తా కలిగివుంది.



## ముందుచూపు

దేశవ్యాప్తంగా పట్టు పరిశ్రమ రంగాన్ని అభివృద్ధిచేసే బాధ్యతను సెంట్రల్ సిల్క్ బోర్డు తన భుజస్కందాలపై వేసుకుంది. పట్టుకు సంబంధించి 2020 నాటికి భారత్‌ను దిగుమతి రహిత దేశంగా మార్చడానికి దాదాపు 8500 మెట్రిక్ టన్నుల బైవోల్టయిన్ ముడి పట్టును ఉత్పత్తి చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. ప్రపంచ మార్కెట్‌లో పట్టుకు భారత్‌ను నాయక స్థానంలో నిలపడం పై కూడా దృష్టి సారించింది. ఈ క్రమంలో 2030 నాటికి మొత్తం మీద పట్టు ఉత్పత్తిని 60,000 మెట్రిక్ టన్నులకు పెంచాలని ప్రతిపాదించింది. ఇదే సమయంలో దిగుమతి ప్రత్నామ్నాయ బైవోల్టయిన్ ముడి పట్టు ఉత్పత్తిని కూడా 20,000 మెట్రిక్ టన్నులకు పెంచాలని భావిస్తోంది.

## సవాళ్ళు – ముందడుగు

### 1. సంప్రదాయ పట్టు పరిశ్రమ ప్రాంతాల పట్టణీకరణ

దేశంలోని సంప్రదాయ ప్రాంతాలలో సత్వర ఆర్థికాభివృద్ధితోపాటు పారిశ్రామికీకరణ, పట్టణీకరణ ప్రక్రియ గణనీయంగా వేగం పుంజుకుంది. దీనితోపాటు భూమి, శ్రమ, వ్యయం పెరిగి అక్కడ పట్టు పరిశ్రమ విస్తీరణకు విఘాతం కలుగుతోంది.

భూమి, మానవ వనరులు సమృద్ధిగా ఉన్న మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి సంప్రదాయేతర ప్రాంతాలకు ఉత్పత్తి ప్రాతిపదికను విస్తరిస్తే, చాలా మేరకు ముడి పట్టు ఉత్పత్తిని పెంచవచ్చు. ఇటువంటి ప్రాంతాలు సహజ పరిస్థితులను కలిగివుండడంతోపాటు పట్టు పరిశ్రమ అభివృద్ధికి అనువైన సామాజిక మూలాలు కూడా అందుబాటులో ఉంటాయి.

### 2. దిగుమతి ప్రత్యామ్నాయ బైవోల్టయిన్ ముడిపట్టు ఉత్పత్తి పెంపు

బైవోల్టయిన్ జాతులు మాత్రమే పటుత్వం జిగి కలిగిన నాణ్యమైన ముడి పట్టును ఉత్పత్తి చేయగలుగుతాయి. మన మరమగ్గాలకు ఇవే అవసరం. అయితే, మనం తగినంత పరిమాణంలో, కనీసం మన దేశీయ అవసరాల మేరకైనా దిగుమతి ప్రత్యామ్నాయ బైవోల్టయిన్ ముడి పట్టును ఉత్పత్తి చేయలేకపోతున్నాం. మన మరమగ్గాల అవసరాల కోసం దిగుమతులపై ఆధార పడవలసివస్తోంది. మన దేశంలో బైవోల్టయిన్ పట్టు పరిశ్రమ ప్రాచుర్యం పెద్ద సవాల్‌గా పరిణమించాయి.

బైవోల్టయిన్ పట్టు పరిశ్రమ కేవలం విస్తృత టెక్నాలజీ మాత్రమే కాదు. విస్తృత పెట్టుబడి ఆధారితం కూడా. ఈ సవాళ్ళ పరిస్థితులలో నాణ్యమైన బైవోల్టయిన్ విత్తన

ఉత్పత్తిపై ఎక్కువ పెట్టుబడి పెట్టవలసిన అవసరం ఉంది. అలాగే, రైతుల స్థాయి మౌలిక సదుపాయాల పైన పట్టుగూళ్ళ దశ నుంచి సౌకర్యాల కల్పన పైన, పరిశ్రమకు సాధికారత కల్పించడం పైన అధిక పెట్టుబడులు అవసరం. కాల పరీక్షకు నిలబడే ఉష్ణ సంబంధమైన బైవోల్టయిన్ పట్టు పరిశ్రమ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ దీనిని అనుకూలతలు ఉన్న ప్రాంతాలకు పెద్ద ఎత్తున విస్తరించవలసిన అవసరం ఉంది. బైవోల్టయిన్ పట్టు పరిశ్రమకు ప్రజాదరణ కల్పించడం స్థాయి, వేగం, నైపుణ్యం అనే మూడు ముఖ్య సూత్రాలపై ఆధారపడి వుంది. మన బైవోల్టయిన్ ఉత్పత్తిని 20,000 మెట్రిక్ టన్నులకు పెంచాలనుకున్నప్పుడు మన రైతులు, పెంపకందారులు, నేతకారులు నైపుణ్యాన్ని అభివృద్ధిపరచి వేగవంతమైన కార్యాచరణతో భారత్‌ను నిజమైన ప్రపంచ పట్టు సారధ్య శాఖలకు చేరుకోవాలి.

### 3. విశ్వసనీయ బైవోల్టయిన్ వాణిజ్య విత్తనాల ఉత్పత్తి, సరఫరా

నాణ్యమైన ముడి పట్టును ఉత్పత్తి చేయడానికి పట్టు పురుగు విత్తనం మౌలిక ఉపకరణం. దేశంలో దిగుమతి ప్రత్యామ్నాయ బైవోల్టయిన్ ముడి పట్టు ఉత్పత్తిని పెంచాలని ఉద్దేశిస్తున్నప్పుడు దానికి తగిన నిష్పత్తిలో వాణిజ్యపరమైన బైవోల్టయిన్ విత్తన వాడకాన్ని కూడా పెంచాలి. ఇందుకు ప్రైవేటు పట్టు పురుగు విత్తన ఉత్పత్తిదారుల భాగస్వామ్యం పెద్ద ఎత్తున అవసరం. శీతలీకరణ ప్లాంట్, సూక్ష్మ వాతావరణ పరిస్థితుల సృష్టికి అవసరమైన ఆధునిక యంత్ర పరికరాలు, విత్తన పట్టుకాయల కొనుగోలు వంటి మౌలిక సదుపాయల కల్పన కోసం భారీ పెట్టుబడులు అవసరం. సంప్రదాయ బహుళ బైవోల్టయిన్‌ల నుంచి నవీకరించిన బైవోల్టయిన్‌లకు తమ ఉత్పత్తిని మళ్ళించే ప్రైవేట్ విత్తన ఉత్పత్తిదారులకు తగినంత ఆర్థిక మద్దతు, సాంకేతిక సహకారం అందించాల్సి వుంటుంది. అంతేకాకుండా పట్టుపురుగు విత్తనాల ఉత్పత్తిలో 'జీరో ఎఫెక్ట్ – జీరో ఎఫెక్ట్' విధానం మన దేశాన్ని కొత్త శిఖరాలకు చేరుస్తుంది.

### 4. క్షీణిస్తున్న నీటి లభ్యత

వర్షాధారిత పట్టు పరిశ్రమను భారత్‌లో కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాలలో మాత్రమే చేపడుతున్నారు. అందుచేత ఈ పరిశ్రమకు నీటివనరు ప్రధాన సమస్యగా మారింది. తరిగిపోతున్న నీటి లభ్యత పరిశ్రమకు ముప్పుగా పరిణమించింది. ఈ సమస్యను అధిగమించ డానికి వర్షపునీటి సంరక్షణ, నీటి పొదుపుపై దృష్టి పెట్టడం జరుగుతోంది. ఇందుకోసం బిందు సేద్య విధానాన్ని చట్టబద్ధం చేశారు. సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాలను రైతులకు సులభంగా, ఆమోదయోగ్యంగా అందించేలా 'చుక్క నీటితో అధిక పంట' నినాదాన్ని నీటి గరిష్ట వినియోగం ద్వారా పట్టు పరిశ్రమకు అన్వయించడం చేస్తున్నారు.

### 5. మార్పు దిశగా

దేశంలో అంతర్జాతీయంగా పోటీని ఎదుర్కొనే ముడి పట్టును ఉత్పత్తి చేయడానికి వీలుగా నాణ్యత కలిగిన వాణిజ్యపరమైన పట్టుకాయల ఉత్పత్తికి మెరుగైన యంత్రాల వినియోగంతోపాటు ఆధునిక రీలింగ్ సాంకేతిక పరిజ్ఞానాల అన్వయింపునకు ప్రాధాన్యం ఇవ్వవలసి వుంది. నాణ్యమైన పట్టు రీలింగ్ కోసం సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాల మెరుగుదల, యంత్రాలు అవసరం. సెంట్రల్ సిల్క్ బోర్డు ఇప్పటికే దేశీయంగా ఆటోమేటిక్ రీలింగ్ మెషిన్ (ఎఆర్ఎమ్)ను అభివృద్ధి పరచింది. మల్బరీ పట్టు కాయల నుంచి పట్టును తీయడానికి ఎఆర్ఎమ్ ఉపయోగ పడుతుంది. మేక్ ఇన్ ఇండియా దిశగా ఈ యంత్ర పరికరం అభివృద్ధి ఒక మైలు రాయి. దీనికి యుద్ధ ప్రాతిపదికపై ప్రాచుర్యం కల్పించాలి. దీనితోపాటు, వన్య సిల్క్ స్పిన్నింగ్ యంత్రాల ఆధునికీకరణ కూడా అవసరం.

### 6. జన్యుపరంగా మెరుగుదల – అధిక దిగుబడి జాతుల అభివృద్ధి

జన్యుపరంగా తక్కువ స్థాయిలో ఉన్న భారత్‌లో అధిక దిగుబడి, తెగుళ్ళ నిరోధక జాతుల అభివృద్ధి అత్యంత అవసరం. ఇవి ఉష్ణోగ్రతలలో హెచ్చు తగ్గులను తట్టుకోగలిగేలా ఉండాలి. జన్యు వనరుల మార్పిడి, పటుత్వం కలిగిన జాతుల అభివృద్ధికి అంతర్జాతీయ స్థాయిలో సహకారం ఒక్కటే దీనికి పరిష్కారం. వాస్తవానికి సెంట్రల్ సిల్క్ బోర్డు ఇప్పటికే ఎన్ఐఎఎస్, సుకుబా, జపాన్, బల్గేరియా, ఉజ్బెకిస్తాన్, రుమానియా, చైనా దేశాలతో ఇటువంటి భాగస్వామ్య సహకార ఒప్పందాలకు శ్రీకారం చుట్టింది.

### 7. అంతర్జాతీయ బ్రాండ్ గుర్తింపు

భారత్ పట్టు ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండవ స్థానంలో ఉన్నప్పటికీ ఇంకా అంతర్జాతీయ పట్టు వాణిజ్యంలో ఉన్నత స్థానానికి చేరలేదు. బ్రాండ్ ఇమేజ్‌తో ప్రపంచ గుర్తింపునకు ఇంకా దూరంగానే ఉంది. చైనా, థాయ్‌లాండ్ దేశాలు ఈ విషయంలో ముందంజలో ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లలో భారత పట్టు ప్రతిష్ఠ మెరుగు పడేందుకు జనరిక్ సిల్క్ ప్రమోషన్ ప్రచారం అవసరం. బ్రాండ్ ఇమేజ్ పెంచుకునే ప్రక్రియలో భాగంగా దేశంలో పెద్ద ఎత్తున అంతర్జాతీయ పట్టు ఉత్పత్తుల ప్రదర్శనలను నిర్వహించాలి. కొత్త ఫ్యాషన్ డిజైన్‌లతో భారత్‌కే ప్రత్యేకమైన పట్టు ఉత్పత్తులను ప్రపంచం ముందు ప్రదర్శించాలి. మీడియాలో కూడా భారీ ప్రచారం కల్పించాలి.

### 8. పట్టు పరిశ్రమ కార్పొరేటీకరణ

భారత పట్టు పరిశ్రమ చిన్న, మధ్యతరహా రైతులు, పెంపకందార్లకే పరిమితమై కొనసాగుతోంది. అదే చైనాలో మాత్రం చిన్న తరహా ఉత్పత్తిదారులైనా, భారీగా మార్పుదారులతో నడుస్తోంది. చిన్న, మధ్యతరహా రైతులకు మనం మద్దతు కొనసాగిస్తూనే.. యాంత్రీకరణతోనూ, తగిన మద్దతు వ్యవస్థతోనూ పెద్ద ఎత్తున పట్టు సాగును ప్రవేశపెట్టాలి. పెద్ద ఎత్తున మార్పుదారులను

ప్రోత్సహిస్తూనే, విస్తృత ప్రాతిపదిక గల వ్యాపార సంస్థగా పట్టు పరిశ్రమ కార్పొరేటీకరణ దిశగా ముందుకు వెళ్ళాలి.

### 9. జన వనరులు – కొత్త ఆశలు

అధిక యువ జనాభా సగటు వయస్సు 35 సం॥లు కలిగిన ఏకైక దేశంగా భారత్ సమీప భవిష్యత్‌లో ఆవిర్భవించబోతోంది. పట్టు పరిశ్రమ అభివృద్ధికి ఇదో అదనపు అవకాశం. పరిశ్రమలో మహిళల పాత్ర కూడా ఎంతో పెరిగింది. ఫలితంగా వారి ఆర్థిక సాధికారత, దాని ఫలితంగా "సబ్ కే సాథ్, సబ్ కా వికాస్" వేగవంతం అవుతున్నాయి.

### 10. పరపతి అంతంత మాత్రం

అవసరమైన రైతులకు, పెంపకం దారులకు, నేతకారులకు తగినంతగా సంస్థాగత ఆర్థిక సహాయం లభిస్తే నాణ్యత, ఉత్పాదకత తద్వారా నికర ఆదాయం పెరగడానికి దోహదపడుతుంది.

పట్టు పరిశ్రమను వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, రీలింగ్ రంగాల పరిధిలో చేర్చడం వల్ల ప్రాధాన్యతారంగం రుణాలు అందుకోవడానికి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎమ్ఎస్ఎమ్ఇ) అర్హత లభించింది. బ్యాంకర్లకు అవగాహనా కార్యక్రమాలు, కమ్యూనిటీ ఆధారిత సంస్థలకు మద్దతు వంటి సెంట్రల్ సిల్క్ బోర్డు చర్యల ద్వారా కొంత మేరకు మెరుగైన సంస్థాగత పరపతి అందుబాటులోకి వచ్చింది. పట్టు పరిశ్రమకు భారీగా నిధులు సమకూర్చేందుకు, లబ్దిదారుల మధ్య గట్టి అనుసంధానం ద్వారా పట్టు పరిశ్రమ రుణాల వసూళ్ళ కోసం త్రైపాక్షిక మార్కెటింగ్ ఒప్పందం సమీక్షకు నాబార్డ్‌లోనూ, ఇతర ఆర్థిక సంస్థలలోనూ పట్టు పరిశ్రమ కోసం క్రెడిట్ గ్యారంటీ ఫండ్‌ను ఏర్పాటుచేయాలి. ఈ త్రైపాక్షిక ఒప్పందంలో లబ్దిదారులు, అభివృద్ధి ఏజెన్సీలు, బ్యాంకులు/ఆర్థిక సంస్థలు భాగస్వాములుగా ఉంటాయి. దీనివల్ల రుణాల మంజూరు, వసూళ్ళు, తిరిగి మంజూరు వ్యవస్థ సాఫీగా జరుగుతుంది.

### 11. పట్టు పరిశ్రమ అభివృద్ధికి ఐటీ, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్

దేశంలో ఎంపిక చేసిన రాష్ట్రాలలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రస్తుత అవకాశాలు ఉన్న ప్రాంతాలను ఇస్రో రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహ చిత్రాల ద్వారా గుర్తించాలి. సంప్రదాయేతర కొత్త ప్రాంతాలలో కూడా పథకాలను ప్రణాళికాబద్ధంగా అమలుచేయాలి. దేశవ్యాప్తంగా మల్బరీ, నాన్ మల్బరీ రంగాలలో విధానపరమైన ప్రణాళికలలో ఈ ప్రతిపాదనలను చేర్చాలి. యాప్, నెట్, కియోస్క్ మొదలైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) టూల్స్ ద్వారా రైతులు/రీలర్లు/వీవర్స్‌కు వాస్తవ సమాచారాన్ని అందించడం ద్వారా వారికి సాధికారత కల్పించాలి.

### 12. పట్టు పరిశ్రమలో యాంత్రీకరణ

పట్టు పరిశ్రమలో మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకం, విత్తనోత్పత్తి, ఇన్ఫెక్షన్ నివారణ, గుడ్డు పొదిగే దశల్లో యాంత్రీకరణ ద్వారా ఆధునికీకరణకు జరుగుతున్న ప్రయత్నాలు ఉత్పాదకతను పెంచడమేగాక, సమయం, శ్రమ ఆదాకు, చాకిరీ తగ్గేందుకు దోహదపడతాయి. పెద్ద ఎత్తున సాగుకు యంత్రీకరణ ఒక వరమే కాగలదు.

### 13. ధరల ఒత్తిడి

పట్టు కాయలు, ముడి పట్టుకు స్థిరమైన, ప్రోత్సాహకరమైన ధరలను రైతులకు, పెంపకందార్లకు అందించగలిగితేనే ఈ పరిశ్రమలో అధిక పెట్టుబడులను, ఉత్పాదకతను ప్రోత్సహించగలుగుతాం.

మార్కెటింగ్ సౌకర్యాలను, సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఈ కింద చర్యలు చేపట్టాలి:

* యూనిఫైడ్ నేషనల్ కాకూన్ మార్కెటింగ్ ఏర్పాటు.
* ప్రభుత్వ మార్కెట్‌లలో ఇ–వేలం.
* ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు.
* పట్టుకాయ బ్యాంకుల ఏర్పాటు.
* నూలు బ్యాంక్‌ల స్థాపన.

### 14. వాతావరణ అనుకూల పట్టు పరిశ్రమ

వాతావరణ అనుకూల పట్టు పరిశ్రమ పరిజ్ఞానాలను అనుసరించడం వల్ల ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుతాయి. సహజ వనరులు, మానవ వనరుల నిరంతర నిర్వహణ ప్రస్తుత వాతావరణ మార్పు శకంలో స్థిరమైన పట్టు పరిశ్రమలో అంతర్భాగం కావాలి. దీని కింద ఎంపిక చేసిన ప్రాధాన్యతా ప్రాంతాలు పటుత్వం కలిగిన బైవోల్టయిన్ జాతుల అభివృద్ధికి, ఆతిథ్య వృక్ష రకాల పెంపకానికి అనువుగా ఉంటాయి. వాతావరణం సరిగా లేని చోట కూడా ఇవి మనగలుగుతాయి.

### 15. అనుబంధ ఉత్పత్తుల వినియోగం

అదనపు ఆదాయాన్ని అందించ గరిష్ట అవకాశాలు పట్టు పరిశ్రమలో ఉన్నాయి. పట్టు పురుగు ప్యూపా, సెరిసిన్, పట్టు వ్యర్థం, బేసిన్ రిఫ్యూజ్ మొదలైన అనుబంధ ఉత్పత్తులు ఎంతో సమర్థంగా ఉపయోగపడతాయి.


### 16. నాన్ టెక్స్‌టైల్ అవసరాలకు పట్టు

ఆరోగ్యవంతమైన లాభదాయకతకు ఉపకరిస్తుంది. బయోమెడికల్ సైన్సెస్‌లో ఇటీవలి అభివృద్ధివల్ల మంచెలు, స్పాంజ్‌లు, ఫిల్మ్, జెల్, సూక్ష్మ నూలు పోగులు మొదలైనవాటి తయారీకి పట్టును బయోమెటీరియల్‌గా వినియోగిస్తున్నారు. అధిక విలువ కలిగిన ఈ ఉత్పత్తులు ఖచ్చితంగా పట్టు పరిశ్రమకు అదనపు ప్రయోజనాలు అందిస్తాయి.

### ముగింపు

పట్టు ఉత్పత్తులకు నిరంతరం పెరిగే అంతర్జాతీయ, దేశీయ మార్కెట్, దీనితోపాటు విస్తృత ఉపాధి అవకాశాలు, గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాలలో ఆదాయ కల్పన, తక్కువ ఆదాయం, సామాజికంగా వెనుకబడిన వర్గాల అధిక భాగస్వామ్యం, భారీ ఎత్తున మహిళా భాగస్వామ్యం, ఎగుమతి ఆదాయవృద్ధికి అపార అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇవి పట్టు పరిశ్రమను ఆకర్షణీయ స్థానంలో నిలబెట్టి మంచి పెట్టుబడులు, దూరదృష్టి గల అభివృద్ధి ప్రణాళికలతో తదుపరి విస్తరణ దిశగా నడిపిస్తున్నాయి. ■

# తెలుగువారి చేనేతలు - ప్రపంచీకరణకు విసిరిన సవాలు



**చేనేత వస్త్రాల ప్రత్యేకమైన తయారీ విధానం, తయారయ్యే ప్రదేశం, డిజైన్ తీరు, నేత -నైపుణ్యాలను బట్టి ఆయా ప్రాంతాల చేనేతలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వటానికి కేంద్ర చేనేత జౌళి శాఖకు చెందిన జౌళి సంఘం జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ రిజిస్ట్రీ ఏర్పాటుచేసింది. అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర నేసిన ధర్మవరం నేతకారులు, నిరంతర చందన పరిమళాలు వెదజల్లే చీరలు నేసి రికార్డు నెలకొల్పిన ఘటనలూ ఉన్నాయి. స్థానికంగా ఉత్పత్తి అయ్యే పునాస పత్తి రకాన్నే పొందూరు వాసులు ఖద్దరు తయారీకి వినియోగిస్తారు.**

బెజవాడలో అఖిల భారత కాంగ్రెస్ సంఘం సమావేశాలు మొదటిసారి 1921లో జరిగాయి. ఆ సమావేశాలకోసం గాంధీజీ వచ్చారు. ఆంధ్ర ప్రాంతానికి ప్రత్యేక కాంగ్రెస్ విభాగం కూడా లేని రోజులు అవి. కాంగ్రెస్ పార్టీలో ఆంధ్రుల స్వరం వినిపించటానికి అప్పటి నాయకులు కృషి చేస్తున్న రోజులు. స్వాతంత్ర్య సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య కృష్ణా జిల్లాలో నేసిన పంచెల చాపును గాంధీజీకి సమర్పించారు. 50 అంగుళాల వెడల్పు, 7.5 గజాల పొడవున్న ఆ పంచెల చాపు చూసి గాంధీజీ మురిసిపోయారు. 20వ నంబరు నూలు పోగులతో నేసిన పలచని ఆ ఖద్దరు పంచెల చాపును చూసి గాంధీజీ ఆశ్చర్యచకితులయ్యారు.

ఖాదీ ఉద్యమం ఊపందుకోకముందే .... తెలుగునేల చేనేతల నెలవుగా ఉండేది. సున్నితమైన పనితనం, నేర్పు, రంగుల మేళవింపు... తెలుగు వారి చేతిలో... చేనేతలు.... సోయగాలు పోయేవి. చీర అయినా, పంచెల చాపయినా, దుప్పటి అయినా, స్నానం చేసి తుడుచుకునే తువ్వాలయినా.... ప్రతి దానికీ ఓ ప్రత్యేకత ఉంది. పట్టు అయినా, ఖద్దరు అయినా, నూలయినా దేనితో చేసినా, ఆ....చేనేతలో తెలుగువారి ముద్ర ఉండేది. పట్టు దారాలతో బెనారస్సు చీరను తలదన్నేలా జరీ దారం మేళవించి నేసే 'ధర్మవరం' పట్టు చీరెలు, నూలు దారంతో అరుదైన జామ్-దానీ బూటీ పనితో చేనేతల ప్రపంచంలో ప్రత్యేకత సంతరించుకున్న 'ఉప్పాడ' చీరలు, నూలు దారాలతోనే కంచి పట్టు చీరను తలపించే 'మదనపల్లి' చీరలు, జరీ పనితో చీరె చెంగులకు సోయగాలు అద్దే కొత్తకోట పైఠానీ చీరెలు....ఇలా ఎన్నో. తెలుగు వారి చేనేతలు ఊరికో రకం. దేని ప్రత్యేకత దానిదే. శ్రీకాకుళం మొదలు పొందూరు, ఉప్పాడ, బండారు లంక, బందరు, మంగళగిరి, గుంటూరు, చీరాల వరకు, ఇటు ధర్మవరం నుంచి మదనపల్లి, మాధవరం, వెంకట గిరి వరకు జిల్లాకో ప్రత్యేకత, ఊరికో నేర్పు. ఇక తెలంగాణలో అయితే చేనేతలకు కొదవే లేదు. హైదరాబాద్ సంస్థానంలో మరాఠా, కన్నడ ప్రాంతాల ప్రభావం అప్పటి నేలపైనే కాదు, నేసిన చేనేతల మీదా ఉండేది. ఆర్మూరు పట్టు చీరలు, గద్వాల, నారాయణ పేట, కొత్తకోట, కరీంనగర్... ఇలా ....జాగీరుకో రకం. జమీకో ప్రత్యేకత.

**ఎం. ఎస్. లక్ష్మి,** ఫ్రీలాన్సర్, హైదరాబాద్.
E-mail: lakshmiair@hotmail.com



**ఫోటో: తెలుగు రాష్ట్రాలలో సామాన్య నేతకారుని చేతి మగ్గం**

ప్రపంచీకరణ, వస్త్ర పరిశ్రమలోకి బహుళ జాతి సంస్థల ప్రవేశం, మరమగ్గాల రాక, నైలాన్ వస్త్రాలపై ప్రజల మోజు ...ఇలాంటి కారణాలెన్నో.... చేనేతల డిమాండును తగ్గించాయి. కానీ కొత్త కొత్త రకాల వస్త్రాలపై ప్రజల మోజు, పత్తి – పట్టు లాంటి ముడి వస్తువుల కొరత లాంటి కారణాలతో చేనేతల ఖరీదు, దానితోపాటు, వాటి డిమాండు మళ్ళీ పెరుగుతుండటంతో తెలుగు వారి చేనేతలు ఎన్నో కొత్త సొబగులు అద్దుకుంటున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో అమలులోకి వచ్చిన మేధో సంపత్తి హక్కులు, తదనుగుణంగా Geographical Indications రిజిస్ట్రీ ఏర్పాటుతో చేనేతల డిమాండు మళ్ళీ ఊపందుకుంటోంది. దేశ విదేశాల్లో చేనేతలకు విలువా పెరుగుతోంది. దాంతో తెలుగు వారి చేనేతల్లో కొత్త కొత్త డిజైన్లు, ప్రయోగాలు జరుగుతున్నాయి. చేనేతలకు ఆలవాలమైన ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో అడుగడుగునా లభించే చేనేత వస్త్రాలు ఒకదానిని మించి మరొకటి ఎంతో విలక్షణమైనవి. వాటి ప్రత్యేకమైన తయారీ విధానం, తయారయ్యే ప్రదేశం, డిజైన్ తీరు, నేత –నైపుణ్యాలను బట్టి ఆయా ప్రాంతాల చేనేతలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వటానికి కేంద్ర చేనేత జౌళి శాఖకు చెందిన జౌళి సంఘం జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ రిజిస్ట్రీ ఏర్పాటుచేసింది. బనారస్, కంచి, గుజరాత్, ఒడిషా లాంటి రాష్ట్రాలలో తయారయ్యే ప్రత్యేక తరహా చీరెల మాదిరి తెలుగు రాష్ట్రాలలో పలు రకాల చేనేత వస్త్రాలకు GI గుర్తింపు లభించటం విశేషం.

**ఉప్పాడ:**

తూర్పు గోదావరి జిల్లా సముద్ర తీర గ్రామం ఉప్పాడ. జామ్ దానీ చీరలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు సాధించింది. ఉప్పాడ, కొత్తపల్లి గ్రామాల్లో ఈ చీరలు నేస్తారు. తువ్వాళ్ళు, దుప్పట్లు, సాధారణ నూలు చీరలు, పట్టు చీరలు నేసినా, ఇక్కడి జామ్ దానీ పట్టు చీరల ప్రత్యేకతే వేరు. ఉప్పాడ చేనేతలది 200 ఏళ్ల చరిత్ర. పర్షియన్ శైలి లో మూలాలు ఉన్నప్పటికీ, పడుగు–పేకల మధ్య మగ్గంపై నూలు/పట్టు దారాలను చేతితో బూటీగా మలుస్తూ సంక్లిష్టమైన డిజైనును రూపొందించే ఈ ఉప్పాడ పట్టు చీరల నేర్పులో తెలుగు నేతకారుల ఓర్పు కానవస్తుంది. చాలాకాలం వరకు రాణివాసాలకే పరిమితం అయ్యాయి. పిఠాపురం రాజధానిగా ఈ ప్రాంతాన్ని పాలించిన చిత్రాడ సంస్థానాధీశులు చాలా కాలం ఉప్పాడ చీరలను ప్రోత్సహించారు. ప్రస్తుతం భారత ప్రభుత్వం జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ మంజూరు చేసి ప్రత్యేకతను పరిరక్షిస్తోంది.



**ఫోటోలు: ఉప్పాడ చీరలు:**


దగ్గరలోనే ఉన్న బొబ్బిలి, నూజివీడు, వెంకటగిరి, గురజాల సంస్థానాలు కూడా ఉప్పాడ వస్త్రాలను బాగా ప్రోత్సహించేవారు. గాంధీజీ 20 కౌంటు ఖద్దరు పంచెలు చూసి అబ్బుర పడ్డారు. ఉప్పాడ నేత కారులు 120, 150 కౌంటుతో వస్త్రాలను నేయటం రివాజు. సన్నని బంగారు, వెండి జరీ పోగులతో, మృదువైన వస్త్రాన్ని చేతితో నేయటం సాధారణ విషయం కాదు. ఎంతో నైపుణ్యం, లెక్కింపు కావాలి. అది కూడా జామ్–దానీ కళను రంగరించి నేసే చీర ఆకర్షణీయమైన వర్ణాలతో, మెరుపుతో ఒక 'నేత–చిత్రాన్ని' ఆవిష్కరిస్తుంది. రాచరికాలు పోయాక కొంతకాలం ఉప్పాడ నేతకారులు ప్రోత్సాహంలేక ఇబ్బంది పడ్డా, మళ్ళీ ఇదిగో..... పెళ్ళిళ్ళు, పేరంటాలకు భారీగా ఖర్చు చేస్తున్న ప్రస్తుతకాలంలో కొత్తదనం, ప్రత్యేకత కోసం ఖరీదు ఎక్కువైనా ప్రజలు ఆదరిస్తున్నారు. దాంతో ఉప్పాడ చీరలలో సమకాలీన డిజైన్లు ప్రవేశించాయి. కోరుకున్న రంగు, ఊహకందని రూపాలతో మగువల మనసులను ఉప్పాడ చీరలు ఇట్టే దోచుకుంటున్నాయి. వార్డ్ రోబ్‌లో ఒక్క ఉప్పాడ చీరయినా ఉండాలని నేటి మహిళలు కోరుకుంటున్నారు.

**పోచంపల్లి:**

నల్గొండ జిల్లాలో నేతకారులు నేసే 'ఇక్కత్' చీరలు, వస్త్రాలు చాల విలక్షణమైనవి. ముందుగా నూలు/ పట్టు దారాలను దారంతో గట్టిగా కట్టి, ఆ తర్వాత రంగులద్దే 'టై–అండ్–డై' టెక్నిక్ ఈ వస్త్రాల మౌలిక తయ్యారీ విధానం. కావలసిన డిజైన్ ప్రకారం ముందే రంగులద్ది ఆ తర్వాత మగ్గంపై పడుగు–పేక ఖచ్చితంగా కలిసే విధంగా వస్త్రాన్ని నేస్తారు. ఇందుకు ఓర్పు నేర్పే కాకుండా లెక్కలపై అవగాహన ఉండాలి. ఈ పడుగు–పేకలపై రంగులు ఎంత ఖచ్చితంగా కలిస్తే అంత ఖచ్చితంగా వస్త్రంపై డిజైన్ వస్తుందన్నమాట. నూలు, పట్టు, జరీ ఉపయోగించి చీరలు, దుప్పట్లు, కర్టెన్, షర్టింగ్ మెటీరియల్ ఇలా అన్ని రకాల వస్త్రాలు ఇక్కడ తయారుచేస్తారు. ప్రముఖ సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య యోధుడు వినోభాభావే తన భూదానోద్యమాన్ని ఇక్కడే

ప్రారభించారు. డిజైన్ చిన్నదైన కొద్దీ, అందుకు అవసరమైన నైపుణ్యం పెరుగుతుంది. జామెట్రికల్ డిజైన్లు, పక్షులు, పువ్వులు, ఇలా రకరకాల డిజైన్లు ఇక్కత్ పద్ధతిలో నేస్తారు.






**పై ఫోటో: పోచంపల్లి చీర.**
**కింది ఫోటో: తేలియా రుమాల్**

పోచంపల్లి, కొయ్యలగూడెం, చౌటుప్పల్, శ్రీరాంపురం, భువనగిరి, చుయ్ గొట్టాల, గాల్తెప్పల లాంటి వంద పైగా ఊళ్ళలో ఇక్కత్ వస్త్రాలను నేస్తారు. ఎన్ని ఊళ్లలో నేసినా, అన్నిటినీ పోచంపల్లి పట్టుచీరలుగానే వ్యవహరిస్తారు. పుట్టపాక లాంటి మరికొన్ని ఊళ్లలో డబుల్ ఇక్కత్ నేస్తారు. పడుగు-పేక అంటే వస్త్రంలో నిలువు, అడ్డం దారాలు రెంటికీ ముందుగా డిజైను ప్రకారం రంగులు అద్ది, ఆ తర్వాత మగ్గంపై దారాలను నేస్తారు. అంటే నేసే సమయంలో ఒక వైపు డిజైన్ కలిస్తే సరిపోదు రెండు వైపులా డిజైనును సరి చూసుకోవటానికి మరింత నైపుణ్యం అవసరం. గుజరాత్, ఒడిషా రాష్ట్రాలలో విరివిగా తయారయ్యే ఇక్కత్ పద్ధతి తెలుగు నేలపైకి వచ్చినా, నల్గొండ జిల్లాకు 20వ శతాబ్దం తొలి దశకాల్లో గుంటూరు జిల్లా చీరాల నుంచి అడుగు పెట్టినట్లు చరిత్రకారులు చెప్తారు. అయితే, నిజాం ప్రభువుల ప్రాపకం, సున్నితమైన పనితనంతో ఉండే పోచంపల్లి పట్టుచీరలకు లభించిన ఆదరణ కారణంగా ఇక్కత్ నేత కొత్త పుంతలు తొక్కింది. 'డబుల్ ఇక్కత్' తో పాటూ అటు పర్షియన్ ఇటు చీరాల పద్ధతుల ప్రభావంతో 'తేలియా రుమాల్' పద్ధతిని ఇక్కడి నేతకారులు ఔపోశన పట్టారు. నూలు దారాలను కొన్ని రకాల నూనెలు, రసాయనాలు లేని సహజ రంగులు వాడుతూ ఇక్కత్ డిజైనుతో పెద్దపెద్ద రుమాళ్ళు తయారు చేస్తారు. బట్ట చివికి పోయేంత వరకు మాసిపోని రంగులు, జామెట్రికల్ డిజైన్లు ఈ తేలియా రుమాల్‌కు ప్రత్యేకతను ఇచ్చేవి. తేలియా రుమాల్ ప్రక్రియలో ఆ తరవాత చీరలు, ఫర్నిషింగు వస్త్రాలు తయారయి మంచి ఆదరణ పొందాయి. ఇప్పుడు 2005 లో కేంద్ర చేనేత జౌళి శాఖ పోచంపల్లి చీరలకు జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ మంజూరు చేశాక పోచంపల్లికి మరింత ఆదరణ పెరిగింది.

**గద్వాల:**

సున్నితమైన బట్ట, బూటా పనికి ఉప్పాడ చేనేత పెట్టింది పేరైతే, రాణివాసపు దాబుసరికి, దర్పానికి ఏడు గజాల నిదర్శనం గద్వాల చీర. బెనారస్ పట్టుచీర పనితనం చూసి, ముచ్చటపడి, చూసి నేర్చుకు రమ్మని 1822లో అప్పటి గద్వాల మహారాజు సీతారాం భూపాల్ బహదూర్ ముగ్గురు చేనేత కళాకారులను బెనారస్ పంపారు. పట్టు-నేత పనితనాల ఆయువు పట్లు నేర్చుకొచ్చారు వాళ్ళు. అయితే, డబుల్ పట్టు నేత, జరీ బూటా పనితనంతో చీర భారీగా తయారయింది. పైగా ఒక మోస్తరు స్థితిమంతులు కూడా కలవర పడేంతగా ఖర్చు తడిసి మోపెడు అయింది. అదుతమైన సరి కొత్తరకం చీర నడిగడ్డ మీద ఆవిర్భవించింది. కానీ ఆదరణ ఏదీ?


ఆ సమయంలో, గద్వాల మహారాణి ఆది లక్ష్మీదేవి తాను ముచ్చట పడి తెప్పించిన వెంకటగిరి చీరల నమూనాలో చీర నేయాలని సూచించారు. దాంతో పట్టు, నూలు మేలు కలయికగా, ప్రస్తుత గద్వాల చీర ఆవిష్కారం అయింది. 100 కౌంటు దారంతో నేసిన నూలు చీరకు, కంచి పట్టు చీరలలో మాదిరి పట్టు-బంగారు జరీ దారాలతో నేసిన అంచులను మగ్గంపైనే అతికి విలక్షణమైన పద్ధతిలో చీరను సాధించారు. చీరంతా పలుచని నూలు దారాలతో ఉండి, అంచులు, కొంగులు ఆకర్షించే వర్ణాలు, పట్టు జరీ దారాలతో మెరిసి పోయే గద్వాల చీరను చూసి రాణివాసం మురిసిపోయింది. నూలు దారాలు వాడటంతో సామాన్యులకూ అందుబాటులోకి వచ్చింది. కాల క్రమేణా, గద్వాల చీరలు, నూలు-పట్టు కలనేతగా అందమైన డిజైన్లతో కొత్త సొగసులు దిద్దుకుంది. తెలంగాణా నడిగడ్డ మీద ఊపిరి తీసుకున్న గద్వాల చీర తయారీ ప్రక్రియకి కేంద్ర చేనేత జౌళి శాఖ జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ మంజూరు చేసింది. అంటే గద్వాల చీర ప్రక్రియను ఏ బహుళ జాతీయ సంస్థా అనుకరించకుండా మేధో సంపత్తి హక్కు గద్వాల నేతకారులకు సంక్రమించింది.



ఫోటోలు: గద్వాల సీకో చీర, మగ్గంపై గద్వాల్ చేర నేస్తున్న నేతకారుడు. పట్టు అంచులతో గద్వాల నూలు చీరలు.

**వెంకటగిరి:**

నెల్లూరు జిల్లాలో మారుమూల ప్రాంతంలో ఉన్న వెంకటగిరి, పుణ్యక్షేత్రం తిరుపతికి దగ్గరగా ఉంది. 18వ శతాబ్దం నుంచి వెంకటగిరి జఖార్డ్ పద్ధతిలో నేసే చేనేతలకు ప్రసిద్ధి. పంచ్‌కార్డ్ తరహా బోర్డును మగ్గానికి కలపటం ద్వారా డిజైనును తెప్పించే విధానం ఇది. డిజైనుకు అనుగుణంగా పంచ్ కార్డును ముందుగా ఎంచుకున్న డిజైనుకు అనుగుణంగా అడ్డం-నిలువు పోగులను సిద్ధం చేసుకోవాలి. ఆతర్వాత అదే డిజైనును ఎన్ని రంగుల మేళవింపుకైనా వాడుకోవచ్చు. ముఖ్యంగా 100, 120 కౌంట్ నూలు దారాలతో గీతలు, చారల జరీ అంచులతో చూడటానికి సుకుమారంగా ఉండే ఈ చీరలను రాణివాసాలకోసం ఎంతో నైపుణ్యంతో నేసేవారు. నెల్లూరు వెలుగోటి సంస్థానం ప్రాభవంలో ఉన్నకాలంలో వెంకటగిరి వెలుగు నలుదిశలా పాకింది.



ఫోటో: వెంకటగిరి చీరలు

**మంగళగిరి:**

మంగళగిరి ఉండటానికి గుంటూరు జిల్లాలోనే ఉన్నా విజయవాడకు అతిచేరువలో ఉన్న చిన్న పట్టణం. ఇతర చేనేతలతో పోలిస్తే మంగళగిరి నేత భిన్న పోకడలు పోయిందనే చెప్పాలి. చీరలు మాత్రమే కాకుండా, మహిళల కోసం పంజాబీ డ్రెస్సులను నేటితరం అవసరాలకు అనుగుణంగా నేయటం మొదటగా మొదలు పెట్టింది మంగళగిరి నేతకారులనే చెప్పాలి. అలాగే, చిన్నా-పెద్దా, మహిళలందరినీ ఆకర్షించే విధంగా సరికొత్త రంగులు, పోకడలను ప్రవేశపెట్టింది మంగళగిరి నేత కళాకారులే. 40 నుంచి 120 కౌంట్ నూలుపోగులతో కూడా ఆకట్టుకునే వర్ణ కలయికలను ఆవిష్కరించారు. విదేశాలనుంచి కూడా ఇక్కడకు పెద్ద సంఖ్యలో ఆర్డర్లు వస్తున్నాయంటే దేశ విదేశాల్లో మంగళగిరి కాటన్ కున్న క్రేజు ఎంతో అర్థం అవుతుంది. సంప్రదాయసిద్ధంగా నూలు చీరలే నేసినా, మంగళగిరి నేతకారులు ఇప్పుడు కోయంబత్తూరు చీరలకు దీటుగా సీకో, పట్టు చీరలను నేస్తున్నారు. అంతే కాదు. కలంకారీ అద్దకం పనిని నూలు నేతకు జోడించి వీరు రూపొందిస్తున్న కొత్త డిజైన్లు కొనుగోలు దారులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. అందుకే, కాలేజి అమ్మాయిల వార్డ్ రోబ్ లలో మంగళగిరి నేత దుస్తులు ఇప్పుడు ఖచ్చితంగా ఉంటున్నాయి.



ఫోటోలు: మంగళగిరి నేతకారులు చేనేత వస్త్రంపై చేతితో డిజైన్ అద్దిన డ్రెస్ మెటీరియల్, మంగళగిరి నూలు డ్రెస్ మెటీరియల్.

**కొత్తకోట:**

భారీ జరీ పనితనంతో నేసే పమిట చెంగు, కొత్తకోట చీరలకు హాల్మార్క్ లాంటిది. నిండైన రంగులు, కొట్టొచ్చినట్లు కనబడే చీర అంచులు, అన్నిటినీ మించి సంక్లిష్టమైన జరీ నేతపని. మహారాష్ట్ర పైథానీ చీరల్లో సగం ఇక్కడే తయారవుతాయంటే అతిశయోక్తి కాదు. హైదరాబాద్ సంస్థానం అటు మహారాష్ట్ర, ఇటు కర్నాటక వరకు వ్యాపించి ఉన్నరోజుల్లో పైథానీ చీరలు జనాదరణ పొందాయి.

**గొల్లభామ చీరలు:**

మెదక్ జిల్లా సిద్ధిపేట పరిసర గ్రామాలలో చేతి మగ్గం మీద నేసే గొల్లభామ చీరలు ఒకప్పుడు కనుమరుగయ్యే పరిస్థితి ఎదురయినా, గత రెండేళ్ళుగా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ చేనేత సేవా కేంద్రం సహకారంతో పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. గొల్లభామచీరల డిజైన్లలో కొత్తదనాన్ని చొప్పిస్తూనే, సంప్రదాయ గుర్తింపును పరిరక్షించేందుకు కృషి చేస్తున్నారు. గొల్లభామ చీరలకు ఇప్పుడు బతుకమ్మ చీరల డిజైన్లు తోడయ్యాయి.



ఫోటోలు: గొల్లభామ చీర గొల్లభామ. సిద్ధిపేటలో నేసిన గొల్లభామ చీరలు. కరీంనగర్ వస్త్రాలకోసం చేనేత సేవా సంస్థ తయారు చేసిన కొత్త డిజైను.

**కరీంనగర్:**

కరీంనగర్ దుప్పట్లు, ఫర్నిషింగ్‌లకు పెట్టింది పేరు. మరమగ్గాల రాకతో గిరాకీ తగ్గిన దశలో చేనేత సేవా కేంద్రం కొత్త డిజైన్లను అందించి వస్త్ర ఉత్పత్తుల విస్తరణకు చేయూతను అందిస్తోంది.

**చీరాల:**

చీరాల సహా చుట్టూ పక్కల ప్రాంతాలలో పట్టు, నూలు చీరలు, ఇతర వస్త్రాలు నేస్తారు. ఒక్క ఊరికో మండలానికో ఇది పరిమితం కాలేదు. నూలు, జరీ దారాలతో 80 నుంచి 120 వరకు కౌంట్ తో నేసే చీరాల చీరలు జరీ అంచులతో వాటికి దన్నుగా, గట్టి అంచుతో చూడటానికి ముచ్చట గొల్పే విధంగా ఉంటాయి.

**నారాయణ పేట:**

నారాయణపేట మహబూబ్‌నగర్ జిల్లాలోని చిన్న పట్టణం. ఇక్కడ నేసే చీరాలు మహారాష్ట్రలోని షోలాపూర్, పూనె చీరలకు చాలా దగ్గరగా ఉంటాయి. నదురైన రంగులకు భిన్న రంగుల్లో అంచులు, అదే రంగు పమిట. అంచులపై రెండు జరీ కడ్డీ బోర్డర్లు వాటిపై చిన్న టెంపుల్ బార్డర్ .... ఇదీ నారాయణ పేట చీర స్వరూపం. ఏ వయసు వారికైనా హుందాతనాన్నిచ్చే ఈ చీరల జనాదరణ ఎన్ని కొత్త డిజైన్లు మార్కెట్టుకు వచ్చినా చెక్కుచెదరలేదు.

**ధర్మవరం:**

అనంతపురం జిల్లా ధర్మవరంలో అసలైన మల్బరీ పట్టు నుంచి తీసిన దారాలతో చేతి మగ్గాలపై (వీటినే గుంట మగ్గాలనీ అంటారు) నేసే పట్టుచీరలు ప్రపంచ ఖ్యాతి గడించాయి. వెడల్పైన అంచులు, గాఢమైన రంగులు సులభంగా గుర్తించే ప్రత్యేకమైన చీరలు. బ్రోకేడ్ పద్ధతిలో పెద్ద పమిట చెంగులతో బరువైన చీరలు నేసేవాళ్ళు. కాల క్రమేణ చీరల డిజైన్లలో మార్పులు చేశారు. అయితే ప్రయోగాలు చేయటం ధర్మవరం నేతకారులకు నిరంతర రివాజుగా ఉంటూ వస్తోంది. అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర నేసిన ధర్మవరం నేతకారులు, నిరంతర చందన పరిమళాలు వెదజల్లే చీరలు నేసి రికార్డు నెలకొల్పిన ఘటనలూ ఉన్నాయి. అయితే, ఈ ప్రయోగాత్మక చీరల ఖరీదు లక్షలలో పలకటంతో కేవలం ప్రయోగాలకే పరిమితం అయ్యాయి.

**మదనపల్లి:**

చిత్తూరు జిల్లా మదనపల్లి మునిసి పాలిటీ పట్టు చీరలు, నూలు చీరల నేతకు పేరు. అయితే పట్టు దారలతోనే అంచులు నేసే ప్రత్యేకత మదనపల్లిది. నూలు చీర అయినా, పట్టు చీర అయినా, పట్టు దారాలతోనేసే అంచులు ఈ వస్త్రాలకు ప్రత్యేకతను తెచ్చి పెడతాయి.

**మాధవరం:**

కడప జిల్లాలో పెన్నానది ఒడ్డున ఉన్న కుగ్రామం మాధవరం. ఇక్కడి చీరలు పేటు అంచులకు, జఖార్డ్ జరీ పమిట అంచులకు ప్రసిద్ధి. ముఖ్యంగా 6 గజాల చీరలను నేయటానికి ముందే మోదుగ పువ్వు రసంతో దారాలకు ఎర్ర రంగు తెప్పిస్తారు. మిగతా రంగుల కోసం కూడా ఎక్కువగా మూలికలను ఉపయోగిస్తారు.

**పొందూరు:**

ఖాదీ ప్రియులు అందరూ కోరుకునేది పొందూరు లాంటి మృదువైన ఖద్దరునే. ఆంధ్ర ప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా, పొందూరు పట్టణం దీర్ఘకాలంగా ఖద్దరు ఉత్పత్తి చేస్తోంది. స్థానికంగా ఉత్పత్తి అయ్యే పునాస పత్తి రకాన్నే పొందూరు వాసులు ఖద్దరు తయారీకి వినియోగిస్తారు. పత్తి నుంచి ఖద్దరు తయారయ్యే వరకు ఏ దశలోనూ యంత్రాలను వాడకుండా, పత్తిని వడికి ఏకులు చేసి, కండెలు చుట్టి, ఆపైన ఆస పోసి మగ్గాలకు ఎక్కించి చేతితో వస్త్రాన్ని నేయాలి. ఎంతో శ్రమతో కూడుకున్న ఈ ఖద్దరు ఖరీదు కూడా అదే వాసిలో ఉంటుంది. అయినా, రాష్ట్ర నుంచి జరిగే ఎగుమతులలో పొందూరు వాటా చూసినా, పర్యాటక రంగ పరంగా లభిస్తున్న ఆదాయం పరిగణనలోకి తీసుకున్నా ప్రపంచ చేనేత రంగంలో పొందూరు ఖాదీకున్న ఆదరణ ఎంతో తెలుస్తుంది.

**ఇతరాలు:**

తెలుగు రాష్ట్రాలలో ప్రత్యేకత సంతరించుకున్న చేనేతలు ఇంకా ఎన్నో ఉన్నాయి.తూర్పు గోదావరి జిల్లా కోనసీమ ప్రాంతంలోని ఓ కుగ్రామం బండారు లంకలో తయారయ్యే చీరలు– పట్టు అంచులు నూలు బూటా పనితో ప్రపంచ ఖ్యాతి పొందాయి. చారలు, చెక్స్ డిజైన్లతో గుంట మగ్గాలపై మచిలీపట్నంలో నేసే బందరు చేనేతలు కూడా అంతే ప్రాచుర్యం పొందాయి. గుంటూరు నూలు చీరలు మరో రకం. 100 కౌంటు నూలుతో నేసిన గుంటూరు చేనేత చీరలు పనితనానికి, గట్టిదనానికి పేరు. ఇక శ్రీకాకుళం, పాటూరు చీరలకున్న ఆదరణ అంతా ఇంతాకాదు.

ఏది ఏమైనా మారుతున్న కాలం, అభిరుచుల మేరకు తెలుగు వారి చేనేతల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. నూలు దారాలతో వర్ణ చిత్రాలను తలపించే చీరలను ఆవిష్కరించిన మంగళగిరి, వెంకటగిరి నేతకారులు ఇప్పుడు పట్టుతోనూ, సీకో గానూ నేస్తున్నారు. పట్టు చీరల కాణాచిగా ఉన్న ధర్మవరం నేతకారులు కొత్త ప్రయోగాలు చేస్తున్నారు. ఆయా చేనేతలకు ఉన్న సంప్రదాయాలను, ఆనవాయితీలను, నియమాలను పక్కన పెట్టి అన్నిచోట్లా నేతకారులు వినియోగదారుల అభిరుచులకు పెద్దపీట వేస్తున్నారు. ప్రభుత్వం, ఫ్యాషన్ సంస్థల సహకారంతో కొత్త కొత్త డిజైన్లు రూపొందిస్తున్నారు. ప్రపంచీకరణ, పెరిగిన పరిజ్ఞానం, అందుబాటులోకి వచ్చిన సాంకేతిక సహకారం, నానాటికీ పెరుగుతున్న పోటీ ...వీటన్నిటితో తెలుగు నేతకారులు సరికొత్త చేనేతల ఆవిష్కారానికి పోటీ పడుతున్నారు. ప్రపంచీకరణతో మగ్గాల మోత ఆగిపోతుందని, మిషన్ మీటల మాటున చేనేత కనుమరుగవుతుందని భావించిన వారి భయాలను పటాపంచలు చేస్తూ, భారతీయ చేనేతలు, అందునా తెలుగు రాష్ట్రాల చేనేతవెలుగులు విశ్వవిపణిని తాకుతున్నాయి.

■

**చేయూత**

# సిరిసిల్ల టెక్స్ టైల్ పరిశ్రమ ప్రస్థానం...




**సిరిసిల్ల వస్త్రపరిశ్రమ ఆటుపోట్ల నుండి తట్టుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడి నేతకార్మికులను ఆదుకోవడానికి టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేశాయి. ముఖ్యంగా కార్మికులకు చేతినిండా పనికల్పించి జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో టెక్స్‌టైల్ పార్క్‌లో పరిశ్రమలను నెలకొల్పే యాజమానులకు 80 శాతం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాయి. దీనితో ముందుకు వచ్చిన పారిశ్రామిక వర్గాలు పలు పరిశ్రమలను నెలకొల్పడంతో సుమారు 1200 మంది నేత కార్మికులు ప్రస్తుతం ఉపాధి పొందుతున్నారు.**

తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి టెక్స్‌టైల్ పార్క్ కరీంనగర్ జిల్లా సిరిసిల్లా మండల శివారులోని బద్దెనపల్లి – సారంపల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేశారు. సుమారు 60ఎకరాలలో రూ. 7,73,39,000 అంచనా వ్యయంతో 2002–03లో అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రారంభించాయి. మొదట 60ఎకరాలలో ఆ తర్వాత 2004లో అదనంగా మరో 15ఎకరాలను కేటాయించాయి. మొత్తం 75ఎకరాలలో టెక్స్‌టైల్ పార్కు విస్తరించగా అందులో 1457 మగ్గాలు 57 వార్పు యంత్రాలు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. పార్క్‌లో పరిశ్రమల స్థాపనలకు మహారాష్ట్ర, గుజరాత్, హైదరాబాద్‌ల నుండే కాకుండా స్థానికులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపారు.

**టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు కారణం:**

సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు పెట్టింది పేరు. దేశవ్యాప్తంగా చేనేత పరిశ్రమకు మంచి గుర్తింపు తెచ్చిన అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసిన నల్ల పరంధాములు ఇక్కడి వాడే. అయితే, సిరిసిల్లలో 90శాతం మంది వస్త్ర పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరందరికీ సరైన సదుపాయాలు లేక ఇతర ప్రాంతాలు, భివాండీ, గుజరాత్, షోలాపూర్ లాంటి ప్రాంతాలకు జీవనోపాధి కోసం వలస వెళ్లడం అప్పట్లో సాధారణం. ప్రతి సంవత్సరం 7,8,9వ నెలలలో ఆషాఢ, శ్రావణ మాసాల సందర్భంగా వస్త్ర ఉత్పత్తి తక్కువగా ఉండడం ఆ సమయంలో తిరిగి సొంత ప్రాంతానికి రావడం, పనిలేక ఆదాయం రాక కుటుంబ అవసరాలకు ఖర్చులు అధికం కావడం వాటిని భరించలేక మానసికాందోళనకు తోడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో నేతన్నలు ఆత్మహత్యలకు పాల్పడడం జరుగుతుండేది. అలాంటి పరిస్థితుల్లోనే 2002లో సుమారు 70మంది వరకు ఆత్మహత్య చేసుకోవడం అందులో కొండ కిష్టయ్య అనే నేత కుటుంబం మొత్తం అయిదుగురు సామూహికంగా ఆత్మహత్య చేసుకోవడం అప్పట్లో దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టి నేతన్నలకు మరింత ఉపాధి చూపెట్టాలనే ప్రణాళికను తయారు చేశారు. అందులో భాగంగానే టెక్స్‌టైల్ పార్క్‌కు రూపకల్పన జరిగింది.

**పరిశ్రమల నిర్మాణం కొరకు భూకేటాయంపులు :**

పరిశ్రమల యజమానులకు ఒక్కొక్కరికి 1200, 600ల చదరపు గజాలు, వాణిజ్య అవసరాల కొరకు 300 గజాలు కేటాయించారు. మొత్తం 237 ప్లాట్లు ఉండగా

**హనుమాండ్ల సంపత్ కుమార్,** ఫ్రీలాన్సర్, కరీంనగర్
E-mail: sampathkumar.dd@gmail.com

దీనిలో 208 ప్లాట్లు పారిశ్రామిక అవసరాలకు, 29 ప్లాట్లు వాణిజ్యపరంగా కేటాయించారు. తర్వాత కేటాయించిన 15 ఎకరాల స్థలాన్ని కనీస మౌళిక సదుపాయాల కొరకు ఇవ్వాలని నిర్ణయించారు. సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్‌లో రోజుకు 2 లక్షల మీటర్ల వస్త్రం ఉత్పత్తి జరుగుతుంది. ఇందులో మూడు రకాల వస్త్రాలు తయారవుతున్నాయి. పూర్తిగా పాలిస్టర్, కాటన్‌తో పాటుగా పాలిస్టర్ కాటన్‌ల మిక్సిడ్‌తో వస్త్ర ఉత్పత్తి జరుగుతుంది.

**ప్రభుత్వ సహకారం:**

టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 70శాతం, కేంద్ర ప్రభుత్వం 30శాతం నిధులను అందించాయి, కేంద్ర ప్రభుత్వం జౌళి నవీకరణ నిధి (TUFS) పథకం కింద నూతనంగా మరమగ్గాలు ఏర్పాటు చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం పురుషులకు 15శాతం, మహిళలకు 20శాతం రాయితీలను ఇచ్చి ప్రోత్సహించాయి. అలాగే పరిశ్రమలోని 26 మంది యాజమానులకు 2005 మే నుండి 2009 డిసెంబర్ వరకు 45 లక్షల 45 వేల రూపాయల మేరకు విద్యుత్ సబ్సిడీని ప్రభుత్వం అందించింది. అలాగే 116 మంది పరిశ్రమల యాజమానులకు 2010 నుండి 2014 వరకు ఐదు సంవత్సరాల పాటు 8 కోట్ల 86 లక్షల రూపాయలకు గాను 7 కోట్ల 19 లక్షల రూపాయల విద్యుత్ సబ్సిడీని ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా సబ్సిడీ ఇంకా విడుదల చేయాల్సిఉంది.

**మౌళిక సదుపాయాల కల్పన:**

టెక్స్‌టైల్ పార్క్‌లో కనీసవసరమైన నీటికి తగిన సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోంది. తక్షణ నీటి అవసరాల కోసం 2 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను టెక్స్‌టైల్ పార్క్‌లో నిర్మించారు. దీనికి అదనంగా 1లక్ష లీటర్ల నీటి సామర్థ్యం గల మరో ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఇవే కాకుండా ప్రభుత్వం గతంలో మంజూరు చేసిన 1.25కోట్ల రూపాయలతో ఒక ప్రధాన రహదారి, 12 అంతర్గత రహదారులను కూడా నిర్మించారు. మురుగునీటి కోసం ప్రత్యేక కాల్వల నిర్మాణం పూర్తి చేశారు.

**నీటి కొరతే పరిశ్రమలకు ప్రధాన సమస్య:**

టెక్స్‌టైల్ పార్క్‌లో ప్రాసెసింగ్ యూనిట్ లేక పోవడంతో పారిశ్రామిక వేత్తలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇందుకు ప్రధానంగా నీటి కొరత కారణమని చెప్పవచ్చు. మహారాష్ట్ర, సూరత్ నుండి వచ్చిన పారిశ్రామికులు ప్రాసెసింగ్ యూనిట్‌లు ప్రారంభించినా నీటి సౌకర్యం లేక పోవడంతో పరిశ్రమలోని పనులను మధ్యలోనే వదిలేస్తున్నారు. నీటి వసతి కోరకు కోటి 20 లక్షల రూపాయలను వెచ్చించి నిర్మించిన శుద్ధ జల ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. నీటి వసతి కల్పించాలని పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనితో సిరిసిల్ల త్రాగునీటి సరఫరా పథకం నుండి ప్రతి రోజు నాలుగు లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయడానికి ప్రణాళికలు సిద్దం చేశారు.

**విద్యుత్ భారం:**

ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీలను భరిస్తున్నా కూడా సబ్సిడీ సకాలంలో అందక పోవడంతో పరిశ్రమల యాజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిరిసిల్లలోని మరమగ్గాల పరిశ్రమకు రాయితీతో యూనిట్ 2 రూపాయల 57 పైసలకు వస్తుండగా, పరిశ్రమలో మాత్రం 6 రూపాయల 14 పైసలు వసూలు చేస్తున్నారు. దీనివలన కరెంటు బిల్లులు భారంగా మారాయి. మహారాష్ట్రలో మాదిరిగా పరిశ్రమలో 2 రూపాయలకు యూనిట్ చొప్పున విద్యుత్తు అందించాలని పారిశ్రామిక వేత్తలు కొరుతున్నారు.

**పరిశ్రమలో కార్మికుల స్థితిగతులు :**

సిరిసిల్ల వస్త్రపరిశ్రమ ఆటుపోట్ల నుండి తట్టుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడి నేతకార్మికులను ఆదుకోవడానికి టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేశాయి. ముఖ్యంగా కార్మికులకు చేతినిండా పనికల్పించి జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో టెక్స్‌టైల్ పార్క్‌లో పరిశ్రమలను నెలకొల్పే యాజమానులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80శాతం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాయి. దీనితో ముందుకు వచ్చిన పారిశ్రామిక వర్గాలు పలు పరిశ్రమలు నెలకొల్పడంతో సుమారు 1200 మంది నేత కార్మికులు ప్రస్తుతం ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు కుదేలవుతున్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో పనిలేకపోవడంతో టెక్స్‌టైల్ పార్కులో ఉపాధి దొరుకుతుందని ఆశించిన కార్మికులకు అక్కడ కూడా నిరాశే ఎదురైంది. కష్టపడి పనిచేస్తున్నా సరైన కూలీ అందడం లేదని కార్మికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు చట్టపరంగా ఇవ్వాల్సిన కూలీతో పాటుగా PF, ESI, ఆదివారం సెలవు, 8 గంటల పని, పరిశ్రమలో మౌలిక వసతులు కల్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అయినప్పటికి తమ లాభాన్నే ఆశించారు కానీ తమ సమస్యలను పరిష్కరించాలని కొరుతూ కార్మికులు ఈ సంవత్సరం 45 రోజులకు పైగా నిరవధిక సమ్మె చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకనుగుణంగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి కూలీ రేట్లను పెంచేలా అధికారులు, యజమాన్యాలు, కార్మిక సంఘాల నాయకుల మధ్య 5 సంవత్సరాల క్రితం ఒప్పందం జరిగింది. అయితే ఈ ఒప్పందాన్ని అమలు చేయక పోవడంపట్ల నేత కార్మికులు నిరసన తెలుపుతున్నారు.

**ముగింపు :**

దేశంలోనే పేరుగాంచిన సిరిసిల్ల వస్త్రపరిశ్రమ నేతన్నలను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలను ప్రకటించినప్పటికీ, వాటిని సక్రమంగా అమలు చేయకపోవడంతో కార్మికుల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి. సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కులో యార్న్ బ్యాంకుతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి కార్మికుల హక్కులను పరిరక్షిస్తే ఈ టైక్స్‌టైల్ పార్కు విలసిల్లుతుందని భావించవచ్చు.

■

ప్రోత్సాహకాలు

# నేతకారుల సేవా కేంద్రాలు

**చేనేత రంగాన్ని ప్రోహత్సహించడానికి ప్రభుత్వం దేశీయ వ్యాప్తంగా 28 చేనేత సేవా కేంద్రాలు ఏర్పాటు చేసింది. దేశీయ రక్షణ విధానంలో భాగంగా చేనేత మగ్గాల ఉత్పత్తులకు మరమగ్గాలు పోటీ రాకుండా పదకొండు రకాల ఉత్పత్తులను చేనేత రంగానికి మాత్రమే రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం చట్టాన్ని *The Handlooms (Reservation Of Articles For Production) Act,* 1985 చేసింది.**

చేనేత రంగం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మొత్తం 43 లక్షలకు పైగా ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, దేశంలో సాలుసరి ఉత్పత్తి అవుతున్న మొత్తం వస్త్రంలో 15 శాతాన్ని అందచేస్తున్నది. ప్రభుత్వం తీసుకుంటున్న అనేక ప్రోత్సాహక చర్యల ఫలితంగా, నేడు చేనేత రంగం ప్రోత్సాహకరంగానే ఉన్నది. డిమాండుకు అనుగుణంగా వస్త్రాల ఉత్పత్తి, గిట్టుబాటు ధరల నిర్ణయం, ఉత్పత్తి, అమ్మకాలలో వైవిధ్యపోకడలు ఈ రంగానికి ప్రోత్సాహాన్ని ఇస్తాయి.

కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖకు చెందిన చేనేత అభివృద్ధి కమీషనర్ అనేక ప్రోత్సాహక చర్యలనూ, సహాయ కార్య క్రమాలనూ అమలుచేస్తున్నారు. చేనేతకారుల సేవా కేంద్రాలు వీటిలో ఒక విధానం. దేశం మొత్తం మీద ఇటువంటి కేంద్రాలు 28 ఉన్నాయి. మొదటి ఇలాంటి కేంద్రాన్ని ముంబైలో 1956లో ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కేంద్రం కింద కనీసం 15 వేల మగ్గాలుండేలా విభజించారు. వీటికి ప్రభుత్వ సహాయం రూ 40 కోట్ల వరకు ఉంటుంది. ఫిబ్రవరి 03, 2016 వరకు మొత్తం 53 బ్లాక్ స్థాయి కేంద్రాలను ఏర్పాటుచేసి, రూ. 31.91 కోట్లను మంజూరు చేశారు.

ప్రధానమంత్రి ప్రకటించిన ముద్ర పథకం కింద ఒక్కొక్క కేంద్రానికీ ఐదు లక్షల రూపాయలను మంజూరు చేశారు. ఈ కేంద్రాలు ముఖ్యంగా వస్త్రాల నూతన నమూనాలను రూపొందించ డానికి ప్రోత్సాహం, ఇలా రూపొందించిన నమూనాలకు వస్త్రం రూపంలో ఆకారాన్ని కల్పించడం, నమూనాల రూపకల్పనలో ఔత్సాహికులకు తగిన శిక్షణ,ప్రోత్సాహం,



**చేనేత ఉత్పత్తిలో వివిధ దశలు**

**వి. హిమజకుమార్,** సహాయ సంచాలకులు, చేనేత సేవా కేంద్రం, హైదరాబాద్.
E-mail: himajakumar@gmail.com

అవసరమైన మూలధన, ముడిసరుకు, ఉపకరణాల అందచేస్తున్నారు. ఉత్పత్తుల మార్కెటింగ్‌కు తగిన అవకాశాలు కల్పిస్తున్నారు. నేతకారుల సేవా కేంద్రాలు కార్మికుల సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచడంలో ఇతోధికంగా కృషి చేస్తున్నాయి. తద్వారా వారి జీవన ప్రమాణాలు కూడా మెరుగు పడతాయి. వారి ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలకు సంతలు, ప్రదర్శనలు ఏర్పాటు చేయడంలో ఈ కేంద్రాలు సహకరిస్తాయి.

క్లస్టర్ అప్రోచ్ అనేది మరొక ప్రోత్సాహక కార్యక్రమం. దీనిలో 300 నుండి 25000 ల మగ్గాలవరకు గ్రూపులుగా విభజించి, వారికి *Mill Gate Price Scheme,* MGPS విధానంలో ముడినూలును తక్కువ ధరకు అందచేస్తారు. అదనంగా ఉత్పత్తుల మార్కెటింగ్ కు కూడా తగిన ఏర్పాట్లు చేస్తారు. దీనిలో భాగంగా ప్రతి సంవత్సరం చేనేత వారోత్సవాలను నిర్వహిస్తున్నది. చేనేత అనేది మన సంస్కృతిలో ఒక భాగం. పదకొండవ పంచవర్ష ప్రణాళిక కాలంలో వివిధ పథకాలన్నింటినీ సమీకృత చేనేత అభివృద్ధి పథకం అనే గొడుగు కిందకు తెచ్చారు. క్లస్టర్ లెవెల్ పథకాన్ని బ్లాక్ లెవెల్ పథకంగా మార్చారు. నేతకారుల శిక్షణ కోసం *Indian Institute Of Handloom Technology,* IIHT అనే సంస్థను కూడా ఏర్పాటు చేశారు. దేశీయ రక్షణ విధానంలో భాగంగా చేనేత మగ్గాల ఉత్పత్తులకు మరమగ్గాలు పోటీ రాకుండా పదకొండు రకాల ఉత్పత్తులను చేనేత రంగానికి మాత్రమే రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం చట్టాన్ని *The Handlooms (Reservation Of Articles For Production)* ACT, 1985 చేసింది. ■


**మహాత్మునిగా మారిన మనిషి కథ చదవండి**



పబ్లికేషన్స్ డివిజన్
సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ
భారత ప్రభుత్వం

**స్వాగతం**

**గాంధీ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పుస్తక ప్రదర్శన మరియు అమ్మకాలు**

**30-09-2016 నుండి 14-10-2016 వరకు**

**35 శాతం వరకు డిస్కౌంట్ పొందండి**

**అందుబాటు ధరల్లో గాంధీ సాహిత్యం**

- Mahatma Gandhi as a student.
- Mahatma Gandhi a pictorial biography.
- Mahatma Gandhi a great life in brief.
- The Charaka and the Rose.
- Satyagraha.
- A Thought for the day.
- Gandhi in Champaran.
- Collected works of Mahatma Gandhi in 100 volumens.
- Bapu Sannidhyam (Telugu)

సందర్శించండి
సేల్స్ ఎంపోరియం, పబ్లికేషన్స్ డివిజన్,
సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ: భారత ప్రభుత్వం,
రూమ్ నం. 204, 2వ అంతస్తు, సి.జి.ఓ టవర్స్, కవాడిగూడ,
హైదరాబాద్ - 500 080. ఫోన్ 040-2753 5383
E-mail: bmsehyd@gmail.com

# మనసు దోచే పొందూరు ఖాదీ



**పొందూరు ఖాదీకి అంత పేరు ప్రఖ్యాతలు రావడానికి ప్రధాన కారణం కొండపత్తి. వస్త్రాలకు ముడి సరుకు ఈ పత్తే. కొండపత్తి సహా పునాసపత్తి, ఎర్రపత్తిని కూడా వినియోగిస్తున్నారు. చేప ముళ్లతో శుభ్రం చేసిన ఈ పత్తితో 11 రకాల వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నారు. మగ్గం మీద, రసాయనాలు వాడకుండా చీరలు, పంచెలు, తయారుచేస్తున్నారు. దేశ, అంతర్జాతీయ మార్కెట్‌లో పొందూరు వస్త్రాలకు ప్రత్యేక గిరాకీ ఉంది. పొందూరులోని ఆంధ్ర సన్న ఖాదీ పరిశ్రమకు పేటెంటు హక్కు లభించింది.**

సత్యం, అహింసలపై నిర్మితమైన ఆర్థిక సామాజిక నిర్మాణానికి కుటీర పరిశ్రమలు పునాదులు అయితే అందులో ఖాదీ పరిశ్రమ గ్రహ మండలంలో సూర్యుని వంటిదని మహాత్ముడు అన్న మాటలు ముమ్మాటికీ నిజం. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖ్య భూమిక వహించిన వాటిలో ఖాదీ ఒకటి. సర్వమత సమ్మేళనమైన అఖండ భారతావనిలో ప్రజలందర్నీ ఏక తాటి మీదకు తీసుకువచ్చిన ఘనత ఖాదీదే. స్వరాజ్య పోరాటంలో ఖాదీ, చరఖా, ఉప్పు ఈ మూడు ఆంగ్లేయులకు ముచ్చెమటలు పట్టించాయి. స్వదేశీ ఉద్యమానికి ఖాదీ రథసారధి అయ్యింది. స్వాతంత్రోద్య మంలో ఖాదీ కీలక పాత్ర పోషించే నాటికే ఆంధ్ర నాట సన్న ఖాదీ రాజ్యమేలుతోంది. ప్రపంచం దృష్టిని తన వైపు మళ్లించగలిగిన సన్న ఖాదీని ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా పొందూరులోనే అంటే ఆశ్చర్యం కలగక మానదు. తూర్పు తీరంలో బంగాళాఖాతానికి అతి చేరువలో ఉన్న పొందూరు మండలం సన్న ఖాదీ ఉత్పత్తికి కేంద్ర బిందువు.

స్వాతంత్రోద్యమం పతాక స్థాయిలో ఉన్న సమయంలో అంటే 1921లోనే ఆంధ్ర సన్న ఖాదీ వస్త్రాలు గాంధీజీ దృష్టిలో పడ్డాయి. సన్న ఖాదీ వస్త్రాల నాణ్యతను చూసి గాంధీజీ మంత్రముగ్ధులయ్యారు. పత్తి వడుకు విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయినా ఆయన సంతృప్తి చెందలేదు. తన కుమారుడు దేవదాసు గాంధీని రంగంలోకి దించారు. పొందూరు వెళ్లి సన్ననూలు, వడుకునేత విధానాలను కూలంకషంగా తెలుసుకుని రావాలని ఆదేశించారు. దేవదాసు గాంధీ పొందూరులో నూలు, వడుకు ఈ రెండింటి గురించి తెలుసుకున్నారు. తాను చూసిన, తెలుసుకున్న విషయాలను గాంధీజీకి వివరించారు. ఇదే విషయాన్ని బాపూజీ పర్యవేక్షణలో వెలువడిన యంగ్ ఇండియా పత్రికలో ప్రచురించారు. అంతే ఒక్కసారిగా పొందూరు ఖాదీ దశ మారిపోయింది. భారతదేశ వ్యాప్తంగా పొందూరు ఖాదీకి ప్రచారం లభించింది. అలా విశ్వ వ్యాప్తమయ్యింది పొందూరు సన్న నూలు ఖాదీ.

ఖాదీని గంగానదిగా భావిస్తే...

పొందూరు ఖాదీ గంగా నదికి జన్మనిచ్చిన గంగోత్రిగా అభివర్ణించవచ్చు...

తారా భట్టాచార్జి (గాంధీ మనుమరాలు)

ఎంతో మంది ప్రముఖులు పొందూరు ఖాదీపై తమ మనోగతాన్ని వ్యక్తం చేశారు. చేస్తున్నారు. అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన ఈ

**ఎన్.నాగేశ్వరరావు,** ఫ్రీలాన్సర్, విశాఖపట్నం
E-mail: naganaboina@gmail.com

ఖాదీకి 1924లోనే అపురూపమైన గౌరవం దక్కింది. వెంబ్లెలో నిర్వహించిన బ్రిటిష్ ఎంపైర్ ఎగ్జిబిషన్‌లో పొందూరు, బొంతల కోడూరుకు చెందిన ఖాదీ వస్త్రాలను ప్రదర్శించారు. బ్రిటిష్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో ఖాదీ ప్రతినిధిగా హాజరైన శంకర శాస్త్రికి సత్కారం లభించింది. ఈ ప్రదర్శన ఖాదీ చరిత్రలో ఒక మైలు రాయిగా నిలిచిపోయింది.

### ఇందిరమ్మను ఆకట్టుకున్న పొందూరు ఖాదీ

దేశ రాజధాని కొత్త ఢిల్లీ కేంద్రంగా 1992లో నిర్వహించిన ఆసియా స్థాయి ప్రదర్శనలో సన్న ఖాదీ, వడుకు నేత ప్రక్రియలను నాటి ప్రధాని ఇందిరా గాంధీ స్వయంగా పరిశీలించి కార్మికుల హస్త కళా నైపుణ్యాన్ని కొనియాడారు. పొందూరు నేత కార్మికులు దేశంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించి ఖాదీ ప్రదర్శనలలో పాల్గొని బహుమతులు గెల్చుకుంటున్నారు.

తమిళనాడులోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టి) విద్యార్థులు పొందూరు ఖాదీ పరిశ్రమను 1996లో పరిశీలించి తన్మయత్వం చెందారు. ముంబయి కేంద్రంగా వెలువడుతునన జాగృతి పత్రిక తన వ్యాసంలో ఢక్కా మజ్లిన్ వస్త్రాలతో పొందూరు ఖాదీని సరిపోల్చవచ్చునని పేర్కొంది.

### మంత్రముగ్ధులైన తారా

మహాత్మా గాంధీ మనుమరాలు, కె.వి.ఐ.సి. తూర్పు మండలం ప్రతినిధి తారా భట్టాచార్జి పొందూరు ఖాదీ పరిశ్రమను మూడు సార్లు సందర్శించారు. నేతన్నలతో హస్త కళా నైపుణాన్ని దగ్గరగా చూశారు. కార్మికుల సంక్షేమానికి రూ. 30 వేలు విరాళంగా అందజేశారు.

### మల్లెమడుగుల వారి శాస్త్రీయ దృక్కోణం

ప్రముఖ గాంధేయవాది, ఖాదీ ఉద్యమ పితామహుడు మల్లెమడుగుల కోదండ రామస్వామి పొందూరు ఖాదీ సంస్థకు అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఈ వ్యవస్థ రూపు రేఖలే మారిపోయాయి. సన్న ఖాదీకి శాస్త్రీయ నిబంధనలను రూపొందించిన ఘనత రామస్వామికే దక్కుతుంది. ఆయన హయాంలో ఖాదీ నిర్వహణ స్వర్ణ యుగాన్ని తలపించిందని అంటారు.

### పరిశోధనలు

సన్న ఖాదీ పరిశ్రమపై బరంపురానికి చెందిన డాక్టర్ ఉప్పల లక్ష్మణరావు, ఆయన సతీమణి మెల్లీ సోలింగర్ సంయుక్తంగా పరిశోధన చేశారు. కొన్నాళ్లపాటు మండలంలోనే ఉండి పరిశ్రమ స్థితిగతులను సవివరంగా తెలుసుకుని విలువైన సమాచారంతో సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం కిల్లాం గ్రామానికి చెందిన ఉట్ల అప్పారావు నేతన్నల ఆర్థిక, సామాజిక పరిస్థితులను తెలియజేస్తూ స్టేట్ ఆఫ్ ఖాదీ ఇండస్ట్రీ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే సిద్ధాంత గ్రంథాన్ని రాశారు. దీనికి 2005లో ఆంధ్రా యూనివర్శిటీ డాక్టరేట్ అందజేసింది.

### జరీ అంచు చీరలో నూలు దారం

నాటి ప్రధాని ఇందిరా గాంధీ ధరించిన జరీ అంచు చీరల్లో వాడిన నూలు దారాన్ని పొందూరు సూరమ్మ వడికింది కావడం విశేషం. సూర్యం అనే పిలువబడే మాడుగుల సూరమ్మ వడికిన నూలు దారాన్ని ఇందిరమ్మ ధరించిన జరీ అంచు చీరల్లో వాడేవారు. గ్రామీణ హస్త కళల్లో కేంద్ర ప్రభుత్వం ఏటా ఇచ్చే జాతీయ అవార్డును 2007లో గెల్చుకున్న సందర్భంగా సూరమ్మ ఈ విషయాన్ని తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి ప్రణబ్ ముఖర్జీ నుండి పాతిక వేల రూపాయల నగదు, ప్రశంసా పత్రాన్ని ఆమె అందుకున్నారు.

### మల్లన్నకు తలపాగా

పొందూరు నేత కళకారులు శ్రీశైలం మల్లన్నకు తలపాగాను కానుకగా అందజేస్తుంటారు. గడచిన అయిదు దశాబ్దాలుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. శ్రీ మల్లిఖార్జున స్వామి వారికి 366 మూరలు (160 మీటర్ల పొడవు, 48 సె.మీ. వెడల్పు) ఉన్న తలపాగా, శ్రీ భ్రమరాంబ అమ్మవారికి ఆరు మీటర్ల పసుపు అంచు చీర, శెనగల బసవన్నకు ఆరు మీటర్ల ఎరుపు పంచె సమర్పిస్తుంటారు. ఈ వస్త్రాల నేతకు కనీసం నెల రోజుల వ్యవధి పడుతుంది. నేత పూర్తైన తరువాత తలపాగాను శివలింగం ఆకారంలో చుట్టి పట్టణ వీధుల్లో ఊరేగిస్తారు.

### అక్కినేని అంచు పంచెలు

తెలుగు వెండి తెర కథానాయకుడు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు పేరుతో పొందూరు అంచు పంచెలు అన్నాయంటే సాధారణ ప్రజలకు ఆశ్చర్యం కలగమానదు. ఇది నిజం. నాలుగు దశాబ్దాల క్రితమే ప్రత్యేకంగా అంచు పంచెను అక్కినేని నాగేశ్వరరావు డిజైన్ చేయించారు. ఆయన డిజైన్ చేసిన అంచు పంచెలు మార్కెట్‌లో విపరీతంగా అమ్ముడుపోయాయి. దీంతో నాటి నుంచి నేటికీ ఆ డిజైన్ పంచెలను పొందూరు నేత కార్మికులు నేస్తూనే ఉన్నారు.

### రూ. లక్షలు ఖరీదు చేసే చీర

పొందూరు పేపర్ వర్క్ చీర ధర లక్షల రూపాయలు విలువ చేస్తుందంటే ఆశ్చర్యం కలగకమానదు. విదేశాలలో ఒక్కో చీర మూడు నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు పలుకుతున్నాయి. కాగితంపై నమూనా ఆధారంగా దారాలతో ఈ చీరలను నేస్తారు. పేపర్ వర్క్ జరీ, మూగాసిల్క్ చీరలు ఈ తరహాలో తయారవుతాయి. అసోంలో లభ్యమయ్యే బంగారు వన్నె పట్టుదారాలతో మూగా సిల్క్ రూపుదిద్దుకుంటోంది. రసాయనాలు వాడకుండా కేవలం మగ్గంపైనే నేస్తారు. నేత చీరలకు రెండు వైపులా ఒకేలా ఉంటుంది. తారుమారైన కనిపెట్టలేం. 12 రకాల దారాలు మూగా, కాటన్, అంబర్

వంటివి వినియోగిస్తారు. ఈ తరహా చీరలను పొందూరు, తండ్యాంమెట్ట, దేవరవలస, పాతకుంకాం, రాజాం మండలంలోని పెనుబాక, బొద్దాం, శ్రీకాకుళం మండలంలోని అలికాం, ఆమదాలవలస మండలంలోని వేణమ్మపేట, అకుక్లపేట తదితర ప్రాంతాలలో నేస్తారు. ఒక్క చీర పొడవు రవికతో కలిపి ఏడు మీటర్లు అంటుంది. ఈ చీరల అంచులు రాణీ రంగు, ఊదా, పసుపు వచ్చ, ఆకుపచ్చ, లేత ఆకుపచ్చ రంగుల్లో ఉంటాయి. బంగారు, వెండి జరీలను పొందుపరుస్తారు. ఒక చీర తయారు కావడానికి రెండు నుంచి మూడు నెలలు పడుతుంది.

## వాలుగ ముల్లే మూలం

విశ్వ ఖ్యాతినార్జించిన పొందూరు ఖాదీ వెనుక చేప ముళ్లు ఉన్నాయంటే ఎవరూ నమ్మరు. ఎందుకంటే ఖాదీ వస్త్రాలకు చేప ముళ్లకు సంబంధం ఏంటని ప్రశ్నిస్తారు. పత్తిని శుభ్రం చేయడానికి వాలుగా చేప ముళ్లను పొందూరు ఖాదీ కార్మికులు వినియోగిస్తుంటారు. వాలుగు చేప దవడ కింద, మీది భాగాలను శుభ్రపరిచి ఎండలో ఆరబెట్టి నాలుగు ముక్కలుగా కోస్తారు. తరువాత ఆ ముక్కలను చిన్న కర్రలకు కదలకుండా కట్టి దాని సాయంతో గింజలో ఉన్న ముడి పత్తిని శుభ్రం చేస్తారు. పత్తిలోని ఆకు పొల్లును తొలగించి దానిని ధగ ధగ మెరిసేలా చేసేది ఈ ముల్లే. ఈ ముల్ల ఖరుదీ రూ. 20 నుంచి రూ. 40 వరకు ఉంటుంది.

## కొండపత్తే ముడి సరుకు

పొందూరు ఖాదీకి అంత పేరు ప్రఖ్యాతలు రావడానికి ప్రధాన కారణం కొండపత్తి. వస్త్రాలకు ముడి సరుకు ఈ పత్తే. కొండపత్తి సహా పునాసపత్తి, ఎర్రపత్తిని కూడా వినియోగిస్తున్నారు. చేప ముళ్లతో శుభ్రం చేసిన ఈ పత్తితో 11 రకాల వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నారు. మగ్గం మీద, రసాయనాలు వాడకుండా చీరలు, పంచెలు, లాల్చీలు తయారుచేస్తున్నారు. దేశ, అంతర్జాతీయ మార్కెట్‌లో పొందూరు వస్త్రాలకు ప్రత్యేక గిరాకీ ఉంది. పొందూరులోని ఆంధ్ర సన్న ఖాదీ పరిశ్రమకు పేటెంటు హక్కు లభించింది. పొందూరు ఖాదీని రక్షించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నకిలీ ఖాదీని అరికట్టేందుకు ఈ పేటెంటు హక్కు ఉపయోగపడుతుంది. ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు పొందూరు ఖాదీ పేరుతో విక్రయాలు నిర్వహిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటారు. అసలైన ఖాదీని గుర్తించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు కలిగిన స్టాంపు, బాడ్జీలను వస్త్రాలపై ముద్రిస్తున్నారు. అఖిల భారత ఖాదీ గ్రామోద్యోగ కమీషన్ (ఎఐకెవిఐసి) ఇప్పటికే ఇందుకు సంబంధించిన లోగోను విడుదల చేసింది.



## విశ్వ విఖ్యాతం

పొందూరు ఖాదీ విశ్వ విఖ్యాత మయ్యింది. నాణ్యమైన, అందమైన పొందూరు వస్త్రాలు ప్రపంచ వ్యాప్తంగా మన్ననలు పొందుతున్నాయి. అమెరికా, కెనడా, నార్వే, జర్మనీ, డెన్మార్క్, జపాన్, అమెరికా తదితర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. విదేశీ డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తులను అందించలేకపోతున్నామనే చెప్పవచ్చు. దేశీయ మార్కెట్‌లోనే పొందూరు వస్త్రాలు వీటి గిరాకీ గురించి చెప్పనక్కరలేదు.

## ముడిసరుకు కొరత

పొందూరు ఖాదీ ఉత్పత్తిని ముడిసరుకు కొరత పట్టి పీడిస్తోంది. ఖాదీకి ముడిసరుకు పత్తి కాగా, పొందూరు ఉత్పత్తులకు కొండ పత్తి, పునాస పత్తి, ఎర్ర పత్తిని వాడుతున్నారు. ఈ పత్తి ఆశించిన స్థాయిలో లభ్యం కావడం లేదు. ఏటా 20 వేల కిలోల పత్తిని ఇక్కడ నేతలు వాడుతున్నారు. గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు ఈ పంటను పండించడం లేదు. ముడి సరుకు కొరత వల్ల ఉత్పత్తులు సన్నగిల్లిపోతున్నాయి.

## లక్ష్యాలను అధిగమిస్తూ

పొందూరు ఖాదీ ఉత్పత్తులు లక్ష్యాలను చేరుకుంటున్నాయి. ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి) నిర్దేశించిన లక్ష్యాలను అందుకునేందుకు గుర్తింపు పొందిన నాలుగు సంఘాలు పోటీ పడుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళల్లో అంటే 1949లో ఆవిర్భవించిన ఆంధ్ర సన్న ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం (ఎఎఫ్‌కెకె) గత ఆర్థిక సంవత్సరం నిర్థేశించిన రూ. ఒక కోటి 40 లక్షల లక్ష్యాన్ని అధిగమించింది. మరో రూ. 15 లక్షల విలువ గల ఉత్పత్తులను అదనంగా అందించింది. 1954లో ఆవిర్భవించిన ఎస్.జె.ఎన్.కె. సంఘం రూ. కోటి ఆరు లక్షల ఉత్పత్తులతో ద్వితీయ స్థానంలో ఉంది. 1966లో వెలసిన ఒకనాటి అతి పెద్ద సంస్థ గ్రామ స్వరాజ్ సంఘం రూ. 92 లక్షల ఉత్పత్తులను సరఫరా చేసింది. 1993లో ఏర్పాటైన గాంధీ ఖాదీ ప్రొడక్ట్స్ అండ్ సేల్స్ ఐసిఎస్ లిమిటెడ్ రూ. 42.67 లక్షలకే పరిమితమయ్యింది. ఈ నాలుగు సంస్థలను కె.వి.ఇ.సి. గుర్తించింది. ఈ నాలుగు సంస్థల్లో 3330 మంది నేతలు, వడికలు ఉన్నారు. వారికి జనశ్రీ బీమా యోజనను కె.వి.ఇ.సి. కల్పిస్తోంది. ప్రమాదానికి గురైతే రూ. 70 వేలు, సాధారణ మరణానికి రూ. 30 వేలు పరిహారం చెల్లిస్తోంది. అదే విధంగా నేత కార్మికలకు వర్క్ షెడ్లు నిమిత్తం రూ. 60 వేలు గ్రాంట్‌ను కూడా విడుదల చేస్తోంది.

■

# జౌళి రంగం అభివృద్ధికి క్లస్టర్ వ్యూహం



**ఈ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించి నిలబెట్టు కోవాలంటే కొన్ని చర్యలు అవసరం. ఇందులో భాగంగా దుస్తులు, ఇతర జౌళిరంగ ఉత్పత్తులకు సంబంధించి స్వదేశీ, విదేశీ ఎగుమతి ఆధారిత తయారీ సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలి. చిన్న మధ్య తరహా పరిశ్రమలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిర్మాణాత్మకంగా సమగ్ర జౌళి పార్కుల పథకం పేరిట 2005లో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారు. జౌళి పరిశ్రమల ఏర్పాటుకు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను సమకూర్చడమే ఎస్ఐటీపీ ప్రధాన లక్ష్యం.**

**ప్రపంచ వస్త్ర వాణిజ్య నేపథ్యం; స్థూల పరిశీలన**

విశ్వ వాణిజ్యంలో ప్రతి దేశానికీ వాటా నిర్దేశించే మల్టీ ఫైబర్ అరేంజ్‌మెంట్ (MFA)ను దశలవారీగా తొలగించడం వల్ల గడచిన దశాబ్దకాలంలో ప్రపంచ వస్త్ర పరిశ్రమ వృద్ధి, వాణిజ్యం ప్రభావిత మయ్యాయి. తద్వారా జౌళిరంగం, దుస్తుల వాణిజ్యం గణనీయంగా పెరిగాయి. ప్రత్యేకించి కార్మికశక్తిపరంగా తక్కువ ఉత్పత్తి వ్యయంగల ఉత్పాదక కేంద్రాలకు ఆర్డర్లు వెల్లడమే ఇందుకు కారణం.

ఈ పరిణామాలు జౌళి, దుస్తుల రంగం విలువల గొలుసు (Value Chain) పై గణనీయ ప్రభావం చూపాయి. అమెరికా, ఐరోపా యూనియన్, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు హెచ్చు విలువగల డిజైనింగ్,విపణి (మార్కెటింగ్), చిల్లర విక్రయాల మీద దృష్టి కేంద్రీకరిస్తే చైనా, ఇండియా, బంగ్లాదేశ్, వియత్నాం వంటి వర్ధమాన దేశాలు తయారీ రంగంపై దృష్టి సారించాయి.

భవిష్యత్తులో ప్రపంచ వస్త్ర వాణిజ్యంలో ఏటా కనీసం 6 శాతం వృద్ధి నమోదవుతూ 2025నాటికి 1,600 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుతుందని అంచనా. ఇందులో దుస్తుల రంగం వృద్ధి ఎక్కువగనుక వర్ధమాన, ప్రవర్ధమాన దేశాలు తమ ఎగుమతులను, రాబడులను పెంచుకునే అవకాశాలుంటాయి.

**(2) భారత్‌లో జౌళి రంగం**

(ఎ) ప్రపంచ జౌళి విపణిలో భారతదేశానికి ప్రముఖ స్థానం ఉంది. అతున్నత సహజ వనరుల పునాది, ఒడుదొడుకులను తట్టుకోగల భారీ సామర్థ్యం ఇందుకు కారణం. ఇందుకు దోహదపడేవి :

(i) 2వ అతిపెద్ద పత్తి, పట్టు ఉత్పత్తిదారు కావటం,

(ii) 2వ అతిపెద్ద జౌళి/వస్త్ర ఉత్పత్తిదారు కావటం,

(iii) ప్రపంచ విపణిలో 63 శాతం వాటాగల అత్యంత నేత సామర్థ్యం ఉండటం,

(iv) ప్రపంచంలోని కదుళ్లలో 24 శాతం, రాట్న యంత్రాల్లో 8 శాతం కలిగి ఉండటం,

(v) నైపుణ్యం, అందుబాటు వేతనాలతో లభ్యమయ్యే కార్మికశక్తి, జౌళి రంగంలో చిన్న-మధ్యతరహా పరిశ్రమ(SME)లకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలపరంగా సాపేక్ష సానుకూలత.

**డాక్టర్ ఎ.కె.కృష్ణకుమార్,** ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, IL&FS క్లస్టర్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ లిమిటెడ్.
E-mail: ak@ilfsindia.com

(బి) దేశీయ జౌళి, దుస్తుల పరిశ్రమ విలువ 2014 ఆర్థిక సంవత్సరంలో 99 బిలియన్ అమెరికన్ డాలర్లు కాగా 2023 ఆర్థిక సంవత్సరం నాటికి 223 బిలియన్ డాలర్ల వృద్ధిని నమోదు చేస్తుందని అంచనా. అలాగే ఎగుమతులు కూడా 40 బిలియన్ డాలర్ల నుంచి 220 బిలియన్ డాలర్లకు చేరతాయని అంచనా! ఇండియా నుంచి మొత్తం జౌళి ఎగుమతులతో 40 శాతం దుస్తుల వాటాయే.

(సి) భారత ఆర్థిక వ్యవస్థలో జౌళి పరిశ్రమ పాత్ర ఔచిత్యానికి నిదర్శనాలు :

(i) మొత్తం ఎగుమతుల ఆర్జనలో 13 శాతం

(ii) మొత్తం పారిశ్రామిక ఉత్పాదనలో 14 శాతం

(iii) దేశంలో వ్యవసాయం తర్వాత అధికంగా 4.5 కోట్లమందికి ఉపాధి కల్పిస్తున్న రెండో అతిపెద్ద రంగం.

(iv) దేశీయ స్థూల ఉత్పత్తిలో 4 శాతం వాటా.

(డి) పత్తి, జనుము, పట్టు, ఊలు వంటి సహజ ఉత్పత్తులతోపాటు మానవ తయారీ పాలియెస్టర్, విస్కోస్, నైలాన్, అక్రిలిక్‌వంటి సింథటిక్ పదార్థాలద్వారా పీచు, నూలును విస్తృతశ్రేణిలో ఉత్పత్తి చేయగల బలమైన ఉత్పాదక పునాది సాపేక్షంగా భారత్‌కుగల సానుకూలత. అలాగే పరిమిత వేతన కార్మికశక్తి, తక్కువ ఉత్పత్తి వ్యయం, అనుకూల ప్రభుత్వ విధానాలు అదనపు అనుకూలతలు. జౌళి రంగంలో అంతర్భాగమైన దుస్తుల విభాగం అత్యంత అధిక విలువను సమకూర్చడమేగాక ఉపాధి కల్పనలోనూ అధిక వాటాను కలిగి ఉంది. అంతేగాక ఇది మహిళలకు అనువైన విభాగం కావడంతో సామాజిక కోణాల మెరుగుదలలోనూ కీలక పాత్ర పోషిస్తున్నది. అలాగే చేనేత, అద్దకం వంటి చేతివృత్తులు, పట్టు వస్త్రాలు–చీరల నేత వంటివి దేశంలోని వివిధ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి.

**భారత జౌళి పరిశ్రమ – ప్రపంచవ్యాప్త పోటీ.**

(ఎ) జౌళి, దుస్తుల ఎగుమతులలో చైనా 36.13 శాతం వాటాతో ప్రపంచంలో అగ్రస్థానంలో ఉండగా 5.13 శాతం వాటాతో భారత్ రెండోస్థానంలో, 4.39 శాతం వాటాతో బంగ్లాదేశ్ మూడో స్థానంలో ఉన్నాయి. ఈ రంగంలో వేగంగా ఎదుగుతున్న వియత్నాం 3.71 శాతంతో ఆరోస్థానంలో ఉంది. అయితే, దుస్తుల విభాగ ప్రపంచ వాణిజ్యంలో భారత్ కేవలం 4.33 శాతం వాటాతో 5వ స్థానంలో ఉంటే, బంగ్లాదేశ్ (2), వియత్నాం (3), ఇటలీ (4) ముందు వరుసలో ఉన్నాయి.

(బి) మన జౌళి పరిశ్రమ వనరుల పునాది, ప్రస్తుత పరిస్థితులు, వ్యవస్థాపన నైపుణ్య పరంగానే గాక, కార్మికవేతన అనుకూలత వంటి అంతర్గత బలాలున్నా విలువ జోడించిన ఉత్పత్తుల ఎగుమతిలో ఇతర దేశాల నుంచి పోటీని ఎదుర్కొంటోంది. రాబోయే రోజుల్లో ప్రపంచ జౌళి, దుస్తుల వ్యాపారానికి రూపునివ్వడంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (FTA) ప్రధాన పాత్ర పోషిస్తాయని అంచనా !

## (3) భారత్‌లో జౌళి రంగం

(ఎ) నేత, దుస్తుల విభాగాల్లో పెద్ద సంఖ్యలో చిన్న–మధ్యతరహా పరిశ్రమలు పనిచేసే కీలక విభాగాలతో కూడినదిగా భారత జౌళి రంగాన్ని పేర్కొనవచ్చు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంలో పెట్టుబడి పెట్టగలిగే శక్తిలేని, తక్కువ ఉత్పత్తి వ్యయానుకూల చిన్న యూనిట్లు అందుబాటులోగల మిల్లులుగా వికేంద్రీకృతం కావటమే ఇందుకు ప్రధాన కారణం. అంతేగాక అనేక ప్రభుత్వ పథకాలద్వారా చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మూలధన రాయితీలు లభిస్తుండటం వాటిలో పోటీతత్వాన్ని పెంచింది.

(బి) నేత విభాగంలో వికేంద్రీకృతమైన మరమగ్గాల విభాగం కూడా ఎస్ఎంఈలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. మరమగ్గాలు 60 శాతం వస్త్ర ఉత్పత్తితో దేశంలో 62 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ రంగంలో సాంకేతిక పరిజ్ఞాన స్థాయి సాధారణ మగ్గాల నుంచి ఆసులు లేని అత్యాధునిక మగ్గాలదాకా ఉంది. ఇలాంటి అత్యాధునిక మరమగ్గాలు సుమారు 1.25 లక్షలదాకా ఉంటే, ప్రస్తుతం పనిచేస్తున్న సాధారణ మగ్గాల్లో 75 శాతం పూర్తిగా పాతబడిపోయి, పనికిరాని స్థితిలో, 15 ఏళ్లకు ముందు నాటివి ఉన్నాయి.

(సి) మరమగ్గాల తరహాలోనే సంసిద్ధ (రెడీమేడ్) దుస్తుల విభాగం (దుస్తుల తయారీ) కూడా అధికశాతం పెద్ద కంపెనీల, ఎగుమతిదారుల, చిల్లర విక్రయ సంస్థల కోసం చిన్నపనుల ప్రాతిపదికన చేపట్టే ఎస్ఎంఈల రూపంలోనే ఉంది.

(డి) నేత, దుస్తుల తయారీలోనే అత్యధిక పరిశ్రమలు ఉండటం భారత జౌళి రంగం విశిష్టత. భూమి, పెట్టుబడుల్లాంటి వనరుల సమీకరణలో ఇబ్బందులు, కార్మిక చట్టాలు తదితర నిర్మాణపరమైన సమస్యలు, అధిక రాయితీలు వంటివి పెద్ద పరిశ్రమల ముందడుగుకు అవరోధాలుగా ఉన్నాయి.

(ఇ) ఎంఎఫ్ఏను 2005లో రద్దుచేసిన తర్వాత జౌళి రంగంలో మెరుగైన మౌలిక సదుపాయాలపై పెట్టుబడి అత్యవసర మైంది. ఈ రంగాన్ని ఎస్ఎంఈలు శాసిస్తున్న నేపథ్యంలో వాటికీ ఇదేతరహా సమస్యలున్నందువల్ల క్లస్టర్ల ఏర్పాటు తరణోపాయమని తెలిసివచ్చింది.

**(4) సమగ్ర జౌళి పార్కుల కోసం ఓ పథకం**

(ఎ) కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ 1999లో సాంకేతిక స్థాయి పెంపు నిధి పథకం (TUFS) ప్రవేశపెట్టింది. దీనిద్వారా సరసమైన వడ్డీతో ఆర్థిక మద్దతు లభించడంతో పరిశ్రమ గణనీయ స్థాయిలో పెట్టుబడులు సమకూర్చుకోగలిగింది. అలాగే క్లస్టర్ల స్థాయిలోనూ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఎగుమతులకు ప్రోత్సాహం దిశగా అందుబాటు పథకాలను ప్రవేశపెట్టింది.

(బి) జౌళి రంగంలోని చిన్న మధ్య తరహా పరిశ్రమలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిర్మాణాత్మకంగా సమగ్ర జౌళి పార్కుల పథకం (SITP) పేరిట 2005లో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారు. జౌళి పరిశ్రమల ఏర్పాటుకు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను సమకూర్చడమే ఎస్ఐటీపీ ప్రధాన లక్ష్యం.

(సి) పరిశ్రమలు... ప్రత్యేకించి ఎస్ఎంఈలు ప్రతిపాదించే నిర్దేశిత ప్రాజెక్టులను 'ప్రత్యేక లక్షిత సంస్థ' (SPV)ల ద్వారా అమలు చేసేవిధంగా ఎస్ఐటీపీకి రూపుదిద్దారు. జౌళి పార్కుల పథకాన్ని అమలు చేసేది ఈ ఎస్పీవీలే కాగా, ఇవి ప్రైవేటు యాజమాన్యాలకింద ఉంటాయి. ఈ పార్కులో ఏర్పాటయ్యే పరిశ్రమలన్నీ వాటికి ఇచ్చిన భూమి నిష్పత్తి ప్రకారం ఎస్పీవీలో వాటా కలిగి ఉంటాయి. ఎస్ఐటీపీ రూపకల్పనలో అత్యంత వినూత్న అంశం ఇదే కాగా, దీన్ని ప్రవేశపెట్టడంద్వారా ప్రభుత్వం మార్గనిర్దేశం చేసింది.

(డి) ఆ విధంగా జౌళి రంగం కోసం ప్రత్యేకంగా సరికొత్త పారిశ్రామిక పార్కులకు ఎస్ఐటీపీ ప్రోత్సాహమిచ్చింది. పరిశ్రమ అవసరాలకు తగినట్లు మౌలిక సదుపాయాలను రూపుదిద్దుకోవడం ఎస్ఐటీపీల ఆధ్వర్యంలోని జౌళిపార్కులకు కలిసివచ్చిన సానుకూలాంశం. ఆ మేరకు పార్కులోని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వ్యర్థాల శుద్ధి ప్లాంట్లను రూపొందించుకోవడం, నీటి-విద్యుత్ సరఫరాల కోసం ఏర్పాట్లు చేసుకోవడం సాధ్యమైంది.

(ఇ) ఈ పథకం అమలులో జౌళి మంత్రిత్వ శాఖకు తోడ్పడే వృత్తిపరమైన సంస్థలను ఏర్పాటుచేయడం ఎస్ఐటీపీలో మరో విశేషాంశం. ఇటువంటి సంస్థలు సమాచార వ్యాప్తి, ప్రతిపాదనల రూపకల్పన, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (DPR)ల తయారీ, మంజూరీ అధికారులకు వాటి సమర్పణ, సమయానుగుణంగా అమలు పర్యవేక్షణ, వీటన్నిటిపైనా జౌళి మంత్రిత్వ శాఖకు నివేదన ఈ సంస్థల విధుల్లో భాగంగా ఉంటాయి. దీనిపై ప్రపంచబ్యాంకు అధ్యయనం ఇలా పేర్కొంది... "దీన్ని మరింత విశదీకరిస్తే... పార్కుల సృష్టి, వాటి కార్యకలాపాల నిర్వహణలో అంతిమ నిర్ణేతలుగా వ్యవస్థాపకులకే ఈ విధానం అవకాశమిచ్చింది."

(ఎఫ్) క్లస్టర్ల అభివృద్ధి పద్ధతిలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిర్దేశిత రంగ తొలి కార్యక్రమం ఎస్ఐటీపీయే. ఆ తర్వాత ఆహార పదార్థాల తయారీ (ఫుడ్ ప్రాసెసింగ్), ఎలక్ట్రానిక్స్, తోళ్ళు, మూలధన వస్తు తయారీ వంటి ఇతర రంగాల్లోనూ ఈ పథకాన్ని అమలు చేశారు.

(జి) ఎస్ఐటీపీ విజయవంతమైందనడానికి ఇప్పటిదాకా దేశంలో 72 జౌళి పార్కులకు ఆమోదం లభించడమే నిదర్శనం. వీటిలో 32 ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

**ఇండియాలో జౌళి సమూహాలు**

(హెచ్) ఎస్ఐటీపీ అన్నది క్లస్టర్ నమూనామీద ఆధారపడింది. దీన్ని వినియోగించుకునే పరిశ్రమలు ఒక్కటై తమ ప్రాజెక్టు కోసం ఎస్పీవీని ఏర్పాటు చేసుకుని, జౌళిపార్కును నిర్మిస్తాయి. అయితే, ప్రత్యేక ఆర్థిక మండలి (SEZ) విధానంలో రకరకాల పరిశ్రమల కోసం డెవలపర్లు ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారు.

(ఐ) ఈ జౌళిరంగ క్లస్టర్ల పథకాలకు ఉన్నతస్థాయి మద్దతు లభించినా ఎస్ఐటీపీలతో పోలిస్తే పెద్దగా విజయవంతం కాలేదు. ఈ పథకాలలో భూ సేకరణ, తుది రూపు నిర్ధారణ, నిర్మాణ-నిర్వహణ వంటివన్నీ కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచాయి. కానీ, ప్రాజెక్టు యాజమాన్యాన్ని పరిశ్రమకే అప్పగిస్తే విజయవంతం కాగలదన్న భరోసా ఉంటుందని ఈ అనుభవం చెబుతోంది.

(జె) తిరుపూర్‌లోని 65 ఎకరాల నేత విభాగం క్లస్టర్ల పార్కుసహా విశాఖపట్నంలోని వెయ్యి ఎకరాల పార్క్-కమ్-సెజ్ వంటి వివిధ శ్రేణి పార్కులకు ఎస్ఐటీపీ ఆమోదం తెలిపింది. అయితే, విశాఖ సెజ్‌లో జౌళిరంగ కార్యకలాపాలే లేకపోవడం గమనార్హం. అధికశాతం పార్కులు ప్రస్తుత క్లస్టర్లలో భాగంగా లేదా సమీపంలో ఉండటంవల్లనే వాటి ఏర్పాటులో సంస్థలు చొరవ చూపాయి.

(కె) విశాఖపట్నంలో బ్రాండిక్స్ ఇండియా అపారెల్ సిటీ వంటి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి సంస్థ సహా విస్తృత శ్రేణి పెట్టుబడులను ఆకర్షించడంలో ఎస్ఐటీపీ పథకం విజయవంతమైంది. ఇందులో భాగంగానే తమిళనాడులోని తిరుపూర్‌వద్ద పల్లడంలో 90 ఎస్ఎంఈల సముదాయం రూపుదిద్దుకుంది. అలాగే తెలంగాణ రాష్ట్రం పోచంపల్లిలోని చేనేత కార్మికులు, నేతపని చేయించేవారు (మాస్టర్ వీవర్స్) సంయుక్తంగా చేనేత పార్కు స్థాపన కోసం

ఎస్పీవీని ఏర్పాటు చేసుకునేలా ఈ పథకం ప్రోత్సాహ మిచ్చింది.

**ముందడుగు:**

(ఎ) అనేక పార్కులలో అత్యధికం ఎస్ఎంఈ యూనిట్లే. వీటన్నిటికీ పెట్టుబడులు సమకూర్చింది ప్రస్తుత క్లస్టర్లలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నవారే కాగా, ఈ పార్కులద్వారా వాటిని మరింత విస్తరింపజేస్తున్నారు. పని మూలాలు, విపణి, కార్మికశక్తి తదతరాల కోసం పరిసరాల్లోని జౌళిరంగ పరిశ్రమ వ్యవస్థపై వీరంతా ఆధారపడి ఉన్నారు. అయితే, బ్రాండిక్స్ విషయంలో ఇది విభిన్న నమూనా. దానికంటూ ప్రత్యేకంగా ఓ సమగ్ర విలువ ఉండగా పార్కులోనే తదనుగుణ పర్యావరణాన్ని కూడా సృష్టించుకుంది.

(బి) ఎస్ఐటీపీద్వారా నేర్చుకున్న పాఠాలద్వారా ముందడుగు వేయడంలో భాగంగా దేశంలో సమగ్ర జౌళి రంగ సదుపాయాల సృష్టికి ఈ అనుభవాన్ని వినియోగించు కోవాల్సిన అవసరం ఉంది. ఈ పరిశ్రమకు మానవ వనరులు ఎంతో అవసరం కాబట్టి లక్షలాది గ్రామీణ యువత, మహిళలకు ఉపాధి కల్పించగల సామర్థ్యం జౌళి పరిశ్రమకు ఉన్నదన్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ దిశగా కృషి చేయాలి. ఈ రంగంలో స్వదేశీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించగల పలు అనుకూలతలు భారత్‌కు కచ్చితంగా ఉన్నాయి. ఈ రంగానికి తగు ప్రోత్సాహకాలిస్తూ ప్రైవేటు పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని సృష్టించడం ఎంతో అవసరం. దీనిద్వారా పెట్టుబడులకు తగిన ఫలితాలు దక్కుతాయన్న భరోసా కలిగించి ఆకర్షించాలి. అందువల్ల ప్రపంచస్థాయిలో పోటీనివ్వగలిగేలా భారీ సమీకృత సదుపాయాలను... స్పిన్నింగ్ మిల్లులు, రంగుల అద్దకం, శుద్ధి, కటింగ్, కుట్టుపని, లేబులింగ్-ప్యాకేజింగ్ వంటి సదుపాయాలను భారీ సామర్థ్యంతో కల్పించడం కీలకం.

(సి) ఈ నేపథ్యంలో జౌళి, అపారెల్ రంగ ఉత్పత్తి ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఏర్పడింది. ఈ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించి నిలబెట్టు కోవాలంటే కొన్ని చర్యలు అవసరం. ఇందులో భాగంగా దుస్తులు, ఇతర జౌళిరంగ ఉత్పత్తులకు సంబంధించి స్వదేశీ, విదేశీ ఎగుమతి ఆధారిత తయారీ సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలి. దీనికోసం అనువైన ప్రత్యేక పెట్టుబడుల ప్రాంతం నెలకొల్పేందుకు ప్రణాళికలను రచించాలి. అన్ని కోణాల్లోనూ సమగ్ర విలువ రూపుదిద్దు కోవాలి. దీనికంతటికీ సుమారు 1,500 నుంచి 2,500 ఎకరాల్లో స్వయం సమృద్ధ పెట్టుబడుల కేంద్రం సిద్ధం కావాలి. అందులో తయారీ యూనిట్లు, ప్రజా సదుపాయాలు, రవాణ, పర్యావరణ పరిరక్షణ వ్యవస్థలు, ఆవాస ప్రాంతాలు, విజ్ఞాన-ఆరోగ్య సంరక్షణకు మౌలిక సదుపాయాలు ఉండాలి.

ఒక జిల్లా లేదా సమితిని జౌళిరంగ ఉత్పత్తి ప్రాంతంగా ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి ఎమ్మార్టీఏలను అభివృద్ధి చేయవచ్చు. తద్వారా జౌళి, దుస్తుల ఉత్పత్తి పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించే వాతావరణం ఏర్పడుతుంది. ఇందుకోసం దరఖాస్తు చేసుకునే రాష్ట్రం నిర్దేశిత ప్రాంతం ఎంపికలో వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. అక్కడ కొదువలేని మౌలిక సదుపాయాలు, సమీపంలో ఓడరేవు/విమానాశ్రయం లేదా వాటికి తగిన అనుసంధానత వంటివి ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పన, వ్యవస్థాగత అనుసంధానం, ఆర్థిక ప్రోత్సాహకాలు, మానవ వనరుల అభివృద్ధి, సామర్థ్య నిర్మాణం తదితరాలకు హామీ ఇవ్వవచ్చు. ఇవే కాకుండా ప్రస్తుత విధానాలు నిబంధనలను సడలించి అదనపు ప్రయోజనానికి భరోసా ఇవ్వడంద్వారా పెట్టుబడులను ఆకర్షించవచ్చు. అలాగే నైపుణ్య వ్యత్యాసాన్ని భర్తీ చేసేందుకు వీలుగా నైపుణ్య కార్మికశక్తిని అందు బాటులోకి తెచ్చేలా ప్రయత్నాలు చేసేవిధంగా అపారెల్ కేంద్రాలకు ప్రతిపాదించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలు ఐటీఐలద్వారా జౌళి ఇంజనీరింగ్ వంటి కోర్సులద్వారా వ్యవస్థాగత మద్దతు ఇవ్వవచ్చు.

ప్రతిపాదిత ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వ తోడ్పాటుతో మరింత బలోపేతం చేయవచ్చు. ఇందుకోసం ప్రస్తుత పథకాలను ఏకీకృతం చేయడంద్వారా ఉమ్మడి మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించవచ్చు. అలాగే కేంద్రం అలాంటి ప్రాంతాలను అభివృద్ధి చేయదలిస్తే అవసరమనుకున్న ఇతర అదనపు సదుపాయాలను సమకూర్చవచ్చు. ఇలాంటి మౌలిక సదుపాయాలన్నీ ఉన్నపుడు స్వదేశీ, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడం సాధ్యమవుతుంది. తద్వారా కేంద్రం తలపెట్టిన ప్రతిష్ఠాత్మక 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం వేగం పుంజుకుంటుంది. ఈ ఆలోచనలను ఆచరణలోకి వస్తే ప్రపంచ జౌళి రంగంలో భారతదేశం నిస్సందేహంగా అగ్రస్థానం సాధించగలదు. ■

అభివృద్ధి మార్గసూచి

## చేనేతకు ఆన్‌లైన్ పోర్టల్:

చేనేతకారుల స్టాల్ కేటాయింపులకు ఒక ఆన్ లైన్ పోర్టల్‌ను కేంద్ర జౌళిశాఖ కార్యదర్శి శ్రీమతి రష్మీ వర్మ గత ఆగష్టు 31న ప్రారంభించారు. ప్రతి సంవత్సరం దాదాపు 340 వరకూ చేనేత మార్కెటింగ్ సంతలను *Development Commissioner, Handlooms* నిర్వహిస్తుంటారు. వీటిలో స్టాళ్ల కేటాయింపుకు ఈ పోర్టల్ సహకరిస్తుంది. వార్తా పత్రికలలో ప్రకటనల ద్వారా ప్రభుత్వం ఇలాంటి సంతలకు పిలుపు నిచ్చినప్పుడల్లా, చేనేతకారులు దరఖాస్తు చేసుకోవచ్చు. కేటాయింపు జరిగినవారికి, ప్రభుత్వం సంక్షిప్త సందేశాలద్వారా తెలియచేస్తుంది. ఆసక్తి గల వారు ***http://handloomstall.gov.in / hems/pages/hems_home.action*** వెబ్ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

## సహజవాయు ప్రోత్సాహానికి చర్యలు:

దేశంలో సహజ వాయు వినియోగాన్ని మరింత పెంచడానికి ప్రభుత్వం ఇటీవల **GAS4INDIA** కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. వంటకు, రవాణాకు, ఇళ్ళలో దీపాలకు, కర్మాగారాలలో ఇంధనంగాను సహజవాయు వినియోగానికి ప్రోత్సాహం కల్పించడానికి చర్యలను చేపడతారు. దీనికోసం సంప్రదాయ ప్రచార సాధనాలనే కాకుండ సామాజిక మాధ్యమాలైన, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, లింక్డ్ఇన్, వంటి డిజిటల్ సాధనాలను కూడ వినియోగించుకుని, కార్యక్రమాలను చేపడతారని కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఇటీవల కేంద్ర పెట్రోలియమ్ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలియచేశారు. ■

## అవార్డులు – రివార్డులు

చేనేత, హస్త కళలలోని నైపుణ్యాన్ని మరింత ప్రోత్సహించేందుకు, కేంద్ర ప్రభుత్వం అనేక అవార్డులు, రివార్డులు, ప్రశంసలు అందచేస్తున్నది. ప్రతి సంవత్సరమూ, సంత్ కబీర్ అవార్డులు పది, జాతీయ అవార్డులు 28, జాతీయ మెరిట్ సర్టిఫికేట్లను 36 మంది యోగ్యులైన వారికి అందచేస్తున్నది. జాతీయ స్థాయిలో ఉత్తమ చేనేతకారులకు సంత్ కబీర్ అవార్డులు, మేలైన నమూనాల అభివృద్ధికి మూడు, చేనేతకారులకు 20, మార్కెటింగ్ ప్రోత్సాహానికి మరో ఐదు చొప్పున జాతీయ అవార్డులు, చేనేతకారులకు 20, నమూనాల అభివృద్ధికి 06, మార్కెటింగ్ ప్రోత్సాహానికి మరో 10, మొత్తం 36 జాతీయ మెరిట్ సర్టిఫికేట్లను ప్రతి సంవత్సరము అందచేస్తున్నది.

## పాఠకులకు మనవి

**యోజన తెలుగు మాసపత్రిక పాఠకుల స్పందనలను ఆహ్వానిస్తోంది. యోజన పాఠకులు, చందా దారులు, శ్రేయోభిలాషులు పత్రికలో వచ్చే వ్యాసాలపై తమ సందేహాలు, సూచనలు, స్పందనను లేఖలు, ఈ-మెయిల్ (yojana_telugu@yahoo.co.in), ట్విట్టర్ (@TeluguYojana)ల ద్వారా తెలియచేయగలరు.**

**యోజన నాణ్యతను మరింత మెరుగు పరచడానికి మీ స్పందన ఎంతో ఉపకరిస్తుంది.**

**The Editor,**
**Yojana (Telugu), Room No. 205, Second Floor,**
**CGO Towers; Kavadiguda, Hyderabad - 500 080.**

***– ఎడిటర్, యోజన.***

# జనసంకల్ప బలంతో స్వచ్ఛభారత్




**అక్టోబర్ 2, 2016న గాంధీ జయంతి నాటికి స్వచ్ఛభారత్ కార్యక్రమం అమలులోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తవుతాయి. ఈ రెండేళ్ల వ్యవధిలోనే స్వచ్ఛభారత్ స్ఫూర్తిని గ్రామ గ్రామానికి తీసుకువెళ్లడంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు విజయం సాధించాయి. స్వచ్ఛభారత్ కార్యక్రమం జన చైతన్య మహోద్యమం. ఇందుకు ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చి ఆరోగ్యవంతమైన ఆత్మగౌరవంతో కూడిన సమాజ నిర్మాణం దిశగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి.**

మహాత్ముడి మహోన్నత ఆదర్శం పరిశుభ్ర భారతావని. పరిసరాలు ఎంత పరిశుభ్రంగా ఉంటే సమాజం అంత ఆరోగ్యవంతంగా ఉంటుంది. ఆరోగ్యవంతమైన సమాజం దేశ ప్రగతికి తొలి మెట్టు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిపై అలుపెరుగని పోరాటం చేస్తున్న సమయంలోనే పరిసరాల పరిశుభ్రత విషయంలో మనం ఎంతో శ్రద్ధ వహించి, భవిష్యత్ భారతావనిని స్వర్గధామంగా తీర్చిదిద్దుకోవాలని మహాత్ముడు నొక్కి చెప్పారు. ఆ దిశగా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు విశేషంగా కృషి చేశారు. అందుకు స్వయంగా తానే పలు కార్యక్రమాలను చేపట్టి ఆచరించి మార్గనిర్దేశంచేశాడు మహాత్ముడు. 1919లోనే నవజీవన్ పత్రికలో, పరిసరాల పరిశుభ్రత విషయంలో పౌరసమాజం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రాశారు. వివిధ సమావేశాల సందర్భంలోనూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు దృష్టిపెట్టేలా చేశారు. కార్యకర్తలను ఆ దిశగా కార్యోన్ముఖులను చేశారు. అంతేకాదు, మీరు మీచేతిలోకి చీపురు, బక్కెట్ తీసుకుని కదలకపోతే మీ గ్రామం, మీ పట్టణం, మీ పరిసరాలు శుభ్రంగా ఉండవని ప్రజలకు ఉద్బోధించే వారు. **అంతగా ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై దృష్టిపెట్టి ఎవరికి వారు వారి పరిసరాలను, వారి గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దేశం మొత్తం పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంటుందన్నది మహాత్ముడి ఆకాంక్ష.** పలు గ్రామాలలో జలవనరులు ఎలా కలుషితమై పోతున్నాయో మహాత్మాగాంధీ ఆనాడే గమనించి జాతిని హెచ్చరించారు. నదులలో, చెరువులలో, బట్టలు ఉతకడం, పశువులను కడగడం వంటి చర్యల ద్వారా ఆయా నీటి వనరులు కలుషితమై వాటినుంచి రకరకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఈ విషయంలో ప్రజలు తమ అలవాట్లను మార్చుకుని జలవనరులను స్వచ్ఛంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని 1935 నాటి హరిజన్ పత్రికలో రాసిన వ్యాసంలో పేర్కొన్నారు.

### మహాత్ముడి కలల సాకారానికి స్వచ్ఛభారత్...

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని దశాబ్దాలలో పరిసరాల పరిశుభ్రత విషయంలో రావలసినంత మార్పు రాలేదని గమనించిన కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్కారు మహాత్ముడి కల సాకారం చేసే మహోన్నత లక్ష్యంతో 2014 అక్టోబర్ 2 న ఆయన జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్‌ను ప్రారంభించారు. 2019 అక్టోబర్‌లో

**రేవూరు ఉమామహేశ్వరరావు,** ప్రిన్సిపాల్, రచన స్కూల్ ఆఫ్ జర్నలిజం, హైదరాబాద్.
E-mail: umarevuru@yahoo.com

మహాత్మాగాంధీ 150 వ జయంతి నాటికి స్వచ్ఛభారత్ లక్ష్యాలను చేరుకుని మహాత్ముడి కలను సాకారం చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ సంకల్పం.

స్వచ్ఛభారత్‌కు సంబంధించి కేంద్రప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలతో పాటు ఇందుకోసం రెండు ప్రత్యేక మిషన్‌లు కూడా ఉన్నాయి. అవి, 1) స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ్), (2) స్వచ్ఛభారత్ మిషన్ (అర్బన్). స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్‌కు మినిస్ట్రీ ఆఫ్ డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. అలాగే మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ డవలప్‌మెంట్ , అర్బన్ మిషన్‌కు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. అక్టోబర్ 2, 2016న గాంధీ జయంతి నాటికి స్వచ్ఛభారత్ కార్యక్రమం అమలులోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తవుతాయి. ఈ రెండేళ్ల వ్యవధిలోనే స్వచ్ఛభారత్ స్ఫూర్తిని గ్రామ గ్రామానికి తీసుకువెళ్లడంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు చాలామటుకు విజయం సాధించాయి.

పరిసరాల పరిశుభ్రతను దెబ్బతీస్తున్న అంశాలలో అతి ముఖ్యమైనది బహిరంగ మల మూత్ర విసర్జన. తగిన సౌకర్యాలు లేక కొందరు, సరైన అలవాట్లు లేక మరికొందరు బహిరంగ మల మూత్ర విసర్జన ద్వారా పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం పలుచర్యలు చేపట్టింది. ప్రతి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండేలా చూసేందుకు ప్రజలను పెద్దఎత్తున చైతన్యవంతులను చేస్తున్నారు. ఇందుకు పేదలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల వారు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించు కునేందుకు ప్రభుత్వం చేయూత నిస్తోంది. అలా ఆయా గ్రామాలలో కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టి బహిరంగ మలమూత్ర విసర్జన అలవాట్లను మాన్పించేందుకు పెద్దఎత్తున కార్యక్రమాలను చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల జీవన నాణ్యతను పెంచేందుకు ఘన,ద్రవ వ్యర్థాల నిర్వహణకు సంబంధించి ఆయా గ్రామ పంచాయితీలలో అవగాహన కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారు.

**పట్టణాలలో స్వచ్ఛభారత్.....**

పట్టణ ప్రాంతాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. 4041 పట్టణాలను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణాలుగా తీర్చిదిద్దనున్నారు. అలాగే మునిసిపాలిటీలలో వ్యర్థాల నిర్వహణకు సంబంధించి చర్యలు తీసుకుంటున్నారు. పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజలలో మౌలిక మార్పు తెచ్చేందుకు పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నారు.

2019 నాటికి అన్ని కుటుంబాలకు టాయిలెట్ల సౌకర్యం అందుబాటులోకి తెచ్చేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు. గడచిన రెండేళ్లలో ఈ దిశగా గణనీయమైన ప్రగతి సాధించారు. 2014-15 లో 50 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లనిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా, అంతకంటే ఎక్కువగానే అంటే 58, 54,987 మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్‌ను ప్రారంభించిన అనంతరం 49.49 లక్షల కుటుంబాలకు మరుగుదొడ్ల సదుపాయం కల్పించడం చెప్పుకోదగిన ముందడుగు.

**వివిధ మంత్రిత్వశాఖల కృషి...**

పరిశుభ్ర భారతావనిని తీర్చిదిద్దే మహోన్నత సంకల్పాన్ని సాకారం చేసేందుకు వివిధ మంత్రిత్వశాఖలూ నడుంకట్టాయి. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమాన్ని చేపట్టింది. టాయిలెట్ సౌకర్యం లేని పాఠశాలల్లో బాల బాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. 64 కేంద్ర ప్రభుత్వ రంగసంస్థలు, 11 ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు విద్యాసంస్థలలో టాయిలెట్‌లను నిర్మించి ఇవ్వడంలో కీలక పాత్ర పోషించాయి.

స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమం కింద 2.61 లక్షల పాఠశాలల్లో నాలుగు లక్షల పదిహేడు వేల టాయిలెట్లను నిర్మించడం ఒక రికార్డు. ఇది పిల్లల ఆరోగ్యస్థాయిని పెంచడమే కాకుండా వారి హాజరు శాతాన్ని గణనీయంగా పెంచడానికి దోహదపడుతుంది.

**ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ నేతృత్వంలో కాయకల్ప..**

ప్రజారోగ్య పరిరక్షణ సంస్థలలో పరిశుభ్రత, వ్యాధికారక క్రిముల నిర్మూలనకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ కాయకల్ప పేరుతో ప్రత్యేకచర్యలు చేపట్టింది.

**బాల్ స్వచ్ఛతా మిషన్....**

మహిళాశిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛభారత్ మిషన్‌కింద అంగన్ వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నారు. సమీకృత శిశు అభివృద్ధి కింద వీటిని చేపడుతున్నారు. బాలల్లో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు బాల్ స్వచ్ఛతా మిషన్‌ను చేపట్టారు. ఇది వారిలో పరిశుభ్రత విషయంలో దీర్ఘకాలికంగా సానుకూల మార్పుతీసుకు రానుంది. ఇందుకు ప్రతి అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకు అనుకూలంగా ఉండే టాయిలెట్‌లను నిర్మిస్తున్నారు. బాల్‌స్వచ్ఛతా మిషన్‌కింద 2016 జనవరి 31 నాటికి దేశవ్యాప్తంగా 6,99,716 టాయిలెట్ల నిర్మాణం పూర్తి అయినట్టు 2016 స్వచ్ఛ్ స్టేటస్ రిపోర్ట్ గణాంకాలు సూచిస్తున్నాయి.

**పెట్రోలియం, సహజవాయు రంగం...**

పెట్రోలు, సహజవాయు మంత్రిత్వశాఖ, దానిఅధీనంలోని పలు ప్రభుత్వ రంగ సంస్థలు పెద్ద ఎత్తున స్వచ్ఛభారత్ కార్యక్రమాలను చేపట్టాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 29 నాటికి ఈ సంస్థలు దేశవ్యాప్తంగా 20,218 పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణాన్ని చేపట్టాయి. స్వచ్ఛభారత్ స్ఫూర్తిపై ప్రజలను

*తరువాయి 74వ పేజీలో...*

# భారతీయ వస్త్రపరిశ్రమ : ప్రపంచీకరణ ప్రభావం



**అత్యధిక శాతం మహిళలకు ఉపాధి కల్పించే రంగం వస్త్రపరిశ్రమ కావడం గమనార్హం. దీంతో పాటు ఎగుమతుల ద్వారా విదేశీ మారకం రాబట్టడంలోనూ దేశీయ వస్త్ర పరిశ్రమ ప్రధాన భూమికను నిర్వహిస్తోంది. అలాగే సుమారు వంద కోట్ల దాలర్ల ఉత్పత్తితో సుమారు 25 వేల మందికి ప్రత్యక్ష ఉపాధిని కల్పిస్తూ వస్త్రపరిశ్రమ దూసుకుపోతోంది. మేకిన్ ఇండియా కార్యక్రమంలో భారతీయ వస్త్రపరిశ్రమ కీలక భూమిక పోషించింది. 2022 నాటికి 6-6.2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.**

పరిచయం : ప్రపంచ ఆర్థికమాంద్యం అన్ని రంగాలపై బలంగా ప్రభావం చూపింది. మాంద్యం నుంచి కోలుకోవడానికి ఇప్పటికీ ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆర్థిక వ్యవస్థలు నెమ్మదిగా వృద్ధిరేటు దిశగా సాగుతున్నాయి. బలహీనమైనప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యం 2.7 శాతం వృద్ధి రేటును సాధించగా, మరోవైపు 2016 జూలై నాటికి ప్రపంచ జీడీపీ వృద్ధిరేటు 2.4 శాతం పెరిగింది. అయితే ఆర్థిక మాంద్యం నుంచి కోలుకున్న అనంతరం కూడా వృద్ధిరేటు మందగించడానికి గల కారణాలు విశ్లేషిస్తే, ప్రధానంగా చైనాలో ఆర్థిక వృద్ధి స్తంభించడం, అభివృద్ధి చెందిన దేశాల్లో ఇంకా ఆర్థిక మాంద్యం కొనసాగుతుండడం, చమురు ధరలు పడిపోవడం, అలాగే ఇతర వస్తువుల ధరలు పడిపోవడం, మారకద్రవ్య విలువల్లో ఒడిదిడుకులు కారణాలుగా కనిపిస్తున్నాయి.

ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న వాణిజ్య వృద్ధిరేటు గమనిస్తే ప్రపంచ వాణిజ్య సంస్థ వెలువరించిన ఒక రిపోర్టు ప్రకారం మనకు పలు అంశాలు కనిపిస్తాయి. వాటిలో ప్రధానమైనది డాలర్ రేటు పతనం, అలాగే వాణిజ్యపరంగా ఎలాంటి వృద్ధి కనిపించక పోగా, స్థిరంగా కొనసాగుతూ ఉండటం. రెండవది ప్రపంచవ్యాప్తంగా ముడిసరుకుల వాణిజ్యం మందగించి, వస్తువుల వాణిజ్యం పెరగడం, ఇక మూడోది ఆసియా దేశాల్లో ఉత్పత్తి తగిపోవడం కారణాలుగా కనిపిస్తు న్నాయి. దీంతో అటు ఆసియాతో పాటు యూరప్, అమెరికా మార్కెట్లలో కూడా డిమాండ్ తగ్గిపోవడం కూడా కారణంగా కనిపిస్తోంది. ఇదిలా ఉంటే 2015లో మాత్రం వాణిజ్యంలో కాస్త ఆశావాహ దృక్పథం కనిపించింది. కానీ ఇదే సమయంలో డాలర్ రేటు 13 శాతం క్షీణించింది. ఈ పరిణామంతో సుమారు 16 ట్రిలియన్ డాలర్ల మేర ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య దిగుమతులు నష్టపోయాయి. ప్రపంచ మార్కెట్ ఈ స్థాయిలో అన్ని రంగాల్లోనూ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కోవడం గమనార్హం. పరిస్థితి ఇలా ఉంటే 2016 ఆర్థిక సంవత్సరంలో మాత్రం భారతీయ వస్త్రపరిశ్రమ ఒక శాతం వృద్ధిని సాధించింది. ఇది ఒక రకంగా మంచి వృద్ధిరేటనే చెప్పవచ్చు ఎందుకంటే అదే సమయానికి ప్రపంచ వ్యాప్తంగా వస్త్రపరిశ్రమ 5శాతం లోటుతో, ఒడిదుడుకులతో ఉంది.

**ఆర్. కె. దాల్మియా,** ఛైర్మన్, నూలు వస్త్రాల ఎగుమతుల ప్రోత్సాహక మండలి.
E-mail: ed@texprocil.org

**వస్త్ర పరిశ్రమ వాణిజ్యం :**

భారత్, ప్రపంచ మార్కెట్లకు వస్త్రపరిశ్రమను వెన్నెముకగా భావించవచ్చు. జీడీపీలో వస్త్రపరిశ్రమ వాటా 4 శాతంగా ఉండగా, దేశంలో 21 శాతం మందికి ఉపాధి కల్పనతో ముందు వరుసలో నిలిచింది. అలాగే పారిశ్రామిక ఉత్పత్తిలో 14 శాతం, మూడో వంతు ఎగుమతులతోనూ, 12 శాతం విదేశీ మారక ద్రవ్యం రాబడితో పాటు దాదాపు 3 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తోంది. గడిచిన 15 సంవత్సరాల్లో దాదాపు కోటి మందికి వస్త్రపరిశ్రమ ఉపాధి కల్పించింది. ఇక ఈ పరిశ్రమ దాదాపు 65 శాతం పత్తినూలు ఆధారంగానే ఉంది. ప్రపంచ వ్యాప్తంగా వస్త్ర పరిశ్రమ వాణిజ్యం 2015నాటికి సుమారు 745 బిలియన్ డాలర్లుగా ఉంది. రానున్న కాలానికి ఇది సుమారు 6శాతం వృద్ధి రేటు సాధించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇక ఈ వస్త్రపరిశ్రమ ద్వారా సుమారు 17 కోట్ల మంది ప్రత్యక్ష ఉపాధి కలిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆసియా దేశాల్లో ఈ ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని తేలింది.

2011-2015 మధ్య సంవత్సరాల్లో వస్త్రపరిశ్రమ సుమారు 0.54 శాతం వృద్ధి సాధించినట్లు తేలింది. అయితే 2008-2009 మధ్య ఆర్థిక సంక్షోభం నుంచి 2014 వరకూ ఆసియా దేశాలు మాత్రమే ఇతర దేశాల కన్నా మెరుగైన వాణిజ్యాన్ని సాధించగలిగాయి. ఇదిలాఉంటే ప్రపంచ వ్యాప్తంగా దిగుమతుల మార్కెట్ మందగించడంతో 2015లో చైనా సహా పలు ఆసియా దేశాల్లో వస్త్రపరిశ్రమ వృద్ధి నెమ్మదించింది. మాంద్యం అనంతరం ప్రపంచంలోని వస్త్ర ఎగుమతులు చేసే టాప్ టెన్ దేశాల వాణిజ్యం గత సంవత్సరం 525.38 బిలియన్ డాలర్ల మేర వృద్ధి సాధించింది. ఇది మొత్తం వృద్ధిలో 70.53శాతం కావడం విశేషం. సరిగ్గా ఇదే సమయంలో భారత్ సైతం సుమారు 37.22బిలియన్ డాలర్ల వస్త్రఎగుమతుల వాణిజ్యం సాధించడం విశేషం. అలాగే భారత వస్త్రపరిశ్రమ వాణిజ్యం ప్రపంచ మార్కెట్లో 5 శాతంగా నమోదైంది.

చైనా తరువాత ప్రపంచవ్యాప్తంగా భారత్ రెండవ అతిపెద్ద ఎగుమతిదారుగా నిలచింది. 2015 ఆర్థిక సంవత్సరంలో సుమారు 20.05 బిలియన్ డాలర్లు వస్త్ర వాణిజ్యం భారత్ సాధించగా, ఇది ప్రపంచ వస్త్ర వాణిజ్యంలో 6.28 శాతంగా ఉంది. అలాగే భారత్ నుంచి ఎగుమతయ్యే వస్త్రఉత్పత్తుల్లో యూరోపియన్ యూనియన్ మూడో అతిపెద్ద మార్కెట్ (9.05శాతం)గా నిలచింది. 2015 సంవత్సరంలో భారత్ నుంచి యూరోపియన్ యూనియన్‌కు 2.88 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగేది. మాంద్యం నేపథ్యంలో పలు దేశాల వృద్ధిరేటు మందగించినప్పటికీ వియత్నాం లాంటి దేశం సుమారు 19.16 డాలర్ల వస్త్రాలను దిగుమతి చేసుకోవడంతో 5.47 శాతం వాణిజ్యవృద్ధి సాధించింది. ఇక సుమారు 4.5 కోట్ల మందికి ప్రత్యక్షంగానూ, ఆరు కోట్లమందికి పరోక్షంగానూ ఉపాధిని కల్పిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం పరిశ్రమ పలు ఒడిదుడుకులను ఎదుర్కొన్నది. ముఖ్యంగా మాంద్యం పరిణామాలు, ముడిసరుకు అయిన పత్తి ధరల్లో మార్పులు, అలాగే విద్యుత్ చార్జీల పెంపుదల, డీజిల్ ధరల పెంపుదలతో రవాణా ఖర్చుల పెరుగుదల ఇలా పలు కారణాలు పరిశ్రమను ఇబ్బందుల పాలు చేశాయి. మరోవైపు బంగ్లాదేశ్, కంబోడియా, వియత్నాం లాంటి దేశాలు అభివృద్ధి చెందిన దేశాలైన యూరోపియన్ యూనియన్, కెనెడా, ఆస్ట్రేలియాతో వాణిజ్య సంబంధాలు బలపడి ఆయా దేశాల నుంచి ఎగుమతులు పెరగడం కూడా మన ఎగుమతులపై ప్రభావం చూపాయి. ఇలా మన దేశీయ వస్త్ర పరిశ్రమ పలు ఒడిదుడుకులు ఎదుర్కొంది.

**భారతీయ వస్త్ర పరిశ్రమ గురించి తెలియని విషయాలు :**

భారతీయ వస్త్ర పరిశ్రమ చిన్న తరహా పరిశ్రమల్లో ఒకటి. ఇతర పరిశ్రమలతో పోల్చిచూసి నప్పటికీ భారతీయ వస్త్రపరిశ్రమ పరిణామంలో చాలా చిన్నది. గత ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఉత్పత్తి పెరుగుదలే ఈ పరిశ్రమను బలంగా ముందుకు నడిపించే చోదక శక్తిగా మారింది. చిన్న తరహా పరిశ్రమలే భారతీయ వస్త్ర పరిశ్రమకు ఆధారమని చెప్ప వచ్చు.

**వస్త్రపరిశ్రమ - ఉపాధి అవకాశాలు**

సుమారు 5వేల టెక్స్‌టైల్ పరిశ్రమల్లో ఎగుమతుల వృద్ధిరేటు రూ.50కోట్ల చొప్పున ఉంది. అలాగే అతి తక్కువ ఉత్పత్తి వ్యయంతో పాటు అత్యధిక శాతం మహిళలకు ఉపాధి కల్పించే రంగం కూడా వస్త్రపరిశ్రమే కావడం గమనార్హం. అలాగే ఉత్పత్తి రంగంలో ప్రధాన భాగం కూడా వస్త్రపరిశ్రమదే కావడం విశేషం. దీంతో పాటు ఎగుమతుల ద్వారా విదేశీ మారకం రాబట్టడంలోనూ దేశీయ వస్త్ర పరిశ్రమ ప్రధాన భూమిక వహిస్తోంది. ఇక అలాగే సుమారు వంద కోట్ల డాలర్ల ఉత్పత్తికి సుమారు 25 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తూ వస్త్రపరిశ్రమ దూసుకుపోతోంది. భారత ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం మేకిన్ ఇండియా కార్యక్రమంలో భారతీయ వస్త్రపరిశ్రమ కీలక భూమిక పోషించింది. ముఖ్యంగా 2008 సంవత్సరంలో 3.3-3.5 కోట్ల మందికి ఉపాధి కల్పన జరగగా, 2022 నాటికి 6-6.2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.

**వస్త్రపరిశ్రమలో అవకాశాలపై ఒక విశ్లేషణ :**

ఇతర పరిశ్రమలతో పోల్చిచూస్తే భారతీయ వస్త్ర పరిశ్రమ చాలా సానుకూలాంశాలతో నిండి ఉంది. ముఖ్యంగా ముడిసరుకు దేశీయంగా ఉత్పత్తి కావడం భారత వస్త్రపరిశ్రమకు కలిసివచ్చే అంశం. పత్తి

ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ముందు వరుసలో నిలబడింది. అలాగే వస్త్రపరిశ్రమకు తగిన నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యతలో ముందు వరుసలో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ముడినూలు ఎగుమతుల్లో భారత్ 29 శాతం వాటాను కలిగిఉంది. అయితే వస్త్రపరిశ్రమలో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. ముఖ్యంగా పర్యావరణ సమస్యలతో పాటు కార్మిక చట్టాల ఉల్లంఘనలు కొంత మేర ఇబ్బందులను కల్గిస్తున్నాయి. కొన్ని ప్రతికూలాంశాలు ఉన్నప్పటికీ భారత్ ఇప్పటికీ మెరుగైన ఫలితాలను రాబడుతోంది.

### ముగింపు..

వస్త్ర పరిశ్రమకు ముడిసరుకును అందించే సుమారు రెండు కోట్ల మంది రైతులు ప్రత్యక్షంగా లబ్ది పొందుతున్నారు. ప్రధాని నరేంద్రమోదీ 2023 నాటికి వస్త్రపరిశ్రమ 300 బిలియన్ డాలర్లకు చేరాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి కొన్ని సూచనలు.

1. ముఖ్యంగా మార్కెటింగ్ నైపుణ్యాన్ని పెంచుకునేలా, వస్త్ర భవన సముదాయాల నిర్మాణంపై దృష్టి సారించడం.
2. భారతీయ ప్రఖ్యాత బ్రాండ్లకు విస్తృతంగా ప్రచారం కల్పించడం ద్వారా అటు ప్రపంచ మార్కెట్‌లోనూ, దేశీయ మార్కెట్‌లోనూ విరివిగా వాణిజ్యం పెంచుకోవడం.
3. రానున్న మూడు నాలుగేళ్లలో కోటి మందికి ఉపాధి కలిగించేలా వాణిజ్యాన్ని పెంచడం. అలాగే ప్రపంచ మార్కెట్లలో ఉన్న పోటీని తట్టుకొనేందుకు టారిఫ్ రేట్లను తగ్గించుకొని ముందుకు వెళ్లడం.
4. అంతర్జాతీయంగా బలమైన దిగుమతి దారులుగా ఉన్న యూరపియన్ యూనియన్, కెనెడా, ఆస్ట్రేలియాలతో వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడం.
5. ముఖ్యంగా దేశంలో వివిధ రకాలైన వస్త్రాలు లభిస్తాయి. కావాల్సిన శ్రేణిలో లభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉత్పత్తిని పెంచుకోవాల్సిన అవసరం ఉంది.
6. ఎఫ్‌డీఐ, పెట్టుబడుల సమీకరణ
7. ఉత్పత్తిలోని అన్ని దశల్లోనూ అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడం.
8. అలాగే నైపుణ్యాల పెంపుదల కోసం శిక్షణ అందించి మానవవనరులను నిరంతరం తయారు చేయడం వంటి చర్యలతో వస్త్రపరిశ్రమ ద్విగుణీకృతం అవుతుంది.

■

*71వ పేజీ తరువాయి...*

## జనసంకల్ప బలంతో స్వచ్ఛభారత్

చైతన్యవంతులను చేసేందుకు 12397 ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ (ఐఇసి) కార్యక్రమాలను చేపట్టారు. చమురు సహజ వాయు రంగానికి చెందిన ప్రభుత్వ రంగ సంస్థల సిబ్బంది 406 ప్రాజెక్టులలో పరిసరాల పరిశుభ్రతకు సంబంధించి శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

### రైల్వేల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్...

రెల్వే మంత్రిత్వశాఖ సైతం తన పరిధిలో పెద్దఎత్తున స్వచ్ఛభారత్ కార్యక్రమాలను చేపట్టింది. ఇందుకోసం స్వచ్ఛ పర్యావరణ్ దివస్, పరిసరాల పరిశుభ్రత కోసం స్వచ్ఛ వారోత్సవాలను నిర్ణయించింది. ఇందులో భాగంగా స్వచ్ఛరైల్‌గాడీ, స్వచ్ఛస్టేషన్స్, స్వచ్ఛ సహాయోగ్, స్వచ్ఛ సమర్పణ్, స్వచ్ఛ ఆహార్ వంటి కార్యక్రమాలను చేపట్టింది.

### చెత్త, అపరిశుభ్రతతో చిక్కులు....

వ్యక్తిగత పారిశుధ్య అలవాట్లు ఒక ఎత్తు అయితే పరిసరాల పరిశుభ్రత పాటించడం మరొక ఎత్తు. సమాజ ప్రగతికి ప్రజల సాధికారతకు ఇవి ఎంతగానో ఉపకరిస్తాయి. మానవ అభివృద్ధి సాధనకు ఇవి ఎంతో కీలకమైనవి. కేంద్ర కాలుష్య నివారణ మండలి అంచనాల ప్రకారం ఏటా 68 మిలియన్ టన్నుల చెత్తా చెదారం రోడ్డుమీదికి వస్తోంది. ఇందులో మూడో వంతు రోడ్లపైనే నిలిచిపోతోంది. దీనివల్ల దుమ్ము, ధూళితో పాటు ప్రజారోగ్యానికీ ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. అందువల్ల ఎవరికి వారు చెత్త వీధులలోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని పరిసరాల పరిశుభ్రతను పాటించగలిగితే స్వచ్ఛభారత్ సాకారమౌతుంది. 2019 నాటికి దేశాన్ని స్వచ్ఛభారత్‌గా తీర్చిదిద్దేందుకు ఆరున్నరవేలకోట్లరూపాయల భారీ వ్యయంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా కార్యకలాపాలను చేపడుతోంది. స్వచ్ఛభారత్ అభియాన్‌కింద 2014- 19 సంవత్సరాలమధ్య రూ. 1.34 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో 9 కోట్ల టాయిలెట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే ఈ దిశగా ముమ్మర ప్రయత్నం జరుగుతోంది.

స్వచ్ఛభారత్ కార్యక్రమం ఒక జన చైతన్య మహోద్యమం. ప్రజలు తమంత తాముగా ముందుకు వచ్చి తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇందుకు వారిలో చైతన్యాన్ని తీసుకువచ్చి ఆరోగ్యవంతమైన ఆత్మగౌరవంతో కూడిన సమాజ నిర్మాణం దిశగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి.

వలస పాలకులపై అలుపెరుగని పోరాటం చేసి స్వాతంత్ర్యాన్ని సాధించు కోగలిగిన మనం మహాత్ముడు కలలుకన్న స్వచ్ఛభారతాన్ని సాధించడం పెద్ద కష్టమేమీ కాదు.

■

आन्ध्रा बैंक
ఆంధ్రాబ్యాంక్
Where India Banks

మీ స్థిరాస్తి పై మరింత
వృద్ధి సాధించండి
మీ కలలు
సాకారం చేసుకోండి



ప్రోపర్టీ ఓవర్‌డ్రాఫ్ట్ (పిఒడి)
ప్రోపర్టీ టెర్మ్ లోన్ (పిటిఎల్)

ఆకర్షణీయ వడ్డీరేట్లతో సులభరీతిలో ఆంధ్రాబ్యాంక్ ద్వారా
మీ స్థిరాస్తిపై ఋణాలు

ఉద్యోగస్తులకు, పెన్షన్‌దారులకు, వృత్తి నిపుణులకు, స్వయం ఉపాధి దారులకు, వ్యవసాయము సంబంధిత రంగాలలో ఉన్న వారికి, ప్రవాస భారతీయులకు, పార్టనర్‌షిప్ సంస్థలకు, లిమిటెడ్ కంపెనీలు మరియు ఎల్.ఎల్.పి.లకు

आन्ध्रा बैंक
ఆంధ్రాబ్యాంక్
Where India Banks

www.andhrabank.in
వివరాలకు, మీ సమీప ఆంధ్రా బ్యాంక్ శాఖను సంప్రదించండి

మీ ఇంటర్నెట్ బ్యాంకింగ్ యూజర్ ఐడి, పాన్‌కార్డు లేదా మీ క్రెడిట్ / డెబిట్ కార్డు నెంబరు/సివివి/ఒటిపి మొదలైన వివరాలు ఫోన్, ఈమెయిల్ లేదా మరే విధంగా కానీ ఇతరులకు తెలియజేయకండి

Publishing date 1st October 2016, Posting on 2-3 October 2016
Yojana (Telugu) October 2016 RNI Regd. No 37729/80 Regd. No. H/HD-663/2015-17




Printed & Published by Mrs. Sadhana Rout, Additional Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India.
and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com
and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314